సాహితీ విపంచిక

Acc No 14827

రచన :

యమ్. ఆర్. అప్పారావు, యమ్.ఏ.,
యమ్.యల్.ఏ.

ఉపాధ్యక్షులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం

5 NOV 2002
ఆంధ్రప్రదేశ్
ఆంధ్ర విజ్ఞాన పరిషత్

ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్సు
వాల్తేరు, విశాఖపట్టణం 530 003

కాపీలు : 500 నవంబరు 1977

© ఆంధ్రా యూనివర్సిటీ

సీరీస్ నె 135 రు

వెల : రు. 14=00

ప్రతులకు :

డైరెక్టరు
ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్సు
వాల్తేరు, విశాఖపట్టణం 530 003

ముద్రణ : ఆంధ్రా యూనివర్సిటీ ప్రెస్సు, వాల్తేరు
విశాఖపట్టణం 530 003

విషయసూచిక

	పీఠిక	v
1.	రుబాయ్యాత్	1
2.	గ్రీకు రూపకములు	29
3.	బ్రహ్మర్షి వేంకటరత్నంనాయుడు	53
4.	సంస్కృతి	97
5.	ఆంధ్రజాతి సంస్కృతి చరిత్ర	109

పీఠిక

నేను అప్పుడప్పుడు రచించి ప్రచురించిన నాలుగు తెలుగు గ్రంథాలను అవలోకించిన సాహిత్యమిత్రులు కొందరు వానిని విడి విడిగా ఉంచడంకంటె ఏకసంపుటంగా కూరుస్తే బాగుంటుందని సూచించారు. అది ఒప్పిదమైన సూచనగా భావించి ఇప్పుడు ఇట్లు ఒక సంపుటంగా ప్రచురించి తెనుగులోకానికి సమర్పించుకొంటు న్నాను.

ఈ సంకలనంలో తొలుతటి దాని శీర్షిక రుబాయ్యాత్. ఇది పద్యకృతి. 'గియాసుద్దీన్ అబుల్ పతహ్ ఉమ్రుబిన్ ఇబ్రహిమ్' అనే పూర్తిపేరు కలిగి 'ఉమర్‌ఖయ్యాం' అనే సంగ్రహ నామంతో విశ్వవిఖ్యాతుడైన పారశీక కవి రచనకు ఇది తెలుగుసేత. పన్నెం డవ శతాబ్దికి చెందిన ఈ కావ్యాన్ని పందొమ్మిదో శతాబ్దిలో 'ఫిడ్జి రాల్డు' అనే ఆసామీ ఆంగ్లంలోనికి అనువదించాడు. ఆ ఆంగ్లాను వాదం ప్రపంచ ప్రఖ్యాతినంది మూలకావ్యకర్త తత్త్వవిచారము ప్రపంచంలోని ప్రశస్త సాహిత్యాల పరామర్శ అందింది. మూలంలో ఇది రుబాయి ఛందోబద్ధము. అందుచేత ఈ రచన 'రుబాయ్యాత్' పేరిట వెలసింది. తత్త్వవిచారంచేస్తూ వార్త (message) ను అం దించే ఈ కృతిని భారతీయ సంప్రదాయానికి అనువుపరచి సంగ్ర హించితిని. ఇందలి తత్త్వబోధ అంతా పానపాత్ర అవలంబనంతో సాగింది. 'ఆసవపాత్ర తీయని లోతులలోనే ప్రాత విచారమ్ములు అణిగిపోతాయని', 'నిర్మలాసవ పీయూష మకరందములో తన్మయ త్వము కనవచ్చుననీ' కవి అంటూ ఉన్నప్పుడు, అందలి వ్యంగ్య వాసనావిలాసనము రసజ్ఞులకు అత్యంతామోదాన్ని కలిగిస్తుంది. ఉపాదేయమైన నీతిని బోధించే ఈ ప్రశస్త కావ్యాన్ని తెలుగులోనికి

అనువదించుటలో నేను ఎంతవఱకు కృతకృత్యుడనైనానో విమర్శకులు తేల్చవలసిన విషయం.

ఈ సంకలనంలోని మిగతా మూడు గ్రంథాలు వచన రచనలే. ఈ మూడింటిలో ఒకటి 'గ్రీకు రూపకములు' అనేది. ఇది సారస్వత విషయికమైన గ్రంథం. గ్రీకు నాటకాల పుట్టుపూర్వోత్తరాలు, క్రమ వికాసాలు ఇందు వివరించాను – క్రొత్తవానిని మానవుడు సంకోచం లేకుండా స్వీకరించడు. మనదేశంలో బ్రిటిషువారు ముందు పోస్టు కవర్లు ప్రవేశపెట్టారు. దరిమిలా కార్డులు వచ్చాయి. ప్రజల రహస్యాలను తెలుసుకోవటానికి వానిని ప్రవేశపెట్టారనే ఆందోళన లేచింది. ఈనాడు ఈ ఆందోళన సమాచారం మనకు హాస్యాస్పదంగా తోచకమానదు. గ్రీకునాటకాలు పుట్టినరోజుల్లో ఇట్టి వింత సంఘటన ఒకటి వినవస్తూ ఉంది. క్రీ.పూ. 639-559 ప్రాంతంలో ఏథెన్సు నగరపరిపాలకుడైన సొలెన్,'తెస్పిస్' నాటకం చూడటానికి వెళ్ళాడట. అంతకుముందు నాటక మంటే నాట్యంచేసి పాటలు పాడటం మాత్రమే. 'తెస్పిస్' వేషధారణం కొత్తగా ప్రవేశపెట్టాడు. ఈ నూతనవిధానాన్ని చూసి 'సొలెన్' 'ఈ విధంగా మాయనటన చేసి ప్రజలయెదుట అబద్ధమాడటానికి సిగ్గులేదా ?' అని గద్దించి అడిగాడట. దీనికి సమాధానంగా తెస్పిస్ 'నాటకంలో వినోదాని కాడితే ప్రమాదం ఏముంది ?' అని సమాధానం చెప్పాడట, వెంటనే సొలెన్ తన చేతికర్రతో నేలమీద కొట్టి 'మనమీ నటనను మెచ్చి గౌరవించినట్లయితే యిటువంటి నటనే ప్రజావ్యవహారాల్లో ప్రవేశించగలదు' అని కోపంతో అన్నాడట. 'కావ్యేషు నాటకం రమ్యమ్' అని గొప్పగా చెప్పకొనే ఈనాటి నాగరికులకు గ్రీకు నాటకపు పురిటి రోజులనాటి ఈ కథ ముచ్చట గొల్పక మానదు.

ఇందలి మూడో గ్రంథం శీర్షిక 'బ్రహ్మర్షి వేంకటరత్నం నాయుడు.' శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ఒకవిధంగా మా కృష్ణాజిల్లాకు చెందినవారు. వారు కాకినాడ కాలేజీ ప్రిన్సి

పాల్‌గా, మద్రాసు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా విద్యారంగానికి చేసిన సేవ మరువరానిది. వారి సంఘసేవ సాటిలేనిది. ఈ గ్రంథంలో నాయుడుగారి జీవితచరిత్ర సంగ్రహంగా కథించడమే కాక వారి జీవితం యొక్క పరమార్థాన్ని ప్రస్తరించడానికి ప్రయత్నించాను. ఇది 1962 అక్టోబరు 27వ తేదీని కాకినాడలో బ్రహ్మర్షి వేంకటరత్నంనాయుడి గారి శతజయంత్యుత్సవ సభలో నేను చేసిన ప్రసంగానికి గ్రంథరూపం. ఈ ఇరవయ్యో శతాబ్ది పూర్వార్థంలో ఆంధ్రదేశాన్ని ఓపినకొలది అభ్యుద్ధరించిన మహాభాగులలో వారొకరు. వారు మనకు స్మరణీయులు. శ్రీ నాయుడు గారి బోధనలను ప్రార్థనలను శ్రద్ధతో అధ్యయనం చేయడంవల్లనే నేను అపారమైన ప్రయోజనం పొందాను. పొందిన ప్రయోజనానికి ఉచితోపయోగ్యవృత్తి కల్పించుకోవడానికై వారి కీర్తిని ఈ చిన్న గ్రంథంలో స్మరించి తృప్తిని పొందుతున్నాను.

ఇక నాల్గో గ్రంథం: ఆంధ్ర సంస్కృతిని గురించినది. ఈ గ్రంథంలో ముందుగా సంస్కృతి అంటే ఏమిటో అనేక దృక్పథాల నుండి వివరించాను. ఆమీద ఆంధ్ర సంస్కృతిని గురించి ఇరవైకి పైగా శీర్షికల క్రింద సంగ్రహంగా క్రోడీకరించాను. సంస్కృతికి మూలస్తంభం భాష. మన ఆంధ్రభాష మధుర మంజులమైనది. సంగీతానికి అనువైనది. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పాశ్చాత్యులు లోగడ దానిని ప్రశంసించి ఉన్నారు. ఇటీవల మరియొక పాశ్చాత్యపండితుడు, హాల్డేన్, మన భాష ఆధునిక వైజ్ఞానిక భావాలను వ్యక్తం చేయడానికి భారతీయ భాష లన్నిటిలోనికి అనుకూలమైన దని అన్నాడు. అట్టి భాష అవలంబన మన సంస్కృతి వివిధరంగాలలో ఎంతటి అభ్యున్నత స్థానాన్ని అందిందో, అందగలదో దిఙ్మాత్రంగా నేను ఇందు క్రోడీకరించాను. అపారము, అగాధము నైన ఆంధ్ర సంస్కృతిని పురశ్చరణ చేయకలిగినందుకు నాకు సంతోషంగా ఉంది.

ఈ గ్రంథంవల్ల తెలుగువారికి నేనేమాత్రమైనా ప్రయోజనాన్ని సాధింప కలిగితే నా ప్రయత్నం సఫలీకృతమైనట్లే నేను భావిస్తాను.

వాల్తేరు,
ఏప్రిల్ 6, 1977

మేకా రంగయ్యప్పారావు

గ్రంథకర్త

రుబాయ్యాత్

రుబాయ్యాత్

లెమ్ము ప్రేయసీ ! బాలభానుడు
నీలిగుండంబులో మేలిరత్నము వేసె
తారలబారు హుటాహుటి
దౌడుతీసె
చూడు తూర్పువేటగాడు
రారాజుమేడ
కాంతిఉచ్చుతో చక్కగ
చిక్కబట్టె చూడ

2

ఉషఃకాంతుని వామహస్తమ్ము
దిగ్దివినొసట రాజిల్లు వేళకె
పానశాలాంతర్భాగాన తియ్యని
కలల యదృశ్యవాణి యిట్లు పలికె :
—"ఓ బాలులార ! నింపు
డాసవపాత్ర నింపు డిదె
జీవితంపు మధుపీయూష
మ్మది యింకకముందె"—

3

పానశాలాంగణాన పవ్వళించు
పాంథులెల్ల లేచిరి
తొలికోడికూతతోనే
మేల్కాంచి పిలచిరి
—"తీయుమోయి తలుపు శీఘ్రమ్మె
పోవలయు మే మిప్పుడె
మరలిరాబోము రాబోము నీ
చాయలకు మే మెప్పుడు"—

4

అంతులేని ఆశాపాశాలు
ఉగాదియువకుని బాగుగ బంధించు
ఏకాకియౌ హృదయమ్మును
నంస్మరణాల కెరటాల తేలించు
తెల్లమౌ పుష్పగుచ్ఛమ్ము లీను
సువాసనావల్లరు లెల్ల
వనదేవి రమ్యకరాలో ఆమె
సౌరభ్యశ్వాసలౌ యనంగ జెల్లు

5

హస్తినాపుర మయసభ లెల్ల
కాలగర్భాన గలిసె
రారాజుల అమృతపాత్రలు
తుత్తునియలై మట్టి నొలసె
కాని యీ యమునాతటాన
మలయమారుత మెల్లపుడు వీచుచుండు
ద్రాక్ష నిజమధురాసవంపు
కెంజాయ నెల్లపుడు నొసంగుచుండు

6

ప్రేమగాయక మృదుగానస్వరమ్ము
మూగవడియె సుమ్ము
"ఆసవ మ్మాసవ" మ్మంచు
ధ్వనించు పికస్వరమ్ము
సార్వభౌముని అంతఃపురాంతర్గత
స్నానవాటిక లెల్ల నెండిపోవును
ఈ సెలయేటి సలిలమ్ము లెల్లవేళల
మిలమిలలాడుచు పారును

7

పిట్టగూటికై యెగుర
సాగింది సాగింది
మ్రిపూడల నణగి మణగి
గూడుంది గూడుంది
ఎగిరియెగిరి అలసిసొలసి
గూడు చేరింది చేరింది
విసురుమోయి విచారమ్మును శాలువ
వసంత సమీరమ్ములో
విరిగి కరుగు జీవితపరిహాసమ్ము
ఆసవ సుహాసమ్ములో

8

భాస్కరకరాల గిలిగింతల
వేయిసుమాల వెలిమొగ్గలు నవ్వె
మరి వేయి వాడి వమ్మై రాలి
నేలపాలైపోవ్వె
గులాబి తెచ్చు నీ నవ
వసంతావతంసమ్ము
రాజుల రాణుల వుసురు
పోసుకొనును సుమ్ము

9

రండు రండు రారండు
మీ ఖయ్యాముతో
విడువుడు మన కేల
కృష్ణార్జునుల దయతో
తన గదతో భీముని
చెండాడ నిండు శత్రుల మూకల
దానకర్ణుని కరుణ
బ్రోవనిండు నిరుపేదల

10

జానిన — రాజను భేదాలె
లేవు లే వచట
సర్వమానవ సమానత్వమ్మే
చెల్లు నచట
"లోకంబుకెల్ల నేనె రారాజు" నంచు
విఱ్ఱవీగు సుయోధనుని వింటివే!
జాలిగొలుపు వాని వెఱ్ఱిచూపుల
దివాంధత్వమ్ము కంటివే!

11

దూరాన నుండేటి సెలయేటి
తీరాన హాలికులు
స్వహస్తాల పరతురు
చక్కని పరుపులు
రారమ్ము రారమ్ము
పోదాము పోదాము
పచ్చనిపంట లందాల
చందాల మించు
ఎండి మండు ఎడారి మత్సరపు
బునలెల్ల నణగించు

12

ఈ చెట్టునీడలో
ఆ ద్రాక్షరసముతో
నాచేతి పండ్లతో
నీగొంతు పాటతో
తీతేనె కావ్యమ్ముతో
వనమెల్ల నందనమె
ఓ ప్రేయసి! ఓ ప్రేయసి!
ఇది స్వర్గమె! యిది స్వర్గమె!

13

రాజ్యపాలనమ్మే
జీవితాశయ మ్మను కొందరు
రానున్న స్వర్గమ్మే నిజమైన
పరమార్థ మ్మను మరికొందరు
వాద వివాదాల మధ్య
వారి నలుగనిండు
వర్తమానమ్ములో
ఓలలాడుదము రండు
మనకేల భవిష్యద్రాగాల
నును పిలుపు లెండు

14

వికసించి ప్రకటించు గులాబి
మృదుసందేశమ్ము వినుడీ !
—“ప్రకృతిలో నిర్విచారాన
నివసింతుచుండీ !
నా పట్టుసంచుల గట్టి
త్రాళ్లల్ల తెంపి చిమ్ముదు
సువాసనా ధనమ్మెల్ల
రంగారు నుద్యానవనమ్మందు”

15

మానవకోటి పేరాసలు
వేలాదివేలె యెపుడు
మనసార నవి
ఫలించు నొకపుడు
పూర్తిగా విఫలమ్ము
లౌ మరొకపుడు
కొన్ని ఫలించిఫలించక మోద
ఖేదముల గూర్చు నపుడపుడు
ఇవియెల్ల నెడారి యెండుటిసుకపై
మంచు ముత్యమ్ములు
థళథళా మెరయు విశీర్ణకాంతి
రెండు నిమేషమ్ములు

16

చీమవలె గింజకుగింజ
కూడబెట్టిన సెట్టి
తండ్రి యిచ్చినదెల్ల హాయి
సెలవుచేసిన జెట్టి
వీరిరువురును పోయి తిరిగి
రాబోరు రాబోరు
మంటగలిసిన శవాలు
మానవులు కాబోరు కాబోరు

17

ఎరుగుదు రాత్రింబవళ్ళే
పెనుద్వారమ్ము లీ సత్రమ్ము కంచు
ఒకరాజు వెంట నిం
కొకరాజు పాలించు
గర్వాన "నేనె భూభర్తను
నా కెదు రెవ్వ" రంచు
పాప మెరుగ డొకడేని
నిడియెల్ల మూన్నాళ్ళముచ్చటంచు

18

సార్వభౌము డేలిన నవరత్నఖచిత
శిఖిసింహాసనమ్మిండు చోటెల్ల
చూడు తొండలు త్రవ్వి
చల్లగ పెట్టు గుడ్ల నెల్ల
అప్పుడు గజ్జెకట్టి
మెప్పించిన వేశ్య లేరి !
వారిచేత ఆసవమ్మానిన
రాకుమారు లేరి !
షికారి గోరీపై వన్య
మృగమ్మె పవ్వళించు
అతడు పాప మరమరలేక
శాశ్వతనిద్ర ననుభవించు

19

రారాజు రక్తపుటెరువున
పెరుగు గులాబి పసందు
మరి యెందు వెదకినా
కానరాదు రాదు
వనదేవిపౌడి కులుకు
మల్లెపూ పుత్రికలు
ఎప్పు డలంకరించెనో
దివ్యలలామల నీలశిరోజములు

20

మన కాలిక్రింద నలగు
మెత్తని మూలికారాజాలు
సెలయేటి పెదవి నాని
జలజలమని కులుకు జాల
నెమ్మదిగ కాలిడుమా!
ఈ తీగ నిద్రించు నే
మధురాధరామృతము
గ్రోలి జీవించునో

21

ప్రేయసీ! ఓ ప్రేయసీ!
నింపు మానసపాత్రను
దీని తీయని లోతులలోనె
మెల్లన నణగును
ప్రాత విచారమ్ములు,
క్రొత్త యాశల
సాఫల్య వైఫల్యాల
సందేహమ్ములు
రేపేల రేపేల
రేపునేను గలియుదునుతే
నిన్నటికి గడచిన
యుగయుగాల కాలాలలో

22

వెన్నెలల భూలోకాప్సరసల
        గాంచి ముగ్ధులమైతిమి మేము
కాలకర్మములు కటా వారి
        యౌవనాసవము గ్రోలుట చూడలేము
వారెల్ల నొండురెండు పాత్రలు
        సేవించునంతలో
అకటా కాలక్రమము ముంచినది
        సమాధినిద్రలో

23

వదలిచనిరి తాతముత్తాతలందరు
        వారి యిండ్లనెల్ల క్రమముగా
మనమందు మత్తెక్కి ఆడుచు
        పాడుచున్నాము సుఖముగా
మనముకూడ శ్మశానమ్మే వదలు టే
        తథ్యమ్ము సుమీ
పెద్దల బూదిపై పుష్పించుపూలె
        యీ పాన్పులయ్యె గనుమీ
మన బూదిపై పూలు మన
        సంతతికి పాన్పులవు వినుమీ

24

ధాత వ్రాసిన వ్రాత చాల
        గడచిపోయెనే
మైమరచు మా నందనోద్యానవన
        వసంతవాహినులలో నే
జాలమేల "శుభస్య శీఘ్రమ్ము"
        శీఘ్రమ్ము శీఘ్రమ్ము
బూది మట్టి గలసి యెర్రగులాబి
        కెరువౌట తథ్యమ్ము తథ్యమ్ము

25

మధురానవ మకరంద సంసేవనా
సుఖము జిహ్వ మరచును
మృదు సంగీతస్వర నినదమ్ముకు
వీనులు చెవుడువడును
అమరగాయక పికస్వరము
మూగవడును
చివరకు తుది మొదల్లేనిదై
సర్వ మనంతాన గలియును

26

జీవితమెల్ల ధారపోసి ఐహికసుఖ
మార్జించిన షాహుకారును జూచి
సర్వము త్యజించి ఆముష్మికమ్మే నమ్మి
కృశించు సన్యాసి గాంచి
అంబరవీథుల నాను చీకటిమేడపై
'మౌజిను' పల్కె పెనుధ్వని
"మీ వెర్రియాశల ఫలిత
మిక్కడ నక్కడ సున్నయే" నని

27

ఇహపర రహస్య విషయచర్చ
వాదోపవాదాల
తర్కించి తర్కించి తుదమొద
ల్లేని వివాదాల
నైజతత్త్వమ్ము నే వేదాంతులు
కానరైరి
శుష్కప్రవక్తలకైవడి వారు
త్రోసిరాజులైరి
ఎడతెగని తర్కాల ధ్వనులెల్ల
గాలిలో లీనమయ్యె
వాదించు నోళ్లెల్ల
మట్టిగలసి మాయమయ్యె

28

"జాతస్య మరణం ధ్రువ"
మ్మనుటే సత్యమ్ము
తదన్య మెల్ల వట్టికల్ల
యని నమ్ము
చేయిచేయి పెనవేసి ఖయ్యాముతో
సయ్యాటగారమ్మా !
పుష్పించిన సుమ మ్మదిగో
మొదటనె రాలుననుమ్మా !

29

చిన్నతనాననే జ్ఞానుల విద్వాంసుల
భక్తి సేవించి కంటి
శబ్దార్థభేదాలు శాస్త్రోపదేశాలు
వీనులనిండ వింటి
విని విని విసిగి విసిగి
వేసారితినే గాని
వాగ్దేవి నైజవిన్యాసాల కన్నార
కాంచ వినుమంతేని

30

జ్ఞానక్షేత్రాల హాలికుల జేరి
నేనును విజ్ఞానబీజపుంజమ్ము
శ్రద్ధగ నీరువోసి పెంచి
పెనుపైరు చేసితినుమ్ము
పండిన ధాన్యమెల్ల చెరుగగా
మిగిలిన గట్టిగింజ లివి
గంగలా జలజలా వచ్చి తీవు
గాలిలా బుస్సుమంచు పోవుదువు

31

ఇష్టానిష్టాల మాటయే లేదు
యెందు కెక్కడి కను ప్రశ్న అసలె లేదు
ఈ మహాసృష్టి సాగరాన
సెలయేరులా గలియుచున్
వాయుదేవుని వెర్రి
వ్యూహాలులా యెగురుచున్
అటునిటు సృష్టివీథు లెల్ల
కలయ వీచుచున్
సరిహద్దులెల్ల దాటుదు
పోవుచున్ పోవుచున్

32

రోయు చిక్కడి కేల
పరుగిడితినా యను
రొప్పు చెక్కడి కీ వింత
పరుగు సాగు నను
పిచ్చివూహల తెగని
ప్రశ్నల త్వరలో
మరచుమీ ఆసవకన్యకాలలామ
జోలల హాయిలో

33

ఏడేడు లోకాలు
ఎల్లలెల్లన్ దాటి
తత్వ పరిజ్ఞాన
యంత్రాన వెదకితి
గాలించి గాలించి
విసిగి వేసారితి
నెంతెంతొ వెదకితి
యెన్నెన్నొ నేర్చితి
గడ్డు ము ళ్ళనేకములు నేర్పున
విప్పనేర్చితిగాని
ముళ్ళకెల్ల ముడి ఆ జననమరణాల
ముడి విడబడదాయెనేమి ?

34

పరమరహస్య ప్రాంగణద్వారపు
తాళపుచెవి దొరకలేదు
మాయతెరమాటున దాగిన కన్య
సహజసౌందర్యమ్ము కానరాదు
నీవు నేనను ద్వంద్వాల మాట
యినుమంత వినిపించు
అంతలో నీవు నేను లే మను
నదియె కనిపించు

35

దిక్కుతోచక దీననై ఆకాశాని
కెలుగెత్తి అరచితి స్వామి!
"చిమ్మచీకట్ల చిత్తవు అనాథలౌ
బిడ్డల గతియేమి!
అదృష్టదేవి కాంతిహస్త మెందును
గానరాదేమి!" యంచు
జవాబిచ్చె నాకాశవాణి
"గుడ్డినమ్మకమ్మె గతి" యంచు

36

అంత మట్టిముద్దపై కాలిడి
మజిలీ సాగించితి
జీవితరహస్య పానీయాల
గ్రుంకు లిడ దలంచితి
నేనేర్చిన విద్యయిది "రెప్పపా
టీ జీవితమ్ము
ఈ త్రుటిలోనె ఆనుమా
అనుభవామృతమ్ము
నిశ్శరీరయైన ఆత్మ
కందరాని ఫలాలు
ఈ నవనవోన్మేష
విషయవాంఛా విశేషాలు"

37

"ఛట్ ఛట్" మను
ఈ మట్టిపాత్రము
దీని మూగగాత్రము వచించె
మంచిసూత్రము
"నేను నీవలె జీవించి కన్యకాధరముల
ఆసవరుచుల చవిచూచి తపుడు
నేర్చితి విషయవాంఛల అంచనైన
అంచనావేయు టిపుడు

38

సాయంసమయాన సారెత్రిప్పు
కుంభకారుని చేయి
మట్టి నెంతలోమార్చి సొగసైన
కుండ చేసెనోయి!
దానినుండి యింపైన నిశ్శబ్ద
వాణి వెలువడియె
"తమ్ముడా! మట్టియని మరవకుమా
నా నిరుపేద బాధ" అనియె

39

పాత్ర ఖాళీయయ్యె నింపుము
నింపుము మరల మరల
కాలప్రవాహము కాలిక్రింద
తరలు తరలు
పోయిన నిన్నటిగురించి
కుందె దేల?
రానున్న రేపటికాలాల
కాంక్షించె దేల?
ఈనాటి మకరంద మాను
వెనుకాడె దేల?

40

అనుమాను మొక్కనిమేష మీ
యమరాజ్యపు టెడారి
హమ్మ ఒక్కనిమేష మ్మి
పానీయాలద్రావి దప్పితీరి
తారాగణ మస్తమించు సమయాన
మజిలీసాగు ఎడారిఒడలకు
త్వరపడుచు చనునవి ఉషస్సుల
శూన్యమౌ రేవులకు
ఆదిమధ్యావసానాలె
లేని కాలాలకు

41

ఎంతకాలము భరింతు వీ ఆశల
వంతను క్రుంగుచు
అది దొరకు ఇది వేపు ఒకటి వలపించు
నింకొకటి మురిపించు
దొరకు ద్రాక్షల యనుభవసంపదల
తృప్తిపడయుమా !
దొరకనిపండ్ల క్రులుచాచి
చింతింపకుమా !

42

మిత్రమా ! నూత్నవైవాహిక
ప్రయత్న సంరంభాలు చూడుమా !
గేహ ప్రాంగణ తోరణ రసాల
కిసలయాల పసల గనుమా !
వదలితి నిష్ఫల శుష్కవాదనా
కన్య విసయాన
సరస సౌందర్యమయానవకన్య
కుసుమసమాన
భవ్య నవ్య దివ్య కరసంస్పర్శనా
సౌఖ్యభాగ్యాన
మున్కలెత్తి తప్పిబ్బె తలక్రిందైతి
నమ్మ నీయాన

43

"ఔను" "కాదు" అనువాదాల
నాలోచనా తులలోన తూచితూచి
మెరకపల్లాల సరియైన కొల్తల
లెక్క గట్టి గట్టి
విషయప్రపంచపు చుట్టుకొల్త
లెల్ల కలయంగ వెతకి వెతకి
ఈ విసువులెక్కలు నాకు సుంతేని
వలదు వల దంచును
నిర్మలాసవ పీయూష మకరందములో
కంటి తన్మయత్వంబును

44

ప్రాంతఃకాల కాంతుల
లేతవెలుగులో కంటి
పానశాల గుమ్మాన మెల్లమెల్లన
నడయాడు నొంటి
విద్యుల్లతభాతి థళథళలాడు
తిలోత్తమ హస్తామృత భాండమ్ము
ఆమె మృదులాజ్ఞ జవిచూచి
తది ద్రాక్షాసవమ్మో సుమ్ము !

45

తిరుగెరుగని యానవ తర్క
ప్రజ్ఞా విశేషాల
ప్రాక్ష నమయించు నానామత
భయంకరవివాదాల
ఆసవమ్మో నాగార్జునుని మించు
రసాయనవేత్త
కలదు చిటుకలో వట్టిమట్టిని
మేల్మిపసిడిచేయు నత్త

(2)

46

అరిరాజ తండాల
సునాయాసాన కీడడంచు
భూతప్రేతాల చెడుపూజ
లెల్ల ఒట్టడంచు
భయవిచారాలను పిశాచాల
నాత్మగేహమునుండి పారద్రోలు
ప్రజ్వల వజ్రాయుధహస్తు
డనమానపరాక్రముండు మన ప్రోలు

47

వేదాంతులు పండితులు
పోరాడుదు రెల్లపుడు
నాకు వదలు డీవిషయతత్త్వ
వాదప్రతివాదాల నెపుడు
విధి నియంత మిమ్మందరను
బొమ్మలనుజేసి ఆడించు
మీదు నాతని నాటపాటల
తేలించుడు నయ్యాట మించ

48

ఓ ప్రేయసీ ! యేదిక్కు చూచినా
యెందెందు వెదకినా
కాన్పించునదెల్ల మాయతెరపై
బొమ్మలాటలేనా ?
సూర్యుడను పెనుదీప
కాంతి చ్ఛాయల
చుట్టును పరిభ్రమించు
కల్లనీడలమె మనమెల్ల

49

నీవింత ప్రేమించి
శ్లాఘించు ద్రాక్షాసవమ్ము
నీవాను ప్రేయసీ
మధురాధర పీయూషమ్ము
ఎన్నాళ్ళీభోగములు
కొన్నాళ్ళేగదా యనును
వట్టి శుష్కనీతులు
పఠించు వేదాంతియును
పాప మత డెరుగడు
జీవితమ్మే నాటక మ్మంచును
దిసమొలన్ వచ్చి తీవు
దిసమొలనే పోదువునుమ్ము
సుంతేని దాచదీ నగ్న
సౌందర్యమ్మే నీ వింతవస్త్రమ్ము

50

వీచు నదీతటాన సువాసనాభరిత
మలయమారుతమ్ము
ఖయ్యాము సాహచర్య సుఖనమయాన
త్రాగు కెంపుద్రాక్షాసవమ్ము
యమదూత వచ్చి యిచ్చినది
కాలకూటవిషమా ?
అయిన నే యరమరయులేక
నిస్సంశయాన నానుమా !

51

ఇదంతయు పగలు రాత్రులచే
నిర్మింపబడ్డ చదరంగపుపీట
కర్మ యాటగాడు నేర్పున
నడుపు బలాలయాట
ఒక్కటొక్కటి నల్లన నడిపించి
యెత్తుకు పైయెత్తు వేయును
చంపు కొన్ని యెడల
జంతువుల బంట్లను
కొన్ని యెడల సయ్యాటగా
బంటుతో త్రోసిరాజనును

52

కుడియెడమ లను
వ్యత్యాసాలులేకనే
ఎటుకొట్టిన నటుపోవు
బంతివలెనే
పోను రాననక నడువుమా
కర్మరాజు నాజ్ఞనే
రంగాన దింపిన ఆటగా డెరుగడే
నీ భావి తెరువును
చిక్కువ్యూహాల రహస్యాలెల్ల
ఆ జెట్టి చక్కగా నెరుగును

53

కలముసాగు ముత్యాల
అక్షరాల నాట్యాల
ఎంత కఠినతపంబైన
నరికట్టదు దాని విన్యాసాల
అది సుంతేని వెనుకకే
రాబోదు రాబోదు
అశ్రు ధారా వృష్టిచే
పోబోదు పోబోదు

54

తిరుగబడ్డ గిన్నె
యానీలి ఆకాశపాత్ర
దానిక్రిందనే మన సుఖదుఃఖ
సంసారయాత్ర
యెంత యెలుగెత్తి యేడ్చినా
వృథాయాసమె సుమా!
అదియు నీవలె నావలె త్రోయబడు
"పాళి"యే వినుమా!

55

బ్రహ్మ సృష్టిచేసిననాటి
మట్టిముద్దలతోనె
ప్రళయకాలపు వారి
కర్మలెల్ల చక్కనల్లె
తుదిపంట విత్తనా లెల్ల
నప్పుడే చల్లె
ప్రథమోదయంపు కవిలికట్టలలోనె
గ్రామకరణము వ్రాసె
తూ చా తప్పక చివరవర
కాసామివారీ లెక్కలెల్ల జేసె

56

నాయాత్ర సాగించు
తొలినాటి వేళనే
ఉచ్చైస్స్రవానాన స్వారిచేయు
నారంభ దివసాననే
నాదారియెల్ల గురుని
స్వాధీనమయ్యె
అటునిటు కదలక కర్మపు త్రాళ్ళ నతడె
చక్కగ చిక్కబట్టనయ్యె

57

ద్రాక్షతీవియ పెనువృక్షశాఖ
నాశ్రయించినరీతి నాశరీర
మెల్ల నానవమ్మె ప్రాకెను
సర్వమున్ విడిచి బూది
నాశ్రయించిన సన్యాసి
దీనినెల్లను సేవగించును
అతడు మోక్షద్వారము
తెరువ తెరువెరుగక
బాదుచున్నాడు తలుపు
నా చెలియె యెరుగు
నేమొ ఆరహస్య
ద్వారపు మలుపు

58

ఏది యెట్లున్న నాకిదిమాత్ర
మ్మెరుకసుమీ !
కామక్రోధా లను పెనుభూతాలమధ్య
చిక్కి నశింపనీ
లేక సప్తవ్యసనాల జయించి
ప్రేమాహింసల నవలంబింపనీ
అనవశాలాంతర్భాగాన కంటి మానవ
హృదయ నైజస్వరూపమ్ము
గర్భగుళ్ళ చీకట్లలో కనుపింపదీ
నిరుపేద హృదయసౌందర్యము

59

మార్గమెల్ల దొంగగోతులు
మాయబోనులుగ పగ బెట్టి
కర్మరజ్జువుతో కదలనీక
గట్టిగ బిగగట్టి
నేనుజేయు పాపమ్ముల
కెల్ల నేలనయ్యా !
నన్నె బాధ్యునిజేతు నం
చరమరలేక పలికెదయ్యా !

60

మట్టిముద్దల మనుజుల నిర్మించి
వ్యసనభరితులజేసి
కాన్పించు నెరలెల్ల కాంక్షించి
వుచ్చుల బడునట్లు వ్రాసి
విషయలంపట పాపపంకిలులైన
దీనమానవుల నంపూర్తి
కావకున్న నిన్నెవరు క్షమింతురయ్యా
ఓ పుణ్యమూర్తి !

61

ఉపవాస పర్వంపు నియమాలెల్ల
వినయమ్ముగా గడపి
సాయంసమయాన నూత్నచంద్రోదయ
వేళ నల్లన నడచి
కుంభకారునింటి
కేకాకినై సాగితి
వరుసచేర్చిన కుండలమధ్య
నిశ్చలుండనై ఆగితి

62

ఆశ్చర్య మాశ్చర్యమ్ము కుండలలో
కలవరము కాసాగె నంత
వాటి కులపెద్ద యొకటి "పటపట"
మని పలుకజొచ్చె వింత
"కుమ్మరెవరో కుండలేవో
చెప్పగలవో ?" యని
నే చేతనావిహీనుడనై నిలచితి
కొయ్యబొమ్మనోయన విని

63

ఒకకూజా పలికె "చైతన్య
విహీనమైన వట్టి మట్టి
స్వహస్తాన నిపుణత
కుంభకారుడే సానబట్టి
ఊరక పొడిపొడిచేసి మరల
మట్టిగలపునా" అనుచు
"ఇట్టి కార్యాల కెట్టి కారణాలుగలవొ
నీకు తెలియునా ?" అనుచు

64

ఒకపాత్ర పలికె "ఎంతవింతబాలుడైన
నెప్పుడు వినియుండ నెందు
తానే మధురాసవముచేయు నాపాత్ర
పట్టిగలుపు టెందు
ప్రేమపూర్వముగ జేసిన
వస్తునంచయమ్ము
పూర్తిగ కోపాన పొడిచేయు
టెందును లేదునుమ్ము"

65

జవాబు రాలేదు రాలేదు
ఈ యక్షప్రశ్నల కెందున
జాగు కొంతయిన వెనుక
పలికె నొక వంకరపాత్ర మెల్లన
"అష్టవంకరలకెల్ల నన్నేల
రొష్టుపెట్టు నిజనంబు
చేతకాక చేసిన కుమ్మరిని
వెలివేయుడు కళాసంఘంబు"

66

"అల్లరిమూకలకునెల్ల మంచి
కుమ్మరియం దసూయ నుమ్ము
ఆతని సృష్టి మాయల ప్రోయజాతు
రదియెల్ల మోసమ్ము
కుంభకారుడు కఠినపరీక్ష
చేయుట అసత్యమ్ము
అతనిచేబుట్టిన మన నేల
నతడే త్రోసిపుచ్చు నమ్ము"

67

సీత్కారముతో నొక పాత్ర
యిట్లు చక్కగ నుడివె
"నా శరీరమెల్ల జ్వరబాధ
తడిబాసి యెండువడియె
దివ్యామృతమ్మిడుమా యదియె
ఆతప నివారణోపాయంబు
క్రమశః — స్వస్థదాయక నిత్య నవ్య
దివ్యౌషధరాజంబు—"

68

ఇట్లొక్కొక్క పాత్ర పలుకుచు
చూచె నావంక
ఇంతలో సర్వజనామోదమ్ముగ
పొడసూపె చంద్రవంక
అంత నానందాన
నందరును సపేక్ష
"తమ్ముడా! తమ్ముడా! మానుమా
యింక కఠినోపవాసదీక్ష
వినుము సోరూరు నానవపు
కావిళ్ళ కిర్రు"లనిరి కాంక్ష

69

నా అవసానకాలాన మనసార
మధురసమ్ముల నిమ్ము
ఈ ద్రవమ్మునసే కడుగుమా
నా మృతకళేబరమ్ము
పచ్చని ద్రాక్షపత్రాల తీగల
చిక్కజుట్టి
నా హృద్యోద్యానవనమందు
చేయుముమట్టి

70

నామరణానంతరము భూగర్భస్థమౌ
బూదియైన పోదు వమ్ముగా
వెదజల్లు చక్కటి సర్వసుమ
సౌరభ్య మిమ్ముగా
రహదారిలో సాగు కళాత్మకు
లబ్బురము పడరె
సమాధుల వింత శుభాల
సంవాసనల కనరె

71

అకటా! యిన్నాళ్లుగా పూజించు
నభిమానవిగ్రహాలె
పూర్తిగా నను సంఘదృష్టి
వెలివేసి అస్పృశ్యుజేసె
నా గౌరవంబెల్ల చిన్న
ఆసవపాత్ర ముంచె
కష్టించి ఆర్జించు పేరెల్ల
చిల్లిగవ్వ కమ్ముడుచేసె

72

అనేకసార్లీ ఆసవకన్య విడనాడెద నం
చొట్టుపెట్టలేదా?
అట్టి ప్రతినపట్టుకాలాల ద్రాక్షా
కషాయంపు నిషాలో లేనా?
ఇంతలోనె వసంతమొదవి
హస్తాన గులాబిపెట్టె
నేమిసేతు నా కఠినదీక్షనెల్ల
వమ్ముజేసె నిట్టె

73

ఆ మ్లేచ్ఛయువతి బాహువల్లరి
నా మర్యాదనెల్ల నేలగలిపివేసె
కులమ్మునకే పూర్తి అపకీర్తి
వాటిల్లజేసె
గతజల సేతుబంధన
మ్మేలగాని
నే వింతపడుదు “నీ దుకాణదారు
లేలనో కనుచు
వెలలేని ఆసవమ్మమ్మి చౌకవస్తువు
లెల్ల కొందు”రనుచు

74

అహహా ! యెంతశోచనీయమ్ము లీ
గులాబుల కెంజాయల రుచులు
మాయముచేయు వసంత
కాలావసానదశలు
యౌవన సౌందర్య కాంతులెల్ల
వెలివోవు వర్షీయసీ కేశాలలో
పంచమ స్వరాన నింపుగా పాడు
పిక మ్మెగిరిపోయి యింతలో
ఏ కోనకు చనెనో
ఏగానము వినెనో !

75

ప్రేయసీ ! నీవునేనును మెల్లన
కర్మతో జట్టుకట్టి
ఈ విషాదపూరిత జీవసామాగ్రి
నెల్ల చేబట్టి
దుమ్ముదుమ్ముచేసి విచారమ్మె
పారద్రోలి
చేయమా ? ఆనందలహరుల దేలు
నూత్నసృష్టిని జాలి

76

అంచల మించు నందాల నొలికించు
ఓ నవ్వులరాణి!
చూడు చూడు మదిగో బాలచంద్రుని
నెమ్మోము కాని
భవిష్యత్కాలాల పూర్ణిమా
పూర్ణనిశ లెల్లను
వేసారు నతడు నాకొరకె
వెదకి తోటలెల్లను

77

వింతకాంతుల వెదజల్లు నీ
రమ్యహర్మ్యాల నీడల
నవనవలాడు సౌందర్యవనాల
నాసీమలౌ కన్యకాలలామల
మధుర ద్రాక్షారస ధారల
తేలించి సుఖించు సమయాల
కందుదేమొ నే నాసవపాత్ర
విసర్జించిన స్థలాల.

గ్రీకు రూపకములు

గ్రీకు రూపకములు

ఉపోద్ఘాతం :

ప్రాచీన గ్రీసుదేశపు విషాదాంతనాటకరంగాన్ని గురించి మొట్టమొదట తెలియజేసినవాడు వెల్కర్ అనే జర్మనీ పండితుడు. ఇతడు 1826లో తన "శటిర్స్పియల్" అనే గ్రంథంలో – మొదట "డితిరాంబు అనే ఆటతో ఆశువుగా పాడబడుతూ ఉండే నృత్యగేయంనుంచి పరిహాస నాటకం (శటరిక్ డ్రామా) ద్వారా విషాదాంత నాటకం (ట్రాజడి) ఉత్పన్నమయ్యింది" – అని పేర్కొన్నాడు.

మద్యానికి నాటక రంగానికి అధిదేవత అయిన "డయనీసస్" ఉత్సవాలలో కొంతమంది కలిసి "డితిరాంబు" అనే నృత్యం చేసేవారు. ఈ నర్తకులు "డయనీసస్" సేవకులైన దేవతల వేషం వేసుకొనేవారు. "డయనీసస్" దేవుని సేవకులైన దేవతలకు "శటిర్స్" అని పేరు. ఈ దేవతలు మేకలను పోలి ఉండేవారు. అందువల్ల మేకకొమ్ములు, చెవులు, డెక్కలు, తోకలు, చర్మం మొదలైనవే యీ వేషధారులకు దుస్తులు. వీరు మేక చర్మాన్ని మొలకు చుట్టీవలె ధరించేవారు. అందువల్ల యీ బృందగానంలో (కోరస్లో) పాల్గొనేవారికి "ట్రాగోయ్లు" అని పేరు వచ్చింది. క్రమంగా ఈ "డితిరాంబు" అనే హాస్యనృత్యగేయం ఆశువుగా కాకముందుగానే రచింపబడుతూ కొంత ఉన్నతస్థాయిని అందుకొనడంతో "శటరిక్ డ్రామా" అనే పేరు వచ్చింది. బృందగాన (కోరస్) దళానికి నాయకుడు ఒక డుండేవాడు. ఈ నాయకుడే కాలక్రమాన దళంనుండి విడివడి నటుడయ్యాడు. దీనితోపాటు నాటకరచనాశైలి కూడా ఉత్తమస్థాయి నందుకొన్నది. "శటరిక్" నాటకానికి తర్వాత "ట్రాగోయ్డియా" (మేకపాట) అనే పేరు స్థిరపడింది. కాని నాటకంలో పాల్గొనే కోరస్ దళంలోనివారు మాత్రం యింకా "శటిర్స్" గానే ఉండిపోయారు. ఈ దేవతలు స్వరూపంలోనే కాక స్వభావంలో కూడా జంతుతత్వం కలవారు. అందువల్ల నాటకం అసభ్యంగాను అపరిష్కృతంగానూ ఉండేది. గ్రీకు నాటకాన్ని యీ స్థితినుంచి ఉత్తమస్థాయికి తీసికొనివచ్చినవాడు క్రీస్తుకు పూర్వం 525–456 సంవత్సరాల మధ్యవున్న "ఈస్కిలస్" – ఈతని చేతిలో గ్రీకు నాటకం ఉత్తమ సాహిత్యరూపం దాల్చింది. "శటిర్స్"ను కూడా మార్చివేసి "కోరస్"లోను, నాటకంలోనూ పాల్గొనే వారినందరినీ యితడు మానవులుగా తీర్చి

దిద్దాడు. అయినప్పటికీ ప్రతి నాటకకర్తయు నాటకోత్సవాల్లో మూడు విషాదాంత నాటకాలను, ఒక "శటైర్" నాటకాన్ని తప్పకుండా ప్రదర్శించి తీరాలనే నియమం పెట్టడం జరిగింది. ఈ నియమం "శటైర్" నాటకాలు పూర్తిగా విస్మరింపబడకుండా ఉండడానికి యేర్పరచడం జరిగి ఉండవచ్చును.

పైన పేర్కొన్న విషయాలన్నీ "వెల్కర్" పేర్కొన్నవే. తరువాతివారు దీనిని సంపూర్ణంగా ఆమోదించలేదు. ఆమోదించని వారిలో గ్రీకు భాషలో పండితా ఖండలులైన డాక్టర్ ఎమిల్ రైఖ్, పికర్డ్ కేంబ్రిడ్జి ప్రభృతులున్నారు. "గ్రీకు నాటకరంగం – నాటకం" అన్న గ్రంథాన్ని రచించిన డాక్టర్ "ఫ్లికింజర్" ట్రాజడీని శటైరును డితిరాంబు నాట్యంనుంచి వెలువడిన రెండు శాఖలుగా భావించాడు. వెల్కర్ భావించిన విధంగా "డితిరాంబు"లో నుంచి శటైర్‌ను, అందులోనుంచి "ట్రాజడీ"యును వచ్చాయని యితడు భావించలేదు. ఈ విధంగా యెవరి సిద్ధాంతాల కనుగుణంగా వారుచేసిన యీ వాదప్రతివాదాలతో ప్రస్తుతం మనకు అవసరం లేదు గ్రీకు నాటక పరిణామవికాసా లేవిధంగా వచ్చాయో పరిశీలించడమే మనకు ప్రస్తుతం అవసరం.

ఇప్పటికి ఉపలభ్యమానాలయిన ఈస్కిలస్, సోఫోక్లిజ్, యూరిపిడిజ్‌ల నాటకాలలో అన్నీకూడా క్రీ.పూ. అయిదవ శతాబ్దిలో రచింపబడినవే. వాటికి పూర్వం సాహిత్య నాటకీయ సంప్రదాయం సమృద్ధిగా ఉన్నది. నాటి నాటకాలలో కన్పించే కళాస్వరూపం యొక్క గాంభీర్య వైశాల్య భూయిష్ఠతలకు ఇవే మూలాలు. సాహిత్యశిఖరాలనదగిన హోమరు గ్రంథాలు (ఇతిహాసకావ్యాలు)—ఇలియడ్, ఒడెస్సీలు—కూడా అత్యంత ప్రముఖమైనవి. అకృత్రిమంగాను ఆడంబరరహితంగానే కాక ఆశ్చర్యకరంగాను హేత్వాభాసంగానూ మానవజీవితపు సమగ్రజీవితాన్ని ఇవి ప్రదర్శిస్తూ ఉంటాయి. క్రీ.పూ. 8వ శతాబ్దినాటి హోమరు కావ్యాలకూ, 5వ శతాబ్దినాటి ఉత్తమ విషాదాంతకావ్యత్రయ కాలానికి మధ్యకాలాన నాగరికతలో అనేక పరిణామాలు వచ్చాయి. ఆధ్యాత్మికవిచారం ప్రారంభమయ్యింది. పారలౌకిక విషయాలను గురించి, మానవతను గురించి ఆలోచనలు జిజ్ఞాసా బయలుదేరాయి. ఆత్మనివేదనం ఉజ్జ్వలంగా ఒనప్పగల భావకవి సమాజం యొకటి యీ కాలంలోనే తలయెత్తింది. మానవస్వభావాన్ని అవగతం చేసుకొన్న శాఫో, అల్సీఅస్, సీమొనడీజ్‌లు భావగీతాల నాలాపించారు. ఈ కవితా సంప్రదాయం ఒక్క కవులకే కాక సహృదయ ప్రేక్షకులకు కూడా ఉపకారకారకమయ్యింది. ఏతెన్సు పౌరులు తాము వినే మహాకావ్య పాఠాలలో తన్మయులై మునిగిపోయేవారు.

ఈ విధంగా క్రమంగా లభించిన అనుభవంతో క్లిష్టాలైన ఛందస్సులతో, ఉజ్వల సమున్నతాలైన భావాలతో కూడిన బృందగీతాలతో నిండియున్న విషాదాంత నాటకాలను సైతం చూచి వారు హర్షామోదాలను తెల్పడం సాగించారు.

తొలుదొల్త క్రీ.పూ. 5 వ శతాబ్దిలో కొన్ని ప్రత్యేకోత్సవాల సందర్భంలోనే యీ నాటకాలు ప్రదర్శింపబడుతూ ఉండేవి.

గ్రీకు నాటకరంగం :

ప్రాచీనకాలంలో ఈ నాటకాలు వెయ్యడానికి కొండల మధ్యభాగంలో ఆరుబయలుగా ఒక ప్రదర్శనాప్రదేశం యేర్పాటు చెయ్యబడుతూ ఉండేది. ఈ నాటక ప్రదర్శనా ప్రదేశాన్ని "థియేట్రస్" లేక "కోయిలన్" అని వ్యవహరించేవారు. సోపానక్రమంలో అర్థచంద్రాకృతిగా ఉండి, మూసివేసిన గుర్రపు డెక్కవంటి స్థితియాన్ని యీ ప్రదర్శనాప్రదేశం పోలి ఉండేది. అందులో ఒక్కొక్క తరగతిలో గల సీట్లవరకూ యెక్కడానికి "క్లిమోకియో" అనబడే సోపానాలుండేవి. థియేట్రస్ పై భాగాన్ని దిగువ భాగాన్ని ప్రత్యేకిస్తూ చదునైన ప్రక్కభాగం కూడా ఉండేది. క్రింద ఉత్తమ స్థానంలో "డయనీసస్" మతాధిపతి ఉన్నతాసనం ఉండేది. ఆ ప్రదర్శనాని కితడొక విధంగా అధ్యక్షత వహిస్తాడని చెప్పవచ్చును. ఈ నాటక ప్రదర్శనాప్రదేశం చాలా పెద్దదిగా ఉండేది. ఏతెన్సులో ఉన్న డయనీసస్ థియేటరులో ఎయ్‌రాపలిస్ దక్షిణపు వాలులమీద నుంచి దాదాపు 17,000 మంది ఆసీనులవ్వడానికి తగినంతగా చుట్టూ గట్లు ఉండేవి. వాటిక్రింద నాటక ప్రదర్శకుల నిమిత్తం చదునైన వలయాకారస్థలం ఆర్కెస్ట్రా (నృత్యరంగం) ఉండేది. ఆర్కెస్ట్రాకు మధ్యగా ఒక బలిపీఠం వుంటుంది. నాటకాభినయంలో కొంతభాగం, అంటే, విన్యాసక్రమాలు నృత్యబృంద నృత్యాలు మొదలైనవి ఆర్కెస్ట్రాలో జరుగుతూ వుండేవి. ఆర్కెస్ట్రాకు కుడి యెడమ భాగాల్లో ప్రత్యేకంగా హద్దులేర్పరచబడిన మార్గాలుండేవి. ప్రేక్షకులు, నటులు, బృందగాయకులు ప్రదర్శనాప్రదేశంలోకి ప్రవేశించడానికి బైటికి వెళ్ళడానికి యీ మార్గాలుపయోగించబడేవి. ఆర్కెస్ట్రాకు వెనుక భాగాన రంగస్థలం వుండేది. దాని వెనుక నేపథ్య గృహం వుండేది. ప్రారంభకాలంలోనూ, క్రీ.పూ. 5 వ శతాబ్ద్యంతంలోనూ నేపథ్యగృహం ఒక దారు నిర్మాణంగా ఉండేది. తరువాత క్రమంగా స్థిరమైన శిలాభవనమే నిర్మించబడింది. చాలా నాటకాలలో నేపథ్యగృహం గృహముఖాన్నో ప్రాసాద ముఖాన్నో దేవాలయ ముఖాన్నో సూచిస్తూ వుండేది. రంగులు వెయ్యబడిన తిరుగుడు చక్రాలు,

పార్శ్వాలకు వేర్వేరు రంగులు వేయబడి పరిభ్రమించుతూ ఉండే రివాల్వింగ్ ప్రిజమ్స్ మొదలైన వివిధసాధనాలు రంగం మారినట్లు సూచించడానికి ఉపయోగింప బడుతూ వుండేవి. రంగులు వెయ్యబడిన కొయ్య తెరగుడ్డ చట్రాలు నేపథ్యగృహానికి అనుబంధాలుగా వుండేవి. ఒక్కొక్కప్పుడు నేపథ్య గృహం ముందువరుసలో నృత్యరంగానికి (ఆర్కెస్ట్రాకు) వెనుకగా రంగస్థల పురోభాగంలో యివి బిగింపబడుతూ వుండేవి. నేపథ్యగృహానికి సాధారణంగా మూడు ద్వారాలుండేవి. అవి నటుల ప్రవేశ నిష్క్రమణాలకు, ఇతర అవసరాలకు ఉపయోగించబడుతూ ఉండేవి. క్రీ.పూ. 5వ శతాబ్దిలో నేపథ్యగృహం పురోభాగంలో ఆర్కెస్ట్రాకు ఒక సోపానం పైగా చదునైన పీఠముండేది. దీన్ని ప్రొస్కీనియన్ లేక లేజినియన్ అనేవారు. ఇక్కడే నాటకాభినయనం యెక్కువగా జరిగేది. అవసరమైనప్పుడు నటులు ఆర్కెస్ట్రాలోకి దిగి అభినయం చేసేవారు. తక్కిన సమయాల్లో రంగస్థలంలోనే నాటకాభినయం జరిగేది.

క్రమంగా కొంత కాలానికి రంగస్థలస్థానంలో ఒక భవనం వంటిది ఏర్పడింది. ఆర్కెస్ట్రానుంచి యీ భవనం పైకెక్కి నాటకాభినయించేవారు. లాంగ్ ప్రొస్కీనియన్ నేపథ్యగృహం ముందు వరండాకు రెండుప్రక్కలా ప్రొస్కీనియన్ నేపథ్య గృహ పార్శ్వాలు అని రెండుండేవి. రంగభవనం దారు నిర్మాణమైనప్పుడు దాని ఆకృతిని వివిధవిధాలుగా మార్చడానికి యీ పార్శ్వగృహాలుపయోగపడేవి. స్థిరమైన శిలాగృహం యేర్పడినప్పుడు యీ పార్శ్వగృహాలు ఎలా ఉపయోగపడ్డాయో స్పష్టంగా తెలియదు. క్రీ.పూ. 5వ శతాబ్దిలో ఉపయోగించిన సాధనలు మరిరెండు ఉండేవి. నేపథ్య గృహంముందే నాటకాలన్నీ ప్రదర్శింపబడడంచేత నాటకాలలోని బహిర్దృశ్యాలు మాత్రమే ఉండి అభినయమంతా సాధారణంగా గృహంముందో హర్మ్యంముందో దేవాలయంముందో జరుగుతూ వుండేవి. ఈ లోపాన్ని పూరించడానికి, ఇళ్ళలోని దృశ్యాలను సూచించడానికి యూరిపిడిజ్, అరిస్టోఫెనిజ్ ఇంకా మరికొందరూ ఎకిలీమా అనే ఒకచక్రవేదికనుపయోగించేవారు. ఇది అంతర్దృశ్యానికి సూచికగా భావింపబడుతూ వుండేది. నాటకవస్తువుల్లో క్లిష్టసమస్యలను పరిష్కరించడానికి భగవంతుని జోక్యం అవసరమైనప్పుడు అతడు ఉపరితలం నుంచి అవతరించాలి గదా! కనుక క్రేన్ (ఓడ కొంగవంటి ఒక వాహనం) భగవంతుని వేషధారి నిమిత్తం లోపలికి వచ్చేది. దానిమీద ఆ భగవంతుడవతరించేవాడు. "డి అస్ ఎక్స్‌మెకనా" యంత్రంనుంచి దేవుడు అని యీ వాహనాన్ని పిలిచేవారు. నాటకవస్తువులోని సమస్యలకు హేత్వాభాసాలు అసమంజసాలు అయిన పరిష్కారాలను చూపడానికి యిది ఒక మార్గంగా రూఢికెక్కింది.

ఈ విధమైన హంగులతో సౌకర్యములతో ఆనాడు నాటక ప్రదర్శనలు జరిగేవి. ఈ ప్రదర్శనలు సామాన్యంగా ప్రత్యేక ఉత్సవాల సమయాల్లో మాత్రమే జరిగేవని యితఃపూర్వమే సూచించడం జరిగింది.

ఉత్సవాలు :

క్రీస్తుపూర్వం 5 వ శతాబ్దిలో ఏథెన్సు నగరంలో నాటకాలు సాధారణంగా రెండు సందర్భాల్లో మాత్రమే—అందులోనూ మత సంబంధమైన ఉత్సవాలలో మాత్రమే—ప్రదర్శింపబడుతూ ఉండేవి. ఇతర సమయాలలో గ్రీకుజాతీయుల జానపదోత్సవాల్లో ప్రదర్శింపబడేవి. ఏథెన్సులో ఎక్కువ ప్రాముఖ్యంలేని ఉత్సవాన్ని "లెనా" లేదా "ఫెస్టివల్ ఆఫ్ వైన్ ప్రెస్" అనేవారు. ఇటువంటి ఉత్సవం జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగేది. సాధారణంగా యీ ఉత్సవం మోదాంతనాటకాలకే ప్రసిద్ధి. అయినా కొన్ని విషాదాంత నాటకాలు కూడా ప్రదర్శింపబడుతూ ఉండేవి. ఎక్కువ ప్రాముఖ్యంకల ఉత్సవానికి "గ్రేటర్ సిటీ డయనీషియా" అని పేరు. "డయనీసస్" దేవుని గౌరవార్థంగా యిది మార్చి-ఏప్రిల్ నెలల్లో జరుగుతూ ఉండేది. అధిక సంఖ్యాకులైన ప్రేక్షకులీ ప్రదర్శనకు హాజరవుతూ వుండేవారు. కేకలు బొబ్బలు పెడుతూ యీ ప్రేక్షకులు తమ ఆమోదాన్నిగాని, నిరసననుగాని వ్యక్తంచేసేవారు. ఒక్కొక్కసారి పళ్ళుకూడా విసిరి వేసేవారు. పాపం! ఒకనటుడు ఒకసారి యీ విధంగానే అసంతుష్టి చెందిన ప్రేక్షకుల రాళ్ళ దెబ్బలతో చచ్చేంతపనిజరిగింది. నాటకాలకు ప్రవేశం ఉచితంగా ఉండేది. కాని క్రమంగా తరువాతి కాలంలో రెండు నాణాలు ప్రవేశరుసుం పెట్టారు. బీదవారెవరైనా కోరినట్లయితే ప్రభుత్వం డబ్బును ముందరగా యిచ్చేది.

గ్రేటర్ డయనీషియాలో నాటక రచయితలకు మోదాంత నాటకాలలో ఒకటి, విషాదాంత నాటకాలలో ఒకటి, 'డితిరామ్బు'లో ఒకటి – మొత్తం మూడు పోటీలు జరుగుతూ ఉండేవి. పెలోపొనీసియన్ యుద్ధానికి పూర్వం యీ ఉత్సవం ఆరురోజులు జరిగేది. మొదటి రోజున విధ్యుక్తంగా జరిగే ఊరేగింపును, రెండవ రోజున "డితిరామ్బియా" బృందగానాల పోటీలు జరిగేవి. "డితిరామ్బు" సుశిక్షితులైన యాభై మందివున్న గాయకబృందం గానంచేసే డయనీసస్ పూజా విషయంకల బృందగీతం. ఈ బృందగీతం పోటీలో పది బృందాలు పాల్గొనేవి. మూడవ రోజున అయిదుగురు మోదాంత నాటకకవులు ఒక్కొక్క కృతిని పోటీకి సమర్పించేవారు. చివరి మూడు రోజుల్లో ముగ్గురు విషాదాంత నాటకకవులు

ఒక్కొక్కరూ మూడేసి విషాదాంతనాటకాలను, ఒక్కొక్క హాస్య (శటైర్) నాటకాన్ని పోటీలకు సమర్పించేవారు.

ప్రతి నాటక ప్రయోగానికీ చాలా శ్రద్ధవహింపబడుతూ ఉండేది. ఎంతో ధనవ్యయం జరుగుతూ ఉండేది. నాటకరచయితే ప్రదర్శనాదర్శకత్వం వహించి అవసరమైతే స్వయంగా పాత్రధారణ కూడా చేస్తూ వుండేవాడు. విషాదాంత నాటకాల్లో ముగ్గురు పాత్రలకంటె యెక్కువగా ఉండేవారుకారు. పౌరుల్లో సంపన్నుడైన వాడొకడు యీ నాటకప్రయోగ వ్యయమంతా భరించేవాడు.

విషాదాంత నాటకాలు విపులాలు, క్లిష్టాలు అయిన కళా విశేషాలు, సంభాషణ లోను పద్య పఠనంలోను లయ, సుస్పష్టమైన అభినయం, ఉజ్వలవస్త్రప్రదర్శనం మొదలైన విచిత్రాంశాలిందులో సమ్మేళనమొంది వుండేవి. బృందగీతాలలో సంగీతము ఉండనే ఉండేది. ఇంక యీ నాటకాలలో వాద్యసంగీతం, బృంద గానం, ఉత్తమ స్థాయి నృత్యంకూడా వుండేవి. ముఖవైఖరీ విన్యాసాలవల్ల భావ ప్రదర్శనంచేసి రక్తికట్టించడం కష్టసాధ్యమైన విషయమని అనాటి ప్రేక్షకుల నిశ్చితాభిప్రాయ మవడంచేత నటులంతా కృత్రిమ ముఖాలు ధరించేవారు. ఎత్తుగా కన్పించడానికి, విగ్రహౌన్నతిని పెంచుకోడానికి నటులు విషాదాంతనాటకోచితాలైన యెత్తుమడమల బూట్లు ధరించేవారు.

గ్రీకు విషాదాంత నాటకాలు కొన్ని విభాగాలు చేయ బడ్డాయి. నాటకం నాందీ ప్రస్తావనలతో ప్రారంభమయ్యేది. వీటిల్లో ఒక పాత్ర సంభాషణమాత్రంగాని, యిద్దరిదిగాని వుండేది. ఇది నాటక సందర్భాన్ని ప్రేక్షకులకు పరిచయంచేసే చిన్న దృశ్యం. పిమ్మట బృందగానం ప్రారంభమయ్యేది. బృందనాయకులు పాడుతూ ఆడుతూ వాద్యబృందంలో చేరేవారు. 5 వ శతాబ్ది తర్వాత కాలక్రమాన బృందగానం ప్రాముఖ్యం తగ్గిపోయింది. మొదట నాటకాభినయంతో యిది గాఢాను బంధం కలిగి ఉండేది. ఈస్కిలస్ కృతమైన "దినప్లయంట్స్" ఇందుకు ఉదాహరణంగా గ్రహించ వచ్చును. కాని యూరిపిడిజ్ కృతాలైన అనంతర నాటకాలలో బృందగాయకులు నాటకంతో సంబంధంలేని భావగీతాలు పాడుతూ ఉండేవారు. సాధారణంగా బృందగాయకులు నాటకాంతం వరకూ వాద్యబృందం దగ్గరేవుండేవారు. విషాదాంతనాటకాల గాయక బృందంలో సాధారణంగా పదిహేనుమంది సభ్యులుంటారు. వారిలో ఒకడు నాయకుడుగా ఉంటాడు. అతడు వాద్య సంగీతంతో నృత్యం చేస్తాడు. కొన్ని సమయాల్లో గాయకబృందం రెండుగా చీలి ఒక దానికి ప్రత్యుత్తరంగా రెండోది పాడడం జరిగేది. ఒక బృందం

ఆర్కెస్ట్రాతో ఒకవైపు పరిక్రమిస్తూ "స్ట్రోపి" అనే గేయ విశేషాన్ని పాడుతుంది. రెండవ బృందం దానికి ప్రత్యుత్తరంగా "యాంటి స్ట్రోపి" అనే మరొక గేయ విశేషాన్ని పాడుతుంది. కొన్ని సందర్భాలలో యీ బృందగానంతో మరొక విధమైన గేయ విశేషంకూడా పాడడం జరుగుతుంది. ప్రారంభబృందగానం యీ విధంగా పూర్తిఅయిన వెంటనే మొదట ప్రాసంగిక కథనం వస్తుంది. ఆధునిక నాటకంలోని అంకానికి లేదా రంగానికి యిది సమానమై వుంటుంది. సాధారణంగా యిది మూడు పాత్రలమధ్య జరిగే సంభాషణారూపంగా వుంటుంది. బృందగానం ఒకటి యీ ప్రాసంగిక కథనాన్ని అనుసరిస్తుంది. అందులో చివరలో యిది రెండు భాగాలుగా చీలి సంవాదరూపమైన బృందగానంగా మారుతుంది. సాధారణంగా నాటకమిట్లా నాల్గైదు భాగాలుగా రూపొందుతుంది. ప్రత్యేక సందర్భాల్లో బృంద గానం (కోరస్) స్థానాన్ని మరొకవిధమైన బృందగానం ("కోమస్" పేరనున్నది) ఆక్రమిస్తుంది. బృందగానానికి (కోరస్‌కి), కోమస్‌కి ఛందోభేదమే భేదం. ప్రాసంగిక కథనాలు బృందగానాలు అయిన తరువాత, "ఎగ్జోడస్" అనబడే ముగింపు దృశ్యం కూడా పూర్తి అయిన తర్వాత గాయకబృందం పార్శ్వ మార్గాల ప్రేక్షకుల దృష్టి పథంనుంచి తప్పుకొంటుంది. గ్రీకు విషాదాంతనాటకం చదివేవారు అందరూ అభిన్నంగావుండే లయానుగుణ ప్రవృత్తినాదం, గీతం, సంగీతాల నెంతమాత్రమూ మరువ కుండా వుండడం చాలా ముఖ్యమైన విషయంగా వుంటుంది. ఈ విధంగా పరిణమించిన గ్రీకు నాటకరంగంలో అసలు "డితిరామ్బు" మొదలైన నృత్యాది రచనలు యేవిధంగా ఆవిర్భవించి రూపొందాయో సూక్ష్మంగా గ్రహించడం అవసరం.

క్రీ. పూ. 7 వ శతాబ్ది మధ్యలో "కారింత్" నగరవాసి అయిన "ఏరియన్" అనే రచయిత "డితిరామ్బు" నృత్య గేయాన్ని ఆశువుగా కాక ఛందస్సు ననుసరించి వ్రాయ నారంభించాడు. అప్పటినుంచే "డితిరామ్బు" నృత్యగేయం సారస్వతరూపం తాల్చింది. క్రీ. పూ. 639–559 ప్రాంతంలో "ఏథెన్స్" నగరాధి పతి అయిన "సోలాన్" వ్రాసిన రచనలైన "ఎలిజీస్" వల్ల యీ అంశం నిర్వివాదంగా ధ్రువమవుతున్నది. మొట్టమొదట విషాదాంత నాటకాన్ని "ఏరియన్" ప్రవేశ పెట్టాడని "సోలాన్" స్పష్టంగా పేర్కొన్నాడు. తన రచనను "నాటకం" గా మొదట పేర్కొన్న వాడు "ఏరియన్" అనడానికి ఎటువంటి సందేహమూ లేదు. క్రీ. పూ. 6 వ శతాబ్ది పూర్తి కాకముందే "డితిరామ్బు" సారస్వతంలో స్థానం సంపాదించుకొన్నది. "కోరస్"లో యాభైమంది నాట్యంచేస్తూ ఛందోబద్ధాలైన పాటలు పాడుతుండేవారు.

"ఏరియన్" తరువాత రచయితలలో సుప్రసిద్ధుడైనవాడు "సిష్యాన్" నగర వాసి అయిన "ఎపిజీనీస్." ఈ "సిష్యాన్" నగరం "పెలొపొనీసస్" రాష్ట్రంలోనిది. ఇది "డోరియన్" జాతివారికి నివాసస్థానం. ప్రథమ విషాదాంత నాటకకర్త యీతడే అని కొంతమంది పండితుల వాదం. "తెస్పిస్" ఇతనికి తరువాతివాడేనని ప్రసిద్ధి. "సిష్యాన్" అధిపతి అయిన "క్లీస్తనీజ్," క్రీ.పూ. 590 లో మేకను బహుమతిగా యేర్పరచి అంతకుముందు సిష్యాన్ రాజైన "ఎడ్రాస్టస్" గౌరవార్థం జరుగుతున్న ఉత్సవాన్ని "డయనీసస్" పూజార్థంగా మార్చివేశాడు. ఎడ్రాస్టస్‌పట్ల క్లీస్తనీజ్‌కున్న వైరభావమే యీ మార్పుకు కారణం. అంతకుముందు – అంటే, ఎడ్రాస్టస్ గౌరవార్థమే ఉత్సవాలు జరుగుతున్నప్పుడు – మేకను బహుమతిగా యివ్వడం జరిగేది కాదు. ఈ ఉత్సవ పరిణామానికి తరువాత మొదటి నాటకాన్ని ఎపిజీనీస్ వ్రాశాడు. ఈ నాటక రచన జరిగినప్పటినుంచి "కోరస్"లో కారింత్‌లోవలె డయనీసస్ సేవకులైన శటిర్స్‌కు సంబంధం తొలగింపబడింది. కారింత్‌లోవలె యీ నాట్యానికి 'శటిర్' నాటకం అని కాక ట్రాజడీ (మేక నాటకం) అని నామాంతరం యేర్పడింది.

క్రీ.పూ. 6 వ శతాబ్దిలో "ఎటికా" రాష్ట్రంలో అయోనిక్ జాతి ప్రసిద్ధిచెందిన జాతి. ఇంతవరకూ "పెలొపొనీసస్" రాష్ట్రాన్ని గురించి కారింత్, సిష్యాన్ పట్టణాల పౌరులను గురించి, పెలొపొనీసస్ రాష్ట్రవాసులైన డోరియన్ జాతివారిని గురించి తెల్సుకున్నాము. ఇప్పుడు ఎటికా రాష్ట్రాన్ని, ఆ రాష్ట్రంలో ఉన్న ఎకేరియా – ఏతెన్స్ పట్టణాలను, ఆయా పట్టణవాసులైన అయోనిక్ జాతివారిని గురించి యింక మనం తెలుసుకొనవలసి ఉంది. డోరియనులలో డయనీసస్ సేవకులైన "శటిర్స్"కు మేకరూపం ఉండేది. కాని అయోనియన్‌లలో "శటిర్స్"కు గుర్రపు రూపముండేది. క్రీ.పూ. 450 వరకూ యీ విధంగానే ఉన్నది. ఆ తరువాత ఎటికా పింగాణి పాత్రలమీద మేకరూపు శటైర్లు కనిపిస్తాయి. ఈ మార్పు అప్పటినుంచే వచ్చి వుంటుంది.

"కారింత్"లో ఏరియన్‌కు పూర్వం యే విధంగా డితిరాంబు అనబడుతూ బృందగానం (కోరస్) తో కలసిన నాట్యముండేదో ఆ విధంగానే ఎటికాలో కూడా వుండేది. దానికి ఎకేరియా నివాసి అయిన తెస్పిస్ సారస్వతరూపం యిచ్చాడు. ఈ తెస్పిసే పెలొపొనీసస్ రాష్ట్రంలోని కొన్ని ఆచారాలను గ్రహించి, మరి కొన్నింటిని ఊహించి ట్రాజడీకి నూతన జీవితాన్ని కలుగజేశాడు. పూర్వ సంప్రదాయాల ననుసరించి ఛందోబద్ధమైన కవిత్వాన్ని, మేకను బహుమతిగా యివ్వడాన్ని యితడు గ్రహించాడు. నటుణ్ణి సృష్టించడమనేది యితని స్వయంప్రతిభామూలకం.

డితిరాంబులో బృందగాన (కోరస్) దళనాయకు డుండేవాడు. కొరిఫీయస్ అని అతని పేరు. అంటే, సూత్రధారుడన్నమాట. రచయిత తాను స్వయంగా యీ పాత్ర నిర్వహించేవారు. ఈ దళంలో ఉన్నవారే కార్యాలీ అనే ప్రశ్నలు వేస్తూవుండగా కొరిఫీయస్ (సూత్రధారుడు) సమాధానాలు చెప్పుతూ ఉండేవాడు. ఈ ఆచారాన్ని అనుసరించే పురోగమిస్తూ బృందగానదళం (కోరస్) నుంచి సూత్రధారుణ్ణి వేరు పరచి స్వతంత్రుడైన నటవ్యక్తిగా చూపడం "తెస్పిస్" చేసిన మహత్తరమైన కార్యం. అందువల్లనే 'యాక్టర్' (నటుడు) అనే పదం జవాబు చెప్పేవాడనే అర్థంలో ప్రయోగింపబడింది. సాఫోక్లిజ్ కాలంవరకూ ఆయా రచయితలే తమ తమ నాటకాల్లో నటులుగా ఉండేవారు. అరిస్టాటిల్ కూడా యీ విధంగానే పేర్కొన్నాడు ఈ సమీక్షవల్ల "డితిరాంబు" నాట్యగాన సూత్రధారునుంచి విషాదాంత నాటకం యే విధంగా అవతరించిందో తెలుస్తుంది. డితిరాంబు నాట్యంలో నటనగాని, పాత్రోచితవేషధారణగాని వుండేది కాదు.

తెస్పిస్ దీనిని సమగ్రంగా మార్చివేసి నాటకాభివృద్ధికి మహత్తరమైన సేవ చేశాడు. తాను స్వయంగా డయొనీసస్ పాత్ర ధరించేవాడు. అందువల్ల మునుపటి రీతిగా డయొనీసస్ సేవకులవలె వారి పాటలను పాడటమే కాక వేషధారణ చేసేట్లుగా కూడా చేశాడు. డయొనీసస్ సేవకులు శటీర్స్, అనగా, మేకరూపు కలవారు. కాగా వారు మేక తోలు, మేక కొమ్ములు ధరించవలసి వచ్చేది. ఇంతేకాదు: మేకలవలె అభినయించవలసి వచ్చేది. ఇది భావి నాటకాభివృద్ధికి అత్యంత ప్రధానమైన ఉపచారమని వేరె చెప్పనవసరం లేదు. అందువల్ల నటుడు పాత్రలో పూర్తిగా లీనమై, ప్రేక్షకుడు తనలో భావైక్యం పొందే అవకాశం యేర్పడి నాటకంలో రసస్ఫూర్తికి అనిర్వచనీయమైన దోహదం కలిగేది. కాబట్టి "కావ్యేషు నాటకం రమ్యం" అన్న సూక్తి ఉత్పన్నమైనది. ఈ సందర్భంలో మనం చెప్పుకో దగిన వింతకథ ఒకటి ఉన్నది. క్రీ.పూ. 639-559 ప్రాంతంలో ఏథెన్సు నగర పరిపాలకుడైన సోలన్, తెస్పిస్ నాటకం చూడడానికి వెళ్లాడట. అంతకు ముందు నాట్యంచేసి పాటలు పాడడం తప్ప వేషధారణమే లేదు గదా! తెస్పిస్ నిర్వహిస్తున్న నూతన విధానాన్ని చూచి "ఈ విధంగా మాయనటన చేసి ప్రజల యెదుట అబద్ధ మాడడానికి సిగ్గులేదా?" అని సోలన్ గద్దించి అడిగాడట. దీనికి సమాధానంగా తెస్పిస్ "నాటకంలో వినోదానికాడితే ప్రమాదం యేముంది?" అని సమాధానం చెప్పాడట. వెంటనే సోలన్ తన చేతికర్రతో నేలమీద కొట్టి "మనమీ నటనను మెచ్చి గౌరవించినట్లయితే యిటువంటి నటనే ప్రజావ్యవహారాల్లో ప్రవేశించగలదు" అని కోపంతో అన్నాడట.

తెస్పిస్ గ్రీకు నాటక ప్రపితామహుడని యీ పర్యాలోచనవల్ల స్పష్టమవు తున్నది. కాని యితడే నాటకానికి సమగ్ర స్వరూపాన్ని యివ్వలేదు. ఆ పని చేసినవా రితని తరువాతివారు. కొన్ని ప్రధానాంశాలను మాత్రమే యితడు ప్రవేశపెట్టాడనడం సత్యమే కాని నాటకంలో మోటుతనం మిగిలే ఉన్నది. ఉన్నత సారస్వతస్థాయిని అది పొందలేదుకూడా. క్రీ.పూ. 534 లో పెజిస్ట్రేటస్ అనే ఏతెన్సు నియంత సిటీ డయనీసియా అనే పేర డయనీసస్ ఎల్యూథేరియస్ దేవుని పూజకొరకు ఒక ఉత్సవాన్ని ప్రారంభించాడు. ఎల్యూథేరియస్ పట్టణంనుంచి తీసుకొనివచ్చిన విగ్రహానికి జరిగే పూజావిధానం కాబట్టి దీనికా పేరు వచ్చింది. ఎల్యూథేరియస్‌లో డయనీసస్‌కు నల్లమేక చర్మం ధరించినవాడని పేరు. ఈ ఉత్సవంలో విషాదాంత నాటకాల పోటీలు ముఖ్య కార్యక్రమంగా యేర్పాటు చేయబడ్డాయి. మొదటి పోటీలో తెస్పిస్ తగిన విజయం పొందాడు. తొలిమేక బహుమానం తెస్పిస్‌కే లభించింది. కాని నాటకం మాత్రం పరిపూర్ణస్థితి నందుకొనలేదు. భాషాడంబరం, అసభ్యత, వాచాలత మొదలైన అవగుణాల సంగతి చెప్పనవసరం లేదు. కాలక్రమాన యివి ఈస్కిలస్ చేతిలో మారిపోయి, ఉన్నతస్థాయికి వచ్చాయి.

తెస్పిస్ తరువాత ఫెలస్ పట్టణ నివాసి అయిన ప్రాటినస్ పేర్కొనదగినవాడు. ఫైలస్ పట్టణం పెలోపొనీసస్ రాష్ట్రంలోనిదని యీ రాష్ట్ర ప్రజలు డోరియన్ జాతివారని యిదివరకే పేర్కొనడం జరిగింది. ప్రాటినస్ పద్దెనిమిది ట్రాజడీలను, ముప్పైరెండు శటైరిక్ నాటకాలను వ్రాశాడు. కాగా మన మిప్పటికి మూడు విధాలైన నాటక విభేదాలను చూడగలిగాము : 1 ఆశువుగా చెప్పి పాడే డితిరామ్బు. ఇది పల్లెలలో పరిపాటిగా ఉండేది. 2. ఛందోబద్ధంగా వ్రాయబడుతూ సారస్వతస్థాయి నందుకొన్న డితిరామ్బు. క్రీ.పూ. 508 నుంచి యిది ఏతెన్సులో జరుగుతున్న సిటీ డయనీసియా ఉత్సవాల్లో ఒక భాగంగా ఉండేది. 3. విషాదాంత (ట్రాజడీ) నాటకం. ఈ పరిస్థితుల్లో ట్రాజడీల్లో కేవలం మద్యానికి అధిదేవత అయిన డయనీసస్ గురించి వ్రాసే పద్ధతి మారింది. కాని ప్రజల్లో మాత్రం కొంత పూర్వాచార పరాయణత, సాంప్రదాయానుసరణము వుంటుంది గనా! అందువల్ల కేవలం డయనీసస్‌ను గురించి నాటకాలు చూడాలనుకొనేవారు చాలామంది వుండేవారు. దీన్ని గుర్తించిన ప్రాటినస్ తన స్వస్థలమైన ఫైలస్‌లో సారస్వతస్థాయి నందిన డితిరామ్బును ఎటికా రాష్ట్రంలోని ట్రాజడీని కలిపి శటైర్ ప్లేస్ వ్రాశాడు. ఆ శటైర్ నాటకాల యితి వృత్తాలు డయనీసస్‌కు సంబంధించినవే; ఇవి డయనీసస్ ఉత్సవాల సందర్భంలో ప్రదర్శింపబడేవే. కాబట్టి ఈ విధంగా ఉండడం సముచితమే ననిపించుకుంటుంది. డయనీసస్ ఉత్సవాలలో మేకను బహుమానంగా యిచ్చే పద్ధతి క్రీ. పూ. 501 లో

మార్చివేయబడింది. అంతేకాక ఔత్సాహిక నటులు నూతన విశాలైన నాటకాలను ప్రదర్శించడానికి ప్రారంభించారు. ఈ నాటకాలే కామెడీలు (సుఖాంతనాటకాలు)గా పరివర్తన చెందాయి. ఇప్పటినుంచే ప్రతినాటకకర్తా మూడు విషాదాంత నాటకాలకు ఒక శటైరు నాటకాన్ని ప్రదర్శించాలన్న నియమంకూడా ప్రవేశపెట్టబడింది. ప్రాటినస్ క్రీ.పూ. 499 లో ఈస్కిలస్‌తో పోటీచేసినట్లు తెలుస్తున్నది. ప్రాటినస్ శటైర్ నాటకాలను ప్రవేశపెట్టింది బహుశా క్రీ.పూ. 517 లో కావచ్చును. శటైరు నాటకాలలో రెండు రకాలైన వేషాలున్నట్లు ప్రాచీనపాత్రల వైఖరి తెల్పుచున్నది. ఒక రకమైనవారు గుర్రపు దుస్తులు. ఇంకొక రకమైనవారు మేక దుస్తులు ధరించేవారు. కాని యీ భేదం నాటకాలలో పాల్గొనేవారు పూర్తిగా సాధించినట్లు కనిపించదు. ఒకవేళ పండుగులలో ధరించే దుస్తులలో యిటువంటి భేదం పాటింపబడేదేమో ! గుర్రపు దుస్తులవారికి సైలీని అని, మేక దుస్తులవారికి శటైర్స్ అని పేర్లు. నేపుల్సులోని క్రీ.పూ. 400 నాటి ప్రాచీన గ్రీకు పాత్రమీద శటైర్ నాటకానికి సన్నద్ధమవుతున్న దృశ్యం ఒకటి చిత్రింపబడి ఉంది. ఈ దృశ్యంలో మేకతోలు, చెడ్డీ, గుర్రపుతోక మాత్రం కనిపిస్తాయి. కొమ్ములుగాని, కాళ్ళకు మేకడెక్కలు లేదా గుర్రపుడెక్కలుగాని కనిపించవు. అప్పటికీ దుస్తులు శటైర్ నాటకాలలో పాల్గొనేవారికి నిర్ణయమై వున్నట్లు ధ్రువపడుచున్నది.

గ్రీకు ట్రాజడీని యెవరు ప్రారంభించారనే విషయం వివాదగ్రస్తమైనదిగా వున్నది. ఏరియన్, ఎపిజీనిస్, తెస్పిస్‌లు ముగ్గురిని ప్రారంభకులుగా పేర్కొనవచ్చునని కొందరంటున్నారు. మరికొందరు ఈస్కిలస్ మొదటి విషాదాంత నాటకకర్త అని దృఢంగా విశ్వసిస్తున్నారు. ఏది యెట్లావున్నా ఏరియన్, ఎపిజీనిస్‌లకు పూర్వం ట్రాజడీగా గుర్తించదగిన గ్రీకు రచనే లేదని, తెస్పిస్, ఈస్కిలస్‌ల తరువాతనే ట్రాజడీ పూర్ణస్వరూపం పొందిందని మాత్రం స్పష్టంగా చెప్పవచ్చును.

ఈస్కిలస్ :

గ్రీకు విషాదాంత నాటకాలన్నిటిలోనూ ఈస్కిలస్, సోఫోక్లిజ్, యూరిపిడిజ్‌ల నాటకాలే సజీవాలుగా నిలిచివున్నాయి. సజీవాలుగావున్న యీ నాటకాలుకూడా యీ రచయితలు రచించిన వాటిలో చాలా అల్పభాగం మాత్రమే. ఈ ముగ్గురిలోనూ ప్రాచీనుడైన ఈస్కిలస్ క్రీ.పూ. 525 లో ఏతెన్సు నగరంలో ఒక ప్రముఖ కుటుంబంలో జన్మించాడు. ఆ కాలంలో యీ నగరానికి యెక్కువ ప్రాముఖ్యం రాలేదు. ఈస్కిలస్ బాలుడుగా వున్నప్పుడు "డయనీసస్" దేవుడు స్వప్నంలో కనపడి విషాదాంత నాటకాలు వ్రాయవలసిందిగా ఆజ్ఞాపించినట్లు ఒక కథ ప్రాచీన

కాలం నుంచీ ప్రచారంలో ఉన్నది. ఇతన్ని "పైతాగరియస్"గా చెప్పే సంప్ర దాయంకూడా ఉన్నది. అంతేకాక "ఎల్యూసినియన్" రహస్యాల ప్రోత్సాహకుడని కూడా పేర్కొనబడ్డాడు. ఒకప్పు డితడు ఎల్యూసినియన్ రహస్యవిశేషాలను వెల్లడి చెయ్యడంచేత దేశభక్తి హీనుడనే నిందకు గురైనట్లు భావించడం జరిగింది.

క్రీస్తుకు పూర్వం 499 లో ఏతెన్సులో జరిగిన నాటకాల పోటీల్లో ఈస్కిలస్ పాల్గొన్నాడు. ఇంతకుపూర్వం 484 లో జరిగిన పోటీల్లోకూడా పాల్గొని విజయం పొందాడు. అది ప్రముఖంగా పేర్కొనదగిన విజయం కాదు. దీని తర్వాత జరిగిన అనేక పోటీల్లో ఉన్నత విజయాలను పొందాడు. ఈస్కిలస్ కేవలం రచయిత మాత్రమేకాదు. గొప్ప యోధుడుకూడా. "మేరథన్" లోనూ, "శలమిస్" లోనూ జరిగిన యుద్ధాలలో యితడు పోరాడాడు. ఇతడు తొంబై నాటకాలు వ్రాస్తే వాటిల్లో యేడు మాత్రమే నిలిచి వున్నాయి. ఎప్పుడైనాగానీ పోటీల్లో పదమూడు సార్లు బహుమతులు పొందాడు. ఈస్కిలస్ క్రీ.పూ. 455 లో సిసిలీలో కీర్తిశేషు డయ్యాడు. గ్రీసు దేశంలో ఏతెన్సు నగరం అత్యద్భుతమైన ఔన్నత్యదశను పొంద డం యితడు తన అవసానకాలంలో చూడగల్గాడు.

ఈస్కిలస్ నాటకంలో సాంకేతికశక్తి క్రమాభివృద్ధి మనకు స్పష్టంగా కన్పి స్తుంది. బృందగానానికి అధికప్రాతగల యితని ప్రథమ నాటకమైన "ది సప్లయింట్స్" లో విషాదాంత నాయకుడు మొదటిసారిగా కనిపిస్తాడు. "ది సెవెన్ ఎగెనెస్టె థీబ్స్" నుంచి నాటకీయత అత్యంతవికాసం పొందిన "ఒరెస్టియా" వరకూ మనం ఎంతో అభివృద్ధిని చూడగలం. ఈ నూతనసృష్టి నాటకీయ సంభావ్యతను గమనించే యితడు రెండవ నటుణ్ణి నిల్పాడని "అరిస్టాటిల్" చెప్పకుండానే తెలు స్తుంది. సోఫాక్లిజ్ ననుసరించి యీతడు ఒరిస్టీస్‌లో మూడవ నటుణ్ణికూడా నిల్పాడు. మనకు లభిస్తున్న నాటకాలను బట్టి యీతని భావనావిశిష్టతను, శైలి ఔన్నత్యాన్ని విశేషంగా మనం గుర్తించగలం. ఇతని భాషాపరిపుష్టి, సార్థకశబ్దప్రయోగ ఔచితి అత్యంత ప్రశంసనీయాలు. ఉత్తమ కవీశ్వరునికి ఉండదగిన కవితా గాంభీర్య వైశిత్యాలతో యీతని భావాలు అలరారుతూ వుంటాయి. మతవిషయంలోనూ, తాత్త్విక విషయాల్లోనూ యితనికి ఆసక్తి మెండని చెప్పవచ్చును. విశ్వజనీనమైన వనీ, ముఖ్యమైనవనీ తాను భావించే మతతాత్త్విక సమస్యల ప్రభావం కలవిగా మానవుల సంగతులను ఇతడు సమీక్షిస్తాడు. పశ్చిమ యూరప్ సంస్కృతికి సంబంధించిన రచనలలో దివ్యత్వాన్నిగూర్చి ఉత్తమాలు, ప్రశస్తాలు అయిన భావా లున్న వాటిల్లో ఒకటిగా భాసించే "ఒరెస్టా" ను యితడు సమర్థవంతంగా తీర్చిదిద్ది పరిసమాప్తి కావించగల్గాడు.

సోఫోక్లిజ్ :

సోఫోక్లిజ్ యూరిపిడిస్ కంటే ముందుగా, అంటే, దాదాపు క్రీ.పూ. 495 ప్రాంతాన జన్మించి తొంభై యేండ్లు జీవించి క్రీ.పూ. 405లో కీర్తిశేషుడయ్యాడు. ఇతని కుటుంబం సంపన్నవంతమైంది. ప్రభుత్వకార్యాలయాల్లో అనేకపర్యాయాలు ఉద్యోగం చేశాడు. సోఫోక్లిజ్ నూటయిరవై నాటకాలు రచించగా వాటిలో దాదాపు యేడు మాత్రమే లభ్యమవుతున్నాయి. ఇతని నాటకాలు విషాదాంత నాటకాల పోటీలలో యిరవై పర్యాయాలు విజయం పొందగా అమేయమైన ఖ్యాతి పొందాడు. కళాకౌశలంతోనూ అతిగంభీరమైన భావగ్రహణాశక్తిలోనూ పరిణితుడైన సోఫోక్లిజ్ ప్రతిభాపరిమితులను నిర్ణయించడానికి విమర్శకులకు సాధ్యమయ్యేదికాదు. ఇతని నాటకాలన్నిటిలోనూ ముఖ్యంగా “ఎడిపస్ ది కింగ్” అన్న దానిలో ఇతని నాటకీయతా వైదుష్యం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. ఈ “ఎడిపస్ ది కింగ్” లోనూ, “ఎజాక్స్” నాటకంలోనూ, “ఫిలాక్టిటీజ్” లోనూ ఇతడు తన రచనా వైదుష్యంతో పరాంకోటి నధిరోహించాడు. వాటిల్లో యితడు పతాకాస్థానకాన్ని (డ్రమెటిక్ ఐరనీ) అధికంగా ఉపయోగించాడు. మానవజీవితాన్ని గూర్చి యితని దృక్పథం యెటువంటిదో యితని రెండు గేయనాటకాల్లో స్పష్టంగా గోచరమవుతుంది. యాంటిగనిలో మానవీయతాద్భుతాలను, ‘ఎడిపస్ ది కింగ్’లో స్వర్గసూత్రాలను ప్రతిబింబింపజేశాడు. జీవితాన్ని గురించి ‘సోఫోక్లిజ్’ దృక్పధంలో రెండంశాలున్నాయి. స్వర్గ నిర్దేశాన్ని, దాని శాశ్వత సూత్రాలను అనుసరించి మానవుడు తన గమ్యాన్ని తానే రూపొందించుకొనడం ఒకటి. అమాయికంగా తనకు తెలియక తన తల్లినే వివాహమాడి స్వర్గనియమాల నతిక్రమించిన ఎడిపస్ అంతర్మథనమూ, చివరిగా అతని పతనమూ పై అభిప్రాయానికి నిదర్శనాలు.

ఈస్కిలస్ బోధనా విధానము మత తాత్త్విక శాఖాభిముఖంగా ఉంటుంది. యూరిపిడిస్ ముఖ్యంగా మానవుల విషయాల్లో ఆసక్తకలిగి వుంటాడు. మానవ స్థాయిలో అతిక్లిష్టాలైన మానవ సమస్యల నెదుర్కొనేటప్పుడు వారి మానసిక పరిస్థితులపట్ల కూడా యితని కాసక్తి వున్నది. ఈ యిద్దరి కవులకూ మధ్యస్థంగా సోఫోక్లిజ్ స్థితి వుంటుంది. ఈస్కిలస్ నియతితోపాటు యూరిపిడిస్ మానసిక పరిశీలన కూడా యితనికున్నాయి. ఇతనిలో దైవీయ మానవీయ సంఘర్షణ యెల్లప్పుడూ కన్పిస్తూ వుంటుంది. ఇతని మానవ జీవితభాష్యం గంభీరమైనదేగాక విస్తృతమూ సార్వభౌమత్వమూ కలది. సృజనాత్మకమైన పశ్చిమ యూరపు సాహిత్యంలో దీనికి తుల్యమైనదెక్కడో వొక్కటి వున్నా యిది అసాధారణమైనదే అనవచ్చును.

యూరిపిడిస్ :

యూరిపిడిస్ స్థానం ప్రాథమికాంశాల్లోనే ఈస్కిలస్ ఆశయానికి ప్రతి ద్వంద్విగా కనిపిస్తుంది. క్రీ.పూ. 485–480 మధ్య యితడు జన్మించాడు. పేద కుటుంబానికి చెందిన యితని తల్లి కూరలమ్ముకుంటూ వుండేది. ఇతని బృందగీత చరణాలలో చిత్రకళాభిజ్ఞతా సూచకాలైన ప్రయోగాలుండడంవల్ల చాలామంది ఇతనికి చిత్రకళ వచ్చునని భావిస్తున్నారు. స్త్రీల పాత్రచిత్రణల్లో యితడు నిస్సంకోచంగా చిత్రిస్తాడు. అందువల్ల యితనికి స్త్రీలతో అతి సన్నిహితంగా అత్యధికమైన అనుభవాలుండి వుంటాయని యితని జీవిత చరిత్రకారు లూహించారు. ఇతడు అసలు వ్రాయడానికి తొంభై రెండు నాటకాలు వ్రాసినా తన జీవితకాలంలో యెనభై యెనిమిది మాత్రమే ప్రచురింపగల్గాడు. పూర్వాచారాలకు దూరమైన యితని నూతనాశయాలు ప్రజామోదం పొందకపోవడంవల్ల యితడు పోటీల్లో నాలుగుసార్లు మాత్రమే కాబోలు విజయం పొందాడు. ఇతని నాటకాల్లో ప్రబలమైన సంశయాత్మత వ్యక్తమవుతూ వుంటుంది. మహావైభవాన్ననుభవించిన ఏతెన్సు నగరం వినాశోన్ముఖమై శిథిలమవుతున్న పెలొపొనీషియన్ యుద్ధసమాప్తి కాలంలో యితడు రచించిన నాటకాల్లో అనుమానం, అనిశ్చితత్వం అధికంగా కనిపించుతుంది. ఇతని భావాలు యితని జీవితకాలంలో ప్రజామోదం పొందకపోయినా మరణానంతరం విషాదాంత నాటక కవితయందలో ఇతన్ని ఉత్తముడుగా పరిగణించడం జరిగింది. ఇతనివి పదిహేడు విషాదాంత నాటకాలు, ఒక పరిహాస నాటకమూ ఇప్పుడు నిలిచి వున్నాయి. మాసిడోనియాలో కింగ్ ఆఫ్ ఆర్ ఖిలాజ్ ఆస్థానంలో రెండేళ్ళుండి క్రీ.పూ. 406 ప్రాంతాన యితడు కీర్తిశేషుడయ్యాడు.

నాటక నిర్మాణంలో యూరిపిడిస్ అంతగా నిపుణుడు కాడు. మానవ సమస్యలను మానవస్థాయిలో పరిశీలించడమే యితని గొప్పతనానికి పెద్దకారణం. కుశాగ్రబుద్ధిగా యితడు చేసే పాత్ర మనఃపరిశీలనం, ప్రసన్నమైన ఇతని కరుణ రసోత్పత్తి దృశ్యాల్లో సంభావ్యనాటకీయతలను గూర్చి యితని ఆలోచన, సాంప్రదాయక గాథలను నూతన నాటకీయ కల్పనలో వ్యాఖ్యానించగల యీతని సామర్థ్యం – యివి అన్నీ సమున్నతస్థాయిలో వుండి కార్యప్రవణమైన పరిణత మనస్వితను వ్యక్తంచేస్తూ వుంటాయి. మానవుని సమస్యల విషయంలో యితని పరిష్కరణా న్నుదాహరించడానికి "అల్ సెస్టిస్" గాని, "మెడియా" గాని ఉపయోగిస్తుంది. "హిప్పొలిటస్" లోని "ఫీడ్రా" పాత్రలోనూ, ఎలెక్ట్రా పాత్రలోనూ, ఇంకా అనేక పాత్రలలోనూ యితని పాత్రచిత్రణా వైభవం కానవస్తుంది.

నాటకీయపంథాలో యితడు తన ప్రభావాన్నత్యధికంగా చూపించాడు. నాటక కవులమీద సాంప్రదాయక గాథలకున్న ప్రాబల్యాన్ని యూరిపిడిస్ సడలించాడు. బృందగానాల ప్రాబల్యాన్ని తగ్గించాడు. పాత్ర పరిశీలనకోనం యితడిచ్చిన ప్రాముఖ్యమే యితని విశిష్టకళోపాయనం. ఇంతకుముందు తెలిపిన విధంగా యితడు ఈస్కిలస్‌వలె మతవిషయాల్లో ఆసక్తికలవాడు కాడు. బాధలను, అరిష్టాలను యెదుర్కొని తలపడే మానవుల నైతిక సమస్యలపట్ల ఇతనికి ఆసక్తి వున్నది. ఇతని జీవిత తత్వజ్ఞతకు "ది బ్యాకీ" ఒక చక్కని ప్రతిబింబంగా కనిపిస్తుంది. పరిమితిలోనూ వైభవంలోనూ ఈస్కిలస్‌కూ సోఫోక్లిజ్‌కూ ఇతడు తగ్గిపోవచ్చునేమో గాని విశిష్టమైన ఉత్కృష్టతాగుణంలో, నాటక కళ అభివృద్ధి చెందడానికై బాటలు నిర్మించడంలో ఇతడు తన ప్రత్యేకత నిలబెట్టుకున్నాడు.

1. ఈస్కిలస్ రచనలు :

   1. ది సప్లయింట్సు, 2. ది పర్షియన్స్, 3. ది సెవెన్ ఎగినెస్ట్ ది థీబ్సు, 4. ది ప్రామిథియస్ బౌండు, 5. ది ఎగమెమ్నన్, 6. సీఫొరి, 7. యూమినైడ్స్.

2. సోఫోక్లిజ్ రచనలు :

   1. ఎజాక్స్, 2. ఎడిపస్ ది కింగ్, 3. యాంటిగని, 4. ట్రాకినియా, 5. ఎలెక్ట్రా, 6. ఫిలాక్టిటీజ్, 7. ఎడిపస్ ఎట్ కొలొనస్.

3. యూరిపిడిస్ రచనలు :

   1. ఆల్‌సెస్టిస్, 2. మెడియా, 3. హిపోలిటస్, 4. హెకూబా, 5. ఆండ్రోమకి, 6. ది హెరాకేడీ, 7. ది సప్లియంట్స్, 8. ది ట్రోజన్ ఉమన్, 9. ఎరాక్లిజ్, 10. ఇఫజెకాయ ఇన్ టారస్, 11. టో, 12. హెలెన్, 13. ఎలెక్ట్రా, 14. ఒరస్టీజ్, 15. ది ఫినిన్సి, 16. ది బ్యాకి, 17. ఇఫజీనియా ఇన్ ఆలిస్, 18. రీసస్, 19. ది సైక్లోప్స్.

సునేరియస్ :

సునేరియస్ ఐకేరియా రాష్ట్రీయుడు. ఏతెన్సులో క్రీ.పూ. 580–560 మధ్యకాలంలో యితడు మోదాంత నాటకాన్ని ప్రవేశపెట్టాడు. దేశంలో ఉన్న పురాతనాచారకాండకు సంబంధించిన కార్యక్రమాలను స్థిమితమైన వాస్యంతో

కూడిన ప్రదర్శనంగా యితనే మార్చివేశాడు. లెనా ఫెస్టివల్ వాలంటీర్స్ కోడి పుంజుల్లాగ, పక్షుల్లాగ వేషాలు వేసుకొనేవారు. క్రీ.పూ. 486 లో డయనీషియా నగరంలోను, క్రీ.పూ. 442 లో ల్యాడియాలోను అధికారిక పర్యవేక్షణలో మోదాంత నాటక ప్రదర్శనం నిర్వహింపబడింది. ప్రాచీన మోదాంత నాటక సాహిత్యం, మధ్యకాలిక మోదాంత నాటక సాహిత్యం, నూతన మోదాంత నాటక సాహిత్యం అని మోదాంత నాటక సాహిత్యం మూడు విధాలుగా విభజింపబడింది. ప్రాచీన మోదాంత నాటక సాహిత్యం క్రీ పూ. 5 వ శతాబ్దిలో అంతమైంది. మధ్య కాలిక మోదాంత నాటక సాహిత్యమూ, నూతన మోదాంత నాటక సాహిత్యమూ క్రీ. పూ. 340 వరకూ వున్నవి. నూతన మోదాంత నాటక సాహిత్యంలో క్రీ.పూ. 300 ప్రాంతం ఉత్తమకాలం. మధ్యకాలిక మోదాంత నాటకాలకు ఎరిక్సిస్, యాంటిఫనీజ్ అనే రచయితలు ముఖ్యకర్తలు. ఈ యిద్దరి రచనలు ఒక్కటైనా లభించలేదు. ప్రాచీన మోదాంత నాటకం క్రీ.పూ. నాల్గవ శతాబ్ది ప్రారంభంలో అంతమవ్వడానికి కారణం నాటి రాజకీయాలు. అరిస్టోఫనీజ్, పెరిక్లిజ్, సోక్రటీస్, యూరిపిడిస్, మొదలైన సమకాలిక నాటక కర్తలపై దూషణ లతో నిండిన విమర్శలు కొనసాగాయి. ప్రాచీన మోదాంత నాటకానిక, మధ్యకాలిక మోదాంత నాటకానికి మధ్య ఒక అర్ధశతాబ్ది సంధియుగంగా గడచింది. రాజకీయ వ్యక్తిత్వాలను, వ్యక్తుల గాథలను యీ కాలంలో కావ్యవస్తువులుగా ఎన్నుకొనడాన్ని పరిత్యజించడం జరిగింది. సాహిత్యవిమర్శ వికటానుకరణలు, వికటపురాణ కథలు—కావ్య వస్తువులుగా పరిగ్రాహ్యాలు కాసాగాయి. నూతన మోదాంతనాటకం నిత్యజీవితాని కంకితంగా రూపొందింది.

ఎపిఖర్మస్ :

ఎపిఖర్మస్ అనే యీ రచయిత "సిసిలీ" లోని "మెగారా హిబ్లియా" నివాసి. క్రీ.పూ. 485 లో యితడు సిరాక్యూస్‌కి వలస వెళ్ళాడు. అరిస్టాటిలు అభిప్రాయాన్ననుసరించి ప్రాచీనకాలపు గానట బీసట గాథలకు బదులు సక్రమ మైన నాటక ఇతివృత్తాన్ని యితడు కల్పించాడని చెప్పవలసి ఉంటుంది. గ్రీకు నగరమైన "మెగరా"కు సంబంధించిన సునెరియస్‌కూ, "సిసిలీ" లోని మెగరాకు చెందిన "ఎపిఖర్మస్"కూ మధ్య స్వామ్యవాదాలు ప్రతిస్వామ్యవాదాలు వుండేవి (ఒక "మెగరా" గ్రీసులోనూ, మరొక "మెగరా" సిసిలీలోనూ వుందన్న సంగతి గుర్తించాలి).

క్రేట్స్ :

ఎపిఖర్మస్ వలెనే "క్రేట్స్" తన నాటకాలలోని అంశాల నొకే ఒక యితివృత్తానికి సహకారులుగా వుండేటట్లుగా ఒనర్చాడు. డయనీషియా నగరంలో క్రీ.పూ. 450 లో యితడు ప్రథమ విజయం పొందాడు.

క్రేటిమస్ :

"క్రేట్స్" కు సమకాలికుడైన "క్రేటిమస్" అనేక పాత్రలకు బదులు, ఒకదానికొకటి సంబంధం లేకుండా వుండేట్లుగా మూడు పాత్రలను సృజించాడు. మోదాంత నాటకాల్లో దుష్కర్ములను పరిహసించి తిరస్కరించాడు. సుసేరియస్, ఎపిఖర్మస్, క్రేట్స్, క్రేటిమస్‌లు అతిప్రాచీన (క్రీ.పూ. 565–450) మోదాంత నాటకకర్తలుగా పరిగణింపబడతారు. ప్రాచీన మోదాంతనాటక సాహిత్యం క్రీ.పూ. 450 నుంచి 385 వరకూ వుంటుంది. ఇంతకంటె అతి పురాతన కాలంలోని నాటకం పాత్ర రహితంగా వుండి కేవల నృత్యగాయక బృందమొక్కటే పాత్రలుగా పాల్గొనడంలో విశిష్టత నొందింది. క్రేటిమస్ తన నృత్యగాయక బృందాన్ని సంభాషణలో పాల్గొనకుండా విరమింపజేసి వారిసంఖ్యను ముగ్గురికి తగ్గించి వేశాడు. ఈ విధంగా బృందగాయకులకంటె, బృందగాన నాయకులకంటె భిన్నంగా నటులకు స్థానం లభించింది. నాటకీయ పాత్రాభినయాన్ని ఈ విధంగా యిది మేళవించుకొన్నది. మూడు పాత్రలుగల విషాదాంతనాటక ప్రభావంవల్లనే యిట్లా జరిగించడంలో సందేహం లేదు. పూర్వమున్న రెండు పాత్రలను సోఫాక్లిజ్ మూడు పాత్రలుగా మార్చాడు. ప్రాచీన మోదాంత నాటకం దూషణోక్తిని ఒక ప్రబలమైన ఆయుధంగా పెంపొందించుకొన్నది. ఈ అంశమే ప్రాచీన, మధ్యకాలిక, నూతనమోదాంత నాటకాలకంటె దీనికి విశిష్టమైన ప్రత్యేకతను సంపాదించింది. డయనీషియా నగరంలో క్రీ.పూ. ·52 లో క్రేటిమస్ ప్రథమ విజయం పొందాడు.

ఇక్ఫన్‌టిడేజ్ :

"ఇక్ఫన్‌టిడేజ్" క్రీ.పూ. 457-453 సంవత్సరాల మధ్య ప్రథమ విజయాన్ని పొందాడు. "మెగేరియన్ కామెడి"ని ఇతడు చేపట్టాడు.

కియామిడీజ్, మాగ్నిజ్ :

కియామిడీజ్, మాగ్నిజ్‌ల కాలంలో, అంటే—క్రీ.పూ. 486 ప్రాంతంలో— ప్రభుత్వం మోదాంతనాటకానికి అధికారిక గౌరవాన్ని యిచ్చింది. ఐచ్ఛిక ప్రద

ర్శనగావున్న బృందగానాలను కూడా పూర్వాచారానికి విరుద్ధంగా ప్రభుత్వం యేర్పాటుచేసింది. ది ఎకియాన్, ది గాల్‌ఫైస్, ది హార్‌పిస్ట్స్, ది బర్డ్స్ అండ్ ది ఫ్రాగ్స్ అనే నాటకాలను మాగ్నెజ్ రచించాడు. ఈ నాటకాలలోని పాత్రలలో కొన్ని ఆ పాత్రలు ధరించే జంతు, పక్షి, కీటకాకృతులుగల కృత్రిమముఖాలను సూచిస్తాయి.

మోదాంతనాటక ప్రాదుర్భావం :

అరిస్టాటిలు ననుసరించి మోదాంత నాటకాలు కూడా ఫ్యాలిక్ కర్మకాండల లోని నాయకులతో కూడా సద్యః కల్పనలవల్ల ప్రాదుర్భావం చెందాయి. ఈ కర్మ కాండ బలిస్థానానికివెళ్ళే ఊరేగింపుతో కూడివుంటుంది. బలి, ప్రజాపతి (ఫ్యాలిక్) గీతమైన (కోమస్) ఆమోద గీతంతో కలిసి వుండేది. కామెడీకి (మోదాంత నాట కానికి) అసలైన అర్థం కోమస్ సాంగ్ (ఆమోదగీతి) అని. త్రాగి గంతులువేసే వేషధారుల బృందం పాల్గొంటుందని దీని భావం. ప్రజాపతి (ఫ్యాలిక్) ఉత్సవ పద్ధతిగల ఆమోద గీతినుంచి (కామెడీ) మోదాంతనాటకం రూపొందింది. ఆమోద గీతిలో రెండంశాలుంటాయి. భక్తుల పూజాతంత్రాలలో సన్నిధి చెయ్యవలసిందిగా దేవుణ్ణి ప్రార్థించడం ఒకటి; కామతంత్రానికి సంబంధించిన భావాలతో ఆశువుగా చెప్పే పద్యం రెండవది. వీటిల్లో వ్యక్తుల నుద్దేశించే పరిహాసానికి యెక్కువగా అవకాశం వున్నది. ప్రజాపతి (ఫ్యాలిక్) కర్మకాండలు కామ్యసంసిద్ధికే గాక దుష్ట భూతాలనుంచి రక్షణ సమకూర్చడానికి కూడా ఉద్దేశింప బడ్డాయి.

ప్రాచీన మోదాంతనాటక లక్షణాలు :

1. ప్రోలోగ్ : మన నాంది ప్రస్తావనలవంటిదిగా 'ప్రోలోగ్' ఉంటుంది. నాట కాంశవివరాలు తెలియజెయ్యడానికి నాటకాభినయప్రారంభానికి ఇది ఉపకరిస్తుంది.

2. పరడస్ : పరడస్ అనేది బృందగాయకుల ప్రవేశగీతం. అరిస్టోఫనిజ్ కాలం నుంచీ కొన్ని సందర్భాల్లో అక్కడక్కడా నటులు పలికే వాక్యా లతో కూడా యిది వుంటుంది.

3. దియాగ్ : యాగ్ అనేది యిద్దరు నటులమధ్య జరుగుతూ బృందగాయకుల చేత బలపరచబడే నాటకీయమైన సంవాదరూపమైన రచన.

4. పరబెసిస్ : ముందుకురా అనే అర్థంవున్న గ్రీకు పదం యిది.

నటులు రంగభూమికి దూరంగా వుండడంవల్ల గాయకబృందం ప్రేక్షకులను బోధించడానికి ముందుకు నడుస్తుంది. పరబెసిస్ ఏడు విభాగాలతో రెండు దళాలుగా యేర్పడి అందులో మొదటిదళం మూడు చిన్న విభాగాలతో ఉంటుంది. కారిఫియస్ట్ ప్రధాన గాయకుడు యీ విభాగాన్ని నిర్వహిస్తాడు. నాటకీయవిభ్రాంతిని, నాటకంలో ముందు జరగబోయే సంఘటనలతోడి సంబంధాన్ని విడిచిపెట్టి స్వీయగుణ విశేషాలను గురించి కవికిగల భావాలను వెలువరించి జనానీకంనుంచి వట్టి ప్రశంసనే ఆశిస్తాడు. ఇతనికి ప్రతినాయకులైన కవుల్ని పరిహసిస్తాడు. ప్రజా సమస్యలను గురించి తన అభిప్రాయాలను ప్రకటిస్తాడు. రెండవదళం నాల్గు విభాగాలతో ఉంటుంది. దీనిని ఎపిర్ హెమటిక్ సిజిగే అంటారు. ఇందులో మొదటిభాగం ఒకగేయం. రెండవది ఎపిర్‌హిమి లేకుండా గాయక బృందంలో సగంమంది క్రమంగా చెప్పే ఉపన్యాసం. దీనికి తక్కిన గాయక బృందమూ దీని నాయకుడూ క్రమంగా యిచ్చే సమాధానం. మూడవదొక యాన్‌టొడిను ఒక యాంటిపెరిమ్‌గా ఉంటుంది. ఈ గాయకబృందం సాధారణంగా వేషంతో పాడుతుంది. యోధులు తమ గుర్రాలను ప్రశంసిస్తారు. పక్షులు తమ జీవితాలను మానవ జీవితాలతో పోల్చుతూ పాటలు పాడడం జరుగుతుంది.

5\. ఉపకథలు : అనంతరం ఉపకథలు, నాటకీయ దృశ్యాలు ఒక దాని వెంట ఒకటిగా వస్తాయి.

6\. సంగ్రహం : బృందగానాలతో ప్రత్యేకింప బడుతుంది. ఈ ప్రాసంగిక వృత్తాలు పూర్వ విజయ (3) పరిణామాలను చిత్రించుతాయి. ఉపాహరణకి—అకారమియనిజ్ నాటకంలో గడచిన వివాదాంశం డైసీపొలిస్ స్పార్టాలో చేసికొన్నట్లు ఆరోపింపబడిన సమాధానమూ, రాజద్రోహానికి శిక్షింపబడాలా లేదా అనే విషయమూ గ్రహించ వచ్చును. 5 వ భాగంలో ప్రాసంగిక కథ ఉండదు. ఆ ఆంతరంగిక శాంతి పరిణామాల ననుభవిస్తున్నట్లు పరిహాస దృశ్యాలలో వరుసగా చిత్రిస్తుంది.

7\. ప్రస్థానం : ఎగ్సోడస్ లేక గాయకబృంద నిర్గమనం. ఇది భరత వాక్యం—ఫలశ్రుతి విరమణ గీతాలలో మాత్రమే ఉండవలసింది. కాని యిది గీతానికి తర్వాత జరిగే నాటకశాలా నిర్గమనాన్ని కూడా కలుపు కొంటుంది. క్లిష్టమైన విషయానికి వొక అసమగ్రమయినా విస్తృతమూ అయిన రూపం. కాని ప్రస్తుతం మన కిది సరిపోతుంది. పూర్వ మోదాంత నాటకాలలో ప్రతి అంశమూ

యీ సూక్ష్మ విభాగాలలో ఉంటుందని చెప్పలేము. ప్రతి నాటకంలోనూ యీ విభాగాలలో ఒకటి రెండంశాలలో తేడా ఉండవచ్చును.

అరిస్టొఫెనిజ్ :

అరిస్టొఫెనిజ్ ప్రాచీన మోదాంత నాటకాలకు ప్రతినిధి. ఫిలిపస్‌కి జమొద్రాకు పుత్రుడై క్రీ. పూ. 445 ప్రాంతాన ఎటికాలో జన్మించి 387 ప్రాంతంలో కీర్తిశేషుడయ్యాడు. చాలా చిన్నతనంలోనే యితడు రచన చెయ్యడం ప్రారంభించాడు. ఇతని ప్రథమ నాటకం "ది బ్యాంక్విటర్జ్" క్రీ. పూ. 427 లో యితని 18 వ యేట యిది ప్రదర్శింపబడింది. నలభై మోదాంతనాటకాలను యితడు రచియించాడు. తన సమకాలికులచేత గొప్ప నాటక కర్తగా భావింపబడ్డాడు. ఇతని నాటకా లొక విశిష్టత కలవి. ఇటువంటి విశిష్టత మళ్ళీ మనకెక్కడా కనిపించదు. ఈ నాటకాల్లో నేటికాలంలో గూడా కనిపించని పూర్తి వాక్స్వాతంత్ర్యం ఉన్నది. వ్యక్తిగాని సంఘంగాని తుదకు దేవుడేగాని యితని లేఖినికి గురికాకుండా యేమాత్రమూ తప్పుకొనలేక పోయారు. ఏతెన్సు నగర వాసులీ ఆరోపణలకు దూషణలకు ఆనందించేవారు. పూర్వ మోదాంత నాటకంలో అశ్లీలాలు సమృద్ధిగా ఉండేవి. ఆ కాలంలో ప్రజలభావాలు మర్యాదలు అటువంటి మొగమోటంలేని సంభాషణలపట్ల సుముఖంగా ఉండేవి. ప్రారంభదశలో యితని నాటకాలలో వస్త్వైక్యం (యూనిటీ ఆప్ ప్లాట్) లేదు గాని యితరగుణా లున్నాయి. తరువాతి నాటకాలు సమగ్ర నిర్మాణాన్ని ప్రదర్శించుతాయి. అరిస్టొఫెనిజ్ ప్రత్యేకత యేమంటే ఉజ్వలమైన హైహాస్యం. ఇతని భావనాబలం అమోఘమైంది. ఇతని మోదాంత నాటకాలు అనుక్రమంగా ఒకదానివెంట ఒకటిగా వచ్చే ప్రకాశవంతాలైన భావనివేదనలు. ఇతడు గ్రీకువారి దృష్టిలో ప్రీతిపాత్రమైన అధరలేపనం (రోగ్) అనదగినవాడు. కాని యితనిని అందరూ అపార్థం చేసికొన్నారు. ఇతడు న్యాయవంతుడనిపించు కొన్నాడు. కాని యితని చమత్కారం న్యాయాన్యాయాలకు వశంకానిది. కండూతిగల నైతిక ప్రమాణాలలో విశృంఖలంగా విహరించేది. తరచుగా యితడు ఏక కాలంలోనే చమత్కారిత్వాన్ని భావనా లోలుపత్వాన్ని అనన్య సామాన్యంగా వ్యక్తీకరిస్తాడు. ఇతడు ప్లేటో ప్రేమను చూరగొన్నాడు. ఉజ్వలమైన మనస్వితయేగాక కరుణార్ద్రమైన హృదయం కూడా ఉన్న చిత్రమైన వ్యక్తి యితడు.

ఎలిక్జిస్, యాంటిఫనిజ్ :

వీరిద్దరూ మధ్యకాలిక మోదాంత నాటక కర్తలు. ఎలిక్జిస్, యాంటిఫనిజ్‌ల గురించి వివరాలేమీ తెలియరాలేదు.

మినందర్ :

నూతన మోదాంత నాటక సాహిత్య సృష్టికర్తల్లో ప్రముఖుడైన మినందర్ క్రీ. పూ. 342 లో ఏతెన్సులో జన్మించాడు. డియాపిరిన్, హెగిసిస్ట్రాటాల కుమారుడు. ఎలిక్జిస్‌కి మేనల్లుడు. సుప్రసిద్ధ రచయిత అయిన తన మేనమామవద్ద విద్యాభ్యాసం చేశాడు. సుప్రసిద్ధ తత్వవేత్త, శాస్త్రజ్ఞుడు అయిన థియోఫ్రాస్టస్ సన్నిధిని కూడా యితడు శుశ్రూషచేసి విద్యగఱించాడు. ఇతడు స్ఫురద్రూపి. సంపన్నుడు. మంచి అభిజనం కలవాడు. ఇతనికి స్త్రీలపట్ల వ్యామోహం మెండు. శతాధిక నాటకాలను రచించాడు. కాని యెనిమిదిసార్లు మాత్రమే విజయం పొందాడు. క్రీ. పూ. 292 లో జలప్రమాదంలో యితడు కీర్తిశేషుడయ్యాడు. అతి విస్తృత మైన కీర్తి పొందాడు. గ్రీకు సాహిత్యంలో హోమర్, రోమన్ సాహిత్యంలో వర్జిల్ మాత్రమే యితనికంటే గొప్పవారనదగినవారు. ఈతని రచనలన్నిటిలోనూ యిప్పు డున్నది క్రీ. శ. 19 వ శతాబ్దిలో ఈజిప్టులో తుక్కుగావున్న చిత్తుకాగితాల రాశిలో నుంచి లభించింది. అరిస్టోఫెనిజ్‌కూ, మినందర్‌కూ మధ్యఉన్న తారతమ్యం యెవరెవర్ని అనుకరించారో చెప్పడానికి వీలులేనంత క్లిష్టంగా ఉంటుంది. ఆకృతి లోనూ, ఆశయంలోనూ, శైలిలోనూ, విషయంలోనూ వీరిద్దరిలో భేదం చాలా అత్యధికంగా కనిపిస్తుంది. వీరిద్దరిని ఒకరితో ఒకరిని పోల్చి మినందర్ అరిస్టో ఫెనిజ్ కంటె తక్కువవాడనుకొనేటంతటి ప్రమాదంలో మాత్రం పడకూడదు. వీరిద్దరూ భిన్నులు. అందులోనూ మినందర్ తనకంటె ప్రాచీనుడైన అరిస్టోఫెనిజ్‌తో సాటిరా గలిగినంత గొప్పవాడుకూడా. మినందర్ ప్రతిభకు ప్రధానలక్షణం సావధానచాతుర్యం. ఇతని మోదాంతనాటకాలు పరిపూర్ణమైన సామర్థ్యంతో నిర్మించబడ్డాయి. కథాక్లిష్టత అధికంగాఉన్నా యితని నాటకాలు సుస్పష్టతలో గాని, ఐక్యతలో గాని వేటికీ తీసిపోవు.

నాటకీయ రచనా పరిపక్వతకు పరిణతిచెందిన అనర్గళ ధారావాహిక శైలీ సంపద కావాలి. మినందర్ కీసంపద అమోఘంగా ఉన్నది. తరువాతి శతాబ్దులకు చెందిన సాహిత్యలోకం యితని నాటకాలనుంచి యేరినముత్యాలుగా చమత్కార చాటూక్తి సంకలనాలను నిర్మించుకొన్నది. ఈతని భాషా ప్రభుత్వ మటువంటిది ;

అంతటిది. ఈతని శైలి ప్రసన్నమైనది. పద్యాలలో రచింపబడినా యితని నాటకాలెప్పుడూ కవితామయాలై వుండటానికి ప్రసన్నతా గుణంపట్ల యితనికున్న అభిమానమే కారణం.

విషయాన్నిబట్టిచూస్తే నూతన మోదాంత నాటకకర్తలు చాలా సంకుచిత రంగంలో వర్తించారనే చెప్పవచ్చును. ఈ నాటక వస్తువులు చర్వితచర్వణాలుగా కన్పడడం వింతగా వుంటుంది. ప్రధానాంశాలలో ఏమాత్రమూ మార్పువుండదు. జనాకర్షణచేసే దిక్కుమాలిన బానిస కన్నెలు, వారితో యువకులు ; తల్లి దండ్రుల వ్యతిరేకతను బానిసలకుట్రలను అతిక్రమించి చివర కీయువకులను బానిస కన్నెలు వివాహం చేసుకుంటూ వుంటారు. పరిహాసం అణుమాత్రమైనాలేని మినందర్ నాటకాలకు కామెడీ (మోదాంతనాటకా) లని పేరు పెట్టడం సముచితంకాదు. కథావస్తువు అరిస్టాటిల్, హెలెన్ వంటి యూరిపిడియా ట్రాజడీస్ కథావస్తువులనుబోలి వుంటుంది. ట్రాజడీస్‌లోవలెగాక మినందర్ రచనల్లో నాటకం మోదాంతం అవుతూ వుంటుంది. భాషకూడా హాస్య రసోత్పాదకంకాదు. ఎటువంటి అశ్లీలతలూ భాషలో ఉండవు. సమకాలికులను పరిహసించడం కూడా వుండదు. ఇతని పాత్రలలో వాటి ప్రతీకారాభినయాలకు మనం కొంత మందహాసం చేస్తాము. ఈ విధంగా మినందర్ గొప్ప నాటకరచయితగా ప్రకాశిస్తాడు. ఇతనివి నాలుగు నాటకాలు మాత్రమే లభించడం దురదృష్టకరమైన విషయం.

మనకు లభిస్తున్న మోదాంత నాటకాలు :

అరిస్టాఫెనిజ్ రచనలు :

1. ది అకార్ నస్, 2. ది నైట్స్, 3. ది క్లౌడ్జ్, 4. ది వాస్ప్స్, 5. పీస్ 6. ది బర్డ్స్, 7. లిసిస్ట్రాటా, 8. ది తెస్మొ ఫొరియాజుసస్, 9. ది ఫ్రాగ్స్, 10. ది ఎక్లీసియాజుసస్, 11. ది ప్లూటస్.

మినందర్ రచనలు :

1. హీరో, 2. సామియా, 3. ఎపిట్రొపాంటిస్, 4. పెరిసి రోమిని (రేప్ ఆఫ ది లాక్స్).

బ్రహ్మర్షి వేంకటరత్నంనాయుడు

బ్రహ్మర్షి వేంకటరత్నంనాయుడు

బ్రహ్మర్షి వేంకటరత్నంనాయుడు

బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నంనాయుడుగారి శత జయంతి ఉత్సవాల మహాసభలో ప్రసంగించే అవకాశం లభించడం మహద్భాగ్యంగా భావిస్తున్నాను*. ఋషులయుగం గతించింది. అయినా సృష్టి వైచిత్ర్యం ఎంత గొప్పదంటే సహాయ మనేది అనుకోని దిక్కునుండి లభ్యమౌతూ వుంటుంది—అది దైవికం అనండి, యాదృచ్ఛికం అనండి. బహుముఖ ప్రజ్ఞానిధి, గుణసంపన్నులు అయిన బ్రహ్మ ఋషివంటివారు ఈ విశాల భారతచరిత్రలో ఎక్కడా కన్పించరు. అకుంఠిత కార్య దీక్షకు, దైవత్వానికి, ఆధ్యాత్మిక చింతనకు, పవిత్రతకు, వితరణకు మారుపేరు నాయుడుగారు. ఆయన గొప్ప బోధకుడు, గొప్ప సంస్కర్త, అన్నిటికీమించి ఆయన బ్రహ్మర్షి. అటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని మనం ఎక్కడ చూడగలం? నాయుడు గారు 1862 అక్టోబరు ఒకటవతేదీ మహర్నవమినాడు మచిలీపట్నంలో జన్మిం చారు. మచిలీపట్నం కృష్ణాజిల్లాకు ప్రధాన కేంద్రం. నేను ఆ జిల్లాకు చెందినవాడినే. అంతేకాదు, నాయుడుగారు ఏ కళాశాలలో విద్యార్థిగాను తదుపరి అధ్యాపకుడు గాను ఉన్నారో వాటిలో చదివే అదృష్టం నాకు కల్గిందని చెప్పుకోడానికి నేను ఎంత గానో సంతోషిస్తున్నాను. మద్రాస్ క్రైస్తవ కళాశాలలో రెండు సంవత్సరాలూ, నోబుల్ కళాశాలలో రెండు సంవత్సరాలూ నేను చదవడం నా భాగ్యం. మన దేశపు విద్యారంగంలో ప్రముఖ పాత్ర వహించిన ఈ రెండు కళాశాలల్లోను నేను చదవటం వల్ల గురుదేవునితో ఆ విధంగా నా సన్నిహిత సంబంధాన్ని వ్యక్తపరచుకో గల్గు తున్నాను. క్రైస్తవ కళాశాల ఎందరో మహామహులను ఉద్భవింపచేసింది. వారిలో డా॥ సి. ఆర్. రెడ్డిగారు ఒకరు. నాయుడుగారి తండ్రి, తాత మదరాసు అర్మీలో పనిచేశారు. సైనికులుగా వారి కుటుంబం విశ్వాసానికి, నిజాయితీకి, ధైర్య సాహ సాలకు పేరొందినది. మహర్షి తాతగారైన రఘుపతి వెంకటరత్నంగారు అందరు తాతలకువలెనే తన మనుమని ఎంతో ప్రేమతో చూచేవారు. మన వెంకటరత్నం నాయుడుగారిని పుత్రునిగా పొందే మహద్భాగ్యం సుబేదారు అప్పయ్యనాయుడు గారికి కలిగింది. అప్పయ్యనాయుడుగారు మిలిటరీ అధికారి. ఎంతో నిరాడంబరులు, నిజాయితీపరులు, దైవభక్తి కలవారు. వైష్ణవ తత్వబోధకులైన రామానుజులవారి మతానికి చెందినవారీయన. గురుదేవుని మాతృమూర్తి శేషమ్మగారు — విష్ణుభక్తి

* ఇది 1962 అక్టోబరు 27వ తేదీన కాకినాడలో జరిగిన బ్రహ్మర్షి వేంకటరత్నం నాయుడుగారి శతజయంత్యుత్సవ సభలో చేసిన ప్రసంగం.

తత్పరురాలు. కుటుంబాన్ని చక్కదిద్దుకోవడంలో అసాధారణ ప్రజ్ఞాపాటవాన్ని ప్రదర్శించేది ఆమె. ఆమెలో భారతనారి కుండవలసిన అత్యుత్తమ గుణగణా లన్నీ ఉన్నాయి. ఆమె ఎప్పుడూ పూజా పురస్కారాలు సలుపుతూ ఉండేది. పేదసాదలకు భోజనాలు పెడుతుండేది. సాధుజనులను, పండితులను సత్కరించేది. మహమ్మదీయ సాధువుల గోరీ కనపడితే చాలు, ఆమె బండిదిగి గోరీకి మొక్కేది. పరాయి మతానికి చెందిన ప్రవక్తలకు ఎందుకు మొక్కుతారంటే "పవిత్రుడైన మానవుని కులమతాలను గురించి అడగవలసిన అవసరం ఏముంది?" అనేది ఆమె. నాయుడుగారిమీద తండ్రిగారికంటే తల్లిగారి ప్రభావమే ఎక్కువ పడింది. నాయుడుగారిని పన్నెండేళ్ళప్పుడు స్కూలులో వేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని బందా జిల్లా ఉన్నత పాఠశాలలో మొదటిసారిగా ప్రవేశించారు. అక్కడే ఆయన పర్షియన్, ఉర్దూ, హిందుస్తానీ భాషలు నేర్చుకున్నారు. అక్కడ చదువుతూ ఉండగానే అనూచానంగా వస్తూవున్న పూజా పురస్కారాలమీద ఆయనకు సందేహాలు ఏర్పడ జొచ్చాయి. ఏకేశ్వరోపాసనను ప్రబోధించే పర్షియన్ పద్యాలు ఆయనను ఎంత గానో ఆకర్షించాయి. క్రమక్రమేణా ఆయన భగవంతుడు ఒక్కడే అనీ, ఆయన లోకేశ్వరుడనీ నమ్మసాగారు. తండ్రి అప్పయ్యనాయుడు గారికి హైదరాబాదు బదిలీ కాగా నాయుడుగారు చాదరుఘాటులో ఉన్న నిజాం ఉన్నత పాఠశాలలో చదువు, కొనసాగించడం జరిగింది. అప్పుడు అక్కడ పనిచేస్తున్న సరోజినీనాయుడు తండ్రి డా॥ అఘోరనాథ చటోపాధ్యాయగారివద్ద విద్యనభ్యసించారు. ఆవిధంగా నాయుడు గారికీ హైదరాబాదుకూ సన్నిహిత సంబంధం ఏర్పడింది. ఆ తర్వాత ఆయన మదరాసు క్రైస్తవ కళాశాలలో చేరారు. అప్పుడు ఆ కళాశాలకు మదరాసు క్రైస్తవ వ్యవస్థాపకులు, నవభారత విద్యావేత్త అయిన డా॥ మిల్లరు ప్రిన్సుపాలుగా ఉంటుండేవారు. కళాశాలలో చదువుతుండగా వెంకటరత్నం నాయుడుగారు చదువు సంధ్యల విషయంలో అయితేనేమి, శీల సంపదల విషయంలో నేమి ప్రతిభావంతు లుగా ఉంటూ ఉండేవారు. ఈయనపట్ల డా॥ మిల్లరు ప్రత్యేక శ్రద్ధవహిస్తూ ఉండే వారు. వెంకట రత్నం నాయుడుగారికి కార్లైల్, టెన్నిసన్, వర్డ్సువర్తు, బ్రౌనింగు, షేక్స్పియరు మొదలైనవారంటే ప్రత్యేక అభిమానం. ఆయన ఎం. ఏ. డిగ్రీకోసం మిల్టన్ వ్రాసిన పేరడైజ్ రీగేయిన్డ్ మీద థీసెస్ తయారుచేశారు. ఈ వ్యాసాన్ని పరీక్ష కులు ఎంతో ప్రశంసించారు. ఆయన 1885 లో పట్టభద్రులయ్యారు. డా॥ మిల్లరును ఆయన ప్రధానాచార్యులుగా భావించారు. నాయుడుగారు మేధా సంపన్నులు. తోటి విద్యార్థులకు చదువు సంధ్యలలో తోడ్పడుతూ ఉండేవారు. మిత్రుడికి జబ్బు చేసిందంటే తన ప్రాణాన్నయినా లెక్కచేయకుండా ఆ మిత్రుడికి సహాయపడేవారు. అంటువ్యాధులు సోకి తన మిత్రులు బాధపడుతూవుంటే, ఆయన జడిసేవారు కాదు.

తాను విద్యార్థిగా ఉన్న రోజులలో అవసరమున్నవారికి సహాయపడేవారు. అంతేకాదు, స్కూలు ఫీజుకూడ తనే కట్టేవారు.

ఇంతకుముందు చెప్పినట్లుగా భగవంతుడు ఒక్కడే అని ఆయనే లోకేశ్వరుడని ప్రబోధించే సూఫీ సిద్ధాంతంపట్ల ఆయనకు మక్కువ ఉండేది. ఆయన స్కూలులో చదువుకుంటున్న రోజులలో రాజా రామమోహనరాయి పేరు మొదటిసారిగా విన్నారు. విగ్రహారాధన వ్యతిరేకిస్తూ ఆయన చేసిన బోధనలను తెలుసుకున్నారాయన. సాధారణ బ్రహ్మసమాజ నాయకుడు పండిత శివానందశాస్త్రిగారి బోధనలవల్ల నాయుడుగారికి బ్రహ్మసమాజంపట్ల మిక్కిలి అనక్తి ఏర్పడింది. శాస్త్రిగారు 1881 లో మదరాసు వచ్చారు. బ్రహ్మ సమాజం గురించి ఆయన వరుసగా ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. అప్పటికి వెంకటరత్నం నాయుడుగారు ఎఫ్. ఏ. చదువుతూ ఉన్నారు. శివానంద శాస్త్రిగారు గొప్ప పండితులు, ఉపన్యాసకులూను. అన్నిటికి మించి ఏకేశ్వరోపాసన సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మిన వ్యక్తి ఆయన. హృదయానికి హత్తుకునేటట్లు ఆయన ఉపన్యసించేవారు. శ్రోతలను మంత్రముగ్ధులను గావించేవారు. నాయుడుగారు బ్రహ్మసమాజం ద్వారా తన ఆధ్యాత్మిక జీవనాన్ని గడపాలని నిశ్చయించుకున్నారు. 1885 లో మదరాసులో బ్రహ్మ సమాజ మందిర నిర్మాణం జరుగుతున్నప్పుడు అంత పిన్న వయస్సులోనే ఆయన ఎక్కువగా కృషిచేశారు. ఆయన ఆ మందిరానికి నిత్యం వెళుతూ వుండేవారు. మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్, శివానందశాస్త్రి మున్నగువారు వ్రాసిన బ్రహ్మసమాజ సాహిత్యాన్ని విరివిగా చదివారు.

ఆ రోజులలో బ్రహ్మసమాజంతో ఎటువంటి సంబంధం పెట్టుకున్నా సనాతన హిందువులు హీనంగా చూసేవారు. ఈ విషయంలోనే నాయుడుగారికి సనాతనులైన వారి తండ్రిగారికి పేచీ వచ్చింది. ఇప్పటికీ మనం మన మతాన్ని విడనాడి మరొక క్రొత్త మతాన్ని స్వీకరించడం ఎంత కష్టమో మనం చూస్తూవున్నాం. అటువంటప్పుడు 70 సంవత్సరాల క్రితం ఇది ఇంకెంత కష్టమో ఊహించవచ్చును. దుర్బల హృదయులు, బలవత్తరమైన సాంఘిక శక్తులముందు లొంగిపోవలసినదే. సనాతన మతాన్ని ధిక్కరించిన వారిని అవి నిర్దయతో నలిపివేశాయి. అన్యమతం స్వీకరించాడంటే అతనికి వెలి తప్పేదికాదు. వంటింట్లోకి రానిచ్చేవారు కాదు. దగ్గిరవారైనా సన్నిహితంగా తిరగనిచ్చేవారు కాదు. అతనికి ఆస్తిలో వాటాకూడా దక్కేది కాదు. కొడుకు చేసిన నేరానికి నాయుడుగారి తండ్రి అనేక సందర్భాలలో మందలించారు. వారిని గదిలో పెట్టి తాళంవేసి తిండి పెట్టకుండా కొన్నాళ్ళపాటు ఉంచేవారు.

ఆఖరికి మొత్తం కుటుంబాన్నే వెలేశారు. బ్రహ్మసమాజంలో చేరిన రోజున ఆయన ఆత్మసంపూర్ణ సంతృప్తిని పొందగలిగింది. ఆయన తన కాలాన్ని భగవద్ధ్యానంలో గడిపారు.

70 సంవత్సరాల క్రితం ఎం.ఏ.ఎల్.టి. చదువుకున్న వ్యక్తి ప్రభుత్వోద్యోగంలో ప్రవేశించివుంటే ఎంతగా రాణించేవారో మనం ఊహించవచ్చు. కాని ఆయన డబ్బుపైగాని అధికారంపైగాని ఆసక్తి చూపించలేదు. సంఘం ఆధ్యాత్మికంగా పునరుద్ధరింపబడటంమీదే ఆయన శ్రద్ధ చూపించారు. పవిత్రత, నిరాడంబరత, సత్యవర్తనలకు కట్టుబడిన వ్యక్తి నాయుడుగారు. సూఫీ వేదాంతాన్ని, హిందూ మతాన్ని, క్రైస్తవ మతాన్ని క్షుణ్ణంగా ఆకళించుకున్నారు. బ్రహ్మసమాజం ద్వారా విశ్వైకమతాన్ని రూపొందించాలని ఆయన వాంఛించారు. ఆయన జ్ఞాపకశక్తి అపారం, దానివల్లనే ఆయనకు అనర్గళంగా ఉపన్యసించే ప్రతిభ ఉండేది. ఆంగ్ల భాషలో వారికిగల పాండిత్యం భారతీయులలో నాటికీ నేటికీ చాలా తక్కువమందికి ఉండి ఉంటుంది. వారు ఆ భాషలో చక్కటి పదజాలం ఉపయోగించి ఉత్తమంగా వ్రాసేవారు. మాటాడేవారు. తన అనర్గళ ఉపన్యాస ధోరణిలో శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసేవారు. ఆస్తికత్వంమీద, వేదాంతంమీద, సాహితీ విమర్శమీద ఆయనతో సరితూగే వ్యక్తులు చాలా అరుదు. విశ్వైకమతాన్ని, ఏకేశ్వరోపాసన సిద్ధాంతాన్ని వ్యాపింపజేసేటందుకు 1881 లో ఒక ముద్రణాలయాన్ని స్థాపించి "బ్రహ్మ ప్రకాశిక," "ఫెలో వర్కరు" పత్రికలను నడిపారు. ఆ పత్రికలను నిర్వహించడంలో వారు చూపిన శ్రద్ధవల్ల అవి మేధావుల మన్ననలను అందుకొన్నవి. ఆ కాలంలో దేశాన్ని బాధిస్తున్న సమస్యలపై తమ మత సంబంధమైన సామాజిక అభిప్రాయాలను ప్రకటించి చాలా సేవజేశారు. అస్పృశ్యతను, పడుపు వృత్తిని ఆయన ప్రతిఘటించారు. విధవా వివాహాలను బలపరిచారు. వెంకటరత్నం నాయుడు, కందుకూరి వీరేశలింగం పంతులుగార్ల స్ఫూర్తితోనూ, ఈ పత్రికల చేయూతతోనూ దక్షిణాదిన సంఘసంస్కరణ బలం చేకూర్చుకుని ముందుకు సాగింది. ఆయన 1884 లో బి.ఎ. మొదటి సంవత్సరం చదువుతుండగా శేషమాంబగారిని వివాహమాడారు. ఆమె దయార్ద్ర హృదయి. పతికి తగిన సతీమణి. 1887 లో వారికి ఒక కుమారుడు జన్మించినాడు. కాని వెంటనే ఆ పిల్లవాడు చనిపోయాడు. తాను మతభ్రష్టుడు కాగా భగవంతుడు కినుకవహించి కుమారుణ్ణి తీసుకుపోయాడని ప్రజలు అనుకునేవారు. ఈ మతాన్ని త్యజించాల్సిందని తండ్రి ఎంతగానో పట్టుబట్టారు. కాని నాయుడుగారు అలాంటిదేమీ చేయలేదు. బ్రహ్మసమాజ మందిరానికి వెళ్ళటం మానివేద్దామా అని భార్య

నడుగగా ఆమె నిరాకరించింది. చివరకు దంపతులిద్దరూ పితృగృహాన్ని విడిచి వెళ్ళవలసి వచ్చింది. 1889 లో ఒక ఆడపిల్లను గని శేషమాంబగారు మరణించారు. ఆమె మరణించిన తరువాత నాయుడుగారు తిరిగి పెళ్ళి చేసుకోలేదు. 50 సంవత్సరాలపాటు కఠినమైన బ్రహ్మచర్యాన్ని అనుసరించారు. హిందూ వితంతువుల మాదిరిగా ఉండాలని ఆయన ఎల్లప్పుడూ తెల్లటి దుస్తుల్నే ధరించేవారు. ఆ విధంగా ఆయనకు "ఆంధ్రదేశ శ్వేతాంబర ఋషి" అని పేరొచ్చింది.

వెంకటరత్నం నాయుడుగారు తాము ఉపాధ్యాయుడు కావాలనే ఎప్పుడూ కోరుకొనేవారు. వారు "ఇంపీరియల్ ఫార్చ్యూన్ టెల్లర్" అనే పుస్తకం చేత పట్టుకొని ప్రశ్న వేసుకోగా బడిపంతులవుతావని సమాధానం వచ్చిందట. చివరకు అది నిజమే అయింది. ఏలూరు సి.ఎమ్.ఎస్. హైస్కూల్‌కు వారు కొంతకాలం హెడ్‌మాస్టరుగా పనిచేశారు. ఆ తరువాత రాజమండ్రి థీయిస్టిక్ హైస్కూలులోను, బందరు హిందూ హైస్కూలులోను ఉపాధ్యాయులుగా పనిచేశారు. 1891 లో ఎమ్.ఏ. (లిటరేచరు) పట్టా పుచ్చుకొన్నాక పచ్చయప్ప కళాశాలలో ఆంత్రోపాలజీ, ఇంగ్లీషు ప్రొఫెసరుగా పనిచేసి, గొప్పపేరు గడించారు. 1894 లో నోబుల్ కళాశాల ప్రథమశ్రేణి స్థాయికి పెంచబడినప్పుడు వారు అసిస్టెంటు ప్రొఫెసరయ్యారు. స్కూలు సూపర్నెంటుగా ఉంటూ దాని పనులు కూడా చూస్తూ ఉండేవారు. ఎక్కువ కాలాన్ని బోధనకూ, హైస్కూలు నిర్వహణకూ వినియోగించేవారు. అతి చాకచక్యంతోను, సామర్థ్యంతోను వారా కార్యభారాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాలు రివరెండు సి.డబ్ల్యూ.ఏ. క్లార్క్, ఎం.ఏ. గారు వారిని గురించి చెపుతూ "విద్యార్థులపై నాయుడుగారి వ్యక్తిత్వ ప్రభావం ఎంతో బలవత్తరమైనది. అంత ప్రభావం కలిగిన మరోవ్యక్తి నెవర్నీ నేను చూడలేదు" అన్నారు. ఎప్పుడూ వారి వెంట ఎంతోమంది విద్యార్థులు ఉంటుండేవారు. వారి బోధనా సామర్థ్యానికి, వారు చూపే వాత్సల్యానికి విద్యార్థులు వారిని అమితంగా గౌరవిస్తూండేవారు. బ్రహ్మర్షి తరవాత కాకినాడ కళాశాలకు ప్రిన్సిపాలైన డా॥ రామకృష్ణారావుగారు నాయుడుగారి ఉపన్యాసాలన్నిటినీ అత్యంత ప్రతిభావంతంగా రికార్డు చేశారు. నాయుడుగారిని గురించి వారిలా అన్నారు : "నాయుడిగారిలో సౌమ్యత, సంతోషంతో తొణికిసలాడే హాస్య ప్రవృత్తి స్పష్టంగా గోచరిస్తాయి. ఆయనది నిండైన విగ్రహం. మనిషిలో ఠీవి, హుందాతనం మూర్తీభవించి ఉన్నాయి. సమయానుకూలంగా ఆయన ఎన్నెన్నో ఉదాహరణలిచ్చేవారు. ఆయన గంగా ప్రవాహంలా ఉపన్యసించేవారు." విద్యార్థులంతా నాయుడుగారి తరగతి గదిని ఒక దేవాలయంగా భావించేవారు.

వారి ఉపన్యాసాలను ఆధ్యాత్మిక అనుభవంగా పరిగణించేవారు. వెంకటరత్నం గారు విద్యాబోధన చేసేటప్పుడు షేక్స్పియర్, మిల్టన్, వర్డ్స్వర్త్, టెన్నిసన్, కార్లైల్, రస్కిన్ వీరంతా సజీవ వ్యక్తులై, నాయుడుగారి ముఖతః తమ సందేశాన్ని ఇస్తున్నట్లుండేది. తరవాతి తరానికి చెందిన ప్రముఖులంతా ఒకప్పుడు వారి విద్యార్థులే. పూజ్యులైన తమ గురువుగారికి తామెంతో ఋణపడి ఉన్నట్లు కృతజ్ఞతతో చెప్పుకొనేవారు. "విద్యార్థులు నాపై చూపే గౌరవమే నా జీవితానికి సార్థక్యం" అనేవారు నాయుడుగారు. బహుశా ఉపాధ్యాయునికి సంతృప్తి కలిగించేది అంతకంటే మరేమీ లేదేమో? బందరు నోబుల్ కళాశాలలో పని చేసిన నాలుగేళ్ళూ తమ జీవితంలో అత్యంత సంతోషకరమైన రోజులు అనే వారాయన. సమర్థులైన ప్రిన్సిపాలు రివరెండ్ క్లార్క్ గారిని వారెంతో గౌరవించేవారు. ఆధ్యాత్మిక, మత విషయాలపై కళాశాల అధికారులతో అభిప్రాయబేదాలు రావడంతో వారు కళాశాలనుంచి తప్పుకోవలసి వచ్చింది. 1899 నుంచి 1904 వరకూ వారు సికిందరాబాదులోని మహబూబ్ కళాశాల ప్రిన్సిపాలుగా పనిచేశారు. వారి నిష్కళంకమైన శీలం, స్వచ్ఛమైన మనస్సు ఈ విలాసమయ స్వేచ్ఛా నగరానికి వింతగా కన్పించాయి. కళాశాలను వీడినప్పుడు విద్యార్థులు అమితాదరంతోను, గౌరవ ప్రపత్తులతోను వారికి వీడ్కోలిచ్చారు.

1904 లో కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాల ప్రిన్సిపాలు పదవి ఖాళీ అయింది. దానికోసం ఇద్దరు దరఖాస్తు పెట్టుకొన్నారు. ఒకరు వి. ఎస్. శ్రీనివాసశాస్త్రి, రెండోవారు వెంకటరత్నంగారు. ఇరువురూ సమాన ప్రతిభావంతులే. అయినప్పటికీ విధి వశాత్తు కమిటీవారు వెంకటరత్నంగారిని ఆ పదవికి ఎంచు కున్నారు. అప్పటినుంచి పిఠాపురం రాజావారికి నాయుడుగారి నిరంతర మార్గ దర్శకత్వమూ, వారి పరిచయ భాగ్యమూ లభించాయి. 1909 లో కళాశాల ఆర్థికంగా స్థిరపడ్డది. పిఠాపురం మహా రాజావారు స్వయంగా కళాశాల నిర్వహణ బాధ్యతను చేపట్టారు. ఇంతకుముందే చెప్పినట్టు స్త్రీలకు, దళిత జాతుల విద్యార్థులకు ఉచితంగా విద్యజరప బడుతుండేది. ఈ ఉచిత విద్యా విధానాన్ని మనం ఈనాటికీ పూర్తిగా అమలు జరపలేకపోతున్నామంటే, ఆనాడు వారు తీసుకున్నది ఎంత అభ్యుదయకరమైన చర్యో, వెనుకబడ్డ వారికి, నిరాధారులకు, నిరుపేదలైన అస్పృశ్యులకు అది ఎంతమేలు చేసిందో మీరు బాగా ఊహించుకో గలరు. 1911 లో మొదటిసారిగా ఆడపిల్లలను కళాశాలలో చేర్చుకొన్నప్పుడు వారితో నెగ్గుకొని రాగల సామర్థ్యం ఉన్నదా అని అనేక మంది సందేహం వెలి బుచ్చారు. ఎన్ని ఇబ్బందులొచ్చినప్పటికీ స్త్రీలకు ప్రవేశం కల్పించడంలో కృత

కృత్యులైనారు. అంతేకాదు : ఇతర కళాశాలలలో కూడ సహవిద్య ప్రవేశపెట్టేందుకొక గొప్ప ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమం క్రమేణా బలపత్తరమై చివరకు భారతదేశంలో ఇదొక ఉత్తమ విద్యా విధానంగా అంగీకరించబడింది. తన విద్యార్థుల జీవనంలోను, వారి నైతిక సంక్షేమంపట్లా స్వయంగా శ్రద్ధ తీసుకొనే వారాయన. ఒకసారి ఒక విద్యార్థి అనైతిక కార్యాలకు పాల్పడుతున్నాడని విని అతణ్ణి పిలిపించి నిజం చెప్పమని అడిగారు. ఆ విద్యార్థి కన్నీరు కారుస్తూ తప్పు ఒప్పుకొని సత్ప్రవర్తనుడైనాడు. తన విద్యార్థులపట్ల పితృవాత్సల్యాన్ని వ్యక్తపరచే ఇలాంటి సంఘటనలు కో కొల్లలుగా ఉన్నాయి. 1905 నుంచి 1919 వరకూ వారు పి. ఆర్. కళాశాల ప్రిన్సిపాలుగా ఉండి విద్యార్థులను ఉత్తేజపరచారు. ఆర్తులను ఆదుకున్నారు. వారి లోపాలను చక్కదిద్దారు. నైతిక పతనంనుంచి కాపాడారు. వారి హయాంలో కళాశాల బాగా వృద్ధిచెందింది. దాని ఉజ్వల ప్రతిష్ఠ వాడవాడలా వ్యాపించింది. పిఠాపురం మహారాజా వారు కళాశాల భవనాలకు, ఆటస్థలాలకుగాను లక్ష రూపాయలూ, 35 ఎకరాల స్థలమూ విరాళంగా ఇచ్చారు. కళాశాలతో తమకు గల సాన్నిహిత్యాన్ని గూర్చి చెపుతూ "నా హృదయాన్ని అరంగుళం చీల్చి చూడండి, అక్కడ మీకు పిఠాపురం రాజా కళాశాల కన్పిస్తుంది" అన్నారు నాయుడుగారు. విద్యార్థులలో మానవతా దృక్పథాన్ని, మేధాసంపత్తిని, మౌలిక ఆలోచనను అలవర్చడంకోసం ఆయన విద్యార్థి సంఘాన్ని స్థాపించారు. అదెంతో ప్రసిద్ధి చెందింది. ఆ సంఘ సభ్యులు ఈ తత్త్వవేత్తను తమ గురువుగా, తండ్రిగా, దైవంగా ఆరాధించేవారు. బ్రహ్మర్షి అనుచరులమని సగర్వంగా ప్రకటించుకొనేవారు. ఆయన తరచు తోటకో, కాకినాడ సముద్రతీరానికో వెళ్ళి ప్రార్థన, దైవం, ప్రేమ, దయ మొదలైన విషయాలపై ఆత్మను ఉత్తేజపరచే ప్రసంగాలు చేస్తుండేవారు. సందేశాలు అందజేసేటప్పుడు వారు ఎంతగా నిమగ్నమై ఉద్రేకపూరితులయ్యేవారంటే, కళ్ళనుంచి అశ్రువులు రాలేవి. చెక్కిళ్ళు ఎరుపెక్కేవి. ఉద్వేగంతో కంఠం రుద్ధమయ్యేది. నయనాలలో దివ్యజ్ఞానజ్యోతి ప్రకాశించేది.

వెంకటరత్నంగారు 1912 లో మద్రాసు విశ్వవిద్యాలయ సెనేటు సభ్యులయ్యారు. విశ్వవిద్యాలయ "ఫెలో" గా కూడ ఎన్నికయ్యారు. మద్రాసు ప్రభుత్వం వారిని 1921 నుంచి 1923 ప్రాంతీయ శాసన పరిషత్తు సభ్యులుగా నామినేటు చేసింది. తరువాత పరిషత్తు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. పిఠాపురం రాజా కళాశాల నుంచి రిటైరయ్యాక ఆయన మరే ఉద్యోగమూ చెయ్యలేదు. మళ్ళీ ఉద్యోగం చెయ్యనని ప్రకటించారు కూడా. 1925 లో వారు మద్రాసు విశ్వ

విద్యాలయ ఉపాధ్యక్షులై మూడేళ్ళపాటు ఆ పదవిలో ఉన్నారు. విశ్వవిద్యాలయ అధికారం చేపట్టాక సుదీర్ఘ పరిణామాలుగల సంస్కరణ లెన్నిటినో ప్రవేశపెట్టారు. ప్రాచ్య అధ్యయన శాఖను ప్రారంభించారు. భారతీయ చరిత్రాధ్యయనాన్ని నిర్బంధం చేశారు. వేదాంత, గణిత శాస్త్రాలకు అధ్యక్ష పీఠాలను నెలకొల్పారు. నిర్బంధ వ్యాయామ శిక్షణను, ద్వితీయ భాషాధ్యయనాన్ని ప్రవేశపెట్టారు. దక్షిణ భారతీయ భాషలపై ప్రముఖ విద్యావేత్తలచే ఉపన్యాసాలిప్పించడం ప్రారంభించారు. భాషా కోవిదులకు డాక్టరేటు డిగ్రీ ఇచ్చి వారిని గౌరవించారు. మహామహోపాధ్యాయ యు. వి. స్వామినాథ అయ్యరుగారికి తమిళంలో డాక్టరేటు ఇచ్చి సత్కరించారు. ఒక భారతీయ భాషలో డాక్టరేటు ఇవ్వడం అదే ప్రథమం. ఆంధ్ర విశ్వవిద్యాలయ బిల్లును రూపొందించి, శాసన మండలిచే ఆమోదింప జేయడానికి వారే ముఖ్య కారకులు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఏర్పడగా ప్రఖ్యాతిగాంచిన ఉపాధ్యక్షులు డా॥ సి. ఆర్. రెడ్డిగారు దాన్ని భారతీయ విశ్వవిద్యాలయాలలో కెల్లా అగ్రగామిగా తీర్చిదిద్దారు. ఉపాధ్యక్షులుగా తనకొచ్చే రెండువేల రూపాయల జీతంలో రెడ్డిగారు తనకోసం నూటయాభై రూపాయలకంటె ఎక్కువ ఖర్చు పెట్టుకొనేవారు కారట!

నాయుడుగారు నోబుల్ కళాశాలలో పనిచేసేటప్పుడు కొద్ది కాలం బందరు కౌన్సిలరుగా ఉన్నారు. తన నియోజక వర్గానికి నిస్స్వార్థమైన సేవచేసి మునిసిపల్ కౌన్సిలరుగా మంచిపేరు సంపాదించుకున్నారు. వారెక్కడికి వెళ్ళినా ప్రజలు సంతోషంతో ఇలా అనేవారు: "తమరు దయచేసినారా! మాబోటి వాండ్రకు తప్పక న్యాయం కలుగుతుంది," అని. అప్పుడు మెయ్‌డెన్‌గారు మునిసిపల్ చైర్మెనుగా ఉండేవారు. వారినిగూర్చి కొన్ని వింతలు చెప్పు కొనేవారు. పన్నులనుగూర్చి అప్పీళ్ళు వచ్చినప్పుడు వారిలా అడిగే వారట:

నీకు భార్య ఉన్నదా?
చిత్తం. లేదండి.
ఎందుకు పెట్టుకోలేదు?
నీకు పిల్ల లేదా?
లేదండి.
ఎందుకు చెయ్యోలేదు?

1880 నుంచి 1890 వరకు అఖిలభారత జాతీయ కాంగ్రెసుతో కూడా వారికి సంబంధం ఉండేది. ఆ కాలంలోనే సుప్రసిద్ధ 'నార్టన్ సంఘటన' జరిగింది. వారు మద్రాసు బ్రహ్మసమాజానికి అధ్యక్షులుగా ఉన్నారు. పూజ్యులు వీరేశలింగం

పంతులుగారు స్థాపించిన రాజమండ్రి హిత కారిణి సమాజానికి కూడ వారధ్యక్షులుగా పనిచేశారు. ఈ సమాజం నిర్వహణక్రింద ఒక వితంతు గృహం, ఒక హైస్కూలు, ఒక ప్రార్థనమందిరం, ఒక గ్రంథాలయం, ఒక పఠనమందిరం, ఒక ఉద్యానవన గృహం ఉండేవి. వారి ప్రోత్సాహంతోనే పిఠాపురం మహారాజావారొక అనాథ శరణాలయాన్ని ప్రారంభించారు. పిఠాపురం మహారాజావారి సాయంతో కాకినాడ బ్రహ్మసమాజ మందిరం నిర్మితమైంది. మహారాజా వారిచ్చిన లక్షరూపాయల విరాళంతో ఒకనిధి ఏర్పాటు చేయబడింది అది "ఆంధ్ర బ్రహ్మధర్మ ప్రచారక నిధి" అన్న పేరుతో 1928 లో ఏర్పాటైంది. నాయుడు గారికి ఈ మూడు సంస్థలతోను అత్యంత సన్నిహితసంబంధం ఉండేది. "ఈ మూడు సంస్థలలో ఒకటి మానవుని ఆత్మను పెంపొందించేది. రెండోది వికసింపజేసేది, మూడోది పరిపక్వం గావించేది" అని అంటుండేవారాయన. రాజకీయ, సాంఘిక, మత సంబంధమైన ఎన్నో ముఖ్య సమావేశాలకు అధ్యక్షత వహించి మన్ననలను అందుకున్నారు. వారికి 1912 లో రావ్ బహదూర్ బిరుదూ, 1918 లో దివాన్ బహదూర్ బిరుదూ ప్రదానం చెయ్యబడ్డాయి. 1923 లో కైజరిన్ హింద్ బంగారుపతకం బహూకరించ బడింది. ఆఖరుకు 1924 లో నైట్ హుడ్ ప్రసాదించబడింది. అనధికార విద్యా వేత్తకు నైట్‌హుడ్ ఇచ్చి గౌరవించడం అదే ప్రథమం. దక్షిణభారత ఉపాధ్యాయ సంస్థకు వారు పెక్కుమార్లు అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులంతా వారిని కులపతిగా గౌరవించారు. 1927 లో ఆంధ్ర విశ్వవిద్యాలయం మొట్టమొదట పట్ట ప్రధానోత్సవ సందర్భంలో ఈ ప్రముఖునికి లిటరేచరులో గౌరవ డాక్టరేటు డిగ్రీనిచ్చి సత్కరించింది. 1927-28 లో వారు అంతర్విశ్వ విద్యాలయ మండలికి అధ్యక్షు లయ్యారు. 1928 లో మద్రాసు గవర్నరు సర్ జార్జి స్టాన్లీ మద్రాసు విశ్వవిద్యా లయంలో వారి నిలువెత్తు చిత్రపటాన్ని ఆవిష్కరించారు.

1932 లో 70 వ జన్మదినంనాడు నాయుడుగారివద్ద విద్య నభ్యసించినవారు, అభిమానులు అందరుకలసి అయనకు బ్రహ్మర్షి బిరుదును ఇచ్చి సత్కరించారు. అది ఆయనకు ఎంతగానో తగివున్నది. ఆయన మన ప్రాచీన మహర్షులకంటె ఏమాత్రం తక్కువవాడుకాడు. బౌద్ధమతం బోధించిన దయాగుణం, క్రైస్తవమతం బోధించిన మానవ సేవాపరాయణత ఆయనలో ఉండేవి.

వెంకటరత్నంగారు మిక్కిలి దయాళువు. వారు అనాథులను కనికరించి ఉదారంగా సహాయంచేసేవారు. ఒకనాడు ఆయనకు త్రోవలో ఒక అనాథబాలిక కనుపించింది. ఆయన ఆ బాలికను ఇంటికి తీసుకవెళ్ళి తనకుటుంబంలో చేర్చుకొని

పెంచారు. ఆ బాలికను తన స్వంతకూతురు మాదిరిగా పెంచారు. ఆయన భూత దయ కలవాడు. ఆయన భగవద్ధ్యానంలో సర్వ ప్రపంచాన్ని, ఐహిక విషయాలను మరచిపోయి ఏకాగ్రచిత్తంతో వుండేవారు. ఒక మానవుడుగా ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన పెంచిన అనాథలు ఆయనలేనిచో నిరాశ్రయులయి వుండేవారు అని ఎవరైనా అంటే ఆయన వెంటనే "వారులేకున్నచో నేనెక్కడ వుండేవాడిని" అని అనేవారు. వారికి ఆయన స్వయంగా పాలు త్రాగించి పడుకోబెట్టేవారు. ఆ బాలికలకు పెండ్లిఅయిన తరువాత ఆయన వారికి తరచుగా డబ్బు, ఇతర కానుకలు పంపు తుండేవారు. 1936 లో ఒకేనెలలో ఆయన విద్యార్థులు కాలేజీలో చేరడానికిగాను సహాయంగా సుమారు 1,500 రూపాయలు పంపారని ఆయన జీవితచరిత్ర వ్రాసిన సూర్యనారాయణ గారంటున్నారు. ఆయన సంపూర్ణమైన జీవితం గడపి 1939, మే 26వ తేదీన దివంగతులైనారు.

సాంఘిక నైర్మల్యమును గూర్చి మాట్లాడుతూ ఆయన సమాజాన్ని నైతిక విషయ పరంగా మూడు ప్రత్యేక దశలుగా విభజించవచ్చునని చెప్పారు. ఆ ప్రకారంగా చట్టమూ, ప్రజాభిప్రాయమూ, వివేచనాబుద్ధి—ఇవి సత్ప్రవర్తనను క్రమబద్ధం చేస్తాయి. ఇది ఎంతటి సత్యమో మనమెరుగుదుము. మనం శాసన నిర్మాణం ద్వారా నైతిక పరమైన ఐహిక విషయాలను సాధించడానికీ, శాసనంద్వారా సంఘాన్ని ఉచ్చస్థాయికి తీసికొనిరావడానికీ ప్రయత్నిస్తున్నాం. శాసనానికి ప్రజాభిప్రాయం అనుకూలంగా వుంటేనే తప్ప ఆ శాసనం విజయవంతంకాదు. మనం మద్యనిషేధాన్ని అమలుపరచడానికీ, జూదాన్ని నివారించడానికీ, వ్యభిచారాన్ని శిక్షించడానికీ ప్రయత్నిస్తున్నాం. కానీ ఆ ప్రయత్నం ఏమాత్రం జయప్రదం కాలేదు. దివిమ్యా శాసనంవలె లేక క్రిమినల్ ప్రొసీజరు కోడ్ వలె సాంఘిక శాసనాన్ని అమలుపరచడం సాధ్యం కాదు. ఒకదొంగ పట్టుబడినట్లయితే క్రిమినల్ శాసనం క్రింద శిక్ష విధించవచ్చు. శిస్తు ఒక రూపాయి నుండి రెండు రూపాయలకు పెంచబడినట్లయితే శిస్తు విధించబడిన వ్యక్తి దానిని చెల్లించవలసి వుంటుంది. కానీ మద్యపానాన్ని శాసనం ద్వారా శిక్షార్హం చేస్తే దాన్ని అమలు పరచడం అంత సులభంకాదు. ఎవరో ఒకరు పట్టుబడవచ్చు కాని చాలామంది శిక్షను తప్పించుకోడానికి అవకాశం ఉంది. జూద గృహాలను మూసివేసినట్లయితే అవి క్లబ్బులు అనే గౌరవనీయమైన పేరుతో తిరిగి వెలుస్తాయి. "దైనందిన లావాదేవీలలో మానవుల్ని సన్నిహితంచేసే అనేక సందర్భాలు, అతిజాగ్రత్తతో మెలగేవారి దృష్టికిని పరిపాలక సంస్థల దృష్టికిని గోచరించవు" అన్నారు ఆయన. సమాజం ప్రభుత్వానికి అండగా ఉండి, నైతిక విషయాలకు సంబంధించిన శాసనాల కనుకూలమైన ప్రజాభిప్రాయాన్ని పెంపొం

దించాలి. "ప్రజలు తమ వ్యక్తిత్వాన్ని గుర్తించి స్వధర్మపాలన, ఆత్మ విశ్వాసము, వైరాగ్యభావము, భక్తి, ఆత్మార్పణ, సేవాపరాయణత—ఈ గుణాలను అలవరచు కొన్న కొద్దీ సమాజం శీఘ్రగతిని అభివృద్ధి చెందుతుంది." అలా జరిగినప్పుడే, "ఇతరులను అనుకరించే పద్ధతి స్థానంలో వ్యక్తిత్వానికి ప్రాబల్యం ఏర్పడుతుంది. ప్రజలు ఆచారాన్ని లెక్కచేయక స్వయంగా ఆలోచించి పనిచేస్తారు." ఈ విషయాన్ని నిరూపించడానికి ఆయన కొన్ని ఉదాహరణలు ఇచ్చారు. "కొన్ని ఇదమిద్ధమైన ఉదాహరణలు తీసుకొని పరిశీలించినట్లయితే ఈ మూడు చర్యలయొక్క ప్రత్యేకత, ఔచిత్యం విదిత మౌతుంది. శాసనాలు జాతియొక్క భౌతికపరమైన భద్రతకును, సంక్షేమం విషయంలోను బాధ్యత వహిస్తాయి. ప్రజాభిప్రాయం సాంఘిక సంబంధాలను క్రమబద్ధంచేస్తూ సాంసారిక బాధ్యతలను నిర్వహిస్తుంది. వ్యక్తిత్వ భావన మానవునిలో గుప్తంగా ఉండే ఉద్దేశాలను లేక సహజ ప్రేరేపణలను పటిష్ఠం చేస్తుంది. సమాజం యొక్క నైతిక ఔన్నత్యాన్ని సాధించడానికి వస్తుతః విభిన్నమైన ఉద్దేశాలతో ఈ మహత్తర సాధనాలు వేరువేరు రంగాల్లో పనిచేస్తాయి. మన దేశంనుండే కొన్ని ఉదాహరణలు తీసుకుందాం. శాసనం సతీసహగమనాన్ని రద్దు పరచి వితంతువుయొక్క న్యాయమైన హక్కులను నిర్ణయిస్తోంది. ప్రజాభిప్రాయం స్త్రీ పునర్వివాహాన్ని నిరసిస్తుంది. క్రూరమైన దురాచారాలకు గురిఅవుతున్న అసంఖ్యాక ప్రజానీకానికి విముక్తి కల్గించడం వ్యక్తులు న్యాయబుద్ధి, ఉన్నతభావాలు కల్గియున్నప్పుడు మాత్రమే సాధ్యం అవుతుంది. వ్యక్తులు తమ సమ్మతిని తెలుపుటకు ఎంత వయస్సు కలిగియుండాలో శాసనం నిర్ణయించవచ్చు లేదా అది వివాహ సంబంధమైన హక్కులను పునరుద్ధరించవచ్చు. కాని క్రూరులైన భర్తల ప్రచ్ఛన్న క్రౌర్యాన్ని అణచివేసేది ప్రజాభిప్రాయమే. పవిత్రమైన వాంఛలతో కూడిన సహృదయత మాత్రమే దాంపత్య జీవితాన్ని స్వర్గతుల్యం చేస్తుంది. శాసనంద్వారా మద్యపానీయాల ధరలను పెంచి అవి ప్రజలకు అందుబాటులో లేకుండ చేయవచ్చు. కాని ప్రజాభిప్రాయంతప్ప ఇంకేదికూడ ఈ దురలవాటును అరికట్టలేదు.

శాసనం బహిరంగంగా అసభ్యంగా ప్రవర్తించే వారిని శిక్షించవచ్చు. కాని అసభ్యకరమైన పాటలను గర్హించేది బలమైన ప్రజాభిప్రాయం మాత్రమే.

శాసనం, జరిగే కార్యాన్ని పరిశీలిస్తుంది, ప్రజాభిప్రాయం ప్రవర్తనను పరిశీలిస్తుంది. వ్యక్తిగతాభిప్రాయం అంతరంగిక వాంఛను పరిశీలిస్తుంది. శాసనం మానవుణ్ణి నేరం చేయకుండ అసహాయుణ్ణి చేస్తుంది; ప్రజాభిప్రాయం మానవుని సాంఘిక జీవితాన్ని ప్రభావితం చేస్తుంది; వ్యక్తిగత బాధ్యత మానవుని పౌరుషాన్ని అదుపులో పెట్టుతుంది."

శాసనం, ప్రజాభిప్రాయం పరస్పరసహకారం కొరకు ఏ విధంగా పనిచేస్తాయో సమగ్రంగా వివరించిన తరువాత ఆయన, శ్రమ నివారణలో సంతుష్టిని, విధి నిర్వహణలో సంతోషాన్ని, ఇబ్బందిలో సౌఖ్యాన్ని ఈప్రకృతి ఏ విధంగా ఏర్పరచిందో వివరించారు.

ఆహారంతో ఆకలి బాధను నివారించవచ్చు కాని సంతుష్టి కల్గించేది రుచియే. జీవితాన్ని సుఖమయం చేసుకోడానికి ఎంతైనా వీలుంది కాని మానవునికి జంతువుకు మధ్యగల తేడా అట్టి సౌఖ్యాన్ని వినియోగించుకొనే విధానంలోనే ఉంది. జీవిత లక్ష్యంగా సౌఖ్యాన్ని కోరడం జంతు లక్షణం; జీవిత లక్ష్యానికై సౌఖ్యత్యాగం చేయడం మానవ లక్షణం. అంటే, సహజ స్వభావానికి ప్రాముఖ్యం ఉంటుంది. మానవుడు తన సహజ స్వభావాన్ని హేతుబద్ధం చేసుకుంటాడు. కావున జంతువు తాత్కాలిక సృష్టి. కాని మానవుడు శాశ్వత సృష్టి. ఈ ఆధిక్యత మూలముగనే మానవుని విషయంలో సౌఖ్యం ప్రగతికి సాధనం అవుతుంది. దానిని విడనాడ వలసిన పనిలేదు. సౌఖ్యం క్రమబద్ధం చేసుకోవలసిన ఒక సాధనమేకాని బొత్తిగా వదులుకోవలసిన పీడకాదు. "నిగ్రహము" మానవునికి చాల అవసరం. నిర్మలత్వమే నిగ్రహము. గృహ సౌఖ్యాలను, సాంఘిక ఆదర్శాలను నిశ్చయించు స్త్రీ పురుషుల మధ్య ఉండే శ్రేష్ఠమైన సంబంధం మన జాతి గతిని మారుస్తుంది. కావున సాంఘిక నైర్మల్యం అంటే సంపూర్ణ అభివృద్ధికి అనుగుణంగా జీవన విధానాన్ని మార్చుకోవడానికి మన కాంక్షలను అదుపులో పెట్టడం.

ఆయన స్త్రీని ఒక మాతృమూర్తిగా, సోదరిగా, పత్నిగా భావించారు. ఆయన ఎప్పుడూ స్త్రీని ఒక వ్యభిచారిణిగా ఎంచలేదు. ఆయన స్త్రీని వంచించే మతాన్ని గర్హించారు. మతానికి సంబంధించిన అక్రమాలను తీవ్రంగా నిరసించారు. 'బ్రహ్మచర్యం—భగవంతుని సేవకై ఆత్మసమర్పణ చేసుకోవడం—సాంఘిక దురాచారానికి దారి తీసింది. పవిత్ర దేవదాసీల స్థానంలో సందేహాస్పదమైన శీలం గల స్త్రీలు వచ్చారు. భారతదేశపు ఆధ్యాత్మిక దురాచారాలను తొలగించే గోప్యస్థితి ఈ జీవంలేని ఎముకల్లో జీవం పోస్తుంది. అంతేకాకుండా అనేకులు ఆచరించే మత విషయక కార్యకలాపాలలో అసహ్యం పుట్టించే ఉన్మత్త తాండవాలు, ఇంద్రియ సుఖాసక్తి పూరకములయిన లీలలు, కామం మూర్తీభవించిన దేవతలు, అపవిత్రమయిన హోలీలు ముఖ్య లక్షణాలు అయినవి. ఈ చెడు ఇంతటితో ఆగడంలేదు. జీవితంలోని అతి ముఖ్యమైన విషయాలలో నైతిక విలువలపట్ల చూపుతున్న నేరపూర్వకమయిన ఈ నిర్లక్ష్యం మతాన్ని దోచడమే కాకుండా కొన్ని సందర్భాలలో సాధారణ సంస్కారాన్ని, భక్తినికూడ నాశనం

చేస్తున్నది. పవిత్ర స్థలాలుగా పేరెన్నికగన్న ప్రదేశాలను జాగ్రత్తగా పరికిస్తే అవి అపవిత్రతతో దుర్గంధ భూయిష్ఠమై ఉండడం గమనించవచ్చును. ఇదంతా చాలా బాధాకరమైన విషయం. ఇది మానవశక్తిని మించిపోయేటటువంటిదేమీకాదు. దీనికి నివారణోపాయం సమాజంలో ఉన్నది. ఆచారమన్నది లేనిచోట ఈ విషయాలలో సమాజం అసాధారణంగా మేల్కొంటుంది. విజ్ఞానవంతులు మాత్రమే ఈ విషయాలను ముఖాముఖిగా చూడాలి. మన జాతీయ ఆదర్శాలలోను, సాంప్రదాయాలలోను కావలసినంతగా పవిత్ర ధర్మనిష్ఠాపరత, ఉత్తేజకరమైన నిర్మలత్వము ఉన్నవి.

వివేచనా రహితంగా మన పూర్వమనతను చాటుకోవడం అన్నది ఒక విషయం. వివేకంతో దానిని అనుసరించడమన్నది మరోవిషయం.

సాంఘిక, మతైక విషయాలలో నిర్మలత ఉండవలసిన అవసరాన్ని గురించి విశదపరచిన పిమ్మట సానివృత్తి నిర్మూలన ఉద్యమాన్ని ఆయన చేపట్టాడు. ఆంధ్రలో ఉన్న వేశ్యల గురించి వ్యథాపూరితమైన తన హృదయాన్ని ఆయన వ్యక్తం చేస్తాడు. సంగీతానికి విరుద్ధంగా ఆయన పోరాడుతున్నాడని, వేశ్యలను వ్యక్తిగతంగా ద్వేషిస్తాడని చేసిన నిందారోపణలు ఆధార రహితమైనవని ఆయన పేర్కొన్నారు. బాగుచేయడానికి వీలులేనిదాన్ని అయన బాగుచేయడానికి ప్రయత్నిస్తున్నాడని కూడ కొందరు అన్నారు. అటువంటి దురదృష్టకరమైన విషయంపట్ల ఏకాగ్రతతో వ్యవహరించిన వ్యక్తి మరొకరెవరైనా ఆయనకు పూర్వంకాని తరువాతకాని ఎక్కడైనా ఉన్నారా? ఈ విషయం ఒక్కదానిలోనే ఆయన సంఘ సంస్కర్తలలో అగ్రస్థానానికి అర్హుడవుతున్నాడు. సంగీతం, నాట్యం, నటనలను దుర్మార్గం, అపవిత్రత, సంఘ బహిష్కారాలనే అవమానాలనుండి రక్షించడంలో ఆయన ఘనవిజయాన్ని సాధించాడని నేను చెప్పాల్సి ఉంది. అయనకు పూర్వం గౌరవంగా బ్రతికే ఏ బాలికనూడ బహిరంగంగా నాట్యం చేయుడానికి కాని, నటించడానికి కాని సాహసించేది కాదు. ఇప్పుడు అన్ని రంగాల్లోను సంతోషపూర్వకమైన మార్పురావడం మనం చూడవచ్చు. శక్తి, జ్ఞానము, అందము ఉన్నటువంటి ప్రతిభావంతులు, ప్రవీణలు అయిన బాలికలు నాట్యం, సంగీత నాటకాలలో పాల్గొనేటందుకు ఇప్పుడు ముందుకు వస్తున్నారు. ఎవరైనా తండ్రి తన కూతురు యొక్క గానమాధుర్యాన్ని గురించిగాని లేక ఆమె నాట్య కౌశల్యాన్ని గురించిగాని, మానవ జాతియొక్క మౌలిక మనోభావాలను సాధారణ సంతోషాలను నటనద్వారా వ్యక్తీకరించడంలో ఆమె చూపే ప్రతిభను గురించిగాని ఈ రోజు గర్వపడుతున్నాడంటే అందుకు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు దోహదం చేసినది అంతా యింతా కాదు. ఇప్పుడు భరతనాట్యం ఒక్క వేశ్యలకు మాత్రమే పరిమిత

పైనవి కాదు. అత్యంత మనోహరమైన నాట్యంద్వారా స్వయంప్రకాశితం కాదలిచే ప్రతి బాలిక అభ్యసించే అత్యంత గౌరవస్థానంలో ఉన్న కళ అది. యువతి పాడే పాట ఇప్పుడు మంత్రముగ్ధంచేసే సైరను కాదు. మనస్సులను కదలించి ఆకట్టుకొనే దైవమాత శ్రావ్యగానం అది. సంగీత నృత్య నాటకాలలో తమ కుమార్తెలు సాధించినదాన్ని చూచి తలిదండ్రులు గర్విస్తున్నారు. కరకులోహం ఎంత చక్కటి బంగారమయింది? ఈ మార్పును సాధించిన రసవాది మనుదైన మన మహాపురుషుడు కాక మరి ఎవరు? ప్రాచీనమైనవన్న పేరుతో మాత్రమే చలామణిలోవున్న కర్కశ ఆచారాలను ఆయన ఎలా ఎదిరిస్తున్నారో చూడండి.

"ఆచారం ఎంతో పురాతనమైనదై ఉండి బహుళ వ్యాప్తికలిగి ఉండినప్పటికీ అప్పుడప్పుడు ఉత్తేజిత ప్రభావం చూపించుతూ ఉంటుందేకాని చెడును ప్రమాద రహితంగా మాత్రం చేయలేదు. ఈ ఘోర అన్యాయం తనలో జీవిస్తూ పెంపొందటానికి పడే బాధకు భారతదేశం చెల్లించవలసివస్తున్న మూల్యం వెలుగులోకి రాకుండా పోతున్నది. నిశ్శబ్దంగా దాదాపు అచైతన్యంగా ఈ మూల్యం చెల్లించబడుతున్నది. చెడుయొక్క వికృత స్వరూపాన్ని దాచిపెట్టి బహిరంగంగా దానిని పరిగణించడంవల్ల అది నాగరికమైపోయి అతి వ్యయకారక మవుతుంది. ప్రతికూల భావం మాత్రం ఉండే పోటీని అది నెలకొల్పుతుంది. ఈ ప్రమాదభరితమైన వ్యామోహం సంపదకు, జీవితానికి ఎంత వ్యర్థంగా పరిణమించిందన్న విషయాన్ని దరిద్రదశకు చేరుకొన్న అనేక కుటుంబాలు, నిష్ఫలమైపోయిన వందలకొలది ఆశలు, నిరాశోపహతులయిన అనేకుల జీవితాలు, నిష్ప్రయోజనమైపోయిన అవకాశాలు, ఉపేక్షింపబడిన అనురాగాలు, ఛిన్నాభిన్నమైపోయిన సంపదలు విస్తారంగా వివరించి చెపుతాయి. ఇంతేకాకుండా ఒక పాపం పట్ల సంఘం ప్రదర్శించే ద్వేషానికి తగిన పరిమాణంలో సాధారణంగా పశ్చాత్తాపం పడాలని ఉంటుంది. భోగనిరతుడైన సురాజుద్దౌలా తనను గురించి చెప్పిన అసహ్య గీతిక నుద్దేశించి "అది నీ తల్లికే కళంకాన్ని ఆపాదిస్తున్నది; నా పేరును మాత్రమే నీవు దీనిక జతపరుస్తున్నావు" అని చురుకైన వేశ్య బాలిక ఒకతె గర్వంగా ఎదురుదెబ్బ కొట్టింది. సంఘం అవసరమైన వృత్తిగా దేనినైతే పరిగణిస్తున్నదో దానిని నీచ వృత్తిగా ఎవరోగాని పేర్కొనటం లేదు. ఎవరికెంత రాసిపెట్టివుందో అంతకంటె ఎక్కువ ఆశించ నవసరంలేదన్న ఊరడింపుభావం పరితాపానికి సులభంగాని వృత్తి కలిగిస్తుంటుంది. నికృష్టదాస్యంకన్నా హీనంగా కవి పరిగణించే ఈ "తెచ్చిపెట్టుకొన్న తృప్తి" పాపపు దురదృష్టకరపెంపకం యొక్క ఘోర శిక్ష. తన కళంకిత జీవితం తనను నైతికంగా కుష్ఠు రోగిని చేసి వేస్తున్నదని ఆమె తల

పోయడానికి కూడ ఇందువల్ల సాధ్యం కాదు. ఆ విధంగా అతి నికృష్టుడైన పాపికికూడా స్వర్గంలో తెరచివుంచిన పశ్చాత్తాప ద్వారం ఆచారాలలోపల మునకలై పోయిన సమాజంచే పూర్తిగా మూసివేయబడింది. అందు మూలంగా పశ్చాత్తాప హీనమైన అపరాధాన్ని అది ప్రోత్సహిస్తున్నది. ఇతరుల హీనస్థితి ఆధారంగా ఖరీదు చేసే ఆనందాన్ని ఏదికూడ సమర్థించలేదు. కృత్రిమంగా ఏ సిద్ధాంతమైనా ఉండనీయండి కాని, వాస్తవానికి జీవితంలో ఎల్లరు అనుభవించే స్త్రీగా ఉండని ఏ స్త్రీకూడా గాయనిగా ఉండదు. ఉండలేదు. దుఃఖకరమైన ఆమె పరిస్థితే ఆమెను ఆ వృత్తికి అర్హురాలను చేస్తుంది. పాశ్చాత్య దేశాలలోని గాన మందిరాల గాయనులతో ఈమెను పోల్చేవారు ఈ ప్రశ్నను మానమర్యాద లనే వాటి సహాయంతో పరిష్కరిస్తారు. అయితే ఆ దేశాలలో ఈ రకపు జీవితం అగ్రాహ్యముగాను సందర్భవశాత్తు సంభవించే బలహీనతవల్లను ఏర్పడిపోయినదని, ఇక్కడ తప్పని సరిగా ఉండవలసిన అర్హతగా పరిణమించినదని వారు మరచి పోతున్నారు. గొర్రెను చంపేవాడే కాక ఆ మాంసాన్ని వండేవారు, తినేవారుకూడ జీవహింస చేసిన వారవుతారని మనువు ఆరోపిస్తున్నాడు. అటువంటప్పుడు "పతిత" స్థితిని గాయనీ వృత్తికి ఒక యోగ్యతాపత్రంగా పరిగణించేవారికి వేశ్య బాలిక పతిత జీవనంలోని తప్పులోను అవమానంలోనూ భాగం ఉండదా? సంగీతం దైవాంశమయిన కళ. "క్రూరమృగాలను సాధువులొనర్చేటంత క్రిందకు దిగి దేవదూతలంత ఉన్నత శిఖరాలకు" అది చేరుతుంది. "అనంతపుటంచులలోకి తీసుకవెళ్ళి ఒక్కక్షణం అందులోకి మన దృష్టిని సారింపజేసే అవ్యక్త అగాధ భాష" అది. ప్రేమోప భోగము, ఆత్మ వికాసకారకము అయిన సంగీతం బహిరంగ నైతిక పతనంతో అపవిత్ర సాంగత్యం పొందడంవల్ల చాలవరకు నిర్లక్షింపబడి అపఖ్యాతి పాలయింది. ఒకప్పుడు మహర్షులు కూడ దానిని బోధించుటకు వెనుకంజ వేసేవారుకాదు. రాకుమార్తెలు కూడ ఈ విద్య నేర్చుకొనకుండా ఉండేవారు కాదు. శీలవతులు, ఉచ్చస్థితిలో ఉన్న స్త్రీలు ఈ కులీన విద్యను నేర్చుకొని ఉపయోగించిన ఉదాహరణలు ఎన్నయినా పేర్కొన వచ్చును. వారు దీనిని అగౌరవంగా భావింపలేదు. ప్రజలుకూడ దీనిని దోషముగా పరిగణింపలేదు. ఎప్పుడయితే సంఘం రాజకీయ సంక్షోభం వల్ల స్తిమితము కోల్పోయి సాంఘిక స్థాయి దిగజారి పోయిందో మర్యాద అంతరించిపోయింది. తులువతనము అంతరాయం లేకుండా పైకొచ్చినది. శాంతి, విజ్ఞానోదయం అయిన తరువాత ప్రతి చోటా సంగీతాన్ని దాని పూర్వఖ్యాతికి తీసికొని రావలసి ఉండినది. అయితే సాంగత్య ప్రభావం దానికి కళంకాన్ని ఆపాదించి పెట్టింది. సంగీతం మన సంఘంలోని వేశ్యల విశేష హక్కు కాదని గర్హించనంత వరకు (వగలాడి యొక్క రసహీనమైన సంగీతాన్ని మనం

(తోసి పుచ్చునంత వరకు) ఈ పరిస్థితి ఇలాగే ఉంటుంది. అది పాపానికి చేదోడుగాను నిందార్హమైన దానికి ప్రతిబింబంగాను ఉంటూ మరింత స్వేచ్ఛగా బలిగొంటూనే ఉంటుంది. సిగ్గుబిడియములను పాటించకుండా స్త్రీలోక మంతటిలోను తనొక్కతే "దేహాన్ని" అద్దెకిచ్చుకొంటూ సోదరి అన్న పవిత్ర నామాన్ని పోగొట్టుకొని కన్య, భార్య, విధవకాకుండా బ్రతుకుతూ "చమత్కారంగా మోసపుచ్చేవలలో చిక్కించుకొనే హృదయాన్ని," "నరక ద్వారమయిన గృహాన్ని" కలిగి, తను రోజూ అపవిత్రం చేసేటటువంటి ఆనందం కోసం కళంక పరిచేటటువంటి సౌశీల్యాన్ని నటిస్తూ బ్రతికే వేశ్య పాల్గొనే వినోదాన్ని తిలకించే ప్రతి కుటుంబం, భార్య, పిల్లలు, అతిథులు, స్నేహితులు అందరిమీదా చివరకు కళంకం, హైన్యం, నైచ్యం తమ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. అశుద్ధాన్ని తాకి అంటుకోకుండా ఉండాలనుకోవడం ఆద్యంత రహితమైన నైతిక శాసనాన్ని రద్దు పరచడానికి ప్రయత్నించటం వంటిదే అవుతుంది. విజ్ఞాని, పూజ్యుడు అయిన డాక్టరు భండార్కరు చెప్పిన అమూల్యమైన మాటలు ఇక్కడ చెప్పడం సబబుగా ఉంటుంది: "వేశ్యలకు ప్రాపకం ఇచ్చే వ్యక్తి, వారు ఎంతో బహిరంగంగా గడిపే దుర్నీతిపూరకమైన జీవితాన్ని తగినట్లుగా అసహ్యించుకోవడంలేదని, స్త్రీలో కులీన లక్షణాలు పెంపొందే భూమి అయిన స్త్రీ పవిత్రతకు ఇవ్వవలసినంత ఔన్నత్యాన్ని ఇవ్వడం లేదని నేను ఎల్లప్పుడు అభిప్రాయపడుతూనే ఉన్నాను. స్త్రీ పురుషుల నైతిక విలువలను వేశ్యా వృత్తి హైన్యపరుస్తూనే ఉంటుంది. సాని మేళాలను ఏర్పాటు చేయడంలోను వాటికి వెళ్ళడంలోను సంతోషాన్ని పొందే పురుషుని విషయంలో గట్టి ఋజువు ఉండిన గాని అతను విశ్వసనీయుడైన భర్తగా ఉంటున్నాడని నేను నమ్మను. ఇంట్లో వేశ్యను ఉంచుకోవడమంటే కుటుంబములోని బాల బాలికలకు, ముఖ్యంగా బాలురకు, దుర్నీతులలో పాఠం చెప్పడమన్నమాట. వేశ్యను పోకైన విషయంగా పరిగణించినంత కాలం, స్వేచ్ఛగా అనుభవించినంతకాలం పురుషుల నైతికస్థాయి గొప్పగా అభివృద్ధి అవడం గాని, స్త్రీలపట్ల మన గౌరవభావం పెంపొందడం గాని సాధ్యపడదు." విషయాన్నంతా క్లుప్తంగా వివరించే విజ్ఞానపూరిత వాక్కులివి. "ప్రభుత్వాధికారులు, సంఘనాయకులు తాము ఆహ్వానితులయిన ఏ వినోద కార్యక్రమంలోగాని వేశ్యలు పాల్గొనకూడదన్న కోరికను శతాబ్ది ప్రారంభంలో తెలియజేసినట్లయితే భారత దేశంలో నైతికస్థాయి విషయంలో ఖచ్చితమైన అభివృద్ధి కన్పించవచ్చు" అని బిషప్పు వెల్డన్‌గారు చెప్పిన మాటలు ఇక్కడ చక్కగా అమరుతాయి.

సాంఘిక పవిత్రతా సంఘ సభ్యులకు ఆయన నిర్దేశించిన ప్రతినలు ఎంత ఆసక్తిజనకమైనవో చూడండి.

"భగవంతుని సహాయముతో క్రింది సూత్రాలను పాటించుటకు ప్రతిన బూనుతున్నాను."

1. వేశ్యలు వచ్చే సమావేశమునకు కూడ నేను వెళ్ళుట గాని, లేక నేనే వారిని స్వయముగా ఆహ్వానించుటగాని, లేక వారిని ప్రోత్సహించే ఏ పనినిగాని చేయను.

2. బూతు మాటలను, లేక మోటు హాస్యాన్ని వాడుటగాని లేక అశ్లీలమైన పాటలను పాడుటగాని నేను చేయను. అట్టి భాషను, పాటలను, హాస్యాన్ని వినుటను కూడ చేయను.

3. అశ్లీలమైన చిత్రాలను, చిత్తరువులను, దృశ్యాలను నేను సందర్శించను.

4. కేవలము ఆనందించుటకొరకు అశుద్ధమైన ఆలోచనలను రేకెత్తించే విషయాలను గురించి చర్చించుటగాని చదువుటగాని నేను చేయను. అటువంటి ఆలోచనలు నాలో కలుగకుండా చేయుటకు వీలయినంత వరకు ప్రయత్నిస్తున్నాను.

5. శారీరకంగా నేను పవిత్రుడుగా ఉంటాను. మనస్సునుకూడా పవిత్రంగా ఉంచుకొనుటకు సాధారణంగా పవిత్రత్వాన్ని పెంపొందింప చేయుటకు నాకు చేతనయినంతవరకు ప్రయత్నిస్తాను.

దృఢమైన శీలములో ఒక ముఖ్య భాగముగా నా వ్యక్తిగత పవిత్రతను, పరిరక్షించుకోవడానికి, ఇతరులలో దానిని ప్రోత్సహించడానికిగాను భగవంతుని సహాయములోను మార్గదర్శకత్వములోను నమ్మకముంచి, క్రిందివాటిని నా శక్త్యానుసారము అవలంబించుటకు ప్రతిజ్ఞ పూనుతున్నాను:

1. మనోవాక్కాయ కర్మలలో పవిత్రతకు దోహదంచేసే అలవాట్లను అలవరచుకొనుట.

2. నా తండ్రి (లేక, సంరక్షకుని) యొక్క అభీష్టములకు ఆజ్ఞానువర్తినై ఉంటూనే నా వ్యక్తిగత పవిత్రతకు హాని కలుగచేసేటటువంటి కార్యములనుండి వైదొలుగుట.

3. నా స్నేహితులను, సహాధ్యాయులను ఇదేవిధముగా చేయునట్లు సమ్మతింపజేయుట.

స్త్రీలు మాతృమూర్తులుగాను, సోదరీమణులుగాను ఏ విధముగా చూడబడినారో దృష్టాంతముల నిచ్చియున్నాడు. తనవద్ద చేరినవారిలో ఏ తరగతికి చెందిన

స్త్రీకాని నిలబడిఉన్న పక్షములో తాను కూర్చొనెడివాడుకాడు. శ్రీ రాజా రామ మోహనరాయ్. ఈ మార్గమును ఈయన అనుసరించాడు. ఒకసారి కొంతమంది భారతీయ స్త్రీలు మాజిక్ లాంతరు ప్రదర్శనాన్ని తిలకింపవచ్చారు. వారికి ఆసనా లేవీ లేవు. వారికి తొలుత ఆసనాన్ని ఇచ్చింది ఈయనే. మరో సందర్భంలో ఈయన నడి వేసవికాలంలో రైలు ప్రయాణం చేస్తున్నప్పుడు తన రెండవతరగతి టిక్కెట్టును ఒక ఆంగ్లో ఇండియన్ స్త్రీకి ఇచ్చి ఆమె మూడవ తరగతి టిక్కెట్టును తను తీసి కొన్నాడు. మరో సందర్భంలో బెజవాడదగ్గర బకింగ్‌హాము కాలువలో తిరిగే కొంత మంది పడవ నావికులు ఒక బీదస్త్రీని నీచంగా అపహాస్యం చేయడం ఈయన గమ నించారు. గౌరవమయిన వ్యక్తిగా ఆమె తన "కులాన్ని" పోగొట్టుకోవడమన్నది వారికి తోచిన కారణం. ఆమెను "అమ్మ" అని పిలిచి గౌరవించి, మంచిత్రోవను చూపించారు.

భోగంమేళాలుండే పెళ్ళిళ్ళకుగాని సాంఘిక కార్యక్రమాలకుగాని వారెన్నడూ హాజరుకాలేదను విషయం సుప్రసిద్ధం. ఆ కాలంలో జాతీయోద్యమంపట్ల సానుభూతి కలిగివున్న బహుకొద్దిమంది యూరోపియన్లలో శ్రీ నార్టనుగారు ఒకరైనప్పటికి, మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ప్రసిద్ధ పురుషులతో బాటు గౌరవ స్థానాన్ని ఆయనకు ఇవ్వడానికి వ్యతిరేకించిన వ్యక్తి వారొక్కరే. అతడు ప్రసిద్ధుడైన బారిస్టరు, వక్తకూడా. కాని అతడు అపవిత్రమైన జీవితం గడుపు తున్నాడని వెంకటరత్నం నాయుడుగారు ఆక్షేపించారు. ఆ విధంగా కంఠమెత్తి పలక డానికి మనలో ఎంతమందికి ధైర్యం ఉంది? నిర్మలము, సత్యం, ధైర్యం, దాతృత్వం, పేదరికం, పవిత్రతలతో కూడిన జీవితం గడిపారాయన. వారి పరిచయ భాగ్యం లభించిన విద్యార్థులను యువకులను ఉన్నతాశయాలతో ప్రోత్సహించారు. నాయుడుగారి సోషల్‌ప్యూరిటీ అసోసియేషనులోని సభ్యులంతా నాయుడుగారి శిష్యులమని చెప్పుకోడానికి గర్వించేవారు. వారి ప్రభావం వల్ల భోగపుమేళాలు పాతబడి పోయాయి. నర్తకుల వర్గానికిజెందిన బాలికలందరూ వారి ప్రభావంవల్ల అప్పటినుంచి పెళ్ళిళ్ళు చేసుకొన్నారు. వారి ప్రోత్సాహం, దాతృత్వం, మార్గదర్శ కత్వాలవల్ల పతిత వర్గానికి చెందిన వారు చాలామంది ఉన్నత స్థానాలను చేరు కొన్నారు.

సాంఘిక పరిశుద్ధత మన జీవితాన్ని అంతను ఆక్రమిస్తుందని వారి అభి ప్రాయం. మొదటినుంచీ ఆయన మద్యపాన వ్యతిరేకి. తుదివరకు త్రాగుడును వ్యతిరేకిస్తూనే వచ్చారు. మెట్రొ పొలిటన్ టెంపరెన్సు అండ్ ప్యూరిటీ అసోసి యేషనుకు అధ్యక్షులై నిగ్రహోద్యమానికి గట్టిగా తోడ్పడ్డారు. 1923లో మద్రాసు

శాసన పరిషత్తు సభ్యులుగా ఉండి రాష్ట్రంలో మద్యనిషేధాన్ని ప్రవేశపెట్టనందుకు గాను ఆబ్కారీశాఖ బడ్జెట్టును నిశితంగా విమర్శించారు. ఆబ్కారీ ఆదాయంలో అధికభాగం ఏ తరగతి ప్రజానీకం నుండి వస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆబ్కారీ ఆదాయం సమాజపు భౌతికశక్తిని దెబ్బతీస్తూ, శీలాన్ని క్షీణింపజేస్తూ, ఆర్థిక స్థిరత్వాన్ని దుర్బలం చేస్తూంది. అది అన్యాయమనీ, బ్రిటిషు పరిపాలనకే కళంక మనీ వక్కాణించారు.

"అందుకు ఉదాహరణగా ఇక్కడ మనువు అభిప్రాయాన్ని పేర్కొంటాను. సురాపాన గురువంగనాగమనాలను పంచమహా పాతకాల తెగలోనే చేర్చాడు మనువు. పూజ్యురాలగు గురువు భార్యను మానవుని ఐదుగురు తల్లులలో ఒకరుగా భావించాలని మనకు ఉపదేశించారు. హానికరమైన ఈ త్రాగుడును జాతి ఎంత అసహ్యము, అనిష్టము అయిన వస్తువుగా భావించిందో దీనివల్ల తేటతెల్ల మవుతుంది. మనదేశంలో రాజకీయంగా, సాంఘికంగా ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ ఈ దృక్పథం మారకుండా నిలిచివుంది. సామాన్య భారతీయునికి నిగ్రహం అంటే సంపూర్ణ జితేంద్రియత్వం అని మాత్రమే అర్థం అని మహాదేవ గోవింద రనడే ఒక సందర్భంలో ఉద్ఘాటించారు. అందుచేత నిగ్రహం అంటే సంపూర్ణ జితేంద్రియత్వమే తప్ప మరేమీ కాదు."

నాయుడుగారెన్నో సాంఘిక సంస్కరణ పథకాలను ప్రారంభించి విజయ వంతంగా నిర్వహించారు. ఆ విజయం యింకా అందుబాటులోకి రాలేదు మనకు. ఆయన సాధించిన ఫలితాలు అద్భుతమైనవి. విధవా వివాహం, స్త్రీ జనాభ్యుదయం, హరిజనులు, వెనుకబడిన తరగతులవారి సంక్షేమం, అస్పృశ్యతా నివారణ—ఇవన్నీ వీరేశలింగం పంతులుగారు, పిఠాపురం మహారాజాలవంటి ప్రముఖనాయకుల తోడ్పా టుతో నాయుడుగారు తీసుకున్న శ్రద్ధమూలంగా వర్ధిల్లినట్టివి. ఈ అపారమైన కృషి కంతకు మానవాళి పట్ల వారికిగల అమితానురాగమే కారణం. వారి లేఖ ఒకటి చదివితే మన కిది స్పష్టమవుతుంది.

"ఈ సమస్త విశ్వం, విజ్ఞాన అధికారాలతో కాక ప్రేమ పదార్థంతో నిర్మించ బడింది. అందుచేత భగవంతుడంటే ప్రేమస్వరూపు డన్నమాట. ఈ ప్రేమ స్వరూ పమే మన ప్రధాన చింతన అయి ఉండాలి. ప్రేమ మార్గంద్వారా మాత్రమే మనకు భగవంతుడు లభ్యమవుతాడు. అప్పుడు భగవత్సాన్నిధ్యం మనకు ప్రేమ మార్గం ద్వారా సుసాధ్యం. స్వేచ్ఛాయుతం కావాలంటే, అది సమస్తం ప్రసాదిస్తూ ఏదీ కోరని ప్రేమ అయి ఉండాలి. అలాంటి ప్రేమద్వారా త్యాగం సాధ్యమవుతుంది.

కలిమిలేములంటూ ఉండవు. స్వర్గసౌందర్యంలోని రహస్య స్థానాలను, మానవ శ్రేష్ఠతలోని నిక్షిప్త నిధులను కనుగొనడం ప్రేమద్వారానే సాధ్యం. సేదదీర్చే వానజల్లులు, ఉల్లాసం కలిగించే తెమ్మెరలు, పరవశత కలిగించే పరిమళాలు, మంత్ర ముగ్ధులను జేసే స్వరాలు, సంతోషాతిశయం కలుగజేసే దృశ్యాలు — ఇవన్నీ నాకు అనుభవైక వేద్యాలు. అవి వంశపరంపరగా అనుభవింపదగిన స్థిరాస్తి నాకు. ఈ అనశ్వరమైన సంపదలుగల నన్ను పేదవాడనని అనడానికి ఎవరికి ధైర్యం ఉంది? భగవంతుడు నాకు ప్రసాదించిన ప్రేమ అనే దివ్యదృష్టితో మంచు బిందువుల్లో అమూల్యమైన ముత్యాలను వీక్షించగలిగినపుడు, ఇంద్ర ధనుస్సులోని ఆనందాత్మకమైన శోభను అనుభవించ గలిగినపుడు పేదరికాన్ని చెడ్డగా భావించడ మెందుకు? మానవునికి పేదరికం పెరిగేకొద్దీ అహం తగ్గుతుంది. క్షమ విషయం తీసుకుంటే, ప్రేమద్వారా పేదరికం అధికమయ్యేకొద్దీ క్షమాభిక్ష స్వేచ్ఛగా ప్రసాదించ గలుగుతాడు. అసలు తాను క్షమించవలసిన పనేలేదని భావిస్తాడు. ఎందుకంటే, ఇప్పుడు క్షమాపణ అవసరమయ్యేటంత అపకారం అతనికెప్పుడు జరిగింది కనుక? తుకారాం గురించిన పరమానందకరమైన కథను మనం వినలేదా? ఒకనాడు సాయంకాలం శిష్యుడు కానుకగా సమర్పించిన చెఱుకుగడల మోపును ఇంటికి తెస్తూ దారిలో కలిసిన వారందరికీ గడలు ఇస్తూ వచ్చాడు. చివరికి ఒకేఒక గడతో ఇంటికి చేరుకోగా భార్య అతన్ని ప్రశ్నించింది. "ఒక్క చెఱుకుగడను మాత్రమే కానుకగా ఇచ్చిన లోభి ఎవడు?" అని. అప్పుడు జరిగిన సంగతిని అతడు విశద పరచగా, ఆ గడతోనే ఆమె అతన్ని బాదింది. ఆ గడ రెండు ముక్కలుగా విరిగింది. ఒక ముక్కను తీసుకొని ఇలా అన్నాడతడు: "నీవు ప్రియపత్నిగా, నీ భర్తతోపాటు ఈ ఒక్కగడనైనా పంచుకోవాలి." అలా క్షమించడానికి అవకాశం లేకపోయినా ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. ప్రేమ సాధనకోసం భగవంతుడు అసంఖ్యాక మైన అవకాశాలు ప్రసాదిస్తాడు. గ్రీకు బానిసఋషి ఎపిక్టిటస్‌ను గూర్చి మనం వినలేదా? అతడి యజమాని ఎంత కఠిన హృదయుడో! ఆ ఋషి ఇలా అన్నాడు: "మీరు ఇంత కఠినంగా వర్తించడంవల్ల నేను అంగవికలుడినై ఇకమీదట మీకేమాత్రం ఉపయోగపడనుకదా?" ముసలితనంలో విరిగిన కాలుతో అతడు ఇలా అనగలిగాడు: "ఓ యువకులారా! స్వేచ్ఛగా తిరుగుతూ జీవిత వరాలను అనుభవిస్తారు మీరు. నెరిసిన తల, వైకల్యంతో కూర్చొని నా భగవంతుడ్ని స్తుతించ గలుగుటకు కృతజ్ఞుడను నేను." మానవుని ప్రేమించువాడు తద్వారా భగవంతుణ్ణి ప్రేమిస్తాడను భావనలో తప్పు, అస్పష్టత ఉంది. ప్రధాన సూత్రం ఇది: భగవంతుని ప్రేమించు, అతనికి మారుగా ఇతరులను ప్రేమించవద్దు. అతనికోసమే అతనిని ప్రేమించు మానవునికీ దేవునికీ మధ్య మూడడుగులు మాత్రమే ఉన్నాయంటాడొక

సూఫీ—మొదటిదాంతో ఈ ప్రపంచాన్ని దాటు. రెండవదాంతో తర్వాతి లోకాన్ని దాటు, మూడవదాంతో భగవంతుడిముందే నిలువగలవు నీవు. స్వర్గం, ఇల్లు సంబంధాంశాలను గూర్చి పాడ్తాడు కవి. కాని మనం ఒక అడుగు ముందుకువేసి ఇలా అందాం: "స్వర్గం, ఇల్లు—ఏకాంశం." ఇల్లును స్వర్గంనుండి వేరుచెయ్యి, జెయిలు కొట్టుగా అవుతుందా ఇల్లు; స్వర్గాన్ని ఇంటినుండి వేరుచెయ్యి, ఎండ మావులుగా మారుతుందా స్వర్గం. స్వర్గమే ఇల్లు. ఇల్లే స్వర్గం. మనం ప్రేమతో జన్మించి ప్రేమతో జీవించటమేగాక ఇంట్లో ప్రేమతో నివసించినపుడు ఇంతకంటె ఉన్నత స్వర్గాన్ని వేరే ఊహించుకోగలమా? అని అంటాడొక గూఢమతవాది; మహమ్మదీయ విశ్వసృష్టి విషయక శాస్త్రంలో ఏడు ఆకాశాలు, ఎనిమిది స్వర్గాలు ఉన్నాయి: 'అలాగైతే అవి ఎక్కడ ఉన్నాయి? ఎనిమిది స్వర్గాలలో ఏడు, ఏడు ఆకాశాలలో ఉన్నాయి, ఎనిమిదవ స్వర్గం, నీ హృదయంలోనే ఉంది.' ఆ ఎనిమిదవ స్వర్గం – అత్యున్నత స్వర్గం, యథార్థ స్వర్గం – నీలో ప్రవేశించినపుడు నీవు స్వర్గ వాసివి కానేరవు – స్వర్గ నివాసస్థలం మాత్రమే అవుతావు. అందుచేత భగవంతుడు స్వర్గంలో లేడు, స్వర్గమే అతనిలో ఉంది – స్వర్గమే దైవం. ఎంతవరకు ఆత్మను ప్రేమకు వశీకృతం చేశాను? అనేది అంతిమ పరీక్ష. "ప్రభూ! ప్రభూ! మీరు ప్రసాదించిన శక్తిద్వారా 'బహ్మకృపాహి కేవలం' అను అనిర్వచనీయమైన సత్యం రహస్యాన్ని గ్రహించగలిగాను" అని నేను పలుకగలిగినంత మేరకు. ప్రేమే దైవము, లేదా, తమిళ శ్రుతులలో చెప్పబడినట్టు అది – అన్బెశివం. ప్రేమే దైవం – ఇది శబ్దాలంకారం కాదు, వాస్తవికాంశం, నగ్నసత్యం. ఈ ప్రేమసందేశాన్ని స్వీకరించిన వారి ఆత్మదర్పణంలో భగవంతుడు ప్రతిబింబిస్తాడు. అతడు భగవంతుడిలో ఐక్యమవుతాడు. అలా భగవంతుడితో అభిన్నమైనవారు ఏడి కానేరరు? అమృతస్య పుత్రః! (అంతా ఆ పరమాత్ముని చిరంజీవులైన సంతానమే).

ఈ ప్రేమనే సృష్టిలోని దైవ సాక్షాత్కారంగా భావించాడతడు. బాలవితంతువు, పీడిత హరిజనుడు, నిరాదరింపబడిన స్త్రీజనం, అనాథ శిశువు—వీరికి అండగా నిల్చుటకు వారిని ప్రేరేపించింది అదే. బాల వితంతువుల వివాహ సమస్య అతడి దృష్టిని బాగా ఆకర్షించింది. ఈ ఉద్యమంలో శ్రీ వీరేశలింగం పంతులుగారికి తోడ్పడ్డారాయన. రాజా రామమోహనరాయ్ సతీసహగమన నిషేధంద్వారా గొప్ప సేవ చేశాడు. దహన సమయంలో భర్త చితిపైనుండి వితంతువు రక్షింపబడినపుడు. జీవితాంతం నిర్బంధ వైధవ్యమనే మరో నరకంలోకి ఆమె త్రోసివేయబడింది. వితంతువుకు పునర్వివాహపు హక్కును ప్రసాదించడానికి శ్రీ కందుకూరి వీరేశలింగం

పంతులుగారు తన జీవిత సర్వస్వాన్ని ధారపోశారు. ప్రతి ఆరుగురు హిందూ-స్త్రీలలో ఒక వితంతువు వుండేదని ఆనాటి నమ్మకం. వితంతు వివాహాలు జరిపించడంలో నాయుడుగారు ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. అలా జీవితాంత బానిసత్వం అనే అమానుష క్రూరత్వంనుండి భారత యువతీ లోకాన్ని రక్షించారు ఆచారరీత్యా నిందించబడు వితంతువునకు వివాహం పూర్తిగా ఒక నూత్న జీవితాన్ని ప్రసాదిస్తోంది. ఇలాంటి కానుకలెన్నో సమర్పించారాయన. స్త్రీలోకానికి ఇంతకంటె గొప్పసేవ ఏమి ఉంటుంది కనుక? మహిళలను గూర్చి మాట్లాడుతూ "మహనీయులగు వ్యక్తులను సృష్టించుటలో బ్రహ్మసమాజపు సేవలను ఉగ్గడించేటప్పుడు, ఇతర వర్గాలలో తరువాత కన్పించిన వారిలో ఎంతోమంది బ్రహ్మ సమాజంలో పెంచబడ్డవారేనన్న విషయాన్ని గ్రహించాలి మనం. జనాభా లెక్కలలో బ్రాహ్మికగా గుర్తించబడటానికి ఇప్పుడు బహుశా సిద్ధంగా లేనప్పటికి, బ్రహ్మ సమాజానికి చెందిన తల్లిదండ్రులచే పెంచి పోషింపబడి, ప్రపంచ గౌరవంపొందిన శ్రీమతి సరోజినీదేవిగారి పేరు ఇప్పుడు మనకు సుపరిచితమే. మనకు సన్నిహితంగా ఉండి బ్రహ్మ సమాజంతో ప్రత్యక్ష సంబంధంగల వారిలో ఇప్పుడు శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మమ్మగారు మనకు ప్రత్యక్ష నిదర్శనం. సదా గౌరవనీయులగు మన కందుకూరి వీరేశలింగం పంతులుగారి ప్రియతమ జీవిత సహచారిణి ఆమె. ఆంధ్ర దేశంలో నిర్వహించబడిన అమోఘమైన అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయనతో పాటు ఆమెకూడా పని చేశారు. ఆయన సాధించగల్గిన ఫలితాలన్నింటిలోనూ ఆమె ఆయన్ని బలపరుస్తూ సహాయకురాలుగా వుండేవారని ఆయనే చెప్పారు. బొంబాయి రాష్ట్రంలో స్త్రీల అభివృద్ధికి దారితీసిన వారందరూ ప్రార్థన సమాజంనుండి వచ్చారు. సాంఘిక గృహజీవితంలో వారు సంపాదించిన ఉన్నత స్థానానికి డాక్టర్ ఆత్మారామ్ పాండురంగగారి పిల్లలు ముఖ్యులు. పట్టుదలతో పనిచేసి ప్రసిద్ధికెక్కిన గౌరవనీయురాలైన శ్రీమతి రమాబాయి రనడే పేరుకూడ ఇప్పట్ల పేర్కొనాలి. అణగద్రొక్కబడిన వర్గాలను పైకితెచ్చే కార్యక్రమంలో 'సమాజం'లోని సభ్యురాండ్రే ఉత్సాహాన్ని రేకెత్తించి తీవ్రతరం చేశారు.

ముగించడానికి ముందుగా రాజా రామమోహన్‌రాయ్ స్వభావంలోని ఒక గొప్ప లక్షణాన్ని ఉదహరిస్తాను. ఆయన హాజరైన ఏ సమావేశంలోనైనా—అది బహిరంగ సమావేశమైనా కాక పోయినా, పెద్దదైనా, చిన్నదైనా ఒక స్త్రీ నిలబడి వుండగా ఆయన కూర్చుని ఎరుగడు. ఆ విధంగా ఆయన పురుషులలో ఉత్తముడని నిరూపించుకొన్నారు కదా? ఇంగ్లాండులో ఆయన స్నేహితురాలొకామె నేనే గనక ఇంగ్లాండు రాణి నయినా ఇంతగా గౌరవింపబడేదాన్ని కాదని అంది. బ్రహ్మ

సమాజంలో పవిత్రుడైన మహమ్మద్ ప్రవక్త యొక్క ఉన్నత భావాన్ని పూర్తిగా పంచుకొంటాము. మానవుని తల్లిదండ్రులలో ఎవరుగొప్ప ? అని ఆయన నడిగి నట్లయితే తల్లియే అని ఉద్ఘాటించారు. ఎందుచేతనంటే ఆమె పాదాలవద్ద స్వర్గం వాలుతుంది. మాతృమూర్తిపట్ల గౌరవభావాన్ని కలిగివుండడం బ్రహ్మసమాజ ఉద్యమలక్ష్యాలలో ఒకటి. బ్రహ్మసమాజంలో తల్లి బిడ్డను పోషించడమే కాకుండా ప్రోత్సాహన్ని కలిగించేది కూడాను. తల్లినుండి గ్రహించిన ఈ ప్రోత్సాహం దేశపరి వ్యాప్త మయింది. సమాజం చిన్నదైనప్పటికి స్త్రీ జనాభ్యుదయం అనే పవిత్ర ధర్మానికి ఇతోధికమైన సహాయం చేయడానికి శక్తిని ప్రసాదించినందుకు భగవంతునికి కృతజ్ఞులము.

ఇక్కడ చాలామంది యువకులున్నారు. వారందరికి అంతిమ విజ్ఞప్తి చేస్తున్నాను. స్వచ్ఛమైన, బలమైన, తెలివిగల, ప్రయోజనాత్మకమైన భావాన్ని అలవర్చుకొని తరువాత మాతృమూర్తిని గౌరవించడం నేర్చుకోండి. అప్పుడే మానవుడు శక్తి పుంజుకొని ఉన్నత శిఖరాలను అందుకోగలడు. భక్తశిరోమణి ప్రహ్లాదుని ఆధ్యాత్మిక చింతనంలో ఈ 'మాతృభావం'—మాతృవిధేయత—ఒక ప్రధానాంశం, ఒక అవశ్యక సూత్రం కదా ? ఈ నిర్మల దృష్టి, విశాల దృక్పథాలు, గొప్ప ఔదార్యానికే కాకుండా పవిత్రమైన మానవత్వానికి కూడా మూలాధారాన్ని కలుగజేస్తాయి. మాతృమూర్తి పాదాలకు నమస్కరించి, అవతారమూర్తికి నమస్కరించు. సోదరి నివేదిత విజ్ఞతతో చెప్పినట్లు హేమ్‌లెట్ దోషియైన తల్లిని నిందించటం పాశ్చాత్యదేశంలో సాధ్యం కావచ్చు. కాని ప్రాచ్యదేశంలో అసాధ్యం. మాతృమూర్తి ఎప్పుడూ మాతృమూర్తే. తెలివిగల చక్కని ఉన్నతాత్ములైన బాల బాలికలను పెంచిన తల్లిచేతులు నిశ్చయంగా బంగారు ఉయ్యాళ్ళే. స్త్రీపట్ల బ్రహ్మసమాజంయొక్క అభిప్రాయ మిదే. మన జాతీయ స్వభావం దృష్ట్యాను, మన దేవతా ధర్మం దృష్ట్యాను, మనం మాతృమూర్తులపట్ల గౌరవము, భక్తి కలిగి వుండడం నేర్చుకోవలసి వుంటుంది.

స్త్రీలపై ఆరోపింపబడ్డ పూర్వాచారా లెన్నింటినో ఈ కాలంలో స్థిరపరచడానికి అన్నివైపులా మతాధికారం ఉదాహరించే టపుడు, భౌతిక అశక్తతలు మానసిక ఆందోళనలనుండే గాక ముఖ్యంగా ఆధ్యాత్మిక పతనంనుండి కూడా సోదర సంబంధముగల ప్రతి స్త్రీని విముక్తురాలను చేయడం నిజమైన బ్రహ్మసమాజీయుని ముఖ్య కర్తవ్యం. ఎందుకంటె స్త్రీ హృదయంలోనే భగవంతుని పవిత్ర దేవాలయం నెలకొంటుంది. అందుకనే కదా భార్యను అర్ధాంగి అని ఎంతో సముచితంగా అన్నారు.

అది గౌరవాన్ని, భక్తిని తెలియ జేస్తుంది. తల్లి, సోదరి, భార్య, కూతురు—ఇలా స్త్రీని ప్రతి బ్రహ్మసమాజీయుడు హృదయ పూర్వకంగా పవిత్రంగా భావించి ఆరాధించాలి. పిఠాపురం మహారాజా, మహారాణి వారి సంరక్షణ సహకారాలతో 1909 లో ఆయన అనాథ శరణాలయాన్ని ప్రారంభించారు. విడిచిపెట్టబడ్డ శిశువులు ప్రేమతోను శ్రద్ధతోను జాగ్రత్తగా పెంచబడ్డారు. వారు వెలివేయ బడిన వారిగా కాక గౌరవనీయులుగా పోషింపబడ్డారు. ఇదే గురువుగారు నేర్పిన పాఠం. దాన్ని మనమిప్పుడు విస్మరిస్తున్నామేమోనని నాకు భయంగా వుంది. అనాథుల పోషణ సమాజపు ముఖ్య కర్తవ్యం. ఎక్కడైతే అనాథుల ఆర్తనాదం అణచివేయ బడిందో అక్కడ సమాజం క్షీణించి పోతుంది. కాకినాడ మహారాజా కళాశాలలో స్త్రీలవద్ద ఫీజు వసూలు చేయబడలేదు. ఎన్నివందల మంది లాభం పొందారో ఉపకారం పొందినవారికే తెలుసు. వెంకటరత్నం నాయుడుగారిలో అస్పృశ్యతా నివారణాచరణము మూర్తీభవించింది. మహాత్మాగాంధీ నాయకత్వంలో ఈ వుద్యమానికి ఎంత ప్రాముఖ్యము ఇవ్వబడిందో మనకు కూడా తెలుసు. మనలో చాలా మంది అస్పృశ్యతను గురించి మాట్లాడుతాం. కాని కొంతమంది మాత్రమే జీవితంలో దాన్ని ఆచరిస్తాం. ఆ మహర్షి అస్పృశ్యులను తన సొంతబిడ్డలుగా పెంచారు; కాదు, తన సొంతబిడ్డలకన్నా ఎక్కువగా పెంచి అగ్రకులాల వారితో వివాహం జరిపించారు. ఆ విధంగా ఆయన ఈ మహత్తర కార్యం కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. హరిజన బిడ్డలను తమ సొంత బిడ్డలుగా పెంపకం చేసిన వారిని మనం ఎందర్ని పేర్కొనగలం? ఈ విషయంలో ఆయన వుద్దేశం ఏమిటంటే—నా తమ్ముడు లేదా నా చెల్లెలు అంటరానివారా, అంటరానివారు కారా అని కాదు నేను ప్రశ్నించుకోవాల్సింది. ఈ సమాజపు పాపపంకిలంతో నా చుట్టూ వున్న దుర్భర వాతావరణంలో నేను అంటుకోటానికి తగిన వాడినా? స్పృశ్యులలో ఒకణ్ణిగా నన్ను నేను లెక్కించుకోగలనా? అనే ప్రశ్నను నాకు నేను వేసుకోవాల్సి వుంటుంది. అందువల్ల స్పృశ్యత, అస్పృశ్యత సమస్య వచ్చినప్పుడు ఆత్మ పరిశీలన చేసుకోవలసిన సమస్య ఏమిటంటే—నన్ను నేను ప్రసక్తిలో వుంచుకోకుండా ఎవడు స్పృశ్యుడో, ఎవడు అస్పృశ్యుడో నిర్ణయించే అధికారం నాకున్నదా? అనేది. ఈ సందర్భంలో వ్యభిచారం చేసిందనే నేరం మోపబడి తీర్పుకోసం తన దగ్గరకు తీసుకువచ్చిన స్త్రీకి సంబంధించి జీసను జీవితంలోని ఒక ఉత్తేజకరమైన సంఘటనను నన్ను చెప్పనివ్వండి. ఈ మహత్తర సమస్య విషయంలో సక్రమమైన దృక్పథాన్ని పొందటానికి, సరియైన పంథా, సముచితమైన తత్వాన్ని మనకు ఆయన ఉపదేశించారు. ఆ తత్వంలోనే ఈ సమస్యను అర్థం చేసుకోటానికి నేను అన్ని వేళలా ప్రయత్నిస్తాను.

ఇప్పుడు ఈ విషయంలో మనం ఏంచేయాలి అనేదాన్ని గురించి వివరంగా ఆలోచిద్దాం. అస్పృశ్యులు అని పిలువబడేవాళ్ళు కొన్ని అవాంఛనీయమైన అలవాట్లను, ఆచారాలను అధిగమించి నట్లయితే త్వరలోనే స్పృశ్యులుగా పరిగణింపబడే రోజు ఆసన్న మవుతుందనే విషయం యథార్థం. దాన్ని ఎవరూ కాదనలేక పోవచ్చు. కాని అప్పుడు పరస్పరతావాదం ఒకటి వస్తుంది. వారు మనలను అంటవచ్చు అనేదానికంటే మనం కూడా వారిలో ఒకరమే అనే భావాన్ని వారిలో ఎంతమేరకు మనం కలుగజేస్తామో అంత మేరకు ఈ అలవాట్లూ, ఆచారాలు వారిలో తొలగిపోతాయి. లేకపోతే వారిప్పుడు ఎక్కడున్నారో అక్కడే వుండిపోతారు. ఎమర్సన్ గూర్చి—ఆయన ప్రసంగాలు వినటానికి తరచు ఒక చాకలి మనిషి వస్తూవుండేదట. ప్రశాంత, మహత్తర ప్రవచనాలు నీ కెంతవరకు అర్థమయ్యాయి—అని ఆమెను అడిగినప్పుడు, ఆమె అనేది: "ఆయన ఏమి చెప్పనీయిగాక నాకు ఒకే ఒక విషయం చెబుతున్నారు. అదేమిటంటే భగవంతుడు విస్మరించిన పాపిని నేనుకాదని, నేనుకూడా నిజంగా సాధ్విని కాగలనని, నాలోకూడా ఉదాత్తమైనది, పవిత్రమైనది ఏదో ఉన్నదనే విషయాన్ని కూడా చెబుతూండేవారు. ఆయన పథాన్నే నేనూ తప్పక అనుసరిస్తాను." ఈ విషయంలో స్వామీ వివేకానంద సరియైన దారి చూపుతున్నారు. తప్పుచేసిన వాడి దగ్గరకు వెళ్లి, నీవు పాపవని చెప్పకు! నీవూ పుణ్యాత్ముడవు కాగలవు—అని చెప్పు. అదే విధంగా ఈ జాతుల వారు మన కెంతో ప్రియమైన వారని, మన శరీరమే వారి శరీరమనీ, మన రక్తమే వారి రక్తమనీ వారికి అర్థమయ్యేలా చేద్దాం. అందువలననే వారికి దూరంగా మనం నిలబడినప్పుడు మనమే అణగద్రొక్కబడినట్టు, మనమే అవమానింపబడినట్టూ మనం భావిస్తున్నాం. అందువల్ల మనమంచికే వాళ్ళని మనవాళ్ళుగా చేసుకోవాలని అనుకుంటున్నాం. ఈ సహోదరతా సందేశాన్ని వారికి అందజేయండి. మన గౌరవాన్ని, వాత్సల్యాన్ని వారికి చూపించటం ద్వారా మనకు వారెంతో ప్రియమైన వారని నిరూపిద్దాం. వారి విధానాలు మారాలనేది, వారి పరిసరాలు మెరుగుపడాలనేది యథార్థమే. కాని అత్యంత ముఖ్యమైన విషయ మేమిటంటే మన విధులలో ఇది తప్పనిసరియైనదిగా, తప్పించుకొటానికి వీలులేనిదిగా భావించి మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒకటి చేయాలి. దళిత జాతుల సముద్ధరణ కోసమే చేయమని నేను చెప్పను. స్వీయ ఆత్మోన్నతికోసమే చేసుకోమని, ఆ విధంగా వారి సహోదరుడు కమ్మనే నేను చెప్పేది. వారి యెడల నాకుండే ఆసక్తిని, వాత్సల్యాన్ని చూపటం కోసం నాకున్న పరిధిలో నా జీవితంలో నేను ఏమి చేయాలి అనేదే అతని ధ్యేయమై వుండాలి.

డాక్టరు వెంకటరత్నంగారు ఉత్తమ శ్రేణికిచెందిన విద్యావేత్త. వారు ఉపాధ్యాయ వృత్తికే ప్రాముఖ్యమిచ్చారు. కళాశాల ఉపాధ్యాయుడుగా, ప్రిన్సిపాలుగా, వైస్-చాన్సలరుగా ఆయన కృషి గణనీయమే గాక ఆదర్శప్రాయమైనది. అందువల్ల విద్యపై వారిభావాలు అమూల్యమైనవి. విద్యార్థులను పరీక్షకు తర్ఫీదు చేసినప్పటికీ, వారి శీలసంపదను, సంస్కృతిని పెంపొందించేటందుకే వారు లక్ష్యంచేవారు. విద్యాకార్యక్రమంలో విజ్ఞానం, వివేకం, ప్రవర్తనలకు ప్రాధాన్య మివ్వాలని వారి ఉద్దేశం. ఒక విద్యాసంస్థ పనితనానికి పరీక్షలే ప్రతిబింబంకాదు. అచట సత్యానికి లభించే ఆదరణ, ఆశయాలకిచ్చే ప్రోత్సాహం, విద్యార్థులపై కలుగజేసే ప్రభావం, యిచ్చే శిక్షణ మార్గదర్శకత్వం—ఇవి విద్యాప్రగతికి నిజమైన గీటురాళ్ళు, ఈ దృష్ట్యాచూస్తే నోబుల్ కళాశాల మన హృదయాలలో విశిష్టస్థానాన్ని ఆక్రమిస్తుంది.

కళాశాల జీవితంనుండి దైవత్వం వరకు ఒకప్రక్క, భారతదేశపు ఉజ్వల భవిష్యత్తును గూర్చి మరోప్రక్క భావోద్వేగాన్ని కల్గించే ఆ నివేదికలోని తుది బంగారు పలుకులు ఇచట చదివే ప్రతి విద్యార్థి హృదయాంతరాళంలోను మారు మ్రోగుతాయి. గత సంఘటనల దృష్ట్యానేగాక, ఇటీవలి చర్యలవల్లకూడ దూర దృష్టిగల రాజనీతిజ్ఞుడేగాక ఉదార స్వభావుడుగా నిరూపించుకొన్న లార్డ్ ఇర్విన్ విజ్ఞతతో కూడిన మాటలను ప్రధానాచార్యులు పేర్కొనడం సమయోచితం. ఈ నెలారంభంలో భారతీయ విశ్వవిద్యాలయాల నుద్దేశిస్తూ వైస్రాయి పలికిన విలువైన మాటలను ప్రధానాచార్యులు మన దృష్టికి తేవడం హర్షించదగింది. విజ్ఞానం, వివేకం, ప్రవర్తన—లక్ష్యాలుగా ఈ కళాశాలలో బోధిస్తున్న నిజమైన యూనివర్సిటీ విద్యపై వైస్రాయిగారు వెలిబుచ్చిన అభిప్రాయానికి మించి నేను ఇవ్వగల్గింది వేరేలేదు:

(1) మీలో ప్రతిఒక్కరి ధ్యేయం అతిప్రాముఖ్యం వహించే విద్యాస్థాయి విషయంలో ఏదో కొంత విషయాన్ని సేకరించడంగాదు; నిజమైన విజ్ఞానాన్ని నేర్చుకోవాలి. అన్నిరంగాలలోను సమగ్రమైన విజ్ఞానాన్ని సాధించిననాడే వ్యక్తి సృష్టిలో తన వైశిష్ట్యాన్ని ప్రదర్శింపగల్గుతాడు. ఆనాడే విజ్ఞానజ్యోతి మనలో ప్రసరిస్తుంది. ఏ విద్య లక్ష్యమైనా సంస్కృతియే. ఎమర్సన్ వర్ణించినట్లు మానసిక, నైతిక, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించేదే సక్రమ జీవిత విధానానికి మూలాధారం. అదే లక్ష్యంతో ప్రతి వ్యక్తి కళాశాలలో చేరాలి. ఆత్మకు ప్రతిబింబమైన ఈ విజ్ఞానం ప్రకృతి పరిధిలోకి చొచ్చుకొనిపోయి దైవత్వం కోసం అన్వేషిస్తుంది. సత్యానికి మూలభూతమైన ఈ విజ్ఞానమే సృష్టికి పునాది. సరైన యూనివర్సిటీ విద్య ఇట్టి విజ్ఞానాన్ని అందజెయ్యాలి. సంస్కృతిని విడమరచి చూస్తే మానవజీవిత

లక్ష్యం చంచలమైన ఆత్మను విజ్ఞానం వైపుకు మళ్ళించడమేనని స్పష్టమౌతుంది. ఈ ఆశయంతోనే మీ తల్లిదండ్రులు మిమ్ములను ఇచటికి పంపుతారు. కాని అనేక మంది జ్ఞానసంపాదనకు వక్రమార్గాల ననుసరించి ఈ మహోన్నత జీవిత లక్ష్యానికి దూరం కావడం శోచనీయం. మూడు దశాబ్దాలకుపైగా ఉపాధ్యాయవృత్తిలో నా అనుభవాన్ని తలచుకొంటే నటనతో యువకులు తమ కాలాన్నెలా వృధాచేసిన సంవత్సరాలనేకం జ్ఞప్తికొస్తాయి. మికొక హాస్యకరమైన ఉదాహరణ చెబుతాను. ఒక విద్యార్థిని ఒకమాటకు అర్థం అడిగాను. ప్రక్క విద్యార్థితో రహస్యంగా సంప్రదించి ఆ మాటకు అర్థం 'మూర్ఖుడు' అని చెప్పాడు. 'ఇది నీ స్వీయచరిత్ర లోనిదా?' అన్నాను. విద్యార్థి ప్రతి విషయాన్ని తనకు తానుగా నేర్చుకోవటం తన ప్రాథమిక విధిగా గుర్తించాలి. అలా నేర్చుకొన్నది స్వల్పమే కానియ్యండి; అది మీ శీలసంపదకు జీవిత విధానికి గీటు రాయిగా పనిచేస్తుంది. ఈ లక్ష్యాన్ని తప్పి ఏ వక్రమార్గాన్ని అవలంబించినా విద్యావిధానం కలుషితమౌతుంది. ఏ పనినైనా స్వయంగా హృదయపూర్వకంగా చెయ్యండి. మీ భవిష్యత్తుకు అది పునాదిగా పనిచేస్తుంది విద్య అన్నది పరిపూర్ణ జీవితానికి మార్గమని నిరూపించగల్గినవాడే సరైన విద్యను అభ్యసించినట్లు భావించాలి. మీరు ఇచట సంపాదించిన విజ్ఞానాన్ని జీవితశేషంలో ఆత్మవికాసం ద్వారా సద్వినియోగపరచాలి. అది అన్నివిధాల జీవిత ప్రమాణానికి కొలబద్ద. ఆనాటి కానాడు విజ్ఞానపథంలో కొంతైనా ముందుకు పోకపోతే భగవంతుడు ప్రసాదించిన అమూల్యమైన కాలాన్నే వృధాచేస్తున్నామన్నమాట! ఒక జ్ఞాని ఇలా అన్నాడు: "నా జీవిత యాత్రలో రెండు విలువైన వస్తువులను పోగొట్టుకున్నాను. తిరిగి నాకిచ్చేటందుకు ఎవరూ ప్రయత్నం చేయకండి. రెండు రోజులు వృధాగా పోనిచ్చాను." కాబట్టి నిజమైన విద్యకు సమగ్రము, పటిష్ఠము, నిజాయితీగల విజ్ఞానం అవసరం.

(2) ఇప్పుడు వివేచనా శక్తిని గూర్చి ఆలోచిద్దాం. శీలాన్నిగాని, మరో విధానాన్నిగాని దేనిదృష్ట్యా లెక్కిస్తాం? ఈ సందర్భంలో ఒక చిన్న సంఘటన చెపుతాను. ఈ కళాశాలలో ఎఫ్ ఏ.లో ఉత్తీర్ణుడైన యువకుడు మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చేరేటందుకువెళ్ళి నా ఉపాధ్యాయుడైన డాక్టర్ మిల్లర్‌ను కలసికొన్నాడు ఆయన సంతోషంతో "మాతో వుండటానికి వచ్చినందుకు సంతోషం" అన్నాడు. విద్యార్థితో ఎంతో దయగా మాట్లాడారు. 'స్కాలర్‌షిప్ పొందగలనాండి?' అన్నాడు విద్యార్థి. "స్కాలర్ షిప్‌లు ఇవ్వడం పూర్తయింది. ప్రస్తుతం ఏమీ లేవు" అన్నాడు డా. మిల్లర్. ఆ విద్యార్థి తిరిగివచ్చి అన్నాడు: 'మాటలేగాని పనిచేసే మనిషిగాదు,' అని.

(౬)

ఐదు దశాబ్దాలుగా ఆయన చేసిన నిస్వార్థసేవ విద్యార్థి దృష్టిలో విలువ లేకుండా పోయింది. అది సరైన వివేచనాశక్తి కాదని మీరూ ఏకీభవిస్తారు. మరో చిన్న సంఘటన: కాకినాడలో ఆంధ్ర విద్యార్థి ద్వితీయ సమావేశ సమయాన ఆటలపోటీలలో ఈ సంఘటన జరిగింది. కళ్ళికోట కళాశాలలోని ఒక విద్యార్థి తాను ఉత్తమంగా పోటీ నిర్వహించానని చెప్పాడు. తీరా అతను వీగిపోయినట్లు ప్రకటించగా "ఫరవాలేదు. మరో సోదరునికి ఆ బహుమతి వస్తుంది" అన్నాడు. ఉత్తమ శ్రేణి వివేచనాశక్తి అంటే ఇదే. ఎవరు బాగా నిర్వహించారన్నదే ప్రధానంగాని, వచ్చిన బహుమతి ఎలా ఉపయోగపడుతుందన్నది ప్రధానం గాదు. వ్యక్తిగత స్వార్థాలను విడనాడితే తప్ప సరైన వివేచనాశక్తి పెంపొందించడం సాధ్యంకాదు. ఎమర్సన్ చెప్పినట్లు ప్రక్కవాడి కాళ్ళకు గొలుసు చుట్టేవాడు దాని రెండవ చివర తన మెడకే చుట్టుకుంటుందని గుర్తించాలి. వివేచనాశక్తి లోపంవల్ల వచ్చే చర్యలన్నీ విషమ ఫలితాల నిస్తాయి. ఒక సంఘటనవల్ల కలిగే పరిణామాలను గ్రహించగల్గడం, వ్యక్తిగత స్వార్థాలను విడనాడటం, మానవ జీవితంలో సరైన విలువలను గుర్తించటం, ప్రతి విషయంలోను సత్యాన్వేషణ చేయడం—ఇవే సమగ్ర విద్యకు సోపానాలు.

(3) ప్రతివ్యక్తీ తానుచూసి, గమనించినదానిని వివేచనాశక్తితో నిశ్చయించు గలేటందుకు విద్యాస్థాయిలో మూడవ అంగంగా సరైన ప్రవర్తనను విధిగా అలవరచుకోవాలి. కార్లైల్ నుడివినట్లు నేత్రం తాను చూడగలిగిన దానినే చూస్తుంది. వస్తువు యొక్క బాహ్య స్వరూపమేగాక అంతర్యాన్ని కూడా గ్రహించగల ప్రత్యేక శిక్షణను మనం కంటికి నేర్పాలి. సాధనతో కూడిన శీలమే ప్రవర్తన అంతర్గత సౌశీల్యముున్నచోట కావలసిన బాహ్యప్రవర్తన చేకూరుతుంది. శీల సంపదకు జీవితంలో మనంచేసే ఏవో కొన్ని మనకార్యాలె కాదు; ప్రతి ఆలోచన, భావానికి సక్రమరూపమివ్వాలి. ఆత్మ వికాసానికైనా, వినాశనానికైనా భావంతోటే భవితవ్యం వెంటనే నిశ్చయంకాదు. దీనికి అనేక దశలున్నాయి. ఒక భావాన్నుండి ఆలోచన కల్గుతుంది. ఆలోచననుండి కోర్కె ఆవిర్భవిస్తుంది. కోర్కె చర్యకు హేతువౌతుంది. చర్యనుండి ఆచరణ వస్తుంది. ఆచరణ ద్వారా శీలం పెంపొందుతుంది. తుదకు శీలమే భవితవ్యానికి దారితీస్తుంది. అందువల్ల మొదట సరైన భావాలను, ఆలోచనలను అలవరచుకోవాలి. వీటినుండి క్రమంగా సరైన కోర్కెలు, శీల సంపదకల్గి ఉన్నతమైన ప్రవర్తన అలవడుతుంది. విద్యాస్థాయి, వివేచనాశక్తి, ప్రవర్తన—యీ మూడింటి సమ్మేళనమే నిజమైన సంస్కృతి. అందువల్ల యువక మిత్రులందరికీ నేను చెప్పదలచిన దేమంటే, మీ ప్రిన్సిపాలుగారి నివేదికలో వివరంగా

పేర్కొన్నట్లు విద్యా ప్రయోజనమేదో దానిని, అంటే, సత్ప్రవర్తనను మీరు ఈ విద్యాసంస్థ ద్వారా నిర్మించుకోండి. సత్ప్రవర్తన సాధించగలిగితే మీకు భావ స్వాతంత్ర్యం లభించినట్లే. మీ శక్తి సామర్థ్యాలు స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చు. ఏ నిరంకుశత్వం కూడా అప్పుడు మిమ్మ ఎదిరించలేదు. సత్ప్రవర్తనగల పుత్రులను చూసి భారతమాత ఆనందిస్తుంది. భగవంతుడు మిమ్ములను ఆశీర్వదించుగాక ! మీ మధ్యలో నిలిచి మాట్లాడుతున్నందుకు, మిమ్ములను కలుసుకున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. దీర్ఘశిశిరర్తుసీమలు దాటి నవవసంతోదయ లోకంలో అడుగిడినంత ఆనందంగా వుంది. నోబుల్ కళాశాల యితోధికంగా అభివృద్ధి చెందాలనీ, దాని సంతతి యింకా వృద్ధికావాలనీ భగవంతుణ్ణి మనసార ప్రార్థిస్తున్నాను.

సరైన సంస్కృతిచ్ఛాయలు బలపరచుకోకుండానే సాంకేతిక శాస్త్రీయ విద్యా రంగాలకు అత్యధిక ప్రాధాన్య మిచ్చినందువల్ల కలిగిన దుష్ఫలితాలను మనం యిప్పుడిప్పుడే గ్రహిస్తున్నాం. సాంకేతిక శాస్త్రీయ నిరంకుశత్వం నుండి మానవ జాతి బయటపడాలంటే, సంస్కృతి వికాసం, మానవత్వం, ప్రేమ—యివే ఆధారాలు. ఉపాధ్యాయుని దృష్టితో ఆయన ఉపాధ్యాయుల సమస్యలను గురించి పనిచేశాడు. భారతదేశంలో ఉపాధ్యాయ వృత్తిని గురించి ఆలోచించినప్పుడు ఒక ముఖ్యమైన ప్రశ్న మనకు స్ఫురిస్తుంది. జాతీయ జీవనంలో ఉపాధ్యాయుని పాత్ర ఏమిటి? 1814 లో డైరెక్టర్ల మండలి (కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్) వారు గ్రామాలలోని ఉపాధ్యాయులంటే దేశమంతటా గౌరవం వున్నదని తెలిపారు. 110 సంవత్సరాల తర్వాత రవీంద్రుడు భారతీయ ఉపాధ్యాయులు నిరంకుశులని నిందించాడు. ఈ మార్పు ఎందుకు జరిగింది? 1814 లోనూ, 1924 లోనూ మన దేశంలో పరిస్థితుల వ్యత్యాసమే యీ అభిప్రాయ భేదానికి కారణమని నా ఊహ. అప్పుడు భారతదేశం నిద్రిస్తున్నది. 1924 లో భారత జాతీయత మేల్కొన్నది. ఆనాడు భారతదేశం విశ్రాంతి తీసుకుంటున్నది. 1924 లో భారతదేశం నిరంతరాన్వేషణలో నిమగ్నమై వుంది. ఈ అన్వేషణకు బీజాలు వేసినవాడు ఉపాధ్యాయుడే. సంపూర్ణ జాతీయ జీవిత సాధనాన్వేషణకు ఉపాధ్యాయుడొక్కడే దోహదం చేయగలడు. భౌతిక, ఆధ్యాత్మిక శక్తి సందోహసంపాదనకు ఉపాధ్యాయుడే మార్గదర్శి. ఇప్పుడు అమల్లోగల విద్యావిధానం తప్పని, దానిని తుదముట్టించాలనే భావనను చూసి మనం భయపడనక్కరలేదు. అది అంత చెడ్డది అయితే, ఇప్పటికి అంతా చీకటి మయంగానే వుండేది. మరి యిప్పుడు మనం సాధించిన అభివృద్ధికీ, ఇకముందు సాధించనున్న మనకార్యాలకూ యీ విధానమే కదా బీజ భూతమైనది? మనలో

యింతటి ప్రగతి ప్రేరణను కల్పించినది యీ విధానమే గదా! అయితే యిప్పటి విద్యావిధానాన్ని పునర్నిర్మించుకోవలసి వున్నది. దానికొక నూతన దృక్పథాన్ని రూపొందించుకోవడంలోనూ, దానిని అభివృద్ధి చేసుకోవడంలోనూ నూతన మార్గాలు అన్వేషించుకోవలసి వుంది. అలాగే కొన్ని పద్ధతులను మార్చుకోవలసి వుంటుంది. పైగా మనకున్న వనరులను ఎక్కువ చేసుకోవలసిన అవసరం కూడా వుంది. మనం తేబోయే మార్పులను 3 విషయాల దృష్ట్యా అమలు పరచాలి—మంచిని పెంపొందించడం, చెడును తిరస్కరించడం, కావలసినవాన్ని వినియోగించడం. నేటి అవసరాల కనుగుణంగా ఈ మార్పు వుండేటందుకు జీవితంలోని అన్ని రంగాల ఉన్నత శక్తులను సమీకరించాలి. ఒక ప్రముఖ విద్యావేత్త విద్యాకార్యక్రమ వ్యాప్తి యావత్తు జాతి ఉమ్మడి కృషివల్లనే సాధ్యమని తెలియజేశాడు. ఐతే భవిష్యత్తులో ప్రయోజనానికి విద్యా పునర్నిర్మాణం దృష్ట్యా ఉపాధ్యాయుడు భావితరాలవారి రక్షకుడుగా ప్రముఖ పాత్రను వహించవలసి వుంది. జాతీయ జీవనంలో తన స్థానాన్ని తిరిగి పొందే టందుకు అతడు విశేషంగా కృషి చెయ్యాలి. జాతి అభివృద్ధికి తగిన అర్హత అతనికి లభించాలి. మరొక రచయిత చెప్పినట్లు విద్య ఖరీదైనది కావచ్చు. కాని అజ్ఞానం మరింత ఖర్చుతో కూడినది. సరైన ఉపాధ్యాయుడు ఆర్థికంగా లాభాన్ని కూడ కలుగజేస్తాడు. ప్రజల శ్రేయస్సును అభిలషించే ప్రభుత్వం ఉపాధ్యాయుని కోర్కెలను తీర్చేటందుకు ప్రయత్నించాలి. సరైన సౌకర్యాలులేని ఉపాధ్యాయులు సమాజాన్ని ముందుకు కొనిపోలేరు. అదే రచయిత చెప్పినట్లు మానసిక వికాసానికి మనం ఎంత ఖర్చు చేయగల్గితే అంత మంచిది. నేటి జీవన విధానంలో సమాజంలోని ఇతర వ్యక్తులకన్న ఉపాధ్యాయుడు ఎక్కువ చైతన్యవంతుడు కావాలి. మన చుట్టూ వ్యాపించివున్న అజ్ఞానాంధకారాన్నుండి బయట పడాలంటే నిస్వార్థంగా జీవితాన్ని దేశప్రయోజనానికి అంకితం చేయగల స్త్రీ, పురుషులు కావాలి. గౌరవనీయులైన మీ అధ్యక్షులు ఉపాధ్యాయ వృత్తిని "విమోచన సేన" గా వర్ణించారు. విజ్ఞానజ్యోతిని వెదజల్లే అంతిమ లక్ష్యంగల ఉపాధ్యాయ వృత్తికి ఈ ప్రయోగం ఎంతో సమయోచితంగా వుంది. ఈ ఉద్యమలక్ష్యం ఉపనిషత్తులో చెప్పినట్లు ఉపాధ్యాయ-విద్యార్థి అనుబంధానికి దారి తియ్యాలి.

ఆయన గొప్ప వేదాంతి అనికూడ మనందరికి తెలుసు. ఇతర మతాలవారు హిందూధర్మాన్ని ఆమోదించాలంటే రెండు ప్రధానమైన మార్పులు రావాలన్న డాక్టర్ మెక్నికాల్ వాదానికి జవాబుగా ఆయన 'జీవం'కు 'శివం'కు గల సంబంధాన్ని చర్చించారు. జీవం, శివం ఏకం కాకూడదు. మానవుడు,

భగవంతుడు—రెండు వేర్వేరు రూపాలుగా పరిగణింపబడాలి. "అహం బ్రహ్మాస్మి" అన్న సూక్తి అంగీకారం కారాదు. ఈ సందర్భంలో వారి అభిప్రాయాన్ని పేర్కొనడం ఎంతైనా అవసరం.

"గౌరవనీయులైన రచయిత చెప్పిన విషయాన్ని వ్యతిరేకించడం నా ఉద్దేశం కాదు. బ్రహ్మసమాజ చరిత్రలో జీవ శివలు ఒకదానికొకటి విభిన్నం కానవసరం లేదని, రెండు రూపాలుగా వున్న జీవ శివలు విడివిడిగా వుండనవసరం లేదన్న వాదాన్ని ఇంతకాలం బలపరచాం. రాజా రామమోహన్‌రాయ్ కాలంనుండి ముఖ్యంగా మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ అతని అనుచరుల ఉపదేశాలలోను, పండిత శివానంద తత్వభూషణ్ రచనల్లోను మానవుడు భగవంతుని ప్రతిరూపం కాకపోయినా ప్రాథమికంగా ఒకలేనని, ఒకరికొకరు సమానులు కాకపోయినా, వేర్వేరు రూపాలన్న సిద్ధాంతం చాటబడింది. జీవరాసి కారకుడుగా తప్ప భగవంతుడు మన ఊహ కందడు. సృష్టికర్త ప్రతిసృష్టిగా తప్ప మానవుని వేరుగా వూహించలేము. వెలుతురు లేకుండా సూర్యుని, నేత్రదృష్టి లేకుండా రంగును ఎలా వూహించలేమో అలాగే భగవంతుని, మానవుని పరస్పర సంబంధంతో తప్ప వూహించలేము. ఒక రచయిత చెప్పినట్లు భగవంతుడు కేవలం మానవునికి ముందుగానే ఆవిర్భవించినవాడు మాత్రమేగాదు. ఒక ప్రయోజనానికి భగవంతుడు కారణభూతుడు. భగవంతుడు, మానవుడు—ప్రాథమికంగా చూస్తే ఒకరే. ఐనా ఉభయులూ వేరువేరుగానే పరిగణింప బడతారు. మూలంలో ఒక్కటైనా లౌకిక దృష్టిలో వేరుగా వుంటారు. అలా కాకపోయినట్లైతే భగవంతుని గూర్చి ఆలోచించే శక్తే వుండేదిగాదు. ఈ విధంగా జీవానికీ, శివానికీ అంతర్యంలో ఏకత్వం వుంది. ఈ సూత్రాన్ని గ్రహించినట్లయితే అద్వైతానికి, ద్వైతానికి సమన్వయం కల్పించడం ఏమంత కష్టంగాదు. భగవంతునికీ, మానవునికీ మధ్యగల సంబంధం విషయమై రెండు దృక్పథాలున్నాయి. భగవంతుడే విశ్వ వ్యాప్తుడు సర్వోత్కృష్టుడు అని ఒక దృక్పథం. ఆత్మలోనే అంతర్భూతుడైవుండి సర్వత్రా వ్యాపించి వున్నాడని మరొక భావం. అయితే ఈ భావాలు పరస్పరం భిన్నమైనవికావు. అండ పిండ బ్రహ్మాండమంతటికీ సృష్టి కారకుడు అంతర్భూతుడైన భగవంతుడు, మనలోనే వున్నాడు. అతడు ఊహాతీతుడు. ప్రేమించిన వాని హృదయంలోనే వుంటాడు. ఇది పెద్ద జలాశయం వంటిది. ఆదిలో సన్న సన్న తుంపరలవలె పైకి విరజిమ్ముతూ క్రమేణా పొంగిపొరలి నదులవలె ప్రవహిస్తూ అంతిమంగా సముద్రములో సంగమమవుతుంది. ఈ రెండు దృక్పథాలు ఒకదానికొకటి అనుబంధంగా వుంటాయి. మతమనే గోళానికి ఈ రెండు దృక్పథాలు పూర్వ పశ్చిమార్థ భాగాలవలె వుంటాయి.

అంతా బ్రహ్మ స్వరూపమే, ఈశ్వర లీల అని తెలుసుకోవడంలో కష్టమేమీ లేదు. భక్తి ప్రియుడైన భగవంతుడు హృదయంలోనే వుంటాడు. అట్లని ఇతరత్రా లేడని అర్థంకాదు. నీటిబిందువులో సూర్యుని కాంతి ఇమిడి వుంటుంది. అయితే సూర్యునికాంతి విశ్వవ్యాప్తమే కదా! మాతృమూర్తి ప్రేమలో జోలపాట వుంటుంది. అయితే ఇది జోలపాటతోనే అంతంకాదు. స్నేహితుని మధుర మందస్మితంలో ప్రేమతొణికిసలాడుతుంది. అంతటితోనే ఆగదు. ఈ విధంగా చూస్తే అంతర్యామి తుడైన భగవంతుడు సర్వవ్యాప్తుడవుతున్నాడు. అనంతమైనవాడు, సృష్టిలయలకు కారణభూతుడవుతున్నాడు. తనకుతానే లయమైతే తప్ప అనంతుడు కాలేదు. లయలేనిదే సృష్టిజరగదు. భగవంతుడు ధ్యానస్వరూపుడని భావిస్తే, అతను భక్తి స్వరూపుడని కూడా భావించాలి. మహర్షుల దృష్టిలో భగవంతుని స్వరూపము రెండూ ఒకటే. భగవంతునిగూర్చి ధ్యానం చేయాలంటే అతను సర్వోత్కృష్టుడుగా వుండాలి. ప్రేమకూ, భక్తికీ మనలో అంతర్యామితుడై వుండాలి. భక్తి ధ్యానము, ధ్యానము భక్తి—ఈ రెండు రంగాలలో మన మానవుడు పురోగమిస్తాడు. అప్పుడు భగవంతుడు సర్వోత్కృష్టుడనీ, అంతర్యామితుడని కూడా గుర్తిస్తాడు. మనము పఠించే ఆరాధన మంత్రంలో యివి రెండూ మేళవించి వుంటాయి. ఆత్మలో ఆరాధిస్తూ, విశ్వాంతరాళమంతా వ్యాపించివున్నాడని భావిస్తాము. మనకంటికి కనిపించే ప్రపంచము నిత్యమైనదీ, వాస్తవమైనదిగా తోస్తుంది. అంటే భగవంతుని తెలుసు కొన్నట్లన్నమాట. అంతా భగవత్సంకల్పమే అనే దృష్టి కూడా ఏర్పడు తుంది.

మన విశ్వాసాన్నీ, మన అనుభవాల్నీ రెంటినీ మేళవించి మతములతో నిమిత్తంలేకుండా భగవంతుని ఆరాధనకు దోహదం కలుగజేయాలి. ఒకే దేవాలయంలో కాకపోయినా, ఒకే ఆశయంతో భగవంతుని ప్రార్థన చేయుగలం. తద్వారా పునీతులమై సత్కృషి చేయడానికి ఉత్తేజ పూరితులమవుతాము. కృషిలేని భక్తి నిష్ప్రయోజనం. భక్తిలేని కృషి వ్యర్థం. ఇవి రెండూ ఒకదానికొకటి చేదోడువాదోడుగా వుండడం సదా శ్రేయస్కరం. అప్పుడు ఆత్మశక్తి పెంపొందు తుంది. భగవంతునికి మానవునికి గల పరస్పర సంబంధం అవగతంకావాలి. ధ్యానంలో భగవంతుని యందు మనస్సును లగ్నంచేసి భక్తితో ఆరాధిస్తాడు మానవుడు. అప్పుడే భగవంతుడు భక్తితో కనిపిస్తాడు.

ఈ ప్రకారంగా డాక్టర్ మెక్నికోల్ దృష్టిలో విభిన్నముగా వున్న దృక్పథాలను సమన్వయం చేయుడం సాధ్యమవుతుంది. భిన్నముగా కనిపించే ఇతర మతాల్ని మన మతాలుగానే ఆదరించగలం. జీవులంతా ఒకటేననే జ్ఞానం కలుగుతుంది.

జ్ఞాని అయిన నేథాన్ యూదునికి, క్రైస్తవునికి మధ్య ప్రగాఢమైత్రి ఏర్పడుతుంది. "నేథాన్, నీవు క్రైస్తవుడవే కాని, వేరేకాదు" అని క్రైస్తవు డంటాడు. "నీలోవున్న యూదుడు ఆ విధంగా పలికిస్తున్నాడు" అని ప్రత్యుత్తర మిస్తాడు. క్రైస్తవుడు యూదీయుని అర్థం చేసుకోవాలంటే, అతనితో ఏకీభవించాలి, అతనిలో లీనమై పోవాలి. యూదీయుడు క్రైస్తవుని అర్థం చేసుకోవాలంటే, అతనితో ఏకీభవించాలి. సర్వత్రా ఇది సత్యమైన విషయం. రూమీలో ఒక కథ వుంది. ఒక అరబీ దేశీయుడు, పారశీకుడు, టర్కీదేశస్థుడు, గ్రీకుదేశస్థుడు—ఈ నలుగురూ కలిసి ప్రయాణం చేస్తున్నారు. అందరికీ ఆహారం కావాలనే కోరిక కలిగింది. ఒకడు నాకు 'అనాబ్' కావాలంటే మరొకడు తనకు 'అంగూర్' కావాలని, ఇంకొకడు 'అంజీర్' కావాలనీ, నాల్గవ వాడు 'స్టాఫూల్' కావాలనీ అన్నాడు. ఈ విధంగా పేరు విషయమై వాళ్ళు పేచీ పడుతూంటే ఒక గాడిద ఏదో ఒకమూటను మోసుకొంటూ, ఆ దారిలో పోతూ వుండడం చూశారు. ఆ మూటలో వుండే పదార్థాలను చూచి "నాకు ఆ పండ్లు కావాలి" అని అన్నారు. భావంలో వాళ్ళకు తారతమ్యం లేదు. పేరులోనే వుంది అంతా. స్వరూపాల తత్వాన్ని తెలుసు కోవాలంటే వివిధ మతాలకు చెందినవారు ఒకచోటికి కలిసిరావడం సాధ్యంకావాలి. విభిన్న భావాలన్నీ వాటిలో ఇమిడివుండే ప్రత్యేకతనే తెలుపుతాయి కానీ, తారతమ్యాల్ని తెలియజేయవు. హిందువు భగవంతుని బ్రహ్మస్వరూపునిగా తలచుతాడు. క్రైస్తవుడు ప్రేమస్వరూపినిగా భావిస్తాడు. ఇటీవల ఖురాను మత గ్రంథాన్ని అనువదించినవ్యక్తి "అల్లా" ను ఆంగ్లభాషలోనికి అనువదించుటాము గనుక గ్రంథమంతా "భగవంతుడు" అనే ప్రత్యామ్నాయ పదంవాడకుండా 'అల్లా' ను మాత్రమే వాడుతూ వచ్చాడు. ఇవి స్వరూపాలు మాత్రమే; వివిధరూపాలలో వివిధ ప్రజల హృదయాంతరాళాలలో హత్తుకొనిపోయి వుంటాయి. అవన్నీ వేరు వేరుగా మనం భావించకూడదు. అన్నీ భగవంతుని బిన్న స్వరూపాలేనన్నీ, భగవంతుడు చిదానంద స్వరూపుడు, ప్రేమ మయమైన సుందరమూర్తి అని గుర్తించాలి. భగవంతునిగూర్చి వున్న బావాల్ని వేటినికూడా త్రోసిపుచ్చ జాలము. ఆత్మ భగవంతుని ప్రతిబింబింప జేసినపుడు ఇవన్నీ మోక్షకారక మవుతాయి. సూఫీ చెప్పినట్లు 'నీవూ,' 'నేనూ' ఒక తోటలో కూర్చొని వున్నాము సంభాషణలు జరుపుతూ. నీకూ నాకుమాత్రమే ఈ సంభాషణ అర్థమవుతుంది. ఇందుకు సిద్ధాంతమైన జ్ఞానంకాదు కావలసింది. పరస్పరం అర్థంచేసుకోవడంద్వారా ఇది సాధ్యమవుతుంది. భక్తి ప్రధానం కానీ, మతం కాదు. ఓ భగవంతుడా, మాలో ప్రతి ఒక్కరికి దీనిని ప్రసాదింపుము!"

'బ్రహ్మో' వివాహం సందర్భంగా వైవాహిక జీవితంలో గల పవిత్ర బాధ్యత

లనుగూర్చి వధూవరులను ఉద్దేశించి పురోహితుడుగా ఆయన చేసిన ఉద్బోధ యెంత ఉత్తేజకరంగా ఉందో యీ ప్రసంగం వ్యక్తం చేస్తుంది:

"నా ప్రియమైన బాలబాలికలారా!

సాంప్రదాయకమైన పరిభాషలోగాక ప్రగాఢ విశ్వాసంతో నా సొంతపిల్లలవలె మిమ్ములను ఈ విధంగా సంబోధించగలిగే విశేషఅవకాశం నాకు లభించింది. నా కుటుంబానికి ఆనందం కలిగించే ఆశాజ్యోతులయి, భగవంతుని కృపతో నా సంరక్షణలో పెరిగి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునే నా సొంత పిల్లలవలెనే మిమ్ములనూ భావించుకుంటున్నాను. మి ఇద్దరిని కేవలం దంపతులుగా నేను కలపడం లేదు. నా జీవిత పరమావధి—నా ఉపాసనా ఉద్దేశాల కలయిక యిది. అందుకే ఇవి కేవలం సాధారణ ఉద్బోధ పారిభాషిక వాక్యాలు కావు. ఈ రోజు మీరు నాకు యెంతో ఆనందాన్ని కలిగించారని నేను హృదయపూర్వకంగా చెప్తున్నాను. మీ కలయికలో నాకొక దైవప్రధాన చిత్రణ ద్యోతకమవుతూ ఉంది. మీ కలయిక యేర్పడింది కనుక మీ వైవాహిక జీవితం సరి అయిన పంథాలో సంతోషమయంగా గడచి, భగవంతుని మహిమ తప్ప యితరాన్ని ఆశించక, భగవదాశయాన్ని పరిపూర్తిచేయుటకే సదాకృషిచేస్తూ ఆదర్శదంపతులుగా మెలిగేట్లు చేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాను. సృష్టికారకమైన వివాహం పవిత్రమైన మహోత్సవం. మానవుడు కల్పించిన సంప్రదాయం మాత్రమేకాదు; దైవం నెలకొల్పిన పవిత్ర బంధమే ఈ వివాహం. జీవితం మొత్తం మీరు ఇద్దరూ వేర్వేరుగా కాక ఒక్కటిగా ఉండడం మీ ప్రథమ కర్తవ్యం. ఒకరికొరకు యింకొకరు అనే భావంలో ఇద్దరుగా ఉండవచ్చునేగానీ ఐక్యత అనే భావంలో యిద్దరు ఒకరుగానే వ్యవహరించాలి. ఆదేవిధంగా దైవ నిర్దేశిత మార్గంలో జీవిత పర్యంతం మీ ఆత్మలను ఏకంగా నిలపండి. కాలక్రమేణ, దశలవారీగా మానవజాతి మొత్తం ఏక కుటుంబంగా మెలగాలని భగవంతుడు యేవిధంగా నిర్దేశించి నాడో, రెండు జీవుల కలయిక అయిన యీ వివాహబంధం వ్యక్తపరుస్తుందని బ్రహ్మసమాజం భావిస్తున్నది. మానవుడు ఏకాకిగా ఉండడానికి సృష్టించబడలేదు. ఇతరులతో కలసిమెలసి ఐక్యతగా ఉండడానికే నిర్మించబడ్డాడు. ఐకమత్యాన్ని నెలకొల్పే శాశ్వత కృషిలో వైవాహిక బంధం మొదటిమెట్టుమాత్రమేకాక ముఖ్యమైనదికూడా. ఈ విషయాన్ని మీ మనస్సులో యెప్పుడూ మననం చేసుకునే ప్రయత్నం చేయండి. దీనికి నిదర్శనంగాను, సహాయంగాను మీరు ఇద్దరు ప్రతిరోజు దైవంవద్ద కూర్చొని కొంత సమయాన్ని గడపండి. ఇద్దరూ ఏకకంఠంతో భగవన్నామస్మరణ చేయండి. ఎల్లప్పుడు హృదయపూర్వకంగా భగవంతుని ప్రార్థించండి. ఎప్పుడు ఆయన మార్గ

దక్షకత్వాన్ని కోరండి. కష్టాలు, పరీక్షలు ఎన్నో రావచ్చు. అయితే భగవంతుని లోను, మీలో మీకు నమ్మకం ఉంచడానికి వచ్చిన దైవం పిలుపులే అవి. కష్టాలు, పరీక్షలను గురించి ఆలోచించేవారికి భగవంతునిలో విశ్వాసం సమధిక మవుతుంది. ఆయనలో విశ్వాసం ఉంచండి. ఆయన అనుగ్రహాన్ని పొందండి. భగవంతునికి చెందిన మీ స్నేహితులు, బంధువులు, సమాజం మీలోని మంచిని కోరుతున్నారు. మీవిదిని నెరవేర్చి తద్వారా దైవంలో లీనంకావాలి. ఇటువంటి ప్రతి సందర్భంలోను నేను చెప్పినట్టు యీ విషయాన్ని మీ మనసుల్లో పదిలపర్చుకోండి. ఇకనుండి నీకు ఒకే ఒక స్త్రీ ఉంటుంది (వరుని వైపు మళ్ళి). నీకు ఒకే ఒక పురుషుడు (వధువు వైపు మళ్ళి). తక్కిన వారందరూ దైవం పేరుతో 'తండ్రులు,' 'తల్లులు' మాత్రమే అవుతారు. మానవత్వం, విశ్వాసం గల స్త్రీ పురుషులనే దృష్టిలో ఉంచుకోవాలి. నేత్రాలకు కృత్రిమ అంధత్వాన్ని అలవర్చుకోవాల్సిన అవసరాన్ని యిది కలిగించదు. భగవంతుడు నీలో ఉంచిన స్వచ్ఛత అనే తెర యితర యే స్త్రీ పురుషుల ఆకర్షణను కాక ఒకే స్త్రీని ప్రతిబింబింప జేస్తుంది. దాంపత్యజీవితం ఆశించేది యిదే. అనుమానాలు లేనిది, పెడమార్గాలు పట్టనిదే నిజమైన దాంపత్యం. మీలో ఒకరిపై ఒకరికి భక్తి విశ్వాసాలను పెంపొందించే సౌశీల్యాన్ని భగవంతుడు మీలో కలిగించుగాక! మానవుడు తనకొరకే జీవించడంలేదు. మానవజాతి కొరకూ, దేశం, సమాజం, కుటుంబం యితరుల కొరకూ జీవిస్తున్నాడనే విషయాన్ని జ్ఞప్తియందు ఉంచుకోవాలి. భగవంతునిలో విశ్వాసం ఉంచే యితరులకు యే కొద్ది ఉపకారం చేసినా అది ఆయన పరిగణనలోకి వస్తుంది. ఈ మార్గంలో వచ్చే అవకాశాలను జారవిడవకండి. మీరు సమిష్టిగా ఉండి చేసేపని ఒక్కడుచేసే పనికన్నా పదిరెట్లు యెక్కువగా ఉంటుంది. ఈ రోజు మీరు ఇద్దరు దంపతులు మాత్రమే; దైవ నిర్ణయానుసారం కుటుంబంగా అభివృద్ధిచెంది భవిష్యత్ మానవాళికి వారసత్వాన్ని అందించండి. వివాహం కాకున్నా స్త్రీ పురుషులు కుటుంబాలుగా ఉండవచ్చు. కాని దైవ కటాక్షంలో ఉండే జీవితంలో జీవించండి. ఆయన దయతో మీరు తప్పక సంతోషంగా ఉండగలరు. యవ్వన జనిత ఊహలు కాలగతిన అనుభవాలుగా మారుతాయి. భగవంతునిలో విశ్వాసం ఉంచు. నీ కర్తవ్యనిష్ఠలో దృఢంగాను, మానవునిపై ప్రేమ అధికంగాను కలిగి ఉండు. మీరు సంయుక్తంగా వేసే ఏడు అడుగులు 'జాతీయ వివాహం' అనే కల్పిత కథను పరిచయం చేయవు. కాని మానవత్వం, కుటుంబ బాధ్యతలు, దేశాభిమానం, కర్తవ్యం, నిజాయితీలలో ఐక్యతగా ఉండేటందుకు అవి మిమ్ములను ప్రోత్సహించగలవు. ఇద్దరూ చేతిలో చేయి వేసుకుని పయనించండి. మిమ్ముల ఇద్దరినీ నిక్కడికి తీసుకువచ్చిన భగవంతుడు మిమ్ములను ఆశీర్వదించుగాక! ఇక్కడ వున్నవారు, లేనివారు, అందరి

ఆశీస్సులు మీకు లభిస్తాయి. అవి మీకు పెన్నిధివంటివి. బంధువుల, స్నేహితుల, భగవంతుని దయతో మీరు ఆనందంగా ఉండండి."

ఆయన సాహితీ పరుడు. అన్నిటిని మించి గొప్పవక్త. అనుభవంతోకూడి, రమ్యంగా ఉండే ఆయన వాక్యాలు వినడం గొప్ప అదృష్టం. ఆయన ప్రార్థనలు, దైవారాధన కలకాలం నిలిచి ఉంటాయి. వాటిలో కొన్నిటిని యిక్కడ ఉదహరించ డం అనుచితం కాబోదు.

"మంత్రం : జయ విశ్వపిత భగవాన్ దయానిధి"
(బెంగాలి)

ఓం ! జయ విశ్వపిత ! భగవాన్ ! దయానిధి !

అఖండ విశ్వానికి పిత భగవానుడు. అన్నింటిని రక్షించేవాడు, దయానిధి. ఇటువంటి సంతోషప్రదమైన పవిత్ర సమయంలో అట్టి దైవాన్ని మనం స్మరించు దాం. ఆయన దయా సముద్రుడు. ఆ విశ్వపితను, దయానిధిని పవిత్రంగా పూజించిన తర్వాతకూడా మనకు ఉద్బోధన అవసరమా ? ఇక్కడ ఉన్న ప్రతి మానవుడు పవిత్రోచ్చారణతో విశ్వపిత నామాన్ని మననం చేసుకోడా ? ఆయన సృష్టి కర్తయేకాదు, సంరక్షకుడు, పరిపూర్ణతకలవాడు. అంతా ఆయన ఉద్దేశపూర్వక మైనవే. ఆయన అతి సన్నిహితుడు, ప్రియమైనవాడు, అనంత ఆనందాన్ని కలి గించేవాడు. ఆయన సృష్టికర్తగా ఆయనను తీసుకోము. సంరక్షకుడుగా కృతజ్ఞత తెల్పం. అయితే ఆయనను అంటిపెట్టుకొని ఉంటాం. మన తండ్రిగా కొలుస్తాం విశ్వానికి ఆయన పిత. మనలో ప్రతి ఒక్కరికి ఆయనతండ్రి. గతమంతా ఆయనలో లీనమైంది. భవిష్యత్తు అంతా ఆయననుండి ప్రసరిస్తుంది. ఆయన సర్వాంతర్యామి, ప్రతిచోటా ఆయన లీలలే గోచరమవుతాయి. అందువల్ల ఆయన కొరకు వేచివుండాల్సిన అవసరం లేదు. మనదగ్గరికి రమ్మని యాచించాల్సిన అవసరంకూడా లేదు.

మనం ఆ మహాత్ముని హృదయపూర్వకంగా అర్చించడానికి శ్రమ పడనవసరం లేదు. ఆయన అనవరతమూ మనలో ప్రతి ఒక్కరి ఆత్మలో ప్రతిష్ఠితుడై సర్వకాల సర్వావస్థలలోనూ మనలోనే, మనతోనే, మనచుట్టూనే వుంటాడు. మనకూ ఆయనకూ మధ్యగల సంబంధాన్ని, ప్రేమాదరాలను వర్ణించి చెప్పడానికి మాటలు చాలవు. ఆయన మన చెంతకు రాకుండా ఎంతకాలం ఎంతదూరం వుండగలడు? ఆయన మనల్ని ప్రేమాదరాలతో హత్తుకొని మనలను పూర్తిగా తనలో లీనం చేసు

కుంటాడు. మనకు ప్రియమైన సన్నిహితుడైన ఆ నిజమైన భగవంతుని ఆరాధించడం కేవలం ఒక ఉత్సవం కాదు. కాని అలా చేయడం మన ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో అంతర్భాగం. మనం ఆయనను ఇక్కడ పూజిస్తున్నామంటే ఆయన నొక అనుగ్రహ దైవంగా గాక ఆయనను సత్య స్వరూపమైన దైవంగా గుర్తిస్తున్నా మన్న భావం మనలో నిక్షిప్తమై వుంటుందన్న మాట. ప్రేమైకమూర్తి, ప్రియతముడయిన ఆయనే మన అర్చనాదైవం. ఈ ప్రత్యేక శుభసందర్భంలో మనం మాటలతో కాలాన్ని వ్యర్థపుచ్చక ఆరాధనా సాగరంలో తేలియాడాలి. వాకొనరాని దీవెన ఆయన పూజకై తపిస్తున్న మా ఆత్మలను ఆయనవైపు మళ్ళించుగాక ! నిత్యమూ, శాశ్వతమూ అయిన ఆ మహానందాన్ని వర్ణించడానికి మాటలు చాలవు.

ఆరాధన :

ఓం ! సత్యమ్ జ్ఞాన మానందమ్ బ్రహ్మ ఆనందరూప మమృతమ్ యద్విభాతి శాంతమ్ శివమద్వైతమ్ శుద్ధ మపాపవిద్ధమ్ !

నిత్యమూ, శాశ్వతమూ, మహోన్నత శక్తిగల సత్యానికి ప్రతిరూపం నీవే ! కేవలం అసంబద్ధమూ, మాయా, మిథ్యాపూర్వకమూ, అసత్యమూ అయిన దేనినైనా నిరోధించడానికి వీలుగా కాలుష్యాన్ని పారద్రోలి పవిత్రత ఒనర్పబడకుండా నాలుక సత్యాన్ని పలుకదు. ఆలోచన సత్యాన్ని మరుగు పరచదు. ఆత్మ సత్యాన్ని అంగీకరించదు. ఈ విశ్వానికి, ఈ అనంత ప్రపంచంలోని పవిత్రతకు సకల చరాచరాలన్నిటికి మూలం అయినది సత్యమే ! ప్రతిమాటలోనూ పవిత్ర ప్రాముఖ్యాన్ని సూచించే సత్యం యొక్క ప్రతిరూపానివి నీవే ! సత్యమే ప్రతి దానిలో బ్రహ్మాండమైన శక్తిని పెంపొందింప చేస్తుంది. సత్యమే ఈ సకల చరాచర బాహ్య ప్రపంచంలో గల ప్రతిదానికీ ఎప్పుడూ నశించని దివ్యత్వాన్ని, అమరత్వాన్ని చేకూరుస్తుంది. సత్యమే హృదయ స్పందనంలో ప్రేమామృతాన్ని జారవేస్తుంది. ఆ వెలుగులోనే నక్షత్రాల కాంతులు ప్రకాశిస్తాయి. సత్యమే నిరంతరం పరిభ్రమిస్తూంటే ఋతుచక్రం ద్వారా మహాశక్తిని ప్రస్ఫుటం చేస్తూ భగవంతునిచే సృష్టింప బడ్డ ప్రాణికీ ప్రాణికీ మధ్య, మానవునికీ మానవునికీ మధ్య, సాధువుకూ సాధువుకూ మధ్య ఏవిధమైన విభేదాలు వుండకుండా చేస్తుంది. ఇటువంటి సత్యానివి నీవే ! నిత్య జీవితంలో, ఉచ్ఛ్వాస నిశ్వాసలలో, మా చూపులో, మాటలో నీవు ఎక్కువ స్థానాన్ని ఆక్రమించుకున్నావు. ప్రతి చేతను, కదలికను జీవితంలో ప్రతిక్షణం సత్యం గమనిస్తుంటుంది.

మేము నీ ముందు అవనత శిరస్కులమై వున్నాము. జ్ఞానదైవం వలెనే నిన్ను సత్యానికి ప్రతిబింబమైన భగవంతునిగా కీర్తిస్తాము. ప్రతి కాంతికిరణంలోనూ, సత్యపూర్వకమైన చూపులోనూ, నీవే! నీ ప్రభావం లేకుండా అవి నిలబడలేవు. అవన్నీ నీనుంచే జ్ఞానం అనే జలయంత్రంనుండి ప్రవహిస్తున్నాయి. "తెలివి" అనేది చిన్న మాటకాని "విజ్ఞానం" నిన్ను జ్ఞానంగా ప్రతిబింబింప చేస్తూన్నది. ఆ జ్ఞానతృష్ణా కాంక్ష యుగ యుగాలనుంచీ వస్తున్నది. నక్షత్రాల కావల, ప్రపంచం ఏర్పడడానికి ముందు అంతు తెలియని ఆత్మయొక్క అగాధాలలోతులకు వెళ్ళింది నీవేగదా జ్ఞానదైవమా! బయల్పరచబడిన సత్యం, జ్ఞానం మానవుని దరికి చేర్చ బడిన సత్యం జ్ఞానం. జీవనయాత్రలో ఆత్మకు దారి చూపించేది జ్ఞానం. పసిబాలులు ఆశగా నమ్మకంగా ప్రేమాదరాలలో వున్న తల్లి దండ్రులవైపు చూచి నట్లుగా వుండే సత్యమే జ్ఞానం. జ్ఞానం జీవనగతిలో దారిచూపే కాంతివంటిది. అది మహాత్ములలో అంతర్భూతమై, సాధువుల హృదయాలలో చొచ్చుకొని మహర్షులను దీపిస్తుంది. అది నిస్సహాయులను రక్షించడమే గాక మనిషిలో మనిషికి నమ్మకాన్ని కలిగిస్తుంది. జ్ఞానదైవమైన నీకు ఇవే మా నివాళులు! అర్చనలు!

ఈ సత్యం శాశ్వతమైంది. ఈ జ్ఞానం అందరినీ వరించేదే. నీవు మహాత్ముడివి. అనంతుడివి. నీవు ప్రతి మనిషిలో స్థావరం ఏర్పరచుకొని నిన్ను నీవు పెంపొందించు కుంటున్నావు. నీ ఉనికికీ, చర్యలకూ, నీ గొప్పదనం యొక్క ఉచ్చస్థితికి, నీ విశాలత్వానికి కొలబద్ద నీ అనంతత్వమే! నీవు అనుక్షణం ఏదో ఒక అద్భుతాన్ని సృష్టిస్తూ అనశ్వరుడిగా, అనంతుడిగా పెరుగుతున్నావు. అట్టి నీముందు మోకరిల్లి ఇవే మా నీరాజనాలర్పిస్తున్నాము. నీతో సరితూగగలవారు ఎవరూ లేరు. నీవు విశ్వాన్నంతా నిండివున్న అనంత బ్రహ్మవు. అనంత శక్తిమంతుడివి. విశ్వానికి మూలకారకుడివి ఐన నిన్ను కొంచెం కూడా తెలుసుకోవడం చాలాకష్టం. ఇది మా ముక్తికన్నా మాకోరిక. ఇది మాశాశ్వత కాంక్ష. అంతవరకు నీకు మేము సేవచేస్తూనే వుంటాము.

అనంత ప్రపంచాన్నంతా ఆవరించుకువున్న అనంతుడివి. కనుక నీవు అనంతరూప మమృతమ్. ఆ విధంగా నీవు విశ్వాన్నంతటా ఆక్రమించుకుని వున్నావు. శాశ్వతమైన ఆనందామృతంలో నీవు సర్వకాల సర్వావస్థలలోనూ ప్రతిబింబిస్తుంటావు.

కనుక నీవు నీ ఆనందంలో, శాంతంగా నీ అమృతంలో శివంగా పునరుద్భూత మవుతుంటావు.

మరొకసారి అందరినీ ఏకం చేసే అవిభాజ్యమైన మహత్తర శక్తి నీది. నీవు అద్వైతానివి. అంతులేని అనంత ప్రేమకు నిలయానివి నీవు. ఆ విధంగా నీవు అందరినీ ఏకం చేసే, పవిత్రం చేసే మహా భగవంతుడివి.

ప్రాణికోటికి బంధవిముక్తినీ, పరిపూర్ణతను కలిగించేవాడు భగవంతుడు. పరమాత్ముని యొక్క ఈ ప్రకృతి విధానం ద్వారానే మనం నిత్యమూ, శాశ్వతమూ అయిన గమ్యాన్ని చేరుకుంటాం. "శుద్ధ మపాపవిద్ధం" అనే పవిత్ర లక్ష్యం కూడా దీని ద్వారానే సిద్ధిస్తుంది. ఇది పాపరహితమైనది. లోపరహితమైనది. నీ ఆరాధనలో ఆనంద పారవశ్యం చెందడంకన్న వేరే కోరికలేదు. అన్య ఆకర్షణలను విడనాడి, ఆశా మోహాలను పరిత్యజించి నీ పవిత్రతలో మేము జీవిస్తాము. పరమ పవిత్రుడైన పరమాత్ముని పవిత్ర సంతానం యొక్క అమరత్వం ఇది. దైవత్వము సిద్ధించిన మానవులుగా నిరంతర ఆశీర్వచన బలంతో వున్నాము. నీ నామము ఇప్పుడును ఎప్పుడైనను చిరస్థాయిగా వుండుగాక !"

'ధన్యవాద సమర్పణము' కంటె చక్కని ప్రవచనము ఆంగ్ల సాహిత్యంలో నా దృష్టికి రాలేదు.

"ధన్యవాద సమర్పణము" :

ప్రార్థన—అంతయు నీదయ (తెలుగు)

"ఇదంతా నీకరుణ ఫలితమని, అజ్ఞానులం, సంకుచిత దృష్టిగల వారం అయిన మాకు కూడా స్పష్టంగా తెలుస్తున్నది. అడుగ కుండానే మా అవసరాలన్నిటినీ—తలవని తలంపుగా తటస్థించేవి కూడా—నీవు తీరుస్తున్నావు. తల్లికి బిడ్డలపట్ల వుండే శ్రద్ధ, ప్రేమ వాత్సల్యాలతో మమ్ములనందర్నీ పోషించి రక్షించు తున్నావు. జీవన విధానం మానసిక దృష్టిని మరుగుపరిచి, హృదయ భావాలను చలన రహితంచేసి, ఆత్మదృష్టికి అడ్డుపడి, నిన్ను మానుండి చాటుచేస్తున్నది. జీవితంలో మాకు కలుగుతున్న ఈ సౌకర్యాలు నీకు తెలియకుండానే చేకూరు తున్నాయని, వీటిని నీవు స్వయంగా కల్పించలేదని అప్పుడప్పుడూ మా అజ్ఞానంచేత భావిస్తూ వుంటాము. సూర్యుడు వెలుగును ప్రసాదిస్తాడు ; నదులు నీటిని అందిస్తాయి ; మందమారుతాలు మనోల్లాసకరంగా వీస్తాయి ; భూదేవి సృష్టి భారాన్ని వహిస్తుంది. జీవితం ప్రారంభమై, విస్తృతినొంది, పరిసమాప్త మవుతుంది. కుటుంబాలు ఏర్పడతాయి ; తెగలు సమకూడుతాయి ; తల్లిదండ్రులు పోషణ చేస్తారు ; ఉపాధ్యాయులు జ్ఞానభిక్ష పెడతారు ; మిత్రులు సహాయపడతారు ;

పిల్లలు తల్లిదండ్రులను, భార్య భర్తను, భర్త భార్యను ప్రేమిస్తారు. ఈ విధంగా నీ సృష్టిజాలంలో మేము ఇమిడి వున్నాము. అయినా నిన్ను మేము మరిచిపోతాం. మేము మా హృదయ నేత్రాన్ని తెరిచినట్లయితే జీవితపు అనుబంధాలన్నింటిలోనూ నీవు సాక్షాత్కరించడం చూడగలుగుతాం. అందుకు మేము ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని పొందుతాం. పురోభివృద్ధికై అన్ని ప్రయత్నాలూ, పాట్లూ స్వీయాభివృద్ధికీ, సేవకు సమస్త సాకర్యాలు—ఇవన్నీ కూడా నీవు సృష్టించినవే. కేవలం ప్రపంచ భవితవ్యానికి సంబంధించిన విశాలమైన విషయాలలోనే గాకుండా ప్రతి ప్రాణికి సంబంధించిన చిన్నవిషయాలలో కూడా నీవు దృగ్గోచర మవుతావు. పసిపిల్లలకుండే నిర్మల హృదయం మాకున్నట్లయితే భోజన సమయంలో నీవుకూడా మాలో కలిసి ప్రేమతో భోజనం చేస్తున్నట్లు గ్రహించగలిగేవారం. "సేవకుడు కొనితెస్తాడు. వంటవాడు పక్వాలు సిద్ధంచేస్తాడు. నేను భుజిస్తాను" అనుకోవడం వాస్తవికానికి వక్రభాష్యమే అవుతుంది. ప్రతిరోజూ, ప్రతిగంటకూడా శిశువును తల్లి పోషించే విధంగా మమ్ములను సంరక్షిస్తున్నావు. ప్రతి శిశువు జీవితానికి అవసరమైన ఆహారాన్ని ప్రతికబళాన్ని నీవే శిశువు నోటికి అందిస్తున్నావు. శిశువు త్రాగే పానీయం మాతృమూర్తి యొక్క ప్రేమామృతము. సేదదీరి మనోల్లాసం పొందడానికి శిశువు తల్లి వడిలో నిద్రిస్తాడు. రాత్రి అంటే ఏమిటి? శిశువు తల్లి వడిలో ఏకాంతంగా నిద్రించి తెల్లవారిన తరువాత మనోల్లాసం కలిగించే జీవితంలో తిరిగి ప్రవేశించడం కాదా? ఉదయాస్తమయాలు, ఋతువులు, వత్సరాలు ఇవన్నీకూడా నీవు నీ శిశువుల ఆనందం కొరకు, క్షేమం కొరకు ఏర్పరచినవే. నీవు సమకూర్చిన సౌకర్యాలన్నింటినీ లెక్కపెట్టవలెనన్న ఏ జీవితమూ చాలదు. మేము నిద్రమేల్కొని మాలో ప్రతి ఒక్కరి యోగక్షేమానికీ, పరిపోషణకు నీవు అన్ని ఏర్పాట్లు చేశావనే విషయాన్ని స్మరించి ఆనందిస్తాము. తల్లి దండ్రులు, భార్యా బిడ్డలు, సేవకుడు, చెలికాడు, సేవచేసేవారు అందరూ మన శక్తిసామర్థ్యాలను సరైన మార్గంలో అభివృద్ధిపరిచి ప్రకృతి క్రమంలో మనలను లీనం చేస్తున్నారు. ఈ అద్భుతాలన్నీ నీదయవలన కలిగినవే. ఇందుకు మేము మా హృదయపూర్వకమైన వందనాలను నీకు సమర్పిస్తున్నాము. నీ దృష్టిలో విశ్వాన్ని వీక్షించిన యెడల ఒక నిరంతర వ్యోమం సాగుతున్నట్లు గోచర మవుతుంది. సృష్టి అంతా ఒక ఆనందదాయకమైన యాత్రవంటిది. తల్లి తన శిశువును కౌగలించుకొనునట్లు, వైభవోపేతమూ, సౌందర్యవంతమూ అయిన సృష్టి మనలను తనలో ఇముడ్చుకుంటున్నది."

భగవంతుని యందుగల ప్రేమనుంచి ప్రభవిల్లిన ఆనందోత్సాహం చేతనూ, దైవికమైన శక్తిని గుర్తించడం వల్లను ఋషిసత్తములు ఈ సందేశం ఇచ్చివుంటారు. లేని యెడల సామాన్య మానవ రచనలలో అంతటి ఔన్నత్యం వుండదు.

బ్రహ్మర్షి వెంకటరత్నం గారిని దర్శించి వారి ఆశీస్సులు పొందే అదృష్టం నాకు కలిగింది. 1931 వ సంవత్సరంలో ఒక పర్యాయం వారి ఉపన్యాసం వినే భాగ్యం కూడా నాకు కలిగింది. కాని అప్పటికి నేను బాగా చిన్నవాణ్ణి కావడంచేత వారి ప్రసంగాన్ని అర్థంచేసుకోలేక పోయాను. వారి ఉపన్యాసాలను, బోధనలను, ప్రార్థనలను ఇప్పుడు శ్రద్ధతో అధ్యయనం చేయడంవల్ల నేను అపారమైన ప్రయోజనం పొందాను. మీరు నన్నీ మహాసభకు అధ్యక్షత వహించమని కోరని పక్షంలో వారి అమూల్యమైన రచనలను చదివి చూచే సదవకాశం నాకు ఎప్పుడూ కలిగివుండేది కాదు. ఆయన జీవితం పరిశుద్ధమైన కావ్యం వంటిది. ఆయన ప్రవచనాలు కోహినూరువంటి మేటి వజ్రాలు కూడా సాటిరాని అమూల్యరత్నాలు. మిమ్ములను ఉద్దేశించి ప్రసంగించే ఈ అపూర్వమైన అవకాశం నాకు కలిగించినందుకు శతజయంత్యుత్సవ సంఘం వారికి మరొకసారి నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

(బ్రహ్మర్షి వేంకటరత్నంనాయుడుగారి ఉపన్యాసముల సంపుటాల నుంచి, సూర్యనారాయణ రావుగారు రచించిన బ్రహ్మర్షి జీవిత చరిత్ర నుంచి ఈ ఉపన్యాసంలోని విషయాలు తీసుకో బడినవి).

సంస్కృతి

సంస్కృతి

అవతారిక :

ఆధునిక కళలో యువతరంవారి విప్లవాత్మక మనఃస్థితి కొంత గోచరిస్తుంది. నిరాశా నిస్పృహలు, ప్రాచీన కళపై, సంప్రదాయంపై కోపం – వీటివల్ల వికృత కళా రూపాల సృష్టికి దారితీయటం జరుగుతుంది; లేదా, నూత్న దృక్పథంవల్ల తమలో సాగుతున్న అంతర్యుద్ధానికి, ఉద్వేగానికి, అస్థిరతకు ప్రతీకలుగా ఉండే కల్పనలు చేయటం జరుగుతుంది. ఇది కూడా కళే అనిపించుకొంటుంది. ఎందుచేతనంటే, ఇందులో కూడా స్వేచ్ఛ, మానవత, ప్రకృతి విషయాలపై కళా సంబంధమైన ప్రతిక్రియ కనబడతాయి కాబట్టి. జాతీయం, ప్రాదేశికం అయిన పరిమితులను దాటి కళ క్రమంగా విశ్వజనీన మవుతున్నది. వాస్తవానికి ప్రాచ్య పాశ్చాత్యదేశాలు సన్నిహితా లవుతున్నాయి. ఈ దేశాల కళా సంస్కృతి రంగాల సమాగమంవల్ల ఒక నూత్న యుగావిర్భావం జరుగవచ్చు.

మనకు స్వాతంత్ర్య సిద్ధించిన తరువాత అనేక విధాలుగా వెనుకబడిన మన సంఘాన్ని ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా ఉన్నత స్థాయికి తీసికొని పోవాలని ప్రభుత్వమూ, ప్రజలూ శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారు. ఇది అంత సులభసాధ్యమైన విషయం కాదు; చాల శ్రమతో కూడుకొన్న కృషి యిది. ఈ మహా ప్రయత్నంలో మనం సాంస్కృతిక విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి. ఏమంటే, సాంఘిక మహా సౌధం నిర్మించాలంటే సంస్కృతియే దానికి గట్టి పునాది కావాలి. బలమైన నైతిక కళాదృష్టి లేకపోతే, ప్రజాస్వామ్య సిద్ధాంతంపై మనం నిర్మించబోయే నవ సమాజంలో ఉత్తమ పౌరులను తయారు చెయ్యలేము.

ఆంధ్రప్రదేశ్‌లో సాహిత్య, సంగీత, నాటక, లలితకళా అకాడమీలు మూడు ఏర్పడినాయి. సాంస్కృతిక వ్యవహారాలకు కూడా తగినంత ప్రోత్సాహ ప్రోద్బలాలు ఇవ్వాలనే సంకల్పంతో మన ప్రభుత్వం మన రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖను క్రొత్తగా ఏర్పాటు చేశారు.

అయితే మన ఆదర్శాలకు అనుగుణంగా మన విద్యాలయాలలో చదువుతున్న యువతీ యువకులకు తర్ఫీదు ఇస్తున్నామా? సౌందర్యానుభూతి, సత్యానుభూతి— వారు పొందటానికి అనువైన క్రమశిక్షణ ఇస్తున్నామా? అని ప్రశ్నించుకొంటే, 'ఇవ్వటం లేదు' అని నిజం చెప్పవలసి వస్తుంది. అన్ని పాఠశాలల్లోను, కళాశాల

ల్లోను, విశ్వవిద్యాలయాల్లోను కూడా నైతిక విద్య, కళాత్మక విద్య ఉపేక్షింప బడుతున్నాయి.

ఈ సమస్యపై ప్రధానంగా మన దృష్టి ఇప్పుడు కేంద్రీకరింప బడాలనీ, మన సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణమైన నవ విద్యావిధానం వెంటనే రూపొందింప బడాలనీ నేను చేసే ప్రతిపాదనతో సహృదయులందరూ ఏకీభవిస్తారని విశ్వసిస్తున్నాను.

సంస్కృతి అంటే ఏమిటి ?

మానవజాతికి "సంస్కృతి" అనేది ఒక ఉన్నత లక్ష్యస్థానం. మానవ వ్యక్తిని జంతుకోటిలో ఒకటిగా నిర్వచించే పక్షంలో అతణ్ణి "సంస్కృతియోగ్యమైన జంతువు" అని పేర్కొనవలసి ఉంటుంది. కాని, సంస్కృతి యోగ్యమైన జంతువుగా నైనాసరే, జంతుకోటిలో ఒకడుగా పరిగణింప బడటం గౌరవహీనంగా భావిస్తాడు మానవుడు. దీనికి కారణం ఏ జంతువైనా సంస్కృతీమంతం కావటానికి జన్మతః అసమర్థమై ఉండటమే. జంతువుల బుద్ధి ప్రాకృతికమైనది ; కాని మానవుని బుద్ధి విచక్షణా సహితంగా ఉంటుంది. బాధ్యత-బాధ్యతారాహిత్యం, స్వాతంత్ర్యం-దాస్యం, స్వార్థం-స్వార్థరాహిత్యం, మంచి-చెడు—వీటిమధ్య అవకాశం కల్పిస్తుంది విచక్షణాజ్ఞానం. జంతువులకు ఈ మంచి చెడ్డల భేదంతో ప్రసక్తే ఉండదు ; కారణం : వాటి బుద్ధి ఆలోచనా శీలంగా ఉండదు కాబట్టి. మానవుని చేష్టలలో వలె జంతువుల ప్రవర్తనలో పాప పుణ్యాల భేదమే ఉండదు. మానవులుతమ ప్రవర్తనకు తాము బాధ్యత వహించినట్లు జంతువులు వాటి ప్రవర్తనకు అవి బాధ్యత వహించవు. మానవుని నరకం ఎంత అగాధాలలో ఉంటుందో, అతని స్వర్గం అంత మహోన్నత సీమలలో ఉంటుంది. మానవుడు నైతికంగా జంతువు కంటె పరమ అధోగతికి క్రుంగిపోనూ గలడు ; దేవతల కంటె అత్యున్నత స్థితిని అందుకోనూగలడు. మానవజాతి పురోగమించాలంటే భౌతిక శాస్త్రాలూ, నీతి శాస్త్రము కూడా మానవునిలోని భౌతిక లక్షణాలకు మానవతా లక్షణాలకు దోహదంచేయగలగాలి. ఇది జరగని పక్షంలో ప్రాణధారణదృష్ట్యా తానే జంతుప్రపంచానికి చెందినవాడే ఆ జంతుప్రపంచంనుండి తన ప్రత్యేకతను నిరూపించుకొనే హక్కును మానవుడు కోల్పోతాడు.

ఇంతకూ ముఖ్యమైన ప్రశ్న "సంస్కృతి" అంటే ఏమిటి ? అన్నది. సంస్కృతి ఉభయాత్మకంగా ఉంటుంది. సౌజన్యం, దాక్షిణ్యం, నిస్స్వార్థం మొదలైనవి "సంస్కృతి" అనిపించుకొంటే, దౌర్జన్యం, నిర్దాక్షిణ్యం, స్వార్థం అనేవి "సంస్కృతి"

అనిపించుకొంటాయి అయితే ప్రతి పనిని ఆయా పరిస్థితులనుబట్టి విచారణ చెయ్యాలి. సంస్కృతీమంతుడైన వ్యక్తి తప్పక అట్లే చేస్తాడు. ఉదాహరణకు, దుష్టుడైన వ్యక్తి విషయంలో మనం సౌజన్యం చూపలేముగదా! అయితే ఒక్కొక్కప్పుడు శిక్షించి సాధించలేని ఫలితాలను దయాదాక్షిణ్యాలను చూపి సాధించడం జరుగవచ్చు. ఉన్న పరిస్థితులను ఆధారం చేసికొని, అహింసా సిద్ధాంతాన్ని జీవితానికి అన్వయించుకోవాలి. సంస్కృతీ రహితమై, దోపిడీ తత్త్వాన్ని ఆధారం చేసుకున్న సామ్రాజ్య వాదపు బంధనాలలోంచి తప్పుకొని బయట పడటానికి గాంధీజీ మానవతాయుతమైన రాజకీయాలతో సంస్కృతి సాధనాలైన సత్యాహింసలను సమన్వయించారు. ఇట్లు ఆ ఫలితాన్ని సాధించడం ఒక్క గాంధీజీకే చెల్లింది. రాజకీయాలను మానవతా పూర్ణంగా చేయడం ఇంతకుముందు రాజనీతికి విరుద్ధంగా భావించబడింది. కాని గాంధీజీ ఈ భావాన్ని రూపుమాపడంవల్ల మానవజాతి అభ్యుదయ రూపమే మారిపోయింది.

ప్రాక్తనదశనుండి ఆధునిక దశ వరకు మానవుని అభివృద్ధి మానవునిలోని ఉదారత, కరుణ, దయ, స్వార్థత్యాగం అనే గుణాలు క్రమంగా పరిణామం చెందిన విషయాన్ని సూచిస్తోంది. ఈ అభివృద్ధి జరగడానికి మానవునిపై మతానికి, తత్త్వశాస్త్రానికి గల ప్రభావమే కారణం. అయితే, మతమూ, తత్త్వ శాస్త్రమూ తరచు దుర్వినియోగానికి గురికావడం అప్పుడూ, ఎప్పుడూ కూడా ఉంటూనే ఉంది. అందువల్ల మానవుడు నైతికంగా పతనంకావడం జరుగుతూనే ఉంది. అయినప్పటికీ సర్వాంగీకృతమైన నైతిక దృష్టికే ఎప్పుడూ అంతిమ విజయం లభ్యమవుతుంది. మానవుణ్ణి వెనక్కి వెనక్కి అంధయుగాలలోకి తీసికొనిపోయే వేదాంతులు ఎల్లప్పుడూ ఉన్నారు; ఇకముందు కూడా ఉంటారు. నిన్న మొన్నటి ఉదాహరణలు ఫాసిజం, నాజిజం అనే వాటి విజృంభణ. ఇవి జాతి ఆధిక్యం, అసహిష్ణుత క్రూరత్వం, స్వార్థం అనే వాటిపై ఆధారపడ్డాయి. కాని ఇవి మానవజాతిని ఉద్ధరించే నవనైతిక తత్త్వాలుగా రూపొందింపబడ్డాయి. అదృష్టవశాత్తు, ఈ జీవన్మరణ సమస్యలో చివరకు మానవతయే పశుత్వం మీద విజయాన్ని సాధించింది. ఈ ఫలితం ఇటునుంచి, అటుతిరిగి ఉంటే మానవజాతి మనుగడ ఏమైపోయి ఉండేదో మనం ఊహించలేం.

ఆదర్శవాదులు :

ఆదర్శవాదులు ప్రపంచంలో ఏయే మూలలలో ఉన్నా, వారిలో ఆశ్చర్యకరమైన విధంగా పోలికలు కనిపిస్తాయి. మతప్రవక్తలు, ఆదర్శవాదులు, తత్త్వ

వేత్తలు, రహస్యతావాదులు—వీరందరు అంతర దృష్టితో సత్యసాధన చేసి, దురభిమానాదుల నుండి బయటపడి, నిర్మమతాయుతమైన గుణసంపత్తిని అలవర్చుకొన్నారు. విమర్శనాత్మక దృష్టిగల బుద్ధిమంతులు సైతం స్వార్థరహితమూ, స్వేచ్ఛాయుతమూ అయిన తమ ఆత్మశక్తిని వినియోగించి, దేశకాలానుగుణమైన సంకుచిత దృక్పథం నుండి విముక్తి పొందారు. తమకోసం, తమ లాభాలకోసం, తాపత్రయపడకుండా పరమార్థంకోసమో, ప్రజాసమూహంకోసమో – అది భగవంతుడైనా, ప్రజా శ్రేయస్సు అయినా - తాపత్రయపడి, మమకారం చూపేవారినే మానవజాతి ఆదర్శపురుషులుగా మన్నించింది.

నిర్మమత్వం :

నిర్మమత్వంలో దాతృత, ధైర్యం, ఔదార్యం, వివేకం, నిర్లిప్తత మొదలైన సుగుణాలు ఇమిడి ఉన్నాయి. ఈ నిర్మమత్వాన్ని అన్ని మతాలవారు, పలువురు తత్త్వవేత్తలు బలపర్చడం జరిగింది. కొందరు తత్త్వవేత్తలు మాత్రం ఈ సుగుణాల్ని త్రోసిపుచ్చి క్రూరత్వం, హింస, భయం, అత్యాచారం మొదలైన వాటిని ఆధారం చేసుకొన్న ఒక తాత్త్విక దృక్పథాన్ని ప్రచారం చేశారు. వారు సత్యాన్ని కూడా సాపేక్షంగానే పరిగణించి, ఏదో ప్రయోజనం దృష్టిలో పెట్టుకొని, అసత్యాన్ని, అంటే, క్రమయుతమైన మిథ్యా ప్రచారాన్ని కూడా ఆకాశాని కెత్తి గౌరవిస్తారు. వీరు దేవుని స్థానంలో ఒక జాతినో, ఒక వర్గాన్నో, చివరకు ఒక నియంతనో నెలకొల్పి, ఇతర జాతుల శ్రేయస్సుకు భంగం కలిగిస్తారు. అయితే ఇప్పుడు, సత్ప్రయోజనాల్ని అసత్య మార్గాల ద్వారా సాధించగలమా అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. కాని, సత్ప్రయోజనాలను సత్య మార్గాల ద్వారానే సాధించగలమని మనం విశ్వసిస్తామనడం లో నాకెలాంటి సందేహమూ లేదు. "సాధనాలు ఏవైనా ఫలితాలే ముఖ్యం" అనే నినాదం చాలా ప్రమాదకరమైంది. ఇది ఔద్ధత్యం, హింస, అసత్యం మొదలైన చెడుగుణాలకు దారితీస్తుంది.

సౌందర్యం :

మానవతతోపాటు సంస్కృతిలో ఇంకో ముఖ్యమైన అంశం ఉంది. అది ప్రకృతిలోను, భావనలోను, భావవ్యక్తీకరణలోను ఉన్న సౌందర్యాన్ని ఆస్వాదించగలగడం, మెచ్చుకోగలగడం. ధ్వని, ఆకృతి, వర్ణం, చలనం మొదలైనవి ప్రకృతి ప్రాథమిక ధర్మాలు—ఇవి ఆలోచనా శీలమూ సహజస్ఫురణాత్మకమూ అయిన మానవబుద్ధిచే అనుసంధానింపబడినప్పుడు బహుముఖ కళాద్వారములలో

వ్యక్తములై, పరమ సుందరములైన కళారూపములను స్వీకరిస్తాయి. ఇవి సంస్కృతీమంతమైన మానవబుద్ధికి శాశ్వత వికాసాన్ని, అనుసంధాన నిమగ్నతను కల్పించుటకు దోహదం చేస్తాయి. ఈ విధంగా మానవతపైగాని, మతముపైగాని ఆధారపడిన నీతిశాస్త్ర, సౌందర్యతత్త్వాలు మానవ జాతి యొక్క వెలలేని భాగధేయాలు. తరచు అజ్ఞాన ప్రమాదానికి లోనుకాగల ఆలోచనాశీలమైన బుద్ధిని మించి మానవబుద్ధి వికసించపలెనంటే మతాన్నిగాని, మానవతనుగాని అవలంబించి యున్న స్వార్థత్యాగం, సౌందర్యమగ్నత అనే వాటిని గాఢంగాను, విస్తారంగాను మానవ జాతి అలవర్చుకొనవలసి ఉంటుంది.

సౌందర్యతత్త్వశాస్త్రం :

ముఖ్యంగా లలిత కళల విషయమై అంటే సౌందర్యతత్త్వాన్ని గూర్చి మన మిప్పుడు ముచ్చటించుకొందాము. ఈ సౌందర్యతత్త్వాన్ని గూర్చి అనేక సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. ఆధునిక సౌందర్యతత్త్వ సిద్ధాంతంపై ప్రముఖ పాశ్చాత్య రచయిత బెనిడెట్టో క్రోస్చే "కళా, దాని వివిధ రూపాలు సహజ స్ఫురణ శక్తికి పర్యాయరూపమైన వ్యక్తీకరణము యొక్క అంశములే" అని ఆయన పేర్కొన్నాడు. సహజ స్ఫురణశక్తి బుద్ధిమత్తకు, నైతిక భావనకు భిన్నమైనప్పటికీ అది వీటిపై అనుభవం కోసం, కళారూపమైన వ్యక్తీకరణ కోసం ఆధారపడి ఉంటుంది. దీనికి ఉదాహరణంగా కృష్ణ కర్ణామృతములోని క్రింది శ్లోకాన్ని గ్రహింప వచ్చు :

సాయంకాలే వనాన్తే కుసుమితసమయే సైకతే చంద్రికాయాం
త్రైలోక్యాకర్షణాంగం సురనరగణికా మోహనాపాంగమూర్తిం ।
సేవ్యం శృంగారభావై ర్నవరసభరితై ర్గోపకన్యాసహస్రై
ర్వన్దేఽహం రాసకేళీరత మతిసుభగం వశ్య గోపాలకృష్ణమ్ ॥

(తృతీయాశ్వాసం, 104 శ్లో.)

ఈ శ్లోకాన్ని, అందలి నైతిక విషయం వల్ల కాక భావనలోని, లేదా, సహజ స్ఫురణశక్తిలోని గొప్పదనం వల్లనే మనం మెచ్చుకొంటాము.

"కళ కళకోసమే" అన్న వాదాన్ని కొందరు అంగీకరించరు. జాన్ డ్యూయీ జీవితంలోని అంశాల కంటె కళ భిన్నమైనది అనే వాదాన్ని అంగీకరించడు. ఒక గీతంలోని భావం యొక్క సంపూర్ణత్వానికి గీతంలోవున్న పదాలు ముఖ్యం. కేవల నాదం సంగీతాన్ని అనుభవించడానికి, తద్వారా కలిగే అనుభూతిని పొందటానికి చాలదు. గానం జీవితంలోని సుఖాన్ని, లేదా, దుఃఖాన్నిగూర్చి ఏదో ఒక భావాన్ని

మనలో మేల్కొల్పుతుంది. అయితే ఇది ఎంతవరకు జరుగుతుంది? అన్నది మళ్ళీ బిన్నాభిప్రాయాలకు తావు ఇచ్చే సమస్య. నిత్యజీవిత సంఘటనలకే కళా రూపం ఇచ్చినప్పుడు అవి సౌందర్యమయాలుగా పరిణమిస్తాయనీ, వాస్తవికాంశాలను బట్టి శాస్త్ర ప్రవచనాలు ధ్రువపడటమో పడకపోవటమో జరుగుతుందనీ, కళాసృష్టి వాస్తవికాంశాలనూ కళాత్మకమైన అమూల్యా వస్తు జాలముగా మారుస్తుందనీ మరికొంద రంటారు. మాక్స్‌డెసాయిర్ అనే విమర్శకుడు సంప్రదాయంగా వస్తున్న "సౌందర్యతత్త్వ శాస్త్రం" (Aesthetics) అనే మాటకు బదులు "వైజ్ఞానిక కళా శాస్త్రం" (The General Science of Art) అని క్రొత్త పేరు పెట్టాడు. నైతిక సమస్యలను అనుసంధించే భాషాత్మక విభజన సిద్ధాంత ప్రాబల్యం వల్ల కళకు సంబంధించిన అర్థాన్నీ, సత్యాన్నీ ఒక కొత్త దృక్పథంతో చూడటం ఫలితంగా ఈ మార్పు వచ్చింది. తత్త్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, మనస్తత్త్వశాస్త్రం, సాంఘికశాస్త్రం, మానవశాస్త్రం, సంస్కృతి, చరిత్ర, విమర్శ, విద్యాపద్ధతి—వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని కళలను, వాటికి సంబంధించిన ఇతర అంగాలను గూర్చి చేసే అధ్యయన మంతా సౌందర్య తత్త్వశాస్త్రానికి సంబంధించిందే అని "అమెరికన్ సొసైటీ అఫ్ ఈస్థటిక్స్" వారు పేర్కొన్నారు. ప్రాచీన సంప్రదాయానికి విరుద్ధమైన "వైజ్ఞానిక సౌందర్యతత్త్వశాస్త్రం" అన్న మాటకు ఈ నిర్వచనం సన్నిహితమైంది. ఈ నిర్వచనాన్ని పరిశీలించి చూస్తే, ఇందులో కాదన వలసింది ఏమీ లేదనిపిస్తుంది.

థామస్ మన్రో శాస్త్రీయదృక్పథంతో కళలను పరిశీలన చేసిన పండితుడు. ఆయన "శాస్త్రీయపంథాలో భావనకు, ప్రత్యుత్పన్న మతిత్వానికి ఎంతవరకు తావు ఉంటుందో చూపినాడు. ఈ పంథాలో—కళానిర్మాణంలో, కళాస్వాదనలో, కళా విమర్శలో — ఏమి ఇమిడి ఉన్నదన్న విషయాన్ని అధికంగా చర్చించటం కంటె తాను అవగాహన చేసుకొన్నదానిని అర్థవంతమైన కళాత్మక వస్తువుగా కల్పించడంలో నేర్పు సంపాదించటం ముఖ్యం. ఇతర సాధనలకు, కళలకు ఉన్న సంబంధం చక్కగా అవగాహన చేసి కొనడంవల్ల విశ్వవిద్యాలయాల్లోను, కళాశాలల్లోను భిన్న భిన్న కళాత్మక రచనలు ఇతోధికంగా వెలువడటానికి అవకాశం కల్పించబడింది. ఉన్నత పాఠశాలల్లోను, ప్రాథమిక పాఠశాలల్లోను కూడా కళాభివృద్ధికి ఎంతో దోహదం చెయ్యవలసిన అవసరం ఉంది."—(Colliers Encyclopaedia.)

అలంకార శాస్త్రం :

భారతీయ సౌందర్య తత్త్వ శాస్త్రమునకు 'అలంకారశాస్త్రము' అని పేరు- భామహుడు, ఉద్భటుడు, రుద్రటుడు, దండి, వామనుడు అను కొందరు ప్రసిద్ధి

కెక్కిన అలంకారికులు — వీరందరూ ఆ శాస్త్రంలో ప్రాచీన సంప్రదాయమునకు చెందిన వారు. వీరి మతంలో కావ్యగౌరవం దోషము, గుణము, అలంకారము అనువాటినిబట్టి నిర్ణయింపబడుతుంది. వీటిలో అలంకారము సాహిత్యమునకు మాత్రము పరిమితం చెయ్యబడింది; పైగా అదే ముఖ్యంగా చెప్పబడింది. మిగిలిన గుణదోషము లన్నవి తర్క వ్యాకరణాలకు సంబంధించి భావసౌష్ఠవమును, శబ్ద సాధుత్వమును చెప్పేవి. ఇక్కడ కవితావస్తువుకంటే శబ్దార్థములకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. గుణములన్నవి కవిత్వానికి ఉత్కర్ష కలిగించేవి; ఇంక దోషములన్నవి కవిత్వానికి అపకర్ష కలిగించేవి.

ACC NO. 14827

ప్రాచీన సంప్రదాయమునకు భిన్నమైనది 'నవీన సంప్రదాయం.' దీనికి ప్రవర్తకుడు ధ్వన్యాలోక రచయిత అయిన ఆనందవర్ధనుడు. ధ్వన్యాలోకాన్ని వ్యాఖ్యానించినవాడు అభినవ గుప్తుడు. ఈ సంప్రదాయంలో వాచ్య వ్యంగ్యాలనుబట్టి కావ్యం విలువ నిర్ణయింపబడుతుంది. ఇందులో వ్యంగ్య వైభవం గల కావ్యానికే ఎక్కువ పరిగణన, ప్రాశస్త్యం వస్తాయి. గుణదోష వివేకం త్రోసిపుచ్చరానిదే; కాని వ్యంగ్య స్ఫురణ ఉన్నదా లేదా అన్నదే ప్రధానంగా పరిశీలింపతగ్గ విషయం అని వీ రంటారు. ఈ వ్యంగ్యం—వస్తుధ్వని, అలంకార ధ్వని, రసధ్వని—అని మూడు విధాలుగా ఉంటుంది. "భావనామయమైన, భవ్యావేశపరవశమైన హృదయం యొక్క ఆవిష్కారమే కవిత అన్నది వీరి దృక్పథం"—(Hiriyanna). శబ్దము వ్యంగ్యార్థమును సూచించువరకే ఆవశ్యకం. నిత్య వ్యవహార భాషవలె కాక, కవిత చెప్పదలచుకొన్న అర్థాన్ని ఆనంద సమ్మిళితం చేసి చెబుతుంది. ఇది శీలానికి కూడా మెరుగుపెడుతుంది. ఈ విధంగా కావ్యంలో 'రసం' ప్రధానం; అంతే కాదు, కావ్యానికి రసమే ఆత్మ. అందుచేతనే "వాక్యం రసాత్మకం కావ్యం" అన్నారు.

894.81309
APP
14-200

వేదాంతం-సాంఖ్యం:

రస సిద్ధాంతాన్ని గూర్చి వేదాంతం, సాంఖ్యం—ఈ రెండూ రెండువిధాలుగా చెప్పాయి. విచార దృక్పథం కల సాంఖ్యాన్నిబట్టి ప్రకృతి సర్వాత్మనా సుందరమైనది కాదు. అందులో కొంత వికృతి కూడా ఉంది. ప్రకృతిగతములైన వస్తువులేవీ ఆనందప్రదాలు కావని కాదు. కాని ఆ శాస్త్రం చెప్పేదేమంటే—ప్రకృతిలో సర్వులకు సార్వకాలికమైన ఆనందాన్ని ఇచ్చేది ఏదీ లేదు. కాబట్టి శుద్ధమైన ఆనందం కావాలంటే ఈ వాస్తవిక జగత్తును వదలి వేరొకచోట వెదకాలి. ఇంక ఆనంద దృక్పథం కల వేదాంతం ఇల్లా చెబుతుంది: "ప్రపంచంలో ఉన్నదంతా

సౌందర్యమే. దాని అంతర్యా సామరస్యాన్ని భంగంచేసే దేమీ లేదు. ఆత్మవాదానికి ఇది మొదటిసూత్రం. ప్రకృతిసౌందర్యానికి తన్మయుడైపోయే యోగిని మించిన కళాహృదయుడే లేడు. అయితే మనం యోగివలె ప్రతి వస్తువులోను ఆత్మ పదార్థాన్ని చూడలేము; కాని ప్రకృతిలో ఉన్న కళాసౌందర్యాన్ని అప్పుడప్పుడు అనుభవిస్తుంటాము. అయినప్పటికి సాధారణంగా మన బుద్ధులు ఈ విశ్వసౌందర్యం పట్ల నిద్రాణంగానే ఉంటాయి అని చెప్పాలి. కళాహృదయుడెప్పుడూ ఆ విశ్వ సౌందర్యం వైపు చూడగల విశిష్ట దృష్టి కలవాడు కావటంచేత అతడు ఆ ఆనందాన్ని పొందుతూ, దాన్ని తాను చేపట్టిన కళారూపంలో వ్యక్తంచేస్తూ, మన కనుల్ని తెరిపిస్తుంటాడు. నిజానికి మనల్ని సర్వాత్మనా ఆకర్షించగల రూపం ధరించి వచ్చిన ప్రకృతియే కళ అని చెప్పాలి. ఈ పరిశీలనవల్ల తేలిందేమంటే పై రెండు దర్శనాల లక్ష్యమూ ఒక విధమైన నిర్లిప్తతను కలిగించడమే. వేదాంతాన్ని బట్టి చూస్తే కళా దృష్టి అన్నది తాత్కాలికంగానైనా వ్యక్తిత్వాన్ని మరచి పోయేటట్లు చేయడమే. సాంఖ్యం దీనినే వాస్తవిక జగత్తునుండి తప్పించుకొనడం అంటుంది. వేదాంతం దృష్ట్యా పరమార్థ లక్ష్యానికి కళ ఒక మార్గం. కాని, సాంఖ్యాన్ని బట్టి, వాస్తవికతనుండి తప్పించుకొనటానికి కళ ఒక మార్గం. నిజానికి కళాప్రయోజనం ప్రకృతిలో పరమోత్కృష్టమైనదాన్ని అవిష్కరించడం, ప్రకృతికంటె ఉత్తమమైన దాన్ని సృష్టించడం" — (Hiriyanna).

నవరసాలు :

అలంకారశాస్త్రంలో మరొక మహాగ్రంథం జగన్నాథ పండితరాయలు రచించిన రసగంగాధరం. ఇది రససిద్ధాంతాన్ని సాకల్యంగా చర్చిస్తుంది. ఇందులో తొమ్మిది రసాలు క్రిందివిధంగా పేర్కొనబడ్డాయి :

"శృంగారః కరుణః శాన్తే రౌద్రో వీరోఽద్భుత స్తథా ।
హాస్యో భయానకశ్చైవ బీభత్స శ్చేతి తే నవ."

కళాసృష్టి :

భారతీయ సిద్ధాంతాన్ని అనుసరించి, శ్రీ ఎస్. ఎన్. దాస్ గుప్త వివరించిన విధంగా, కళాఖండం అవిర్భవించడానికి కళాకారునిలో ఏడువిధములైన దశలు ఉంటాయి :

1. కళాకారుడు ప్రకృతిస్వరూపములను చక్కగా పరిశీలన చేయాలి.

2. ఆయా రూపాలలోని అంగాంగిభావ సామరస్యాన్ని జాగ్రత్తగా గమనించాలి.

3. వస్తువుకంటె భిన్నంగా, దాని పరిసర స్థితిగతులను గూర్చి విడిగా వివేచన చెయ్యాలి.

4. ఇంతకుముందు చేసిన కళాపరిశీలనవల్ల వాని జ్ఞాపకశక్తి సుశిక్షితం కావాలి.

5. మనఃఫలకమందు రూఢమైన రూపాన్ని కళాసముచితాలైన మాటలలో, రేఖలలో, రంగులలో, ఆకృతులలో, లేదా, ఇతర విధాలలో వ్యక్తం చేయగల కనులు, వ్రేళ్ళు కలిగి ఉండాలి.

6. అది తన సృష్టి అనిపించుకోగల ఆత్మీయతాముద్ర విస్పష్టంగా నిరూపించుకొనేటట్లు మననం చెయ్యాలి.

7. తన కళాతత్వార్థ మేమిటో సంపూర్ణంగా అవగాహన చేసికోవాలి.

భారతీయ కళాదృష్టిలో మరొక ప్రధానమైన అంశం కళాకారుడు నైతికదృష్టి కలవాడుగా ఉండాలి. నేను వెనుక చెప్పినట్లు ఈ లక్షణాలు ప్రతి కళానృష్టికి—ప్రాచ్యమైనా, పాశ్చాత్యమైనా—తప్పక ఉండితీరవలసినవే. సంస్కృతీ సంప్ర దాయాలు కొన్ని కొన్ని విషయాలలో భిన్నంగా ఉన్నా సర్వ సంస్కృతులు ప్రధాన విషయాలలో ఏకీభావం కలవిగానే ఉంటాయి.

విశ్వజనీనత :

ఆధునిక కళలో యువతరం వారి విప్లవాత్మక మనఃస్థితి కొంత గోచరిస్తుంది. నిరాశా నిస్పృహలు, ప్రాచీన కళపై సంప్రదాయంపై కోపం—వీటివల్ల వికృత కళారూపాల సృష్టికి దారితీయటం జరుగుతుంది; లేదా, నూత్న దృక్పథంవల్ల తమలో సాగుతున్న అంతర్యుద్ధానికి, ఉద్వేగానికి, అస్థిరతకు ప్రతీకలుగా ఉండే కల్పనలు చేయటం జరుగుతుంది. ఇది కూడా కళే అనిపించు కొంటుంది; ఎందు చేతనంటే ఇందులో కూడా స్వేచ్ఛ, మానవత, ప్రకృతి విషయాలపై కళా సంబంధ మైన ప్రతిక్రియ కనబడతాయి కాబట్టి. ప్రాదేశికం, జాతీయం అయిన పరిమితులను దాటి కళ క్రమంగా విశ్వజనీన మవుతున్నది. వాస్తవానికి ప్రాచ్య పాశ్చాత్య దేశాలు సన్నిహితా లవుతున్నాయి. ఈ దేశాల కళా సంస్కృతి రంగాల సమాగమంవల్ల ఒక నూత్న యుగావిర్భావం జరుగవచ్చు.

కర్తవ్యం :

మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత అనేక విధాలుగా వెనుకబడిన మన సంఘాన్ని ఆర్థికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా ఉన్నత స్థాయికి తీసికొనిపోవాలని ప్రభుత్వమూ, ప్రజలూ శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నారు. ఇది అంత సులభసాధ్యమైన విషయం కాదు; చాలా శ్రమతో కూడుకొన్న కృషియిది. ఈ మహా ప్రయత్నంలో మనం సాంస్కృతిక విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి. ఏమంటే, సాంఘిక మహాసౌధం నిర్మించాలంటే సంస్కృతియే దానికి గట్టి పునాది కావాలి. బలమైన నైతిక కళాదృష్టి లేకపోతే, ప్రజాస్వామ్య సిద్ధాంతంపై మనం నిర్మించబోయే నవసమాజంలో ఉత్తమ పౌరులను తయారు చెయ్యలేము.

ఆంధ్రప్రదేశ్‌లో సాహిత్య, సంగీత, నాటక, లలితకళా అకాడెమీలు మూడూ ఏర్పడినాక, వీటికి తోడు సైన్సు అకాడెమీ, రవీంద్రభారతి కూడా ఉన్నాయి. బహుశః సైన్సు అకాడెమీ నెలకొన్నది ఒక్క మన ఆంధ్రప్రదేశ్‌లోనే అనుకొంటాను. శాస్త్రవిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తేవడానికీ, ప్రజల్లో విజ్ఞానాత్మక శాస్త్ర దృష్టిని కలిగించడానికీ ఈ సైన్సు అకాడెమీ కృషి చేస్తుంది. దీని స్థాపనకు విద్యామంత్రి శ్రీ పి.వి.జి. రాజుగారు చేసిన కృషి గణనీయం. సాంస్కృతిక వ్యవహారాలకుకూడా తగినంత ప్రోత్సాహ ప్రోద్బలాలు ఇవ్వాలనే సంకల్పంతో మన ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వ శాఖను క్రొత్తగా ఏర్పాటు చేశారు.

అయితే మన ఆదర్శాలకు అనుగుణంగా మన విద్యాలయాలలో చదువుతున్న యువతీ యువకులకు తర్ఫీదు ఇస్తున్నామా? సౌందర్యానుభూతి, సత్యానుభూతి వారు పొందటానికి అనువైన క్రమశిక్షణ ఇస్తున్నామా? అని ప్రశ్నించుకొంటే 'ఇవ్వటంలేదు' అని నిజం చెప్పవలసి వస్తుంది. అన్ని పాఠశాలల్లోను, కళాశాలల్లోను, విశ్వ విద్యాలయాల్లోను కూడా నైతికవిద్య, కళాత్మకవిద్య ఉపేక్షింపబడుతున్నాయి.

ఈ సమస్యపై ప్రధానంగా మనదృష్టి ఇప్పుడు కేంద్రీకరింపబడాలనీ, మన సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణమైన నవ విద్యా విధానం వెంటనే రూపొందింపబడాలనీ నేను చేసే ప్రతిపాదనతో సహృదయులందరూ ఏకీభవిస్తారనీ విశ్వసిస్తున్నాను.

ఆంధ్రజాతి సంస్కృతి చరిత్ర

ఆంధ్రజాతి సంస్కృతీ చరిత్ర

భాష :

భాషను గూర్చి వివరించటంతో ఆరంభంచేస్తాను. తెలుగులో ఆర్య-ద్రావిడ భాషా-సారస్వతాల అంశాలు రెండూ ఉన్నాయి. వీటినే మార్గ-దేశీభేదాలంటారు. 'మార్గ' అనేవి సంస్కృత జన్యం ; కాగా ఆర్యసంబంధి. 'దేశి' అనేది దేశీయమైనది ; కాగా ద్రావిడ సంబంధి. ఈ భాషాభివృద్ధిలో పై రెండు అంశాలు పెనవేసికొని ఉన్నాయనటానికి నిదర్శనం ఈ భాషకు రెండు పేర్లు ఉండటమే—ఒకటి ఆర్య సంబంధి పదమైన 'ఆంధ్రము ;' ఇంకొకటి ద్రావిడ సంబంధి పదమైన 'తెలుగు.' తెలుగు "సంశ్లిష్ట" భాష. ఇందులో ప్రాతిపదికకు విభక్తి చేరిస్తే చాలు, అసలు ప్రాతిపదికలో ఎట్టి మార్పు ఉండదు. సంస్కృత ప్రాతిపదికలకు డు, ము, వు, లు అనే తెలుగు విభక్తులు చేరిస్తేచాలు, అవి తెలుగు పదాలైపోతాయి.

ఆంధ్రము లేదా తెలుగు అజంతభాష కావటంచేతా, శబ్దాలలోని మాధుర్యం వల్లా దీన్ని 'ప్రాగ్దేశపు ఇటలీ భాష' (Italian of the East) అంటారు. అంతే కాదు, గాత్ర సంగీతానికి ఈ భాష ఎంతో అనుకూలం. తమిళ దేశంలో, కన్నడ దేశంలో వ్యవహారంలో ఉన్న శాస్త్రీయ కర్ణాటక సంగీత కృతులలో అధికభాగం తెలుగుభాష లోనే ఉండటం గమనార్హం. సంగీతధర్మమైన మాధుర్యగుణం కలిగిన దవటం చేతా, సంస్కృత పదాలను సులువుగా తనవిగా చేసికోగల శక్తి కలిగినదవటంచేతా ఆధునిక వైజ్ఞానిక భావాలను వ్యక్తం చేయటానికి భారతీయభాష లన్నింటిలోను తెలుగు భాషయే ఎక్కువ అనుకూలమైనదని పాశ్చాత్య విద్వాంసుడు ఆచార్య జె. బి. ఎస్. హాల్డేన్ పేర్కొన్న విషయం విజ్ఞులందరకూ తెలిసిందే.

చరిత్ర :

'ఆంధ్ర' అనే పదం ప్రప్రథమంగా ఐతరేయ బ్రాహ్మణంలో కనిపిస్తోంది. అశోకుని తరువాత ప్రసిద్ధికి వచ్చిన సాతవాహనుల (లేదా, శాలివాహనుల) కాలం నుంచీ ఆంధ్రులచరిత్ర క్రమవికాసం తెలియ వస్తోంది. నాలుగు శతాబ్దాలపాటు ఆంధ్రదేశాన్ని పరిపాలించిన సాతవాహనులు బౌద్ధులు. మంచి ఉచ్ఛదశలో ఉన్నప్పుడు ఈ ఆంధ్ర చక్రవర్తుల సామ్రాజ్యం దక్కను పీఠభూమి అంతా వ్యాపించటమే కాక కొంతవరకు ఉత్తర హిందూస్థానానికి, అధికంగా తమిళదేశానికి

కూడా వ్యాపించింది. తొలి సాతవాహన చక్రవర్తి అయిన శ్రీముఖ సాతవాహనుడు నేటి గుంటూరు జిల్లాలోని అమరావతి రాజధానిగా క్రీ. పూ. 225 నుంచి క్రీ. పూ. 202 వరకు పరిపాలించాడు. అటుపిమ్మట పరిపాలకులైన సాతవాహన రాజులలో క్రీ. శ. 78 నుంచి 102 వరకు పరిపాలన చేసిన గౌతమీపుత్ర శాతకర్ణి చాలా శక్తిమంతుడైన చక్రవర్తి సాతవాహన చక్రవర్తుల కాలంలో ఆంధ్ర సామ్రాజ్యం మంచి ఉచ్ఛదశలో ఉండి, శాంతి సౌభాగ్యాలతో తులతూగింది. వివేకవంతులైన ఈ ఆంధ్ర చక్రవర్తుల ఆదరాభిమానాలవల్ల ఆనాడు కళలు, సాహిత్యం, వాణిజ్యం, మతం బాగా పెంపొందాయి. సుప్రసిద్ధ సాతవాహన చక్రవర్తి అయిన హాలుడు 'గాథా సప్తశతి' ని కూర్చినాడు. తెలుగు గడ్డమీద ప్రభవించిన తొలి కావ్యం 'గాథా సప్తశతి.' సాతవాహనుల మంత్రి అయిన గుణాఢ్యుడు 'బృహత్కథ' ను రచించాడు. ప్రాకృత సాహిత్యంలో ఈ రెండు గ్రంథాలు చాలా ప్రామాణిక రచనలు.

ప్రాకృత భాషాలాలిత్యం, గాథల కమనీయత తెలియటం కోసం గాథాసప్తశతినుంచి ఒకటి రెండు ఉదాహరణలు :

అ ఉలీణో దోమూహజో తా మహురో భో అణం ముహే జావ!

మురజో వ్వ ఖలో జిణ్ణమ్మి భో అణే వర సమారసఇ॥ [III-53]

—ముఖమున బోనమున్నంత వరకే మద్దెల మధురముగా పలుకును; అది పోగానే విరసముగా మొఱగును. అట్లే ఖలుడు ద్విజిహ్వుడై అన్నము తిను చున్నంతసేపు మధురముగా పలుకును; అది జీర్ణము కాగానే విరసముగా పలుకును!

ఒక హాస్యమట్టము :

పాఅపడిఅస్స పఇసో పుట్టిం పుత్తే సమారుహత్తమ్మి ।

దడమణ్ణుదుణ్ణి ఆఏ విహాసో మరీణఏ ణెక్కంతో ॥ [I-11]

—అలుక మానుమని వేడుచు ఇల్లాలి పాదముల యందు పడియున్న పతి వీపుమీద పుత్రుడెక్కి కేరింతాలు కొట్టుచుండగా ఎంత కోపంతో ఉన్నప్పటికీ ఆ ఇల్లాలు నవ్వు ఆపుకొనలేక పోయింది!

సాతవాహన సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశం ఛిన్నాభిన్నమైంది. వేర్వేరు ఆంధ్ర భూభాగాలను ఇక్ష్వాకులు, సాలంకాయనులు, విష్ణుకుండినులు,

పల్లవులు, వాకాటకులు, బాదామిచాళుక్యులు ఆయా కాలాలలో పరిపాలించారు. విజయపురి రాజధానిగా క్రీ. శ. 220 నుండి 260 వరకు కొనసాగిన ఇక్ష్వాకు రాజుల పరిపాలనా కాలంలో, అచ్చట, సుప్రసిద్ధాలైన బౌద్ధస్తూపాలు, విహారాలు, విశ్వవిద్యాలయం నిర్మింపబడ్డాయి. మహాయాన బౌద్ధమత ప్రవక్త అయిన ఆచార్య నాగార్జునుడు అచ్చటనే వర్ధిల్లినాడు. ఈ స్తూపాలు, విహారాలు రాణులైన శాంతిశ్రీ, హమ్మసిరినికలచే నిర్మింపబడ్డాయి. ఇక్ష్వాకు రాజులలో శాంతిమూలుడు, వీర పురుషదత్తుడు వైదికమతావలంబులై అశ్వమేధయాగాలు చేశారు. క్రీ.శ. 7వ శతాబ్దిలో, తూర్పు సముద్రతీర ప్రాంతంలో, గోదావరీ మండలంలో తూర్పుచాళుక్యుల సామ్రాజ్యం వెలసింది. రాష్ట్రకూటులు, చివరి చాళుక్యులు తెలంగాణా ప్రాంతాన్ని పరిపాలించారు. తూర్పుచాళుక్య చక్రవర్తి అయిన రాజరాజ నరేంద్రుడు రాజమహేంద్రవరం (నేటి రాజమండ్రి) రాజధానిగా క్రీ.శ. 1062 వరకు పరిపాలించాడు. మనకు లభించిన తొలి తెలుగు కావ్యం రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవియైన నన్నయభట్టుచేత రచింపబడింది. ఆటుపిమ్మట, వరంగల్లు రాజధానిగా పరిపాలన చేసిన కాకతీయులు ప్రసిద్ధికి వచ్చారు. క్రీ.శ. 1198 నుంచి 1261 వరకు పరిపాలించిన కాకతీయ గణపతిదేవుడు సముద్రతీర ప్రాంతాన్ని, రాయలసీమను జయించి, తెలుగు ప్రజలందర్ని తన ఏలుబడిలోనికి తెచ్చినాడు. పిమ్మట ఆయన కుమార్తె రుద్రాంబ (క్రీ. శ. 1261–1296) ఆటు తరువాత ఆమె మనుమడు ప్రతాపరుద్రదేవుడు (క్రీ.శ. 1296–1323) కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించారు. క్రీ.శ. 1323 లో మహమ్మద్ బిన్ తుగ్లక్ ప్రతాపరుద్రదేవుని సింహాసన భ్రష్టుని చేయటం సంభవించింది. కాకతీయుల పరిపాలనలో శాంతి సౌభాగ్యాలు విలసిల్లినాయి. కళలు, సాహిత్యం పెంపొందాయి. కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థాన కవియైన విద్యానాథుడు రచించినదే నేటికి భారతదేశమంతటా పఠనపాఠన వ్యవహార ప్రసిద్ధిలోనున్న అలంకారశాస్త్ర గ్రంథం "ప్రతాపరుద్ర యశోభూషణం."

కొందరు సుప్రసిద్ధులైన ఆంధ్రవీరులు తుగ్లక్ జయించిన భూభాగాలను స్వతంత్రం కావించారు. తత్ఫలంగా రెడ్డిరాజులు కొండవీటి రాజ్యాన్ని, వెలమదొరలు రాచకొండ రాజ్యాన్ని, హరి హర బుక్కరాయలు విజయనగర రాజ్యాన్ని పరిపాలించసాగారు. క్రీ.శ. 1345 లో బహమనీ రాజ్యం పశ్చిమ దక్కన్ పీఠభూమిలో స్వతంత్ర ముస్లిం రాజ్యంగా నెలకొన్నది. స్వతంత్ర ప్రతిపత్తి కోసం ఈ రాజ్యాలన్నింటి మధ్య నిరంతరం పోరు కొనసాగుతూనేఉండేది. క్రీ.శ. 16వ శతాబ్ది ప్రథమ పాదంలో బహమనీ రాజ్యం పతనమైన పిమ్మట చిన్న చిన్న ముస్లిం

సంస్థానాలేర్పడ్డాయి. గోల్కొండ, అంటే, నేటి హైదరాబాదు రాజధానిగా కుతుబ్ షాహీ వంశస్థులు రాజులైనారు. గోల్కొండ రాజ్యము క్రీ.శ. 1520 లో స్థాపింపబడింది.

ఆదిలో ఒక చిన్న రాజ్యంగా మొదలైన విజయనగర రాజ్యం పిమ్మట మహా సామ్రాజ్యంగా వెలసింది. క్రీ.శ. 1509 నుంచి 1529 వరకు పరిపాలన చేసిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యం చాలా ఉచ్ఛస్థితికి వచ్చింది. రాయల కాలంలోనే తెలుగు సాహిత్యం క్రొత్తదారిని త్రొక్కింది. ఆనాటి వరకు అనువాదాలే అధికంగా కొనసాగుతూ వచ్చాయి. అందులకు భిన్నంగా ఆనాటి కవులు తమ ఇష్టానుసారం కావ్యరచన చేయుటం ఆరంభించారు. శ్రీకృష్ణదేవరాయల కొలువులో 'అష్టదిగ్గజాలు' అనే పేరుతో ఎనిమిది మంది ప్రఖ్యాత కవులు ఉండేవారు. వీరిలో 'మనుచరిత్ర' రచించిన అల్లసాని పెద్దన అగ్రగణ్యుడు. విజయనగర సామ్రాజ్యం క్రీ. శ. 1336 నుండి 1564 వరకు వర్ధిల్లినది.

'రక్షస్-తంగడి' యుద్ధంలో అళియ రామరాయలు చనిపోవటంతో విజయనగర సామ్రాజ్యం ఛిన్నాభిన్నమైంది. విజయనగర సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశం క్రమంగా గోల్కొండ కుతుబ్‌షాహీల ఆధిపత్యంలోకి వచ్చింది. కుతుబ్ షాహీలకాలంలోనే ఫ్రెంచి, డచ్, ఇంగ్లీషు వర్తకులు తూర్పు కోస్తా ఆంధ్ర ప్రాంతాలైన మద్రాసు, మచిలీపట్టణం, భీమిలిపట్టణం మొదలైన చోట్ల వ్యాపార స్థావరాలేర్పరచుకొన్నారు. క్రీ.శ. 1687 లో ఔరంగజేబు గోల్కొండ కుతుబ్ షాహీలను జయించాడు. ఆనాటినుంచి ఆంధ్రదేశంలోని 'తెలంగాణా' ప్రాంతం 'నైజాములు' అని పిలువ బడే అసఫ్‌జాహీ పాలకుల పరిపాలనక్రిందకు వచ్చింది; అప్పటి పరిపాలకుడు నైజామ్-ఉల్-ముల్క్. అసఫ్ జాహీల పరిపాలన క్రీ.శ. 1723 లో ఆరంభమై, క్రీ. శ. 1956 లో 'ఆంధ్రప్రదేశ్' ఏర్పడే పర్యంతం కొనసాగింది. నైజాము, ఫ్రెంచివారు, ఇంగ్లీషువారు, మహారాష్ట్రులు, మైసూరుకు చెందిన టిప్పుసుల్తాన్—వీరి మధ్య జరిగిన సంఘర్షణలు కారణంగా ఒక ముప్పై సంవత్సరాల కాలంలో ఆంధ్ర భూభాగం ఆక్రమణ విషయంలో అనేకాలైన మార్పులు వచ్చాయి. చివరకు క్రీ.శ. 19వ శతాబ్ది ప్రారంభంలో రాయలసీమ, కోస్తా జిల్లాలు బ్రిటిష్ సామ్రాజ్యం ఆధిపత్యం క్రిందకు వచ్చేశాయి.

ఆంధ్రరాజుల కాలంలో వైదిక-బౌద్ధ మతాలు ఆదరింపబడ్డాయి. విజయనగర సామ్రాజ్యం ఆవిర్భవించిన పిమ్మట హిందూ స్వాతంత్ర్యం, హిందూ నాగరకత సంరక్షింపబడుతూ వచ్చాయి. ఇంతకుముందే పేర్కొన్నట్లుగా సాతవాహన రాజుల

కాలంలోను, ఇక్ష్వాకుల కాలంలోను ఆంధ్రదేశంలో బౌద్ధమతంకూడా వర్ధిల్లింది. ఆంధ్రులు ప్రయోగ దృష్టియందలి ఔత్సుక్యంతో క్రొత్త క్రొత్త ఉద్యమాలన్నింటినీ ముందుగా చేపట్టేవారుగా కనిపిస్తారు. ప్రపంచమంతటా బౌద్ధమతంమీద విస్తృతమైన ప్రభావాన్ని చూపిన మహాయాన సిద్ధాంతాన్ని ఆచార్య నాగార్జునుడు వెలయింపజేశాడు. బౌద్ధమత విషయంలో ఘంటసాల, భట్టిప్రోలు, అమరావతి, నాగార్జున కొండ—ఇవి అంతర్జాతీయ ప్రసిద్ధిని పొంది, విశ్వవిఖ్యాత యాత్రాస్థలాలైనాయి.

వాస్తుకళ :

వాస్తు కళా క్షేత్రములో ఆంధ్రులు అపూర్వ నిర్మాణాలకు సృష్టికర్తలైనారు. "నాలుగు ఆయక వేదికలను కలపటం చక్కని శిల్పాలతో కూడుకొన్న చలువరాతి పలకలతో ఇటుక కట్టడాలను పూరించటం ఆంధ్రుల ప్రత్యేకత; ఇవి స్తూపాలకు గంభీరతను, అందాన్ని చేకూర్చాయి. అమరావతి మహా "చైత్యమందలి చలువ రాతి పలకల వరుసలు, ప్రఖ్యాతమైన సాంచీ స్తూపమందలి తోరణాలు బౌద్ధ వాస్తుకళ చరిత్రలో అపూర్వ నిర్మాణాలు."

"విజయపురి ఇక్ష్వాకులు దేవాలయ నిర్మాణోద్యమాన్ని చాలా పట్టుదలతో ప్రారంభించారు. పల్లవులు ఆ ఉద్యమాన్ని కొనసాగించి, అభివృద్ధి పొందించారు. విష్ణుకుండినులు బౌద్ధుల గుహారామ వాస్తుకళను అనుకరించారు. హిందూ దేవతలకు అంకితాలైన పెక్కు గుహాలయాలను త్రవ్వించి వెలికి తీయించారు. పల్లవులు ఈ పద్ధతినే పాటించి, దీన్ని దక్షిణ హిందూదేశంలో అభివృద్ధి పరచారు. ఆంధ్రదేశానికి సంబంధించిన ఈ ద్వివిధమైన సంప్రదాయం ప్రఖ్యాతమైన మహాబలిపురం రాతిరథాల రూపంలో మనీభవించింది."

"దేవాలయ వాస్తుకళకు సంబంధించిన నగర, వేసర, ద్రవిడ అనే ప్రధాన శైలులు మూడున్నూ ఆంధ్రదేశంలో చాళుక్యుల కాలంలో ఆదరణ పొందాయి. వేసర శైలికి పరాకాష్ఠ అని చెప్పబడే వక్రరేఖావృతమైన గోపురం, అమలక శిఖరం—ఇవి కలిగిన వేసరశైలి దేవాలయాలు ఆంధ్రదేశంలో మూడుచోట్ల కనబడుతున్నాయి. తరువాతి చాళుక్యుల కాలానికి సంబంధించిన వాస్తుకళా శైలులను కాకతీయులు అవలంబించి, పెక్కు క్రొత్త పోకడలను మిళితంచేసి తెలంగాణాలోని వరంగల్లు జిల్లాలో ఉన్న హనుమకొండ, రామప్ప మున్నగు ప్రదేశాలల్లో సుందరములైన పెక్కు కట్టడాలను వెలయింపజేశారు."

"మధ్యయుగానికి చెందిన దక్కను చరిత్రలో ఈ దేవాలయాలు హిందూ వాస్తుకళకు పరాకాష్ఠ అని చెప్పవచ్చు. ప్రసిద్ధులైన విజయనగర చక్రవర్తులు

ఒక క్రొత్త దేవాలయ నిర్మాణ శైలిని కనుగొన్నారు. ఈ శైలికి సంబంధించిన స్వచ్ఛమైన కట్టడాలను రాయలసీమ జిల్లాలలో చూడవచ్చు."

—మారేమండ రామారావు

పురాతనాలైన ఇట్టి కట్టడాలను దక్షిణ దేశంలో వెల్లూరు, తంజావూరు, మధుర, జింజి, పుదుక్కోట మొదలగు ప్రాంతాలలో కూడా చూడవచ్చు. విజయనగర సామ్రాజ్య పతనానంతరం తంజావూరులో తెలుగు నాయకరాజులైన రఘునాథ నాయక, విజయరాఘవ నాయకులు, మధురలో విజయరంగ చొక్క నాథుడు, పుదుక్కోటలో రాజా రఘునాథుడు స్వతంత్రులైనారు.

క్రీస్తుశకారంభంలో, అంటే, సాతవాహన రాజుల కాలంలో ఆంధ్రులు కొందరు ఆగ్నేయ ఆసియా దేశాలకు వలస వెళ్ళారు. ఆయా దేశాలలో కనుపట్టే అమరావతి, విజయపురి, సింహపుర, కళింగ మున్నగు స్థల నామాలు ఆంధ్రులు వలస వెళ్ళారనడానికి తార్కాణాలు. శక సంవత్సరాలలో ఈయబడిన తేదీలుకల శాసనాలు, క్రీస్తు శకారంభ శతాబ్దాలకు చెందిన తెలుగు లిపిలో వ్రాయబడిన శాసనాలు, అమరావతి శైలికి చెందిన శిల్పాలు ఈ దేశాలలో కనుగొనబడ్డాయి.

జాతీయోద్యమం :

జాతీయ స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రుల దెల్లప్పుడూ ముందంజయే. క్రీ.శ. 1885 లో 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' ఉద్భవించటంతో జాతీయ మహోద్యమం ఆరంభమైంది. భారతీయ సైనికుల తిరుగుబాటుతో క్రీ.శ. 1857 లోనే నిజంగా స్వాతంత్ర్య సమరం ఆరంభమైనదన్న సత్యం మనకందరకూ తెలుసు. ఈ సైనికుల తిరుగుబాటును తాంతియాతోపే, ఝాన్సీరాణి మున్నగు జాతీయ మహాయోధులు బలపర్చటంతో సైనికుల తిరుగుబాటు 'స్వాతంత్ర్యసమర' రూపంతాల్చింది. తరువాతి పరిశోధనలను బట్టి భారతదేశంలో బ్రిటిషువారి అధికారం స్థిరపడినప్పటినుంచి స్వాతంత్ర్యంకోసం సమరం సాగుతూనే ఉన్నదని తెలుస్తోంది. కృష్ణా జిల్లాలోని నూజివీడుకు చెందిన నారయప్పారావు, దక్షిణ దేశానికి చెందిన పాండ్య సరదారు కట్టబొమ్మ (ఇతడు కూడా ఆంధ్రుడే) — ప్రసిద్ధులైన ఈ ఇరువురు సరదార్లు 18 వ శతాబ్ది రెండవభాగంలో బ్రిటిషువారిని ఎదిరించి పోరాడినారు. క్రీ.శ. 1783 లో నారయప్పారావు ఈస్టుఇండియా కంపెనీ వారి అధికారులతో పోరాటం సాగించాడు. ఆయన కుమారుడు రామచంద్ర అప్పారావు కూడా ఈ పోరాటం కొనసాగించాడు. చివరకు నూజివీటి అప్పారావుతో

బ్రిటిషువారు సంధిచేసికొన్నారు. క్రీ.శ. 1795 లో కట్టబొమ్మ ఈస్టుఇండియా కంపెనీకి వ్యతిరేకంగా తిరుగుబాటు సాగించాడు. కాని దురదృష్టవశాత్తు నమ్మిన వారిచేత మోసగింపబడి, బ్రిటిషువారికి చిక్కి, కట్టబొమ్మ ఉరితీయబడినాడు. భారతీయ స్వాతంత్ర్యసమరం ఆరంభంకావాటానికి ఇంచుమించుగా 75 సంవత్సరాలకు ముందే ఈ సరదార్లు ఇరువురు బ్రిటిషువారిపై తిరుగుబాటుకు మార్గదర్శకులైనారు.

ఆంధ్రోద్యమం :

భాష ప్రాతిపదికగా రాష్ట్రాల పునర్విభజన జరగాలన్న ముఖ్యాశయంతో క్రీ.శ. 1913 లో ఆంధ్రోద్యమం ఆరంభమైంది. ఈ విషయంలో తక్కిన రాష్ట్రాల వారికి ఆంధ్రులే మార్గదర్శకులు. ప్రత్యేక రాష్ట్ర కాంగ్రెస్ సంఘం కావాలన్న ఆంధ్రుల కోర్కెను క్రీ.శ. 1917 లో భారత జాతీయ కాంగ్రెస్ అంగీకరించింది. ప్రత్యేకరాష్ట్ర వాంఛ ఆంధ్రులలో ఎల్లప్పుడు ప్రబలంగానే ఉంటూ వచ్చింది. ఈ ఆందోళన ఫలితంగానే క్రీ.శ. 1926లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నెలకొల్పబడింది. నాటినుంచి క్రీ.శ. 1950 వరకు భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్య మద్రాసురాష్ట్ర శాసనసభలోను, కేంద్ర శాసనసభలోను చర్చించబడుతూనే ఉంది. స్వరాజ్యం సిద్ధించిన పిమ్మటనే భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్య చేపట్టాలని క్రీ.శ. 1936 లో జాతీయ కాంగ్రెస్ నిర్ణయించింది.

క్రీ.శ. 1947 లో స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట ఆంధ్రరాష్ట్ర విభజన జరగాలని కాంగ్రెస్‌పై వత్తిడి తీసికొని వచ్చారు ఆంధ్ర నాయకులు. భాషాప్రయుక్త రాష్ట్ర విభజన సమస్యపై సమగ్రమైన ఒక నివేదిక సమర్పించటం కోసం పండిత జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యలతో కూడుకొన్న ఒక ఉపసంఘాన్ని జైపూర్ సభల సమయంలో ఏ.ఐ.సి.సి. నియమించింది. 'జె.వి.పి. రిపోర్టు' అనే పేర ప్రసిద్ధి కెక్కిన ఈ ఉపసంఘ నివేదికలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణం సిఫారసు చేయబడింది. ఈ ఉపసంఘ నియామకానికి ముందే జస్టిస్ థార్ అధ్యక్షతలో ఒక సంఘం నియమింపబడింది. ఈ సంఘం భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన సూత్రాన్ని వ్యతిరేకించినప్పటికీ ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యను ప్రత్యేకంగా ఆలోచించాలని సిఫారసు చేసింది. అయినప్పటికీ ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో ఎట్టి చర్య తీసికోబడలేదు. చివరకు క్రీ.శ. 1949 లో ప్రత్యేకాంధ్ర

రాష్ట్ర నిర్మాణ విషయంలో కచ్చితమైన సూచనలు చేయటంకోసం ఒక విభజన సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. క్రీ. శ. 1950 లో ఈ సంఘం తన నివేదికను సమర్పించింది. 1950 జనవరి 26 వ తేదీనాటికి ప్రత్యేకాంధ్ర రాష్ట్రం ఏర్పడగలదని అందరూ ఆశించారు. కాని, ప్రత్యేకాంధ్రరాష్ట్రం నిర్మాణం వాయిదా వేయబడిందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో అంతటా నిరాశ అలముకొంది.

ఇట్టి సమయంలో పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర నిర్మాణం కోసం ఆమరణ దీక్షను పట్టారు. ఈ ఉపవాస దీక్షతో ఆంధ్రులలో అలజడి, అశాంతి అధికమైనాయి; ఆంధ్రరాష్ట్రం ఏర్పడనిదే ఆంధ్రులు తృప్తి చెందరన్న విషయం స్పష్టమైంది. చివరకు పొట్టి శ్రీరాములు ఆత్మాహుతి అయినారు. ఆమరణ ఉపవాస దీక్ష పట్టి, ఆత్మాహుతి అయిన ముగ్గురు ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులలో శ్రీరాములు ఒకరు అయినారు. ఈ ఆత్మాహుతి కారణంగా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు వచ్చింది. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం విషయంలో సమగ్ర నివేదికను సమర్పించటం కోసం జస్టిస్ వాంఛూను కేంద్ర ప్రభుత్వం నియమించింది. క్రీ.శ. 1953 అక్టోబరు 1 వ తేదీన కర్నూలు రాజధానిగా, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఆంధ్రరాష్ట్రం అవతరించింది.

భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్విభజించాలన్న సమస్యను కూలంకషంగా పరిశీలించి, నివేదికను సమర్పించటం కోసం ఫజుల్ ఆలీ అధ్యక్షతలో ఒక సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ సంఘం తన నివేదికను క్రీ. శ. 1955 లో సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం ఈ నివేదికను అంగీకరించి, రాష్ట్రాలను భాషా ప్రాతిపదికపై పునర్విభజించటానికి తగిన చర్య తీసికొంది. తత్ఫలితంగా నేటి వివిధ రాష్ట్రాలు 1956 నవంబరు 1 వ తేదీన రూపొందింప బడినాయి. నిజాము పరిపాలన అంతమై తెలంగాణా కూడా చేరిపోవటంతో ఆంధ్రరాష్ట్రం, 'ఆంధ్రప్రదేశ్' అయి, హైదరాబాదు రాజధానీ నగరం అయింది. ఈ విధంగా నిరంతర సంఘర్షణవల్ల, త్యాగాలవల్ల 3½ కోట్ల ఆంధ్రులు స్వరాష్ట్రాన్ని పొందగలిగారు.

మహిళాలోకం :

శ్రీ కందుకూరి వీరేశలింగంగారు స్త్రీ జనోద్ధరణకు అశేషంగా చేసిన కృషికి ఫలితంగా ఈనాడు స్త్రీలు అనేక రంగాలలో ప్రముఖ పాత్రను వహిస్తున్నారు.

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న యోధురాలే కాక స్త్రీలకోసమై ఎన్నో విద్యా సంస్థలను నెలకొల్పింది. ఆంధ్ర మహిళా సభను మద్రాసులోనూ, హైదరాబాదులోనూ స్థాపించి స్త్రీలకు ఎన్నో వృత్తి విద్యలలో శిక్షణ నిచ్చే సంస్థగా రూపొందించింది. శ్రీ కేసరిగారు స్థాపించిన "గృహలక్ష్మి" పత్రిక ఎంతోమంది రచయిత్రులను ప్రోత్సహించింది. ఈనాడు రాష్ట్రంలో ఖ్యాతి నార్జించిన రచయిత్రు లెందరో ఉన్నారు. లత, ముప్పాళ్ళ రంగనాయకమ్మ, యద్దనపూడి సులోచనారాణి, అరికెపూడి కౌసల్యాదేవి మొదలైనవారు నవలా రంగంలో సిద్ధహస్తులైనవారు. విద్యారంగంలో డాక్టర్ శ్రీదేవి చాలా కృషి చేశారు. రాజకీయాల్లో శ్రీమతి అమ్మన్నరాజా ప్రముఖ పాత్రను వహించారు.

సాహిత్యం :

ఇప్పుడింక బహుముఖమైన ఆంధ్ర సంస్కృతిని పరిశీలించుదాము. ముందుగా 'సాహిత్యం' తో ఆరంభిస్తాను.

ఇంతకుముందే పేర్కొన్నట్లుగా తూర్పు చాళుక్య రాజు అగు రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి అయిన నన్నయభట్టు క్రీ.శ. 11 వ శతాబ్దిలో అనువదించిన ఆంధ్ర మహాభారతమే మనకు లభించిన తొలి తెలుగు మహాకావ్యం. ఈ ఆంధ్ర మహాభారతం ప్రౌఢరచన కాబట్టి అంతకుముందుకూడా కొన్ని కావ్యాలు రచింప బడి ఉండాలి ; కాని, దురదృష్టవశాత్తు అవి అలభ్యాలైనాయి. నన్నయ కవిత్వంలో సంస్కృత పదాల పాలు అధికం ; అయినప్పటికీ అది మనోహరమైన సరళ రచన. తన రచనను గూర్చి నన్నయభట్టు క్రింది విధంగా చెప్పుకొన్నాడు :

"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తిలో
నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు దెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్."

—ఆది పర్వ. ప్ర. ఆ. 25 ప.

నన్నయ మహాభారతంలో ఆది-సభా పర్వాలను, అరణ్య పర్వంలో కొంత భాగాన్ని అనువదించాడు. క్రీ.శ. 13 వ శతాబ్దిలో నివసించిన మరియొక తెలుగు మహాకవి తిక్కన మహాభారతాంధ్రీ కరణ భారం వహించాడు. తిక్కన మహాకవియే కాక మహాసేనాపతి అని కూడా ప్రసిద్ధి. ఆవేశ కారకాలు, ఆకర్షణీయాలు అయిన కొన్ని పట్టాలలో తిక్కన కవిత్వం కవితాంశంలోను, నాటకీయ రచనా పద్ధతిలోను

వ్యాసుని సంస్కృత భారతాన్ని సులువుగా మించుతుంది. ఈ తిక్కన 'కవిబ్రహ్మ' బిరుదాంచితుడు. క్రీ.శ. 14 వ శతాబ్దిలో నివసించిన ఎఱ్ఱాప్రెగ్గడ, నన్నయ తిక్కనలు వదలివేసిన భారతారణ్య శేషభాగాన్ని, హరి వంశాన్ని అనువదించి, ఆంధ్ర మహాభారతాన్ని సంపూర్ణం చేశాడు. ఈ ముగ్గురు ఆంధ్ర మహాభారత కర్తలను 'కవిత్రయము' అంటారు. ఈ ఆంధ్ర మహాభారతం తెలుగులో తొలి కావ్యమే కాక తెలుగు భాషాసారస్వతాల విషయంలో ప్రామాణికమైన కావ్యం కూడాను.

క్రీ.శ. 15 వ శతాబ్దిలో శ్రీనాథ, పోతనలు అవతరించటంతో తెలుగు సాహిత్యంలో ఒక క్రొత్తయుగం ఆరంభమైంది. శ్రీనాథుడు నిజానికి 'విశ్వకవి.' అంతేకాదు, పాలకులైన రాజులతోపాటు జీవిత భోగభాగ్యాలను పూర్ణంగా అనుభవించాడు; భౌతిక విషయాలలో బాగా నిమగ్నుడైనాడు. జీవితావసాన సమయంలో శ్రీనాథుడు చెప్పిన క్రింది పద్యం గమనింపదగినది:

"కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి,
రత్నాంబరంబు లే రాయఁడిచ్చు?
కంభఁగూడెఁ దెనుంగు రాయరాహుత్తుండు,
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁడయ్యె విస్సనమంత్రి మఱిహేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁగలదు?
కైలాసగిరిఁ బండె మైలారు విభుఁడేగి,
దినవెచ్చ మేరాజు దీర్పఁగలఁడు?
భాస్కరుఁడు మున్నె దేవుని పాలికరిగెఁ,
గలియుగంబున నింకనుండఁ గష్ట మనుచు
దివిజ కవివరు గుండియల్ దిగ్గురనఁగ,
నరుగుచున్నాడు శ్రీనాథుఁ డమరపురికి."

సంస్కృతభాషపై బాగా అధికాధికారం కలవాడు శ్రీనాథుడు. అతడు హర్షనైషధాన్ని 'శృంగార నైషధము' అన్న పేరుతో ప్రౌఢంగా ఆంధ్రీకరించాడు. ఆనాటి సామాన్యుల జీవితసంప్రదాయాలను చిత్రీకరించిన 'క్రీడాభిరామం' అనే కావ్యాన్ని కూడా శ్రీనాథుడే రచించాడని కొందరు విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

రాజులను రాజాస్థానాలను, భోగాలను భాగ్యాలను దూషించి తిరస్కరించిన పోతన శ్రీనాథునకు పూర్తిగా విరుద్ధం. పోతన భాగవతాన్ని ఆంధ్రీకరించాడు.

ఆయన అనువాదం పద్యానికి పద్యంగా సాగలేదు; అనువాదం మూలంకంటె అధికమైంది. పోతన భక్త్యావేశం సాటిలేనిది. ఆయన శైలి ధారాళంగా, శ్రావ్యంగా, లయానుగుణంగా ఉంటుంది. పోతన పద్యాలు తెలుగు ప్రజలకు చాలా ప్రీతిపాత్రాలైనాయి.

ఏమ్మట శ్రీ కృష్ణదేవరాయల యుగం ఆరంభమైంది. ప్రబంధ రూపం తాల్చిన తెలుగు సాహిత్యానికి అది స్వర్ణయుగం. తెలుగు భాషయందు తనకు గల గాఢాభిమానాన్ని, ఆ భాషా వైశిష్ట్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు క్రింది విధంగా చాటి చెప్పినాడు :

"తెలుఁ గదేల యన్న దేశంబు దెలుఁ, గేను
దెలుఁగు వల్లభుండఁ, దెలుఁగొ కండ,
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశ భాషలందుఁ దెలుఁగు లెస్స."

—ఆముక్తమాల్యద, 1–15

ఇంతకుముందు చారిత్రక విభాగంలో పేర్కొన్నట్లుగా ప్రసిద్ధ విజయనగర కవులు ఎనమండుగురు. వారు పురాణానువాదాలతో తృప్తిచెందక, రచనా స్వాతంత్ర్యం పొందారు. రామరాజభూషణుని మాటలలో ప్రబంధ కవుల రచనా విధానం క్రింది విధంగా స్పష్టమవుతోంది :

"కేవల కల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరిఁ బుట్టు రత్నము లవారిత సత్కవి కల్పనా విభూ
షావహ పూర్వవృత్తములు సానలఁ దీరిన జాతిరత్నముల్
గావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పు పెంపునన్."

—వసుచరిత్ర, 1–19

'మనుచరిత్ర' రచించిన అల్లసాని పెద్దన ఈ ఎనమండుగురిలోను సుప్రసిద్ధుడు; అంతేకాదు పెద్దన 'ఆంధ్ర కవితా పితామహ' బిరుదాంచితుడు. ఈ కావ్యం వైశాల్యంలో పెద్ద దైనప్పటికీ ఆసాంతం మనోహరంగా ఉంటుంది. మనుచరిత్ర రచన ఉదాత్తమై, భాష సంస్కృత పదబహుళము, శ్రావ్యము, లయాన్వితమునై అలరారుతూ ఉంటుంది. తెలుగు భాషలో ఇది ఒక ప్రామాణికమైన రచన. శ్రీకృష్ణదేవరాయలు ఈ మహాకవిని "ఎదురైనచోఁ దన మద కరీంద్రము నిల్పి, కేలూత యొసఁగి యెక్కించు" కొనే వాడట !

శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా కవి; 'ఆముక్త మాల్యద' అనే ప్రౌఢ కావ్యాన్ని రచించాడు. ఈ కావ్య రచనాశైలి జటిలమై, నారికేళపాకంలో ఉంటుంది. ముక్కుతిమ్మన, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు మున్నగు మహాకవులంతా ఈ యుగానికి చెందినవారే. క్రీ.శ. 16 వ శతాబ్ది రెండవ భాగానికి చెందిన పింగళి సూరన 'కళాపూర్ణోదయము' అనే ఉత్తమ కావ్యం రచించాడు; దీన్ని 'కావ్య రూపంలో ఉన్న నవల' అంటే అతిశయోక్తికాదు. అంతేకాదు, ఇది కేవలం కల్పిత కథ కూడాను. అపూర్వమైన విధంగా సంగీత సాహిత్యాలు మేళవించిన రామరాజ భూషణుని 'వసుచరిత్ర' ఆనాటి మరియొక ఉత్తమ కావ్యం. ఆలంకారిక పదప్రయోగానికి, భావనా వైశిష్ట్యానికి, వ్యంగ్య సంపదకు, శ్లేష మాధుర్యానికి ప్రత్యేకత వహించిన వసుచరిత్ర తెలుగులోని పంచ కావ్యాలలో విశిష్ట స్థానం సంపాదించుకొంది.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం కొందరు తెలుగు కవులు దక్షిణ దేశానికి తరలివెళ్ళి తంజావూరు, మధుర మొదలగు ప్రాంతాలలో స్థిరపడ్డారు. అచ్చట, తెలుగు సాహిత్యంలో వారొక క్రొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. సారంగు తమ్మయ్య రచించిన 'వైజయంతీ విలాసము,' చేమకూర వేంకటకవి రచించిన 'విజయ విలాసము' తెలుగులో సుప్రసిద్ధాలైన కావ్యాలు. "ప్రతి పద్యము నందుఁ జమత్కృతి గలుగం జెప్ప నేర్తు"నని చెప్పుకొన్నవాడు చేమకూర వేంకటకవి. క్రీ.శ. 18 వ శతాబ్దిలో పలువురు కవులు రచనలు చేసినప్పటికీ చెప్పుకోదగిన గొప్ప కావ్యాలేమీ వెలువడలేదు. కవుల రచనలలో స్వాతంత్ర్యంకాని, శైలిలో రమ్యత కాని కన్పట్టదు. క్షీణదశ ప్రారంభమైనదని చెప్పవచ్చు.

తెలుగు వాఙ్మయ శాఖలలో చెప్పుకోదగిన విశిష్టమైన శాఖ 'శతక' వాఙ్మయం. భక్తి, నీతి, వేదాంతం, విమర్శ—అనే అంశాలు శతక రచనకు ప్రేరేపకాలు. క్రీ.శ. 17 వ శతాబ్దిలో నివసించిన వేమన శతక కవులలో సుప్రసిద్ధుడు.

క్రీ.శ. 15 వ శతాబ్దిలో నివసించిన అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామి భక్తులలో అగ్రేసరుడు. అన్నమాచార్యులు తెలుగులో రచించిన 'వేంకటేశ్వర వచనాలు' సుప్రసిద్ధాలైనాయి. కీ.శ. 18 వ శతాబ్దిలో నివసించిన క్షేత్రయ్య సుప్రసిద్ధుడైన పదకర్త. క్షేత్రయ్య పదాలు దాక్షిణాత్య నృత్యానికి నికషోపలాలు. క్రీ.శ. 18 వ శతాబ్ది తొలి భాగంలో నివసించిన త్యాగరాజు కర్ణాటక సంగీత సంప్రదాయానుసారంగా తెలుగు భాషలో రమ్యమైన కృతులు రచించిన సుప్రసిద్ధ వాగ్గేయకారుడు. "నిధి చాల సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా? నిజముగ బల్కు

మనసా!" (కళ్యాణి-చాపు) అని తర్కించుకొని, "సుమతి త్యాగరాజు నుతుని కీర్తన"మే సుఖమని నిర్ణయించు కొన్నవాడు త్యాగరాజు. "సీతమ్మ మా యమ్మ శ్రీరాముడు మా తండ్రి" (లలితా-రూపకం) అని పాడుకొన్న త్యాగరాజునకు రామునిపై గల భక్తి, ఆయన కృతుల యందలి పదలాలిత్యం, సారళ్యం సాహిత్య ప్రపంచంలోను, భక్తి సంగీత విషయంలోను నిరుపమానములైనాయి. అను నాసిక్యం, అజంతత్వం, మహా ప్రాణాక్షర రాహిత్యం కారణాలుగా తెలుగు భాష మధురతరమై సంగీతానికి చాలా అనుకూలమైంది. త్యాగరాజు వాక్కులలో అది భక్తి సంగీతానికి పరమమైన సాధన అయింది.

19 వ శతాబ్ది మధ్యభాగంలో, ఆంగ్ల-వంగ సంప్రదాయాల ప్రభావం బాగా ప్రసరించిన కాలంలో ఆధునిక తెలుగు వాఙ్మయం ఆరంభమైనదని చెప్పవచ్చు. క్రీ.శ. 19 వ శతాబ్ది మధ్యభాగం వరకు తెలుగులో వచనవాఙ్మయం పెంపొందనే లేదు. ఆధునిక తెలుగు వచన రచనకు కందుకూరి వీరేశలింగం మార్గదర్శకులు. ఆయన నాటకాలు, జీవిత చరిత్రలు రచించటంమాత్రమే కాక స్వీయ చరిత్రకూడా రచించుకొన్నారు. అంతేకాదు సాహిత్య సాధనగా వచన రచనను తీర్చిదిద్దినారు. కృష్ణాపత్రిక సంపాదకులైన ముట్నూరి కృష్ణారావు తెలుగు పత్రికారచనలో ప్రామాణికులు. ఆయన మంచి వ్యాస రచయిత. రాజకీయ, సాహిత్య, వేదాంత, సంఘ సంస్కరణాది విషయాలను సుస్పష్టంగా చర్చించటానికి చాలా అనువైన ఒక క్రొత్త శైలిని వారు అవలంబించారు. పానుగంటి లక్ష్మీనరసింహారావు ఛలోక్తులను విసరటంలో, హాస్యరచనలో అందెవేసిన తెలుగు రచయిత. ఆయన శైలి తెలుగుదేశమంతటా ప్రజాదరణ పొందింది.

క్రీ.శ. 19 వ శతాబ్ది ఆరంభంలో ప్రామాణికమైన, సమగ్రమైన తొలి తెలుగు వ్యాకరణం ('బాల వ్యాకరణం') రచించినవాడు చిన్నయసూరి.

'తిరుపతి వేంకటకవులు' అను పేర సుప్రసిద్ధులైన గొప్ప జంటకవులు దివాకర్ల తిరుపతిశాస్త్రి, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి. వారు తమ అవధానాలతో తెలుగు కవిత్వాన్ని ప్రజలకు సన్నిహితంచేశారు. సరళము, మనోహరము, ప్రామాణికము అయిన భాషలో వారు రచనలు చేశారు. వారి కావ్యాలు, నాటకాలు కూడా తెలుగు నాట చాలా ప్రసిద్ధిపొందాయి. ఈ జంటకవులలో చెళ్ళపిళ్ళవారికి శిష్యసంపద అధికము. నాడు ప్రసిద్ధి కెక్కిన తెలుగు కవులలో నూటికి తొంబదిమంది వారి శిష్యులే. విశ్వనాథ సత్యనారాయణ పేర్కొన్నట్లుగా

"తనయెద యెల్లమెత్తన, కృత్రపతి పద్యము నంతకంటె మె
త్తన తన శిష్యులన్న నెడదంగల ప్రేముడి చెప్పలేని మె
త్తన యయి శత్రుపర్వత శతారము సత్కవి చెళ్ళపిళ్ళ వేం
కన గురువంచుఁ జెప్పికొనగా నది గొప్ప తెలుంగునాఁడునన్."

వంగ సాహిత్యంచేత—ముఖ్యంగా రవీంద్రనాథ టాగూర్‌చేత—ప్రభావితులైన రాయప్రోలు సుబ్బారావు గారితో తెలుగు కవిత్వం క్రొత్తమార్గం త్రొక్కింది. ఆయన నాందీపూజ కావించిన కాల్పనిక సంప్రదాయాన్ని తెలుగులో 'భావకవిత్వము' అంటారు. ఈ భావకవిత్వ సంప్రదాయం కృష్ణశాస్త్రి, అబ్బూరి, రామిరెడ్డి, జాషువా, నండూరి సుబ్బారావు ప్రభృతుల చేతుల్లో తీర్చిదిద్దబడింది. పీడితజాతుల, అస్పృశ్యుల కష్టాలను మనోహరమైన కవిత్వంలో చిత్రించిన సమర్థుడైన తొలి హరిజన క్రిస్టియన్ కవి గుర్రం జాషువా. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావులు క్రొత్తయుగానికి చెందినవారు; వారి 'సౌందరనందము' ఒక ఉత్తమ ఆధునిక తెలుగు కావ్యం. పింగళి లక్ష్మీకాంతం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుభాషా శాఖాధ్యక్షులుగా చిరకాలం పనిచేసి తెలుగు భాషా-సాహిత్యాల బోధనను సువ్యవస్థితం చేశారు. ప్రసిద్ధ కవులైన గడియారం వేంకటశేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు రాయలసీమ ప్రాంతం కవులు.

విశ్వనాథ సత్యనారాయణ బహుముఖ ప్రజ్ఞావంతుడైన రచయిత. ఆయన వచనము, నాటకము, గేయము, కథానిక మున్నగు పలుశాఖలలో ఉదాత్తమైన రచనలు చేసి తెలుగు సాహిత్యానికి పుష్టి చేకూర్చారు. వారి 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము' ఆధునిక యుగంలో వెలువడిన ఒక మహాకావ్యం. "కవి ప్రతిభలోన నుండును గావ్య గతశతాంశముల యందుఁ దొంబదియైనపాళ్ళు! ప్రాగ్విపశ్చిన్మతంబున రసము వేయిరెట్లు గొప్పది నవకథాదృతినిమించి" అన్న ప్రత్యయంతో ఆరంభమైనదీ మహా కావ్యరచన.

ఇంక యువతరం కవులలో శ్రీ శ్రీ చాలా ప్రగతి భావాలుగల కవి. ఆయన రచనాపద్ధతి అధివాస్తకవితకు చెందింది; ఛందస్సంప్రదాయాలన్నింటిని త్రోసిపుచ్చి రచనలు సాగించారు. శ్రీ శ్రీ పూర్తిపేరు శ్రీరంగం శ్రీనివాసరావు.

నండూరి సుబ్బారావు 'యెంకిపాటలు' ఆధునికకాలంలో వెలువడిన ఉత్తమ గేయకావ్యం.

ఒక ఉదాహరణ :

ఆరిపేయవె దీపమూ !
యెలుగులో నీమీద నిలపలేనే మనసు !
ఆరిపేయవె దీపమూ !

జిమ్ముమంటా తోట సీకటైపోవాలి,
సీకట్లొ సూడాలి నీ కళ్ళ తళతళలు ! ॥ఆరిపేయవె॥
తళుకుతో నీరూపు తలుసుకొని తలుసుకొని,
సీకట్లొ నా కళ్ళు సిల్లులడ సూడాలి ! ॥ఆరిపేయవె॥
సూపులే ఆపేసి, రూపుపూసే మరిసి,
ఒకరెరుగ కింకొకరు ఒరిగి నిదరోదాము ! ॥ఆరిపేయవె॥

కాకినాడ ఆంధ్రసాహిత్యపరిషత్తు గ్రాంథికభాషావాదానికి పట్టుగొమ్మ కాగా, గిడుగువారి అడుగుజాడల్లో గుంటూరు నవ్య సాహిత్యపరిషత్తు శిష్టవ్యావహారికానికి చేదోడు వాదోడు అయింది.

వీరేశలింగం ప్రభృతుల సంస్కరణ ధోరణి సాహిత్యం ప్రచురప్రచారంలో ఉండగా, త్రిపురనేని రామస్వామిగారి తిరుగుబాటు కవిత్వం తెనుగునాట హేతు వాదానికి హారతులెత్తింది. క్రమంగా దేశంలో వచ్చిన భావవిప్లవం సాహిత్యరంగంలో రూపుదాల్చి, అభ్యుదయసాహిత్యమూ, విప్లవసాహిత్యమూ యుగచేతనకూ, యువ చేతనకూ వేయిదీపిక లెత్తుతున్నాయి ; కొత్త గొంతులు వినిపిస్తున్నాయి.

తెలుగులో ఆధునిక సాంఘిక నవల విషయంలో ఉన్నవ లక్ష్మీనారాయణ మార్గదర్శకులు. సరళము, సహజము అయిన శైలిలో రచింపబడిన వారి 'మాలపల్లి' హరిజనుల జీవితంపై వ్రాయబడిన తొలి ఉత్తమ సాంఘికనవల.

గుడిపాటి వెంకటచలం సాంఘిక విప్లవవాది. ఆయన కథానికలు, నాటికలు ప్రజలలో గొప్ప అలజడిని కలిగించాయి. సాంఘిక నీతిసూత్రాలకు ఆయన కట్టు బడకపోవటాన్ని అవినీతి క్రింద జమకట్టి చాలామంది అలజడి పొందారు. 'కథక చక్రవర్తి' చింతాదీక్షితులు, అంతర్జాతీయ బహుమానం గడించుకొన్న పాలగుమ్మి పద్మరాజు ప్రసిద్ధ కథానికా రచయితలు. ఉమర్ ఆలీషా, జాషువా, జోసెఫ్‌లు హైందవేతరులలో ప్రసిద్ధ తెలుగు కవులు. సురవరం ప్రతాపరెడ్డి, పద్మశ్రీ మాడపాటి హనుమంతరావు, డాక్టరు బూర్గుల రామకృష్ణారావులు తెలంగాణా ప్రాంతంలో ఆధు నిక సాహిత్యోద్యమానికి కర్ణధారులు ; వారు ముగ్గురూ ఉర్దూభాషలో కూడా

మంచిపండితులు. దాశరథి, నారాయణరెడ్డి మున్నగు యువరచయితలు పలువురు బహుముఖ ప్రజ్ఞావంతులై వివిధ సాహిత్య శాఖలలో రచనలు సాగిస్తున్నారు.

బాలసాహిత్యం తెలుగులో ఇటీవలనే ప్రవేశించిన శాఖ. ఈ రంగంలో చాలా మంది కృషిచేశారు. శ్రీ చింతా దీక్షితులుగారు ఈ సాహిత్యానికి తెలుగులో శ్రీకారం చుట్టారు. రేడియోలో పిల్లల కార్యక్రమాలలో ఎన్నో కొత్త మార్గాలు తొక్కిన శ్రీ న్యాపతి రామవరావుగారూ, వారి సతీమణి కామేశ్వరమ్మగారూ కూడా బాల సాహిత్య సృష్టికర్తలే.

ఇంక తెలుగుభాషావిషయంలో గిడుగు రామమూర్తి ప్రథమ గణ్యులు. తెలుగుసాహిత్యంలో వ్యావహారికభాషకు ప్రవేశం కలగటానికి ఆయన మార్గదర్శకులు. వారికి సహాయకులై, అనుచరులై పనిచేసిన వారి కుమారుడు డాక్టర్ గిడుగు వేంకటసీతాపతి తండ్రితో సాటిరాగల విద్వాంసులు. సీతాపతి తోడ్పాటుతో తెలుగులో వివిధ సాహిత్యశాఖల స్వేచ్ఛాభివృద్ధికి వ్యావహారికభాష సజీవ సాధనమైంది. రామమూర్తి ప్రభావంవల్ల పురాతనభాష స్థానంలో సజీవభాష అయిన వ్యావహారిక భాష స్థిరపడింది. ఇంక యువతరం వారిలో వడ్లమూడి గోపాలకృష్ణయ్య వ్యావహారిక భాషోద్యమాన్ని సమర్థవంతంగా చేపట్టి, దానికి ప్రత్యేక వ్యాకరణం కూడా రచించారు. తెలుగుభాషా ప్రపంచంలో ఇంకా సుప్రసిద్ధులైనవారు వర్ఘుల చిన సీతారామస్వామిశాస్త్రి, డాక్టర్ చిలుకూరి నారాయణరావు, గంటిజోగి సోమయాజి, కోరాడ రామకృష్ణయ్య, నిడుదవోలు వేంకటరావు, డాక్టర్ భద్రిరాజు కృష్ణమూర్తి.

ఇంక విమర్శ విషయంలో డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి మార్గదర్శకులు; వారి 'కవిత్వతత్త్వ విచారము' ప్రామాణికమైన రచన. అంతేకాదు, రామలింగారెడ్డి ఆంధ్ర-ఆంగ్ల భాషలలో గొప్ప వక్తలు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, చెఱకువాడ నరసింహం పంతులు కూడా తెలుగులో గొప్ప వక్తలు.

క్రీ.శ. 19వ శతాబ్ది చతుర్థపాదంలో తెలుగు సాహిత్య ప్రపంచంలో పరిశోధనకు శ్రీకారం చుట్టినవారు మానవల్లి రామకృష్ణకవి. వీరు 'ఎమ్. ఆర్. కవి' అన్న ప్రసిద్ధనామంతో అంతర్జాతీయ ఖ్యాతిని గడించుకొన్నారు.

సంగీతం :

కర్ణాటక, హిందూస్థానీ సంప్రదాయాలుగా చీలిపోయినప్పటికీ భారతీయ సంగీతం ప్రధానంగా ఒకటే. ప్రాచీన మహర్షులైన భరత, నారద, మతంగాదులు

భారతీయ సంగీతానికి శాస్త్రాదులు రచించి, సువ్యవస్థితం చేశారు. ఈ శాస్త్రా లన్నింటిలో భరతుని 'నాట్యశాస్త్రం' సంగీత, నృత్య, నాటకాల విషయంలో ప్రామాణిక మైన రచన, కాకతీయ గణపతిదేవుని సేనాపతి అయిన జాయప సేనాని సంగీత నృత్యాలలో విద్వాంసుడై సంగీత రత్నావళి, నృత్త రత్నావళి అనే శాస్త్ర గ్రంథాలను రచించాడు. దేవగిరిరాజైన సింహణ భూపాలుని ఆస్థాన సంగీత విద్వాంసుడు శార్ఙ్గదేవుడు 'సంగీత రత్నాకరము' అనే ప్రామాణిక శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ముస్లింలు భారతదేశాన్ని జయించిన పిమ్మట ఉత్తరభారతంలోని సంగీతం ఇస్లాం ప్రభావానికి లోనై దక్షిణభారత శైలికి భిన్నంగా చాలా మార్పులకు లోనైనది.

క్రీ.శ. 15వ శతాబ్దిలో తాళ్ళపాక అన్నమాచార్యులు, ఆయన కుమారులు, మనుమలు వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ పెక్కు 'పదాలు' రచించారు. క్రీ.శ. 17వ శతాబ్దిలో క్షేత్రయ్య సంగీత శాస్త్రసమ్మతంగా పదరచన సాగించి, శృంగారరసానికి కళాత్మకంగా పరిపూర్ణత్వం కల్పించాడు. క్రీ.శ. 19వ శతాబ్ది ఆరంభంలో త్యాగరాజు తెలుగులో వాగ్గేయకారుడై, అద్వితీయమైనవిధంగా కృతులను రచించి, పాడి, కర్ణాటక సంగీతాన్ని తీర్చిదిద్దినాడు. ఆయన సంగీతాన్ని 'నాదబ్రహ్మ' రూపంగా ఉపాసించినాడు. రామునియందు ఆయనకుగల పరమభక్తి సాటిలేనిది. సంగీతం ద్వారా ఆయన ఆత్మసిద్ధిని పొందాడు. శ్యామాశాస్త్రి, ముత్తుస్వామిదీక్షితార్, త్యాగరాజు—ఈ ముగ్గురు కర్ణాటక సంగీతానికి ప్రఖ్యాత త్రిమూర్తులు.

ఆధునిక కాలంలో సంగీతానికి తమిళదేశంలో ఉన్నంత ప్రజాదరణ ఆంధ్ర దేశంలో లేకపోయినప్పటికీ ఉపేక్షింపబడలేదని మాత్రం చెప్పవచ్చు. విజయ నగరం మహారాజా ఆనందగజపతి సంగీతాన్ని అభిమానించి, ఒక ప్రత్యేక సంగీత కళాశాలను స్థాపించారు. ఆ కళాశాలాధ్యక్షులుగా పనిచేసిన విజయనగరం నివాసి ఆదిభట్ల నారాయణదాసు కవి, వాగ్గేయకారుడు, హరికథాప్రవీణుడు. పిఠాపురం నివాసి అయిన తూమరాడ సంగమేశ్వరశాస్త్రి, విజయనగరం నివాసి అయిన వీణ రామయ్య గొప్ప వైణికులు. సజీవులైన వారిలో ఈమని శంకరశాస్త్రి ప్రఖ్యాత వైణికులు. ఇటీవలనే పరమపదించిన పద్మశ్రీ ద్వారం వేంకటస్వామి నాయుడు కర్ణాటక సంగీతంలో, ఫిడేలువాద్యంలో అగ్రగణ్యులు. 'ఫిడేలు నాయుడు' అన్న పేర ఆయన సుప్రసిద్ధులు. ఆయన తొలి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన సంగీత విద్వాంస పదవిని అలంకరించారు.

బాలమురళీకృష్ణ, నేదునూరి కృష్ణమూర్తి, సోమేశ్వరరావు, వాసా కృష్ణ మూర్తి, వోలేటి వెంకటేశ్వర్లు, శ్రీమతి టి. టి. సీత, శ్రీమతి శ్రీరంగం గోపాలరత్నం

ప్రభృతులు కర్ణాటక సంగీతంలో సుప్రసిద్ధులు. డాక్టరు శ్రీపాద పినాకపాణి గాయకులే కాక సంగీత శాస్త్రజ్ఞులు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గాయకులేకాక సంగీతశాస్త్ర విద్వాంసులు. హైదరాబాదులో హిందుస్థానీ సంగీత గాయకులు పలువురున్నారు. ఈ చిన్నవ్యాసంలో వారందరిని గూర్చి పేర్కొనటం సాధ్యంకాదు. హైదరాబాదులోని ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో కర్ణాటక-హిందుస్థానీ సంగీత సంప్రదాయాలు రెండింటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోంది.

బాలాంత్రపు రజనీకాంతారావుగారు లలితసంగీతరంగంలో అసమానమైన ప్రతిభను వ్యక్తపరిచారు. వీరు కృష్ణశాస్త్రిగారి రచనలకు మంచి సంగీతాన్ని సమకూర్చారు.

నృత్యం :

ఆంధ్రదేశంలో యక్షగానాలకు, లేదా, నృత్య నాటకాలకు ప్రజాసామాన్యంలో చాలా ఆదరణ ఉండేవి. ఇవి ప్రాచీనకాలంలో శ్రీశైలం, అహోబిలం మున్నగు దేవాలయాలకు చెందిన ఆటవిక జాతులవారిచేత ఆడబడేవి. 'అభినయ దర్పణం,' 'భరతార్ణవం' రచించిన నందికేశ్వరుడు ఆంధ్రుడని తలంపబడుచున్నాడు. జాయప సేనాని నృత్తరత్నావళినిగూర్చి ఇంతకుముందే పేర్కొన్నాను. క్రీ.శ. 13 వ శతాబ్ది ప్రాంతాలలో, సిద్ధేంద్రయోగి గురుత్వంలో, కృష్ణాజిల్లాలోని కూచిపూడి బ్రాహ్మణులు భామాకలాప నృత్యాన్ని వృత్తిగా స్వీకరించారు. అటుపిమ్మట నృత్య నాటక ప్రదర్శనాలుకూడ అభ్యసించారు. సిద్ధేంద్రయోగి గొప్ప గాయకుడు; నర్తకుడు. ఆయన ప్రభావంవల్లనే కూచిపూడి గ్రామ బ్రాహ్మణులంతా ఈనాడుకూడా ఈ భామాకలాపాన్ని అభ్యసిస్తున్నారు; వారి పేరుమీదుగా ఈ నృత్యం 'కూచిపూడి భామాకలాపం' అని పిలువబడుతోంది. ఈ భామాకలాపం అభినయ విద్యకు నికషోపలం అంటే అతిశయోక్తి కాదు.

ఈ కూచిపూడి నర్తకులు కొందరు తొలుత విజయనగర చక్రవర్తుల గౌరవాదరాలను పొంది, ఆ సామ్రాజ్య పతనానంతరం తంజావూరు రాజ్యానికి తరలివెళ్లి, అచ్చట నాయకరాజుల ఆదరాభిమానాలకు పాత్రులయ్యారు. కూచిపూడి నర్తకుల భామాకలాపం నేటి తంజావూరు భరతనాట్యానికి, కూచిపూడి నర్తకుల నృత్య నాటకాలు, నేటి మేలట్టూరులోని నృత్యనాటకాలకు మార్గదర్శకాలైనాయి. మహారాజ శరభోజీ (క్రీ.శ. 1798–1832) ఆస్థాన నృత్య విద్వాంసులైన చిన్నయ, పొన్నయ, వడివేలు, శివానందం అనే ప్రఖ్యాత సోదరులు భామాకలాపంలోని, రాజనర్తకి

దేవదాసీ సంప్రదాయాలలోని సారాన్ని గ్రహించి, నేడు తంజావూరు 'భరతనాట్యం' అని పిలువబడే నృత్య విధానాన్ని రూపొందించారు. 'కూచిపూడి నృత్యం ప్రధానంగా పురుషుల నృత్యం; తంజావూరు భరతనాట్యం ప్రధానంగా స్త్రీల నృత్యం. ఈ రెండువిధాలైన నృత్యాలు ఒకే మూలనుంచి ఉద్భవించాయి. రెండింటికి అభినయ దర్పణం, భరతార్ణవం, రసమంజరి అనేవి ప్రామాణిక శాస్త్రగ్రంధాలు."

—పొణంగి శ్రీరామ అప్పారావు

నేటికీ కూచిపూడి నృత్యం ప్రసిద్ధిలో ఉంది. వేదాంతం లక్ష్మీనారాయణశాస్త్రి ఆధునికులలో ప్రామాణికులైన గురువులు; ఆయన కొలదికాలం క్రిందటనే పరమపదించారు. నేడు కూచిపూడి నృత్య విద్యావేత్తలలో సుప్రసిద్ధులైనవారు: భరతకళాప్రపూర్ణ వేదాంతం రామయ్య, వేదాంతం సత్యనారాయణశర్మ, చింతా కృష్ణమూర్తి, వెంపటి సత్యం, భాగవతుల రామకోటయ్య ప్రభృతులు. తదితర నృత్య సంప్రదాయాలలోను, జానపద నృత్యాలలోను సుప్రసిద్ధులైనవారు కొంతమంది ఉన్నారు. నటరాజ రామకృష్ణ నృత్యసంప్రదాయాలన్నీ తెలిసినవారు; అంతేకాదు, సమర్థులైన గురువులు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ ఆధ్వర్యాన ఒక నృత్య శిక్షణా శిబిరం కూడా నిర్వహించారు. కాకతీయ దండనాథుడు జాయపసేనాని రచించిన "నృత్త రత్నావళి" ఆధారంగా పేరిణీ శివతాండవాన్ని పునర్నిర్మించారు. ఏనాడో లుప్తమైపోయిన నృత్య విశేషాన్ని పునర్నిర్మించి ప్రదర్శించడం సులభంకాదు. పేరిణీ శివతాండవానికే కాక. దేవాలయ ఆరాధనా నృత్యాలకు కూడా ప్రాణప్రతిష్ట చేసిన ఘనత శ్రీ నటరాజ రామకృష్ణగారికి దక్కుతుంది. వీరి శిష్యుడు చిరంజీవి సుదర్శన్ పేరిణీ శివతాండవంలో అసమానమైన నేర్పు సంపాదించాడు. అతనికి మంచి భవిష్యత్తుఉంది. సంపత్కుమార్ జానపద నృత్యాలలో కృషిచేశారు. కోరాడ నరసింహారావు విదేశాలలో కూచిపూడి నృత్యాలను ప్రదర్శించి పేరుపొందారు. కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, శ్రీరంగం శ్రీనివాసరావు ప్రభృతుల భావగీతాలను నృత్యానికి అనుగుణంగా మలచటంలో బి. వి. నరసింహారావు మార్గదర్శకులు. కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ నృత్యసంప్రదాయాలలో కుమారి యామినీ కృష్ణమూర్తి ప్రసిద్ధి పొందారు. యువతరంవారిలో కనకదుర్గ, జయశ్రీ, సుమతీకౌశల్, విజయలక్ష్మి వర్ధిష్ణువులైన నర్తకీమణులు. శ్రీమతి రత్నపాప కేవలం నర్తకీమణేకాక ఆంగ్లసాహిత్యంలో పట్టభద్రురాలు. లలితసంగీతంలో పేరుపొందిన సీతా అనసూయల పేరు అందరికీ పరిచితమె. వీరిలో అనసూయ పుత్రిక రత్నపాప. ఈమె విదేశాలలో కూడా ఎన్నో ప్రదర్శనలిచ్చి వచ్చింది. కూచిపూడి, భరతనాట్య సంప్రదాయాలు రెండింటికి నేడు ప్రజాదరణ అధికంగా ఉంది. అందుచేత ఈ నృత్యాలు నేర్చు

కొనటానికి పలువురు బాలికలు ముందుకు వస్తున్నారు; తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు

నాటకం :

సాహిత్యశాఖలన్నింటిలోను నాటకం ఉత్తమోత్తమమైనప్పటికీ, సంస్కృత సాహిత్యంలో నాటకానికి ఉన్నతస్థానం ఉన్నప్పటికీ ('నాటకాంతం సాహిత్యం') ఇంతకుముందు పేర్కొన్న యక్షగానాలను తప్ప ప్రాచీనులైన కవులెవ్వరూ తెలుగులో నాటకాలు రచింపలేదు. ఈ ప్రాచీన కవులందరకు కాళిదాసాదుల నాటకాలు సుపరిచితాలే ; అయినప్పటికీ క్రీ.శ. 19వ శతాబ్ది 7వ దశాబ్దం వరకు తెలుగులో నాటక రచనకు వారెవ్వరూ పూనుకోలేదు. ఇందలి రహస్యం ఇంకా అగోచరంగానే ఉంది. ఆధునికాంధ్ర నాటకరచనా ప్రదర్శనాలకు కందుకూరి వీరేశలింగం పంతులు (క్రీ.శ. 1848-1915) మార్గదర్శకులు. అంతకుముందే ఇద్దరు ముగ్గురు తెలుగు నాటక రచనకు పూనుకొన్నప్పటికీ అవి ప్రదర్శన భాగ్యానికి నోచుకోలేదు. ఈస్టు ఇండియా కంపెనీ అధికార్లు భారతదేశంలో పాదుకొల్పిన 18వ శతాబ్ది ఆంగ్లనాటక రంగస్థల సంప్రదాయాన్ని అనుసరించి, మహారాష్ట్ర, కర్ణాటక నాటక సంఘాలవారు క్రీ.శ. 1880 ప్రాంతాలలో తెలుగు దేశంలో నాటక ప్రదర్శనాలిచ్చారు. వారు నిర్మించిన రంగస్థలాన్ని, నాటకశాలను, తొందరలో వ్రాసి ప్రదర్శింపజేసిన తమ నాటకాలకు, వీరేశలింగం పంతులు ఉపయోగించారు.

'ఆంధ్రనాటక పితామహులు' ధర్మవరం కృష్ణమాచార్యులు, చిలకమర్తి లక్ష్మీనరసింహం, వేదం వేంకటరాయశాస్త్రి, కోలాచలం శ్రీనివాసరావు, తిరుపతి వేంకటకవులు ప్రభృతులు అధికభాగం పౌరాణిక, చారిత్రక నాటకాలు రచించారు. ఇవి అన్నీ విజయవంతంగా ప్రదర్శింపబడ్డాయి. క్రీ.శ. 19వ శతాబ్ది చివరిభాగంలో, వ్యావహారిక భాషలో రచింపబడిన ప్రఖ్యాత స్వతంత్ర సాంఘికనాటకం గురజాడ వేంకట అప్పారావు రచించిన 'కన్యాశుల్కం.' శుల్కం పుచ్చుకొని, బాలికలను (కన్యలను) 50, 60 ఏండ్లవృద్ధులకు భార్యలుగా అమ్మటం, వారు రజస్వలలు కాకుండానే ఆ వృద్ధులు గతించి, ఆ కన్యలు విధవలు కావటం అనే దురాచారాన్ని చిత్రించిన నాటకమిది. తెలుగులోని సాంఘిక నాటకాలకు ఇది తలమానికం అని చెప్పవచ్చు. క్రీ.శ. 20వ శతాబ్దిలోని రెండవ దశాబ్దంలో ప్రసిద్ధికెక్కిన కొన్ని నాటక సంఘాలు: బెజవాడలోని మైలవరం కంపెనీ, ఏలూరులోని మోతే కంపెనీ, రాజమండ్రిలోని గున్నేశ్వరరావు కంపెనీ, బందరులోని డి.వి. సుబ్బారావు కంపెనీ. గుంటూరు, తెనాలి మున్నగుపట్టణాలలో కూడా ప్రసిద్ధాలైన వృత్తినాటక సంఘాలు ఉండేవి.

తెలుగు నాటకరంగ చరిత్రలో విశిష్టంగా పేర్కొనదగిన అంశాలలో 'సురభి వంశం' ఒకటి. ఈ వంశంలో స్త్రీ పురుషులందరూ నటన వృత్తిగా స్వీకరిస్తారు. ఈ వంశంవారు బహుళంగా వృద్ధిపొంది, ఇప్పుడు ముప్పదికిపైగా నాటకసమాజాలను నడుపుతున్నారు. వేర్వేరు సమాజాలను స్వతంత్రంగా నడుపుకొంటున్నప్పటికీ వీరందరు ఒక సమాఖ్యగా ఏర్పడినారు. అవేటి నాగేశ్వరరావు ఈ సమాఖ్యకు నాయకుడు ; ఆయన స్వయంగా ఒక సురభి నాటక సమాజాన్ని నిర్వహిస్తున్నారు.

కోలాహలపూర్వకమైన నటనా విధానాన్ని తిరస్కరించి, సాత్త్వికాభినయానికి ప్రాధాన్యమిచ్చి బళ్ళారి రాఘవాచార్యులు ('రాఘవ' అనేది ప్రసిద్ధనామం) క్రీ.శ. 1930 ప్రాంతాలలో రంగస్థల నటనంలో విప్లవం తీసికొనివచ్చారు. ఆయన తెలుగు నాటక రంగానికి చేసిన సేవ మరి ఏ ఒక్కరూ చేసివుండలేదు. నాడు ఆంధ్రనాటక రంగం చాలా ఉత్సాహంతో పనిచేసింది. మంచి నాటకాలు ప్రయోగింపబడసాగాయి. యువతరంవారు కొత్త పంథాలో రచింపబడే ఆంగ్ల నాటకాలు పరిశీలించారు. మద్రాసు హైకోర్టు ప్రసిద్ధ మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన పి.వి. రాజమన్నారు తమ 'తప్పెవరిది' రచనతో తెలుగులో కొత్త నాటక రచనా విధానానికి నాంది పలికారు. ముద్దుకృష్ణ, నార్ల, ఆత్రేయ, నరసరాజు, తిలక్ ప్రభృతులు కొందరు నాటక కర్తలుగా ప్రసిద్ధిపొందారు. ఆంధ్రదేశంలో నేడు బాగా ప్రచారంలో ఉన్న ఏకాంకికా నాటక రచనకు నార్ల మార్గదర్శకులు. యువతరంవారు నేడు ఆంగ్ల నాటకాలను అనుసరించటమేకాక, మంచి స్వతంత్ర నాటకాలను కూడ రచిస్తున్నారు. ఒకప్పుడు వృత్తి నాటకరంగం బాగా ప్రజాదరణ పొందింది. కాని సినిమా రాకవల్ల అది బాగా దెబ్బ తిన్నది. ఇటీవలికాలంలో సినీ కళాకారుడైన శ్రీ నాగభూషణం గారు 'రక్తకన్నీరు' నాటకాన్ని చాలా జయప్రదంగా ఆంధ్రరాష్ట్రంలో అనేకచోట్ల ప్రదర్శించి ప్రజల మన్ననలను పొందారు. నాటకాన్ని శ్రీ నాగభూషణంగారు ప్రజల దగ్గరకు తీసుకువెళ్లారంటే అతిశయోక్తికాదు. తెలుగు నాటకరంగం పునర్వికాసం పొందితేనేకాని తెలుగులో ఉత్తమ నాటకాలు వెలువడవు.

క్రీ.శ. 1929లో స్థాపింపబడిన 'ఆంధ్రనాటక కళాపరిషత్తు' ఆధ్వర్యంలో ఔత్సాహిక నాటకరంగం అపారంగా అభివృద్ధి పొందింది. 'ది పీపుల్స్ థియేటర్,' హైదరాబాదులోని 'నాట్యసంఘం,' కొప్పరపు సుబ్బారావు స్థాపించిన 'లిటిల్ థియేటర్' మొదలైనవి ఔత్సాహిక నాటకరంగ సంస్థలే. ఆంధ్ర నాటకరంగంమీద సుప్రసిద్ధులైన నటులు ఎందరో ఉన్నారు : దుష్యంతుడుగా యడవల్లి సూర్య నారాయణ, హరిశ్చంద్రుడుగా హరిప్రసాదరావు, దుర్యోధనుడుగా మాధవపెద్ది

వేంకట్రామయ్య, హరిశ్చంద్రుడుగా డి. వి. సుబ్బారావు, కృష్ణుడుగా బందా కనక లింగేశ్వరరావు, అర్జునుడుగా పులిపాటి వేంకటేశ్వర్లు, అనేక ముఖ్య పాత్ర ధారులుగా పీసపాటి, సూరిబాబు, రాఘవులు, స్త్రీ వేషధారులుగా ముప్పిడి జగ్గరాజు, పద్మశ్రీ స్థానం నరసింహారావు సుప్రసిద్ధులైనారు. వీరేకాక ప్రసిద్ధ నటులు ఇంకా చాలామంది ఉన్నారు. నటీమణులలో శ్రీమతి పూర్ణిమ, శ్రీమతి రాజేశ్వరి వృత్తినాటక రంగం మీద సుప్రసిద్ధులైనారు.

అబ్బూరి రామకృష్ణరావుగారు కన్యాశుల్కాన్ని చక్కగా సంక్షిప్తపరచి ఉత్తమ కళా ప్రమాణాలతో ఆంధ్రదేశమంతటా ప్రయోగించారు.

తెలుగులోకి ఇతర భారతీయ భాషలనుంచి నాటక సాహిత్యం అనూదిత మౌతోంది. మరాఠీనుంచి శ్రీవిజయ టెండూల్‌కర్ రచన "శాంతత ! కోర్ట్‌చాలూ ఆహే!" ను శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రిగారూ, తమిళంనుంచి ఇందిరా పార్థసారథి రచన "లేయర్స్ ఆఫ్ బ్లాంకెట్స్" ను శ్రీగోవిందరాజు రామకృష్ణారావుగారూ అనువదించారు. అలాగే ఆంగ్ల నాటక రచయిత షేక్స్‌పియర్ రచన "మెక్‌బెత్" ను శ్రీ అమరేంద్ర అనువదించారు. గ్రీక్ మహాకవి సోఫాక్లిస్ రచన "యాంటిగని" నేను అనువదించాను. ఇక్కడ స్థాలీపులాక న్యాయంగా కొన్ని రచనలనే పేర్కొనడం జరిగింది. ఈ అనువాదాలు తెలుగు నాటక సాహిత్యానికి కొత్త స్ఫూర్తిని ఇవ్వగలవని ఆశించవచ్చు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో రవీంద్రభారతి నిర్మాణం జరగడంతో రాజధానిలో నాటకకళకు కొత్త ఉత్తేజం కలిగింది. ఎన్నో సాంకేతిక సౌకర్యాలున్న రవీంద్రభారతిలో నూతన ప్రయోగాలకు అంకురార్పణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఇటీవలి కాలంలో నాటకరంగానికి ఎనలేని కృషి చేసింది. ప్రసిద్ధ నాటక రచయితల జీవిత సంగ్రహాలను ప్రకటిస్తోంది. "నాట్యకళ" మాస పత్రికను ప్రచురిస్తోంది. అనేక నాటక గోష్ఠి కార్యక్రమాలను నిర్వహించింది. 1973 లో ఆరునారాలపాటు నాటక శిక్షణా శిబిరాన్ని నిర్వహించింది. ఇందులో నలభై ఐదుగురికి ఆహార్యం, రంగోద్దీపనం, నటన, వాచికం, దర్శకత్వం మొదలైన శాఖల్లో సమగ్రమయిన శిక్షణను ఏర్పాటుచేసింది. ఆంధ్రదేశంలో ఇలాంటి శిక్షణా శిబిరం ఏర్పడడం ఇదే మొదటిసారి.

ఈ శిక్షణానంతరం శిక్షణపొందిన బృందం శ్రీ చాట్ల శ్రీరాములు గారి దర్శకత్వంలో అబ్బూరి గోపాలకృష్ణ రచించిన ఆధునిక యక్షగానం "త్రిజాకీయమదర్శ

నం" పన్నెండు ప్రదర్శనలను ఒక సంవత్సర కాలంలో ఇచ్చింది. ఇటీవలికాలంలో నూతన ప్రయోగంగా ఈ ప్రదర్శన పేరుపొందింది. దర్శకులు, నటీనటులు బాగా శ్రమించి ఈ ప్రదర్శనను తీర్చిదిద్దారు. దర్శకుడు శ్రీ చాట్ల శ్రీరాములు బ్రిటిష్ డ్రామాలీగ్‌లో శిక్షణపొంది వచ్చిన యువకుడు. బ్రిటిష్ డ్రామాలీగ్‌లో శిక్షణపొంది "ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్"కు కార్యదర్శి అయిన శ్రీ ఏ. ఆర్. కృష్ణ మరొక ప్రముఖుడు. ఈయన చాలాకాలం ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘానికీ, భారతీయ నాట్య సంఘానికీ కూడా కార్యదర్శిగా పనిచేశారు. ఈయన ఇటీవల భారత జాతీయ పోరాటకాలంలో రచితమైన శ్రీ ఉన్నవ వారి "మాలపల్లి" నవలను నాటకీకరించి పది పన్నెండు రంగస్థలాలపై ఏకకాలంలో నాటకాన్ని ప్రదర్శించి కొత్త ప్రయోగం చేశారు. ఇంకా నూతన ప్రయోగాలను చేస్తున్నవారిలో శ్రీ డీన్ బద్రు, రావి చలం, ఈరంకి సీతారామయ్య ప్రముఖులు. తెలుగు నాటక రంగం మీద కొత్తగాలులు వీస్తున్నవనడానికి ఈ ప్రయోగాలే నిదర్శనం.

నాటకరంగానికి ప్రత్యక్షంగా సంబంధించి ఉండకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో రంగస్థలంమీద ప్రదర్శితమయ్యే కళారూపాలు కొన్ని ఉన్నాయి. వీటిలో బుర్రకథ, జముకులకథ మొదలైనవని ప్రసిద్ధాలు. ఈ ప్రక్రియలు చాలా ప్రాచీనకాలం నుంచే మనకు సంక్రమించాయి. నేడు ఈ ప్రక్రియలో విశేషమైన కృషి చేసిన వారున్నారు. వారిలో ప్రజా నాట్యమండలికి చెందిన శ్రీ నాజర్, శ్రీ లక్ష్మీకాంత మోహన్ ముఖ్యులు. శ్రీ లక్ష్మీకాంత మోహన్ బుర్రకథలనే కాక జానపద గేయాలనుగూడా శ్రావ్యంగా ఆలాపించగల దిట్ట. షేక్స్‌పియర్ నాటకాలను అనువదించడమేకాక, ఆంగ్లంలో షేక్స్‌పియర్ నాటక సాహిత్యంమీద విమర్శకూడా ప్రకటించారు.

నాటకరంగానికి చెందని మరొక ప్రక్రియ ధ్వన్యనుకరణం. శ్రీ నేరెళ్ళ వేణు మాధవ్ ఈ కళలో నిష్ణాతులు. అసలు ఆంధ్రదేశంలో ఈ విద్యకి కళాగౌరవాన్ని సంతరించిన వ్యక్తి యీయన. రకరకాల కంఠస్వరాలనూ, వివిధ వాద్య స్వరాలనూ పలికించడంలో ఈయనకి ఈయనే సాటి. ఇటీవలే అమెరికా మొదలైన విదేశాలు పర్యటించి ఐక్యరాజ్య సమితిలో తన విద్యని ప్రదర్శించి అక్కడి వారిచే అశేష గౌరవాలను పొందిన ఘనులు వీరు.

సినిమా :

తెలుగు సినిమారంగం ఈనాడు మనదేశంలో హిందీ సినిమారంగం తరవాత ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించింది. మొట్టమొదటగా తెలుగులో 1931లో శ్రీ హెచ్.యం. రెడ్డిగారు "భక్త ప్రహ్లాద" చిత్రం నిర్మించారు. ఆనాటినుంచీ

ఈనాటివరకూ ఎంతోమంది ప్రతిభావంతులు సినిమారంగాన్ని బహుముఖాల అభివృద్ధి చేశారు. కాంచనమాల, పుష్పవల్లి, కన్నాంబ, భానుమతి, నాగయ్య, నారాయణరావు, గోవిందరాజుల సుబ్బారావు మొదలైనవారు నటీనటులుగా రాణించారు. శ్రీ సి. పుల్లయ్య, బి.యన్. రెడ్డి, ఘంటసాల బలరామయ్య, గూడవల్లి రామబ్రహ్మం, మీర్జాపూర్ రాజా మొదలైన వారెందరో దర్శకులుగా తమ ప్రతిభను ప్రకటించారు. తెలుగు చిత్రనిర్మాణం పౌరాణిక చిత్రాలతో ప్రారంభమైంది. మొదటి సాంఘికచిత్రం "ప్రేమ విజయం" 1936లో నిర్మించబడింది. సాంఘిక సమస్యల గురించీ సంఘసంస్కరణ గురించీ నిర్మించిన చిత్రాలు సుమంగళి, గృహలక్ష్మి, మాలపిల్ల, రైతుబిడ్డ ఉత్తమ కళాఖండాలు. బి.యన్. రెడ్డిగారి "మల్లీశ్వరి" చరిత్రాత్మక చిత్రం.

శ్రీ యన్.టి. రామారావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు చిత్రరంగానికి మకుటాలు లేని మహారాజులుగా వెలుగొందుతున్నారు. సినిమా రచనలో సముద్రాల, పింగళి, మల్లాది కృష్ణశాస్త్రి, నారాయణరెడ్డి, దాశరథి, శ్రీశ్రీ, ఆత్రేయ, ఆరుద్ర ప్రభృతులు పేరుపొందిన మేటి రచయితలు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అనేక విధాలుగా రాష్ట్రంలోని సినిమా పరిశ్రమకు సహాయపడుతోంది.

విగ్రహశిల్పం :

చిత్రలేఖనం, విగ్రహశిల్పం, వాస్తుకళ—వీటిల్లో ఆంధ్రుల దెప్పుడూ ప్రముఖస్థానమే. ఆంధ్రుల చరిత్రను వివరించే సమయంలో ఆంధ్రుల వాస్తుకళను గూర్చి సంక్షిప్తంగా వివరించి ఉన్నాను. భారతీయ సంప్రదాయంలోనే కాక ఆంధ్ర సంప్రదాయంలోకూడా విగ్రహశిల్పానికి, వాస్తుకళకు సన్నిహిత సంబంధం ఉంది. రాతి దేవాలయాలలో శిల్పాలు మలచటం జరిగింది. మెత్తని రాళ్ళమీద శిల్పాలు చెక్కి బౌద్ధ స్తూపాలకు చుట్టూ అమర్చేవారు. దేవాలయ గోపురాలు కూడా శిల్పాలకు చక్కని అవకాశం కల్పించాయి. విజయనగర సామ్రాజ్యంనాటి రాజభవనాలలోను, పెద్ద పెద్ద శాలలలోను శిల్ప విన్యాసాలు కన్పట్టగలవు. ఆంధ్రుల చరిత్రలోని శాతవాహన, ఇక్ష్వాకు, విష్ణుకుండి, పల్లవ, చాళుక్య, కాకతీయ, విజయనగర రాజుల కాలాల్లో వాస్తుకళతోపాటు విగ్రహశిల్పం కూడా అభివృద్ధి పొందింది. లభించిన విధంగా భద్రపరుపబడిన ఈ శిల్పాలన్నింటిని ఆయా ప్రాంతాలలో కాని, పురావస్తు ప్రదర్శనశాలల్లో కాని నేటికిని చూడవచ్చు. భారతీయ ప్రభుత్వమేకాక ఆంధ్ర ప్రభుత్వం కూడా ఈ పురాతన కట్టడాలను భద్రపరచడానికి చాలా జాగ్రత్త తీసికొంటున్నది.

అమరావతి, నాగార్జున కొండ స్తూపాల చుట్టూ చలువరాళ్లలో మలచబడిన జాతక కథల శిల్పాలే మనకు లభించిన తొలిశిల్పాలు. గౌతమ బుద్ధుని వివిధ జన్మలకు సంబంధించిన కథలను కళాత్మకంగా, విశదంగా ఈ శిల్పాలు నిరూపిస్తున్నాయి. ఆ విగ్రహాల ముఖభావాలు, కదలికలు, వివిధ అంగ విన్యాసాలు సజీవ వ్యక్తులవలెనే బుద్ధుని ఆశయాలను, కథలను, బోధలను వ్యక్తం చేస్తున్నాయి. సాంచీలోని ప్రసిద్ధ తోరణం, మహాబలిపురంలోని అర్జునుడి తపస్సు, లేపాక్షిలోని మహానంది, రామప్ప గుడిలోని నృత్య భంగిమలు, హంపిలోని నృసింహ మూర్తి—ఇవి ఆంధ్రుల ప్రసిద్ధ శిల్పాలలోని కొన్ని మాత్రమే. ప్రాచీన సాంప్రదాయానికి చెందిన కొలదిమంది శిల్పులు మాత్రం నేటికీ మినుకు మినుకు మంటూ జీవించి ఉన్నప్పటికీ బౌద్ధ హైందవశిల్ప సంప్రదాయాలు నశించి పోయాయనే చెప్పవచ్చు ; ఇది మన దురదృష్టం. ఈ విధంగా ఈ కళను నశించి పోనీయరాదు.

శిల్పాలు అంటే, పాశ్చాత్య మతం ప్రకారం, వ్యక్తుల విగ్రహాలు, లేదా, సామూహిక చిత్రణం. ఈ ఆధునిక శిల్పంకూడా నేటి ఆంధ్రులలో ప్రచారం పొంద లేదు. యువతరానికి చెందిన వర్ధిష్ణువులైన శిల్పులు కొందరు ఇప్పుడిప్పుడు అభి వృద్ధిపథంలో ప్రయాణిస్తున్నారు. కాని దేవీప్రసాదరాయ్ చౌదురివలె ప్రఖ్యాతి పొందినవారు ఆంధ్రులలో ఇంకా ఎవ్వరూ లేరు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఉస్మాన్ సిద్దికీ మంచిశిల్పి.

దక్కన్‌లో ముస్లిం పరిపాలన ఆరంభమైన పిమ్మట వాస్తుకళ వికసించిందని చెప్పవచ్చు. కుతుబ్‌షాహీల పరిపాలనలో గోల్కొండలోను, అసఫ్ జాహీల పరిపాలనలో హైదరాబాదులోను వాస్తుకళ వికాసం పొందింది. నాటి నిర్మాణాలైన చార్ మినార్, మక్కామసీదు, కుతుబ్‌షాహీల గోరీలు మున్నగునవి నేటికీ భద్రంగా కాపాడబడటం మనం చూస్తున్నాము. ఆంధ్రలో, వాస్తుకళా విషయంలో, బ్రిటిష్ వారు ఎట్టి కృషి చేయలేదు. పబ్లిక్ వర్క్సు శాఖద్వారా బ్రిటిషు ప్రభుత్వం కొనసాగించిన వాస్తు నిర్మాణ శైలియే దురదృష్టవశాత్తు ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. పాశ్చాత్య శిల్పుల, వారి శిష్యుల ప్రభావంవల్ల ఈ పరిస్థితిలో క్రమంగా మార్పు వస్తోంది. న్యూఢిల్లీ, చండీగర్‌లలోని నూతన నిర్మాణాలను, దేశంలోని ముఖ్య పట్ట ణాలలోని కొందరు వ్యక్తుల సొంత భవనాలను చూస్తే ఈ విషయం స్పష్టం కాగలదు. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని నిర్మించిన నవాబ్ అలీ నవాబ్‌జంగ్ ప్రసిద్ధ వాస్తు శిల్పి. ఇటీవల ప్రభుత్వ వాస్తుశిల్పి పదవీ విరమణ చేసిన ఫైజుద్దీన్ హైదరాబాదులోని రవీంద్రభారతి నిర్మాణాన్ని రూపొందించారు. ఆంధ్రుల జాతీయ నాటకశాల అయిన

ఈ 'రవీంద్ర భారతి' హైదరాబాదులో ఇటీవల నిర్మింపబడిన వాస్తు కళాత్మకమైన కట్టడం.

నేడు పలువురు యువకులు వాస్తుకళలో శిక్షణ పొందుచుండుట సంతోష కరమైన విషయం. హైదరాబాదులోని 'ఆర్ట్స స్కూలు'లో ముప్పది మందికి పైగా బాలికలు వాస్తుకళ నేర్చుకొంటున్నారు.

చిత్రలేఖనం :

చిత్రలేఖన కళలో ఆంధ్రులు రమణీయమైన కృషి చేశారు. సాటిలేని సౌందర్యంతో కూడుకొన్న అజంతా బౌద్ధ చిత్రాలు ప్రాచీన శిల్పశాస్త్ర సమ్మతంగా కడుసమర్థతతో చిత్రింపబడినాయి. అజంతా, బాగ్, సిత్తన్‌వాసల్, సిగిరియాలలోని 'ఫ్రెస్కో' చిత్రాలకు కళాత్మకంగా సన్నిహిత సంబంధం ఉంది. అజంతా చిత్రాలు సాతవాహన, వాకాటక, బాదామి చాళుక్యుల కాలాల్లో చిత్రింపబడ్డాయి. తరువాతి కాలంలో కూడా చిత్రలేఖన కళ బాగా కొనసాగుతూనే వచ్చింది.

కాకతీయ యుగానికి చెందిన చిత్రాలు దురదృష్టవశాత్తూ లభించకపోయినా, ఆనాటి చిత్రలేఖనా శైలిని అర్థం చేసుకోవడానికి రాచకొండలో కొద్దిగా మిగిలి ఉన్న చిత్రఖండం ఉపకరిస్తుంది. ఈ చిత్రఖండం రేచర్ల వెలమనాయకులు రాచ కొండను రాజధానిగా చేసుకొని పాలించిన కాలం నాటిది. ఈ చిత్రఖండం ఎల్లోరా లోని ఇంద్రసభ చిత్రాలను కొంతవరకు పోలిఉన్నది. మనకు తెలిసినంతలో ఆంధ్ర దేశంలో లభించిన అతిపురాతన చిత్రం ఇదే.

విజయనగర సామ్రాజ్య కాలానికి చెందిన లేపాక్షి చిత్రాలు జగత్ ప్రసిద్ధిని పొందాయి. లేపాక్షి చిత్రాలకు సమకాలీనాలయిన చిప్పగిరి చిత్రాలు గూడా విజయ నగర శైలికి మంచి ఉదాహరణలే. విజయనగర సామ్రాజ్యపు తుది దినాలకు చెందిన సోమపాలెం చిత్రాలు చాలావరకు కాల ప్రభావానికిలోనై నశించినా, ఇంకా ఉన్న చిత్రాలు అత్యంత మనోహరమైనవి. రేఖలోని లాలిత్యం మనలను ముగ్ధు లను చేస్తుంది.

మాచెర్ల, కాళహస్తి, పిల్లలమర్రి దేవాలయాలలోని చిత్రాలు విజయనగర చిత్రలేఖనపు క్షీణదశను సూచిస్తాయి. వీటిలో కాళహస్తి దేవాలయంలోని చిత్రాలు కలంకారీ చిత్రశైలిలో చిత్రితమైనాయి.

కాగా, ఆంధ్రదేశంలో హిందూపరిపాలనలో 'ఫ్రెస్కో' చిత్రాల సంప్రదాయం నిరంతరంగా సాగింది. గోల్కొండలో ఇస్లాం రాజ్యం ఏర్పడిన పిమ్మట ఆంధ్ర

చిత్రకారులు మొగల్ శైలి చిత్రలేఖనం చేపట్టారు. ఈ శైలి అత్యంత మనోహరమైన 'దక్కన్ స్కూల్ ఆఫ్ మీనియేచర్ పెయింటింగ్' గా అభివృద్ధి పొందింది. బ్రిటిష్‌వారి పాలనలో ఆంధ్రదేశంలో చిత్రలేఖన కళకు కూడా ఎట్టి దోహదం కలుగ లేదు. బెంగాలులో అవనీంద్రనాథటాగూర్ స్థాపించిన వంగ సంప్రదాయపు ప్రభావం పడేవరకు ఆంధ్రదేశంలో చెప్పుకొనతగిన కృషి ఏమీ జరుగలేదు.

ఆధునికకాలంలో ఆంధ్ర చిత్రలేఖనానికి మార్గదర్శకులు దామెర్ల రామారావు, అడివి బాపిరాజు. రామారావు బొంబాయి కళాశాలలో శిక్షణ పొందారు. ఆయన అజంతా చిత్రాలనుండి ఉత్సాహంపొంది, స్వీయ ప్రతిభకు తగిన ఒక క్రొత్తశైలిని రూపొందించుకొన్నారు. ఆయన చిత్రాలలోని రేఖా విన్యాసం, సమీకరణంలోని చిత్రణంలోని పొందిక, వర్ణసారళ్యం చాలా గణనీయాలు, గుణాధికాలు. బాపిరాజు ఎంతగొప్పచిత్రకారుడో అంత గొప్పకవి, నవలాకారుడు, పత్రికారచయిత. నా దృష్టిలో అయితే బాపిరాజు ప్రప్రథమంగా కాల్పనికోద్యమానికి చెందిన ఉత్తమ కళాకారుడు. వంగ సంప్రదాయానికి చెందిన ప్రమోద్‌కుమార్ చటర్జీనుండి ఉత్సాహం, ఆయనకడ శిక్షణా పొందారు బాపిరాజు. బాపిరాజు చిత్రాలన్నీ ప్రత్యేకమైన స్వీయముద్రకలవి. ఆయన రేఖావిన్యాసంలో కోమలత్వం, భావప్రకటన సామర్థ్యం, క్రియాత్మకశక్తి ఉన్నాయి. కాని, ఆయన బహుముఖప్రజ్ఞకలవాడై, అనేక వ్యాసంగాలలో అభిరుచి కలవాడై ఉండటంవల్ల ఎక్కువ చిత్రాలను రచింపకపోవటం మన దురదృష్టం.

చామకూర్, నాగేశ్వరరావులు వ్యక్తి చిత్రణంలో సిద్ధహస్తులు. రామమోహన శాస్త్రి తైలవర్ణ, జలవర్ణ చిత్రలేఖనాలు రెండింటిలోను సిద్ధహస్తులు. బహుశా ఇంగ్లండులో శిక్షణపొందిన తొలి ఆంధ్రచిత్రకారుడు ఈయనే. భాగీరథి జానపద చిత్రణంలో ప్రసిద్ధులు. హైదరాబాదులో ఖాన్‌బహదూర్ సయీద్ అహ్మద్, జలాలుద్దీన్‌లు ప్రసిద్ధ చిత్రకారులు. అజంతా చిత్రాలను యథాతథంగా చిత్రించటం మూలంగా వారు చిత్రలేఖన కళకు అమూల్యమైనసేవ చేశారు. యువతరంవారిలో పైడిరాజు, హెచ్.వి. రామగోపాల్, మొక్కపాటి శ్రీనివాసులు, పి.టి. రెడ్డి, ఎస్.వి. రామారావు, కృష్ణారెడ్డి, రెడ్డెప్పనాయుడు, మధుసూదన్, జగదీశ్‌మిత్తల్, శ్రీరావు, శ్రీమతి కరుణారావు, కుమారిలస్వామి, సయీద్ మాసూద్ అహ్మద్, కొండపల్లి శేషగిరిరావు, విద్యాభూషణ్, కుమారి ఫాతిమా అహ్మద్‌లు ముఖ్యంగా పేర్కొనదగ్గవారు. వీరిలో శ్రీ కృష్ణారెడ్డి పారిస్‌నగరంలో స్థిరపడ్డారు. ఈయన "ఎచింగ్" లో నిష్ణాతులు, ప్రపంచమంతటా ఈయనపేరు విఖ్యాతమైంది. శ్రీ ఎస్.వి. రామారావు ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నారు. అనేక అంతర్జాతీయ బహుమతులు

పొందిన వీరు, విశ్వవిఖ్యాత కళావిమర్శకులు శ్రీ హెర్బర్ట్ రీడ్ ప్రశంసలను పొందిన మనుడు. వర్ధిష్ణువులైన చిత్రకారులు ఇంకా ఎంతమందో ఉన్నారు. హైదరాబాదులో శక్తిమంతులైన చిత్రకారులు, యువతీయువకులు పలువురున్నారు. ఆంధ్రచిత్రకారులు ప్రాచీన నవీన సంప్రదాయాలు రెండింటినీ ఆదరిస్తారు. వారు ఉత్సాహవంతులేకాక నిజమైన కళోపాసకులు. త్వరలోనే భారతీయ చిత్రకళకు గొప్ప విశిష్టతను చేకూర్చగల చిత్రకారులు ఆంధ్రప్రదేశ్‌లో వెలయగలరని నేను గాఢంగా విశ్వసిస్తున్నాను.

చేతిపనులు :

ఆంధ్రప్రదేశ్‌లో అందమైన వస్తువులు కొన్ని సంప్రదాయసిద్ధంగా చేతిపనుల ద్వారా తయారు అవుతున్నాయి. కళాభిమానులందరు తప్పక సంపాదించి భద్రపరచుకోవలసిన వస్తువులివి. బీద్రీవస్తువులు, నిర్మల్‌వస్తువులు, దంతంతో, కొమ్ముతో తయారుచేయబడిన వస్తువులు, వెండినగిషీ వస్తువులు, కొండపల్లి బొమ్మలు, తిరుపతి ఎఱ్ఱచందనం బొమ్మలు, చర్మవస్తువులు, తివాసీలు, దుప్పటీలు, చాపలు, పేము వస్తువులు—ఇవి అన్నీ చేతిపనులవల్ల తయారవుతున్న వస్తువులే. ఆంధ్రప్రదేశ్ చేనేతవస్త్రాలకు కూడా ప్రసిద్ధికెక్కింది. గద్వాల్, సిద్దిపేట, పోచంపల్లి, ఉప్పాడ, వెంకటగిరి చీరలు, ఆర్మూర్ సిల్కువస్త్రాలు, హిమ్రూ గద్వాల్ చోళ్‌ఖాస్‌లు, పొందూరు సన్నబట్టలు, కలంకారీ అద్దకాలు—ఇవి అన్నీ హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విక్రయశాలలో లభిస్తున్నాయి.

జానపద వినోదాలు :

'జనపద' మంటే పల్లెటూరు. జనపదాలలో ఉండేవారు జానపదులు. ఈ జానపదులు వినోదాలలో నృత్య, సంగీత, నాటకాలేకాక, ఇంకా అనేకం ఉన్నాయి—తోలుబొమ్మలాటలు, కట్టెబొమ్మలాటలు, పగటివేషాలు, బుట్టబొమ్మలు, విప్రవినోదం, పులివేషాలు మొదలైనవి. తుమ్మెదపాటలు మొదలైనవి జానపద సంగీతానికి సంబంధించినవి. హరికథలు, బుర్రకథలు, భజనలు, బతకమ్మపాట మొదలైనవి నృత్యసంగీతాలు రెండింటికీ చెందుతాయి. కురవంజి, యక్షగానం, వీధి భాగవతం నాటకానికి చెందుతాయి. ఇవేకాక పర్వత అరణ్యప్రాంతాలకు చెందిన చెంచులు, భిల్లులు, లంబాడీలు, కోయలు మున్నగువారి నృత్య వినోదాలు అనేకం ఉన్నాయి. ఈ జానపద వినోదాలకు ఉపయోగపడే గేయాలు నాగరక చిత్రకల్పనలకు దూరమై,

సుఖదుఃఖాలను స్వయంగా అనుభవించిన జానపదకవుల హృదయాలనుండి సూటిగా వెలువడినవి; ఇవి తెలుగులోని లలిత, లేదా, మధుర సాహిత్యానికి ప్రథమోదాహరణాలు. పండుగపబ్బాలసమయాల్లో, ఉత్సాహంతో స్త్రీపురుషులందరూ సామూహికంగా తమతమ ఆచార సంప్రదాయాల్ని అనుసరించి ఈ వినోదాల్లో పాల్గొంటారు.

జానపద సాహిత్యం తెలుగులో అనంతంగా ఉంది. ఈ రంగంలో కృషిచేసిన ప్రముఖులు శ్రీ నేదునూరి గంగాధరంగారు. వీరు ఎన్నో జానపదగేయాలను సేకరించి ప్రచురించారు. ఇలాగే డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ తూమాటి దొణప్ప, శ్రీహరి ఆదిశేషుగార్లు ఈ రంగంలో కృషిచేసి ఎన్నో వ్యాసాలను ప్రకటించారు.

ఈ వినోదాలు నేడు నశించిపోతున్నాయి. పోగా మిగిలినవాటికి నాగరకతా ప్రభావం సోకి, వాటిలోని సహజ ప్రాకృతిక సౌందర్యం లోపిస్తోంది. వీటిని పునరుజ్జీవింపజేయటానికి కృషి జరగాలి. భారతప్రభుత్వం ప్రతి సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవంలో న్యూఢిల్లీలో అఖిల భారతీయ జానపద నృత్య సంగీతాలను ప్రదర్శింపజేస్తున్నారు. ఆ విధంగానే, ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర జానపద సంగీత నృత్యాదులను ప్రదర్శింపజేయవచ్చు.

విశ్వవిద్యాలయాలు :

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఐదు విశ్వవిద్యాలయాలు పని చేస్తున్నాయి. కేంద్ర విశ్వవిద్యాలయం కూడా ప్రారంభం అయింది. ఆంధ్రప్రదేశ్‌వంటి సువిశాలమైన రాష్ట్రానికి విద్యావసరాలకు ఈ విశ్వవిద్యాలయాలు సహాయపడుతున్నాయి. వీటిలో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు మిగిలిన విశ్వవిద్యాలయాలకన్నా ముందుగా స్థాపించబడింది. తెలుగుజిల్లాల కొక విశ్వవిద్యాలయముండాలనీ, తెలుగు భాషాభివృద్ధికీ సంస్కృతి పరిరక్షణకు ఇది అవసరమనీ అర్ధశతాబ్దం కింద మేధావులు కొందరు భావించినందు వల్లనూ, వారి కృషివల్లనూ ఆంధ్ర విశ్వకళాపరిషత్తు యేర్పడింది. డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డి, పానగల్లు మహారాజాల కృషితో ఈ విశ్వకళాపరిషత్తు శాస్త్రీయ విధానంలో రూపొందించబడింది. డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ వి. యస్. కృష్ణ వంటి ప్రసిద్ధ పురుషులు ఈ విశ్వకళాపరిషత్తుకు ఉపాధ్యక్షులుగా పనిచేశారు. విజ్ఞానశాస్త్ర రంగంలో ఈ విశ్వకళాపరిషత్తు ఎంతో అభివృద్ధిని సాధించింది.

నైజాం నవాబు వితరణవల్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం రూపుదాల్చింది. ఆధునిక విజ్ఞానాన్ని ఆనాటి హైదరాబాదు సంస్థాన రాజభాష అయిన ఉర్దూలోనే బోధించబడింది. ఈ విశ్వవిద్యాలయం ఉర్దూలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎంతో కృషి చేసింది. ఈ విశ్వవిద్యాలయానికి నవాబ్ ఆలీ యావర్ జంగ్, డాక్టర్ భగవంతం, డాక్టర్ డి. యస్. రెడ్డి ప్రభృతులు ఉపాధ్యక్షులుగా పనిచేసి అభివృద్ధిలోనికి తెచ్చారు.

శ్రీ తిరుపతి వేంకటేశ్వర దేవస్థానంవారి విరాళంతో తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం యేర్పడింది. రాయలసీమ ప్రాంతాలకు ఈ విశ్వవిద్యాలయం ఎనలేని సేవ చేస్తోంది. శ్రీ గోవిందరాజులు నాయుడు వంటి మేధావులైన ఉపాధ్యక్షుల నేతృత్వంలో ఈ విశ్వవిద్యాలయం ఎంతో ప్రగతిని సాధించింది.

హైదరాబాదులోని వ్యవసాయ విశ్వవిద్యాలయం, సాంకేతిక విశ్వవిద్యాలయం, కేంద్రవిశ్వవిద్యాలయం కూడా ఎంతో గర్వించదగ్గ కృషిని చేస్తున్నాయి.

పరిశోధనలు :

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట, అంతకంటె అధికంగా తొలుత ఆంధ్రరాష్ట్రం, తరువాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిమ్మట తెలుగు దేశంలో వివిధ రంగాలలో పరిశోధనాసక్తి పెంపొందింది. రాష్ట్రంలోని మూడు విశ్వవిద్యాలయాలు ఇందులకు ఎంతగానో దోహదం చేశాయి ; చేస్తున్నాయి. తెలుగు సాహిత్యంలో, సంగీత నృత్యనాటకాది కళలలో పరిశోధనలు జరుగుతున్నాయి. పలువురు నన్నయ తిక్కనాది కవులపై, చరిత్రపై, చిత్రలేఖనాది లలితకళలపై, నవలలు, నాటకాలు, నవ్య కవితలపై, నృత్య సంగీతాలపై, జానపద వినోదాలపై, చేతిపనులపై, చక్కని పరిశోధనలు కావించి, గ్రంథాలు రచిస్తున్నారు ; డాక్టరేటు డిగ్రీలు పొందుతున్నారు. డిగ్రీ సంపాదనతో నిమిత్తం లేకుండా మరి కొందరు జిజ్ఞాసువులు స్వయంగా పరిశోధనలు సాగించి, ఫలితాలను గ్రంథరూపంలో అందిస్తున్నారు. భరతముని నాట్యశాస్త్రం సమగ్రానువాదం పొందింది తొలుత తెలుగు భాషలోనే. ఇట్టి పరిశోధనలన్నీ ప్రాచీన, నవీన సాంప్రదాయాలు రెండింటికి మధ్య సేతువుగా నిల్చి, జాతి చైతన్యాన్ని జాగరితం చేస్తాయి. పై పరిశోధనగ్రంథాలలో ఇప్పటికి కొన్ని మాత్రమే ముద్రణ భాగ్యం పొందాయి. తక్కినవి కూడా ముద్రణ భాగ్యం పొంది, ప్రజలందరికీ

అందుబాటులోకి వచ్చినప్పుడు భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి అవి ఎంతగానో ఉపకరిస్తాయి.

అకాడమీలు :

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన పిమ్మట, సాంస్కృతిక పునర్వికాసం కలిగించాలన్న ఆశయంతో లలిత కళలకు—సాహిత్యం, సంగీతం, నృత్యం, నాటకం, పురావస్తు సంచయం—వీటికి ప్రోత్సాహ సహకారాలివ్వటం కోసం ప్రభుత్వం చేయగలిగినదంతా చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, లలిత కళా అకాడమీ, పురావస్తు పరిశోధనశాఖ, జాతీయ నాటకశాల అయిన రవీంద్రభారతి ఉన్నాయి ; మూడు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలు, రెండు ప్రైవేటు నాటక విద్యాలయాలు ఉన్నాయి. కూచిపూడి గ్రామంలో కూచిపూడి నృత్యశిక్షణ కేంద్రం నెలకొల్పబడింది. హైదరాబాదులో వాస్తుకళ, లలితకళల ప్రభుత్వకళాశాల ఉంది. రెండు పురావస్తు ప్రదర్శనశాలలు —ఒకటి హైదరాబాదులో, ఇంకొకటి విజయవాడలో—ఏర్పాటు చేయబడినాయి. ఇవికాక, హైదరాబాదులో సుప్రసిద్ధమైన 'సాలార్ జంగ్ మ్యూజియం' ఉంది.

శ్రీ బి. రామకృష్ణరాజుగారూ, శ్రీ పసల సూర్యచంద్రరావుగారూ, సంగీత నాటక అకాడమీ ద్వారా సంగీత,నాటక కళలకు ఎనలేని సేవ చేశారు. సంగీత నాటక అకాడమీ ద్వారా ఎన్నో విలువైన గ్రంథాలను ప్రచురించారు.

శ్రీ నూకల నరోత్తమరెడ్డిగారూ, శ్రీ ఎల్. ఎస్. గుప్తాగారూ చాలా కాలం ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీకి సారథ్యం వహించి చిత్ర శిల్ప కళలకు ఎంతో ప్రోత్సాహన్నిచ్చారు.

సాహిత్య అకాడమీ ఎన్నో విలువైన గ్రంథాలను ప్రచురించి భాషా సేవ చేస్తోంది. భాషా విషయిక పరిశోధనలలో సహాయకారులుగా ఉండే ఎన్నో గ్రంథాలను ప్రచురించడం సామాన్యం కాదు. సాహిత్య అకాడమీ నెరపుతున్న కృషికి అధ్యక్షులు డా. బెజవాడ గోపాలరెడ్డి, కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావుగారల ప్రధానులూ, ప్రశంసనీయులూను. రాష్ట్రంలోని సైన్సు అకాడమీ విజ్ఞాన ప్రసారానికి ఎంతో కృషి చేస్తున్నది. తెలుగుఅకాడమీ పాఠ్య గ్రంథాలను తయారు చేయించి ప్రచురించడమేకాక, భాషా విషయంలో అమూల్యమైన పరిశోధనలను కూడా చేస్తోంది.

అకాడమీలన్నీ తమ తమ రంగాలకు సంబంధించిన సంస్థలకు తగిన చేయూత నివ్వటానికీ, పరిశోధనలను ప్రోత్సహించటానికీ కృషి చేస్తున్నాయి. పేదవారైన వృద్ధ కళాకారులకు ఉచిత వేతనాలివ్వటం జరుగుతోంది. రవీంద్రభారతి నిర్మాణానికి పూర్వం ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ నాటకశాల లేదు. ఇప్పుడు ఆ కొరత తీరింది. ఇదేవిధంగా జిల్లా కేంద్రాలలో, మునిసిపాలిటీలలో జాతీయ నాటకశాలలు నిర్మించ టానికి కృషి సాగుతోంది. క్రమంగా ఆంధ్రులు, ఉన్న కొలదిసాధనాలతో, అవ కాశాలతో, ధైర్యంగా, దృఢ సంకల్పంతో, ఆశతో, అమోఘమైన సాంస్కృతిక పునరుజ్జీవనం సాధించగలమన్న ఆత్మప్రత్యయంతో అభివృద్ధి పథకంలో పురోగ మిస్తున్నారు.

పత్రికారంగం :

ఆంధ్రప్రదేశ్‌లో పత్రికారంగం దేశంలోని యే రాష్ట్రంలోని పత్రికారంగానికీ తీసిపోనిది. ఎంతోమంది పత్రికా రచయితలు ఆంధ్రప్రదేశ్‌లో తమ విద్యకు శ్రీకారం చుట్టిన తరువాత యావద్భారతదేశ ఖ్యాతిని సముపార్జించారు. తెలుగులో కేవలం దిన పత్రికలూ, వార, మాస, పత్రికలే కాక, పరిశోధనలకు అంకితమైన పత్రికలూ స్థాపించబడినై. ఆంధ్రపత్రికను దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారు ప్రారంభించి తెలుగులో దిన పత్రిక స్థాపనలో ప్రథములైనారు. ముట్నూరి కృష్ణా రావుగారు కృష్ణాపత్రికను స్థాపించి ఆంధ్ర సాంస్కృతిక రంగానికి యెంతో సేవ చేశారు. డాక్టర్ పట్టాభి, టంగుటూరి ప్రకాశం, మాడపాటి హనుమంతరావు వంటి నాయకులు అటు రాజకీయాలలోనే కాక పత్రికా రచనలో గూడా విఖ్యాతులైనారు. కేవలం సారస్వత పరిశోధనలకు అంకితమైన పత్రికలలో శ్రీ పూండ్ల రామకృష్ణయ్యా గారి అముద్రిత గ్రంథ చింతామణి చెప్పుకోదగ్గది. కోటంరాజు పున్నయ్యా, కోటం రాజు రామారావు, ఖాసా సుబ్బారావు ప్రభృతులు ఆంగ్ల పత్రికా రచనలో యావద్భరత ఖ్యాతిని పొందారు. తెలంగాణా ప్రాంతంలో శ్రీ సురవరం ప్రతాపరెడ్డి గారు చాలాకాలం గోలకొండ పత్రికను ప్రచురించి ఆ ప్రాంతంలో రాజకీయ, సాంస్కృతిక చైతన్యానికి కారకులైనారు. ఉర్దూ పత్రికా రచయిత శ్రీ షోయి బుల్లా ఖాన్ తాను నమ్మిన భారత జాతీయ వాదం కోసం కలంతో పోరాడి చివరకు ప్రాణాలు సైతం కోల్పోయిన ధీశాలి. ఈ నాటికీ పత్రికా రచనను సాగిస్తున్న శ్రీ చలపతిరావు, శ్రీ నార్ల వెంకటేశ్వరరావు, శ్రీ గోరాశాస్త్రి, శ్రీ జి.కె. రెడ్డిగారలు ఏ దేశానికైనా వన్నె తేగలిగిన మేధావులు.

దేశ పునరుజ్జీవనానికి గ్రంథాలయా లెంత అవసరమో చెప్పనవసరంలేదు. ఈ రంగంలోకూడా ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసిందనే చెప్పాలి. ఈ నాడు ఊరూరా గ్రంథాలయాలు వెలసినవంటే కారణం శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారూ, పాతూరి నాగభూషణంగారూ శక్తివంచన లేకుండా చేసిన కృషే కారణం. గ్రంథాలయ ప్రచారాన్ని ఒక ఉద్యమంగా నడిపిన ఘనత వీరికి చెందుతుంది.

కళల పరమార్థం :

కళ ద్వారా పరిపూర్ణత్వం సాధించాలన్నదే పరమాశయం. మానవులు కళ ద్వారానే సౌందర్యాన్ని గ్రహించగలరు. సౌందర్యాన్ని గ్రహించి, అనుభవించటం ద్వారానే ఆనందం—అంటే, సుఖ దుఃఖాతీతమైన, అపారమైన, నిశ్చలమైన శాంతి లభ్యమవుతుంది. అప్పుడే మానవుడు స్వయంభువుగా, ఆత్మజ్ఞానిగా, సత్య స్వరూపుడుగా, అంటే, సత్. చిత్ స్వరూపుడుగా వెలయగలడు.